


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 8.00 | సంపుటి: 16 | సంచిక: 322

SUNDAY Special | ఆదివారం 4-8-2024

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'మూడో' కన్ను చెదిరింది!


పారిస్ ఒలింపిక్స్‌లో భారత యువ షూటర్ మనూ భాకర్‌కు త్రుటిలో మూడో పతకం చేజారింది. 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో మనూ భాకర్ నాలుగో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని కోల్పోయింది. 'పారిస్' గేమ్స్‌ను మనూ రెండు కాంస్య పతకాలతో ముగించింది. - వివరాలు 12లో



మాది ఎయిర్‌ఫోర్స్ బ్యాచ్

'ఎయిర్‌ఫోర్స్ బ్యాచ్' నుంచి ఎయిర్‌బస్ దాకా విజయ్ దేవరకొండ, తరుణ్‌భాస్కర్ విజయప్రయాణాలు చేశారు. ఇద్దరూ ఇండస్ట్రీలో నిలిచారు. ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా ఇంటర్వ్యూ

- వివరాలు 11లో



కోల్‌కతాను ముంచెత్తిన వానలు

పశ్చిమబెంగాల్‌లో ఎడతెరిపి లేకుండా వానలు కురుస్తున్నాయి. కోల్‌కతాతో పాటు పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి.

వివరాలు 6లో ▸



పారిస్ ప్రయాణానికి 'నో'

పంజాబ్ సీఎం భగవంత్ సింగ్ మాన్ పారిస్ వెళ్లేందుకు కేంద్రం భద్రతా కారణాల రీత్యా అనుమతివ్వలేదని అధికారవర్గాలు తెలిపాయి.

వివరాలు 6లో ▸



ట్రంప్, కమల డిబేట్!

అమెరికా అధ్యక్ష రేసులో ఉన్న కమలా హారిస్‌తో డిబేట్‌కు ట్రంప్ అంగీకరించారు. వచ్చే నెల 4న డిబేట్ జరగనుంది.

వివరాలు 6లో ▸



యుద్ధమేఘాలు!

ఇజ్రాయెల్‌తో యుద్ధం దిశగా ఇరాన్ అడుగులు వేస్తోంది. ఇజ్రాయెల్‌కు మద్దతుగా అమెరికా యుద్ధనౌకలను మోహరిస్తోంది.

వివరాలు 6లో ▸

చదువులకూ చంద్ర గ్రహణం



నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం బృందావనంలో ఒక్క టీచర్ కూడా లేని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో విద్యార్థులకు ఇక్కట్లు

2 నెలలవుతున్నా పూర్తి స్థాయిలో అందని స్టూడెంట్ కిట్లు

- 60 శాతం విద్యార్థులకు కూడా చేరని యూనిఫారాలు
- కొలతల తేడాతో మూలకు చేరిన బూట్లు
- ప్రతిరోజు ఒక స్కూలు నుంచి మరో స్కూలుకు 'సర్దుబాటు'
- ఏజెన్సీల మార్పుతో గందరగోళం.. రుచి మారిన మధ్యాహ్న భోజనం.. అన్ని స్కూళ్లలోనూ టీచర్ల కొరత
- టోఫెల్ ఎత్తివేత.. అమ్మ ఒడికి ఎగనామం
- గత ప్రభుత్వంలో స్కూల్ తెరిచిన తొలి రోజే విద్యా కానుక
- వివక్ష లేకుండా విద్యార్థులందరికీ కిట్ల పంపిణీ..
- బడికి పిల్లలను పంపే తల్లులకు అమ్మ ఒడి ద్వారా ఏటా రూ.15 వేల సాయం

2లో

రాష్ట్రంలో ప్రభుత్వ బడుల్లో చదువులు గాడి తప్పాయా? విద్యార్థులందరికీ యూనిఫాం అందలేదా? కొంత మందికే బూట్లు ఇచ్చారా? టీచర్ల కొరత వేధిస్తోందా? మధ్యాహ్నం పిల్లలకు రుచీపచీ లేని భోజనం పెడుతున్నారా? ఇదివరకటి మెనూ అమలు కావడం లేదా? వంట వాళ్లను ఇష్టానుసారం మార్చేస్తున్నారా? టోఫెల్‌కు మంగళం పాడారా? ఇంగ్లిష్ మీడియంను చిన్నచూపు చూస్తున్నారా? స్టూడెంట్ కిట్లను కూటమి నేతలు పంపిణీ చేస్తున్నారా?.... ఈ ప్రశ్నలన్నింటికీ ప్రతి జిల్లాలో, ప్రతి ఊళ్లో, ప్రతి ఒక్కరూ 'అవును' అని సమాధానమిస్తున్నారు. ఇన్నాళ్లూ బంగారంలా చక్కగా సాగిపోతున్న చదువులకు గ్రహణం ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

■ ఆగిన సిరిమువ్వల సవ్వడి

యామినీ శివైక్యం



- వయోభారం, ఆరోగ్య సమస్యలతో తుదిశ్వాస విడిచిన నాట్యమయూరి
- ఢిల్లీ అపోలో ఐసీయూలోనే ఏడు నెలలుగా చికిత్స
- నేడు ఢిల్లీ గ్రీన్‌పార్క్ శ్మశానవాటికలో అంత్యక్రియలు
- అన్నమయ్య జిల్లా మదనపల్లె యామినీ జన్మస్థలం
- మూడు నాట్యరీతుల ముగ్ధమనోహరిగా కీర్తి

2లో

నాట్యం కోసమే పుట్టాను 11లో



వయనాడ్ జిల్లాలో గుహలో చిక్కుకున్న చిన్నారులను రక్షించిన కేరళ అటవీ శాఖ సిబ్బంది

6 ప్రాణాలు నిలబెట్టారు

- వయనాడ్ జిల్లాలో కొండ గుహలో చిక్కుకున్న గిరిజన కుటుంబం
- 5 రోజులపాటు తిండిలేక నలుగురు చిన్నారులు, తల్లిదండ్రులు విలవిల
- ఎనిమిది గంటలపాటు శ్రమించి రక్షించిన కేరళ అటవీ శాఖ సిబ్బంది
- అసలైన హీరోలంటూ ప్రశంసల వర్షం కురిపిస్తున్న జనం

6లో

వయనాడ్ వారియర్

ఆర్మీ మేజర్ సీతా అశోక్ షెల్కేపై కథనం - 11లో

న్యూస్‌రీల్

ఆహార మిగులు దేశంగా భారత్



భారత్ ఆహార మిగులు దేశంగా మారిందని.. ప్రపంచ ఆహార, పౌష్టికాహార భద్రతకు పరిష్కారాలను అందించేందుకు కృషి చేస్తోందని అంతర్జాతీయ ఆర్థికవేత్తల సదస్సులో ప్రధాని మోదీ చెప్పారు. భారతదేశ ఆర్థిక విధానాలకు వ్యవసాయం కేంద్ర బిందువన్నారు.

వివరాలు 6లో ▸

కేసు ఉన్నా ఉద్యోగం నుంచి తీసేయకూడదు



క్రిమినల్ కేసు పెండింగ్‌లో ఉన్నంత మాత్రాన నేరుగా ఉద్యోగం నుంచి తీసేయడానికి వీల్లేదని హైకోర్టు స్పష్టం చేసింది. క్రిమినల్ కేసు పెండింగ్‌లో ఉండటం.. ఆ ఉద్యోగి తన అధికారిక విధులను నిర్వర్తించడానికి ఎంత మాత్రం అడ్డంకి కాదని తేల్చిచెప్పింది.

వివరాలు 3లో ▸

మా భార్యలను కాపురానికి పంపించండి



తమ భార్యలను కాపురానికి పంపేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ తోడల్లుళ్లు ఏలూరు కలెక్టరేట్ వద్ద శనివారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. కలెక్టర్, ఎస్పీ కూడా న్యాయం చేయకపోవడంతో రిలే దీక్షలు చేపట్టామన్నారు.

వివరాలు 3లో ▸

భలే మంచి చౌక బేరం


- రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలించే ముఠాతో అనంతపురం ఎమ్మెల్యే రాయ'బేరాలు'!

వివరాలు 10లో ▸

ఎన్నికల్లో భారీగా అవకతవకలు

ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో 12.5 శాతం ఓట్లు పెరిగాయి

- ఈసీ ప్రకటించిన ఓట్ల లెక్కలకు, తుది ఓటింగ్ శాతానికి మధ్య భారీ తేడా
- ఈవీఎంల యుగంలోనూ ఇంత వ్యత్యాసాలా?
- ఈ ఎన్నికల ఫలితాలు సరైనవేనా?
- కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్



సాక్షి, న్యూఢిల్లీ: ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో భారీ ఎత్తున అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఎన్నికల సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల సంఘం తొలుత ప్రకటించిన ఓట్ల శాతం కంటే.. తుది ఓటింగ్ 12.5 శాతం పెరగడం పట్ల ఆ పార్టీ నేత సందీప్ దీక్షిత్ విస్మయం వ్యక్తం చేశారు. ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో సందీప్ దీక్షిత్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఓట్ ఫర్ డెమోక్రసీ అనే సంస్థ నివేదికను ఉటంకిస్తూ ఆయన పలు ఆరోపణలు చేశారు. ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘం (ఈసీ) ప్రకటించిన ఓట్ల లెక్కలకు, తుది ఓటింగ్ శాతానికి మధ్య భారీ తేడా ఉందన్నారు. ఈవీఎంల యుగంలోనూ ఇంత వ్యత్యాసాలు ఉండటం పట్ల ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇలా వచ్చిన ఎన్నికల ఫలితాలు సరైనవేనా అని నిలదీశారు. ఇంత వ్యత్యాసం ఉండటం మొత్తం ఎన్నికల ప్రక్రియపైనే పలు ప్రశ్నలను లేవనెత్తుతోందన్నారు. కేవలం ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా ఒడిశాలో కూడా 12.5 శాతం ఓట్లు పెరిగాయన్నారు.

ఎన్నికల అవకతవకలతో బీజేపీకి అదనంగా 79 సీట్లు..

ఎన్నికల్లో అవకతవకలకు పాల్పడటం ద్వారా బీజేపీ 79 సీట్లు అదనంగా గెలుచుకుందని సందీప్ దీక్షిత్ ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల ఓటింగ్ శాతం పెరుగుదలకు సంబంధించి రిగ్గింగ్ జరిగిందని అనుమానం

మిగతా 10వ పేజీలో ▶

బడుగులపైకి బుల్డోజర్

విశాఖలో జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ అరాచకం

- చిరు వ్యాపారుల 500 దుకాణాలు కూల్చివేత
- వారి షెడ్లనూ పెకిలించిపారేసిన వైనం
- రోడ్డుపై బైఠాయించిన బాధితులు

10లో



ధ్వంసమైన దుకాణం

రక్షక భటుడికి రక్షణేది?



బాపట్ల జిల్లా భట్టిప్రోలులో ఎస్‌ఐ చొక్కా పట్టుకున్న టీడీపీ కార్యకర్త ఆదిన తాండవకృష్ణ

భట్టిప్రోలులో టీడీపీ బరితెగింపు

ఎస్‌ఐ చొక్కాపట్టుకుని నెట్టివేసిన టీడీపీ కార్యకర్త

- అధికార పార్టీ కార్యకర్త కావడంతో మిన్నకుండిపోయిన ఎస్‌ఐ
- వీడియో సోషల్ మీడియాలో వైరల్
- టీడీపీ మూకల దౌర్జన్యంపై సర్వత్రా చర్చ
- సామాన్యుల పరిస్థితి ఏమిటోనని ఆందోళన

10లో

రేషన్ బండికి దారేది?



ప్రకాశం జిల్లా ఇంఢ్లచెరువు వద్ద రేషన్ లారీని అడ్డుకొని అధికారులను బెదిరిస్తున్న టీడీపీ కార్యకర్తలు

రేషన్ బండి మా ఊళ్లోకొస్తే తగులబెడతాం

డీలర్‌ను మార్చండి.. మా వారికే షాపు ఇవ్వండి

- అప్పటి వరకు బియ్యం బండి రానివ్వబోం
- ప్రకాశం జిల్లా ఇంఢ్లచెరువులో టీడీపీ నేతల బరితెగింపు
- రెండుసార్లు వచ్చిన రేషన్ బియ్యం లారీ ఊరి బయటే నిలిపివేత
- పోలీసు బందోబస్తుతో వచ్చినా అడ్డుకుని దౌర్జన్యం
- మూడో తేదీ వచ్చినా గ్రామస్తులకు అందని రేషన్ బియ్యం

10లో

ఇదండీ సంగతి



అలాగే రాజకీయాల్లో కూడా బెర్తులుండేట్లు చూడండీ!

క్లుప్తంగా...

ఆరోగ్య విశ్వవిద్యాలయం పేరు మార్పు

సాక్షి, అమరావతి: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయాన్ని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయంగా పేరు మార్చారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం సవరణ చట్టం-2024 శనివారం నుంచి అమలులోకి వచ్చినట్లు వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు ఇచ్చారు.

ఆర్టీసీలో మహిళల ఉచిత ప్రయాణానికి ప్రభుత్వం సిద్ధం

రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



చిత్తూరు రూరల్: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని, త్వరలోనే శుభవార్త చెబుతామని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. చిత్తూరులోని ఆర్టీసీ బస్టాండులో శనివారం ఆయన చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు సంబంధించిన కొత్త బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఆర్టీసీని గాడిలో పెట్టేందుకు సీఎం చర్యలు చేపడుతున్నారన్నారు. అన్ని హామీల అమలుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని తెలిపారు. ఈ ఐదేళ్లల్లో ఎలక్ట్రికల్ బస్సులను ప్రవేశపెడతామని చెప్పారు. కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యేలు జగన్ మోహన్, మురళీమోహన్ పాల్గొన్నారు.

వందరోజుల్లో 1.25లక్షల ఇళ్ల నిర్మాణమే లక్ష్యం

మంత్రి పార్థసారథి



మనుబోలు: అర్హత కలిగిన ప్రతి పేదవానికి పక్కా ఇల్లు మంజూరు చేస్తామని, వందరోజుల్లో 1.25 లక్షల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. శనివారం విజయవాడ నుంచి తిరుపతి వెళుతున్న ఆయన మార్గమధ్యలో శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, కాగితాలపూరు క్రాస్‌రోడ్డు వద్ద ఓ హోటల్‌లో ఆగి గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమీక్షించారు. శాఖాపరంగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఆయన వెంట గృహ నిర్మాణశాఖ పీడీ దయాకర్ ఉన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాలే కావాలంటే సాధ్యపడదు

మంత్రి సత్యకుమార్‌యాదవ్



సాక్షి, అమరావతి/వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): అందరూ ప్రభుత్వ ఉద్యోగాలే కావాలంటే సాధ్యపడదని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ అన్నారు. ప్రైవేట్ సంస్థల్లో రాణించాలని, అందుకు తగ్గట్టుగా నైపుణ్యం అవసరమని అభిప్రాయపడ్డారు. స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (స్పా), అఖిల భారతీయ రాష్ట్రీయ శిక్షక్ మహాసంఘ్ సంయుక్త ఆధ్వర్యంలో 'ఉన్నత విద్యాసంస్థల్లో జాతీయ విద్యావిధానం-2020 అమలు, ఎదురయ్యే సవాళ్లు' అనే అంశంపై శనివారం నిర్వహించిన 2 రోజుల సదస్సుకు మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ బట్టీ విధానానికి స్వస్తి పలికి సృజనాత్మకత పెంపొందించడం, ప్రతి ఒక్కరూ చదువుకునేలా చేయడం నూతన విద్యావిధానం ప్రధాన ఉద్దేశమన్నారు. నూతన విధానం వల్ల యువతకు విస్తృత అవకాశాలు లభిస్తాయన్నారు. ఏపీకి 29 జాతీయ విద్యా సంస్థలను కేంద్రం ఇచ్చిందన్నారు. అఖిల భారతీయ రాష్ట్రీయ శిక్షక్ మహాసంఘ్ జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి గుంతా లక్ష్మణ్ మాట్లాడుతూ భారత్‌ను విశ్వగురువుగా తీర్చిదిద్దేందుకు నూతన విద్యావిధానం బాసటగా నిలుస్తుందన్నారు. సదస్సుకు స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ డైరెక్టర్ కొండ రమేష్ అధ్యక్షత వహించారు.

● ఆగిన సిరిమువ్వల సవ్వడి

యామినీ కృష్ణమూర్తి శివైక్యం

వయోభారం, ఆరోగ్య సమస్యలతో తుదిశ్వాస విడిచిన నాట్యమయూరి



సాక్షి, న్యూఢిల్లీ/మదనపల్లె/అమరావతి: ప్రముఖ భరతనాట్య, కూచిపూడి, ఒడిస్సీ నృత్య కళాకారిణి, పద్మవిభూషణ్ డాక్టర్ యామినీ కృష్ణమూర్తి (84) కన్నుమూశారు. వయసు రీత్యా తలెత్తిన ఆరోగ్య సమస్యలతో ఏడు నెలలుగా బాధపడుతున్న ఆమె ఢిల్లీలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. ఆమె పార్థివ దేహాన్ని ఢిల్లీ గ్రీన్‌పార్క్‌లోని డి-బ్లాక్‌లో అభిమానుల సందర్శనార్థం ఉంచారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు గ్రీన్‌పార్క్ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబీకులు వెల్లడించారు. చాలా ఏళ్లగా ఢిల్లీలోనే ఉంటూ ప్రదర్శనలు ఇస్తున్న కృష్ణమూర్తి ఈ ఏడాది జనవరిలో వయోభార సంబంధిత సమస్యలతో అపోలో ఆస్పత్రిలో చేరారు. అప్పటి నుంచీ ఆస్పత్రి ఐసీయూలోనే వైద్యులు చికిత్స అందిస్తున్నారు. కాగా, శనివారం మధ్యాహ్నం ఆరోగ్యం క్షీణించగా.. వైద్యులు అత్యవసర చికిత్స అందించినప్పటికీ ఆమె మృతి చెందారు.

భరతనాట్య 'పద్మం'

యామినీ పూర్తి పేరు యామినీ కృష్ణమూర్తి పూర్ణతిలకం. అందరూ యామిని కృష్ణమూర్తి అని పిలుస్తుంటారు. చిత్తూరు జిల్లా మదనపల్లెలో 1940 డిసెంబర్ 20న ముంగర కృష్ణమూర్తి, లక్ష్మీ దంపతులకు జన్మించారు. తండ్రి కృష్ణమూర్తి సంస్కృత పండితులు. నృత్యంపై ఉన్న మమకారంతో మదనపల్లెలోని ఓ డాన్స్ మాస్టర్ వద్ద అతి చిన్న వయసులో డ్యాన్స్ నేర్చుకునేందుకు వెళ్లారు. ఆ తర్వాత కొద్దిరోజులకు తమిళనాడులోని చిదంబరంలో స్థిరపడ్డారు. తన తండ్రి ప్రోత్సాహంతో 5వ ఏట చెన్నైలోని రుక్మిణీదేవి అరండేల్ కళాక్షేత్రంలో భరతనాట్యం నేర్చుకోవడం ప్రారంభించారు. కూచిపూడి, ఒడిస్సీ కూడా అభ్యసించారు. ఎండీ రామనాథన్ వద్ద కర్ణాటక సంగీతం, కల్పక్కం స్వామినాథన్ దగ్గర వీణ నేర్చుకున్నారు. యామినీ తన తొలి ప్రదర్శనను తన 17వ ఏట 1957 చెన్నైలో ఇచ్చారు. 20 ఏళ్ల వయసులోనే ప్రతిభావంతురాలైన నర్తకిగా గుర్తింపు తెచ్చుకున్నారు.

ఖండాంతరాలను దాటిన ప్రతిభ

యామినీ భరతనాట్య ప్రతిభ ఖండాంతరాలను దాటింది. 17 ఏళ్ల వయసులో తొలిసారిగా ఆస్ట్రేలియాలో భరతనాట్య ప్రదర్శన ఇచ్చారు. ఆ తర్వాత అమెరికా, ఐరోపా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, న్యూజిలాండ్, ఇండోనేషియా, బ్యాంకాక్, సింగపూర్, మయన్మార్ వంటి దేశాల్లో భరతనాట్యం, కూచిపూడి ప్రదర్శనలతో మంత్రముగ్ధుల్ని చేశారు. ఢిల్లీలో నృత్య కౌస్తుభ కల్చరల్ సొసైటీ యామినీ స్కూల్ ఆఫ్ డ్యాన్స్ పేరుతో ఒక సంస్థను ఏర్పాటు చేసి యువతకు భరతనాట్యం, కూచిపూడి నృత్యాల్లో శిక్షణ ఇస్తున్నారు. 2014లో మహిళా దినోత్సవం సందర్భంగా శాంభవి స్కూల్ ఆఫ్ డ్యాన్స్ సంస్థ యామినీకి నాట్య శాస్త్ర పురస్కారాన్ని అందించింది. న్యూఢిల్లీలోని ఇందిరా ప్రియదర్శిని ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మ్యూజిక్ అండ్ డాన్స్ అనే సంస్థకు డైరెక్టరుగా ఆమె కొన్నేళ్లు సేవలందించారు.

అనేక అవార్డులు ఆమె సొంతం

యామినీ కృష్ణమూర్తి దేశ విదేశాల్లో కూచిపూడి నృత్యానికి ఎంతో పేరు, ప్రఖ్యాతలు తెచ్చిపెట్టారు. కర్ణాటక సంగీతం నేర్చుకున్న యామిని పాట పాడుతూ నృత్య ప్రదర్శనలు ఇవ్వడంలో భేష్‌గా నిలిచారు. భరతనాట్యంలో యామినీ ప్రతిభను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఆమెకు 1968లో పద్మశ్రీ, 2001లో పద్మభూషణ్, 2016లో పద్మ విభూషణ్‌లతో సత్కరించింది. టీటీడీ ఆస్థాన నర్తకిగా యామినీ కొనసాగారు.

'డకోటా' ఫ్లైట్‌లో పాకిస్థాన్‌కు..

యామినీ కృష్ణమూర్తి నాట్యం గురించి తెలుసుకున్న పాకిస్థాన్ దేశస్తులు అక్కడ ప్రదర్శన నిమిత్తం ఆహ్వానం పంపించారు. 1970లో పాకిస్థాన్‌లోని లాహోర్‌లో ప్రదర్శన ఇచ్చారు. ఆ సమయంలో మన దేశం నుంచి 'డకోటా' ఫ్లైట్‌లో అతికష్టం మీద పాకిస్థాన్‌కు వెళ్లాల్సి వచ్చిందని పలు సందర్భాల్లో ఆమె ప్రస్తావించడం విశేషం. పాకిస్థాన్ పేరు వింటేనే భయపడే రోజుల్లో యామినీ తన నృత్యంతో అక్కడి వారిని ఆకర్షించారు. విమానంలో అసౌకర్యం కలిగినప్పటికీ ఆమె ధ్యాస అంతా నృత్యంపైనే ఉండటం విశేషమని ఓ ఇంటర్వ్యూలో ప్రస్తావించారు. భరతనాట్యం, కూచిపూడి నాట్యప్రదర్శలను చూసిన పాకిస్థానీలు మంత్రముగ్ధులై పలుమార్లు ఆమెను ఆహ్వానించడం విశేషం. ప్రముఖ సేవామూర్తి మదర్ థెరిస్సా చేతుల మీదుగా యామినీ జ్ఞాపికను అందుకోవడం విశేషం.

వివాహం చేసుకోకుండా..

నాట్యరంగానికే తన పూర్తి జీవితాన్ని అంకితం చేసిన యామినీ వివాహం చేసుకోలేదు. తన నృత్య జీవిత విశేషాలను, నృత్యం నేర్చుకునే క్రమంలో తాను ఎదుర్కొన్న ఇబ్బందులు, నేర్పించిన గురువుల వివరాలతో 'ఏ ప్యాషన్ ఫర్ డ్యాన్స్' పేరుతో పుస్తకం రచించారు.

కేంద్ర సంగీత నాటక అకాడమీ సంతాపం

ప్రముఖ భరతనాట్య విద్వాంసురాలు యామినీ కృష్ణమూర్తి మృతి పట్ల కేంద్ర సంగీత నాటక అకాడమీ, దాని అనుబంధ సంస్థలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశాయి. ఆమె మరణం నాట్య రంగానికి తీరని లోటని, ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశాయి.

ఆమె సేవలు అభినందనీయం

కళా రంగానికి యామినీ చేసిన సేవలు అభినందనీయమని హర్యాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు. ఆమె మృతిపట్ల సంతాపాన్ని ప్రకటించారు. ఆమె ప్రదర్శనలు ఇస్తూ ఎంతోమందికి నృత్య ప్రదర్శనలు నేర్పిన వ్యక్తి అంటూ కొనియాడారు. ఆమె మృతిపట్ల కుటుంబీకులకు ప్రగాఢ సానుభతిని వ్యక్తం చేశారు.

సీఎం చంద్రబాబు సంతాపం

యామినీ కృష్ణమూర్తి మృతి పట్ల సీఎం చంద్రబాబు సంతాపం తెలిపారు. భారతదేశం గర్వించదగిన నృత్యకారిణి యామినీ తుది శ్వాస విడిచారని తెలిసి తీవ్ర ఆవేదన చెందానని సీఎం పేర్కొన్నారు. యామినీ లేనిలోటు నృత్య కళారంగంలో ఎవరూ తీర్చలేరని సీఎం పేర్కొన్నారు.

వైఎస్ జగన్ సంతాపం

భరతనాట్యం, కూచిపూడి నృత్యాల్లో ఎనలేని ప్రతిభ చాటి.. అత్యున్నత స్థాయికి ఎదిగిన ప్రముఖ నృత్య కళాకారిణి యామినీ కృష్ణమూర్తి మరణం పట్ల మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. భరతనాట్యం, కూచిపూడి నృత్యాల్లో తనదైన శైలితో అద్భుత ప్రతిభ చూపిన యామినీ కృష్ణమూర్తి శాస్త్రీయ నృత్యంలో చెరగని ముద్ర వేశారని ఆయన పేర్కొన్నారు. యామినీ కృష్ణమూర్తి మరణం శాస్త్రీయ నృత్య రంగంలో తీరని లోటని, ఆమె తెలుగువారు కావడం మనందరికీ గర్వకారణమని అన్నారు యామినీ కృష్ణమూర్తి ఆత్మకు శాంతి కలగాలని జగన్ పేర్కొన్నారు.

చదువులకూ 'చంద్ర' గ్రహణం!

కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో విద్యార్థులకు ఇక్కట్లు

సాక్షి, అమరావతి/ సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రంలో విద్యా సంవత్సరం ప్రారంభమై దాదాపు రెండు నెలలు సమీపిస్తున్నా ఇప్పటికీ ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫారం, బ్యాగులు అందలేదు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేదింటి పిల్లలకు బడి తెరిచిన మొదటి రోజే అందాల్సిన స్టూడెంట్ కిట్లు ఇప్పటిదాకా పూర్తి స్థాయిలో అందించండంలో చంద్రబాబు ప్రభుత్వం విఫలమైంది. గత విద్యా సంవత్సరం వరకు వేడుకగా సాగిన చదువులను నిస్తేజంగా మార్చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 60 శాతం మంది విద్యార్థులకు యూనిఫారం అందనే లేదు. చాలా జిల్లాలకు బ్యాగులు చేరలేదు. పుస్తకాలు సైతం అందరికీ పంపిణీ చేయలేదు. ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు ప్రతిరోజు పుస్తకాలు, బ్యాగులు, ఇతర విద్యా సమగ్రిని 'సర్దుబాటు' చేసుకోవాల్సిన పరిస్థితి తీసుకొచ్చారు. స్కూళ్లకు చేరిన వస్తువులను సైతం స్థానిక కూటమి నేతల చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేస్తున్నారు. 'ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమంలోనూ కార్యకర్తలకు ప్రాధాన్యం ఉంటుంది. అన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలు వారి చేతుల మీదుగానే జరుగుతాయి. ఇది మీకు నేను ఇస్తున్న వాగ్దానం' అని ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చిన నేపథ్యంలో పుస్తకాల పంపిణీలో కూడా 'తమ్ముళ్లు' భాగస్వాములవుతున్నారు. పంపిణీ ఆలస్యం అవడానికి ఇది కూడా ఓ కారణం. రెండు నెలలుగా విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ ప్రహసనంగా సాగుతోంది. ఈ నెలాఖరున ఫార్మాటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలు ఉన్న నేపథ్యంలో విద్యార్థులు పుస్తకాల కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొంది.

35.60 లక్షల కిట్లకు ఆర్డర్.. అందినవి అంతంతే..

ప్రస్తుత (2024-25) విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం గతేడాది సెప్టెంబర్‌లో విద్యా కానుక కిట్ల సరఫరాకు విద్యా శాఖ ఆర్డర్ పెట్టింది. హైస్కూల్ విద్యార్థులకు అన్ని సబ్జెక్టుల పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, టోఫెల్ వర్క్ బుక్, ఫ్యూచర్ స్కిల్స్ సబ్జెక్ట్ పుస్తకంతో పాటు 3 జతల యూనిఫాం క్లాత్, స్కూల్ బ్యాగ్, బెల్ట్, ఆక్స్‌ఫర్డ్ నిఘంటువు.. 1-5 తరగతుల విద్యార్థులకు వర్క్ బుక్స్, పిక్టోరియల్ డిక్షనరీ అందించాలి. గత నాలుగేళ్లుగా ఇదే ప్రక్రియ కొనసాగింది. ఈ విద్యా సంవత్సరంలో మొత్తం 35.60 లక్షల స్టూడెంట్ కిట్ల సరఫరాకు సమగ్ర శిక్షణ ఆదేశాలు జారీ చేసింది. అన్ని వస్తువులను మే చివరి నాటికి మండల స్టాక్ పాయింట్లకు చేర్చి, అక్కడి నుంచి జూన్ మొదటి వారంలో ఆయా స్కూళ్లకు తరలించి కిట్‌గా రూపొందించాలి. బడులు తెరిచిన మొదటి రోజే 9 వస్తువులతో కూడిన కిట్‌ను విద్యార్థులకు నేరుగా స్కూల్లోనే అందించాలి. ఇందులో ఎలాంటి రాజకీయ జోక్యం ఉండకూడదు. కొత్తగా చేరే విద్యార్థులకు మండల స్టాక్ పాయింట్ నుంచి ఎప్పటికప్పుడు తెప్పించి ఇవ్వాలి. కానీ ఈ ఏడాది అందుకు భిన్నంగా జరుగుతోంది. గత విద్యా సంవత్సరంలో మిగిలిన 90 వేల కిట్లు మాత్రమే నూరు శాతం పంపిణీ చేశారు. ఆపై కంపెనీల నుంచి వస్తున్న వస్తువులను స్కూళ్లకు ఇంకా పంపిస్తూనే ఉన్నారు. ఇప్పటి వరకు విద్యా కానుక కిట్‌లో అందించే 9 వస్తువుల్లో ఏ ఒక్కటీ స్కూల్‌కు సరిపడినన్ని ఇవ్వకపోవడం గమనార్హం.

జగన్ సర్కారులో ప్రభుత్వ విద్యకు ప్రాధాన్యం

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని గత ప్రభుత్వం ప్రభుత్వ విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. సర్కారు బడిలో చదువుతున్న విద్యార్థులున్న తల్లిదండ్రులకు ఎలాంటి ఆర్థిక భారం ఉండకూడదన్న లక్ష్యంతో 'జగనన్న విద్యా కానుక' (జేవీకే)ను 2020-21 విద్యా సంవత్సరం నుంచి తీసుకొచ్చింది. ఈ విద్యార్థులు కార్పొరేట్ స్కూల్ విద్యార్థులకు సమానంగా ఆత్మవిశ్వాసంతో బడికి వెళ్లాలని రూ.2,900 విలువైన కిట్‌లో నాణ్యమైన స్కూలు బ్యాగు, టెక్ట్స్ బుక్స్, నోటు పుస్తకాలు, జత బూట్లు, రెండు జతల సాక్సులు, వర్క్‌బుక్స్ (ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు), ఇంగ్లిష్-తెలుగు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ(హైస్కూల్), పిక్టోరియల్ డిక్షనరీ, మూడు జతల యూనిఫారం క్లాత్, బెల్టు, టై అందించింది. వస్తువుల నాణ్యతను పరిశీలించేందుకు భారత ప్రభుత్వం మద్దతుతో లాభాపేక్ష లేకుండా నడుస్తున్న 'క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా' సంస్థకు అప్పగించింది. 2024-25 విద్యా సంవత్సరానికి రూ.1,042.51 కోట్లతో విద్యా కానుక కిట్ల సరఫరాకు గత సెప్టెంబర్ నెలలోనే ఆదేశాలు జారీ చేసింది. 1 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు మొదటి సెమిస్టర్‌లో బోధించే 3.12 కోట్ల పాఠ్యపుస్తకాలతో పాటు ఈ విద్యా సంవత్సరం అదనంగా టోఫెల్ వర్క్‌బుక్, ఫ్యూచర్ స్కిల్స్ సబ్జెక్ట్ పుస్తకం కూడా అందించాలి. కానీ 80 శాతం పుస్తకాలను సరఫరా చేసి, మిగిలిన వస్తువులను అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది.



అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం బేతపూడిలో మూతబడిన ఎంపీపీ స్కూల్

'సర్దుబాటు'తో నెట్టుకొస్తున్న వైనం

గతంలో విద్యా కానుక కిట్లపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టడంతో వస్తువుల సరఫరాదారు నుంచి పాఠశాలకు చేరే దాకా ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉండేది. ఈ ఏడాది ప్రభుత్వ నిర్లక్ష్యంతో అంతా తారుమారైంది. విద్యార్థులకు ఒక వస్తువు ఇస్తే మరో వస్తువు అందే పరిస్థితి లేదు. యూనిఫారాలు ఇప్పటికీ బడులకు చేరలేదు. వస్తువుల కొరత కారణంగా ప్రతి మండలంలో ఏరోజుకారోజు వస్తువులను ఒక స్కూల్ నుంచి మరో స్కూల్‌కు సర్దుబాటు చేస్తున్నారు. ముఖ్యంగా పుస్తకాల విషయంలో ప్రతిరోజు విద్యార్థుల చేరికను బట్టి స్టాక్ ఉంచుకుని మిగిలిన వాటిని ఉన్నతాధికారులు సూచించిన స్కూలుకు తరలిస్తున్నారు. ఇక్కడి బడిలో విద్యార్థులు చేరితే, ఆ మేరకు వస్తువులను ఇంకో స్కూల్ నుంచి తరలిస్తున్నారు. ఇదిలా ఉంటే అందిన వస్తువులను సైతం విద్యార్థులకు వెంటనే అందించకుండా బడుల్లో స్టాక్ పెట్టి, స్థానిక కూటమి నాయకులు వస్తేనే వారి చేతుల మీదుగా పంపిణీ చేస్తున్నారు. నాయకులు రానిచోట వస్తువుల పంపిణీ నిలిపేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు సైతం చేష్టలుడిగి చూస్తున్నారు. దీంతో జూన్ 13న స్కూళ్లు తెరిచిన నాటి నుంచి ఆగస్టు వచ్చినా పంపిణీ ప్రక్రియ ప్రహసనంగా కొనసాగుతోంది.

టోఫెల్‌కు రాం రాం..

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పిల్లల్లో ఇంగ్లిష్ ప్రావీణ్యం పెంపొందించాలనే లక్ష్యంతో వైఎస్ జగన్ ప్రభుత్వం ఎంతో చొరవ తీసుకుని టోఫెల్ క్లాసులు ప్రవేశపెట్టింది. ఇందుకోసం ప్రత్యేక పీరియడ్ కూడా కేటాయించింది. 3-5 తరగతుల పిల్లల కోసం టోఫెల్ ప్రైమరీ, 6-9 తరగతుల వారి కోసం టోఫెల్ జూనియర్ క్లాసులు నిర్వహించి మార్చిలో పరీక్షలు కూడా జరిపింది. తాజాగా కూటమి ప్రభుత్వం ఆ పరీక్ష ఫలితాలు ప్రకటించకపోగా, ఏకంగా టోఫెల్‌కే తిలోదకాలు ఇచ్చింది. పేదలకు ఇంగ్లిష్ మీడియమే ఎక్కువ.. అనుకుంటుంటే ఆ భాషపై మరింత పట్టు సాధించేలా టోఫెల్ అవసరమే లేదని ప్రభుత్వ పెద్దలు ఈ నిర్ణయం తీసుకున్నారని స్పష్టమవుతోంది. దీనికి తోడు అమ్మ ఒడి (తల్లికి వందనం) పథకం అమలు చేస్తారో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటి వరకు మార్గదర్శకాలు కూడా విడుదల కాక పోవడం చూస్తుంటే ఈ పథకానికీ ఈ ఏడాది మంగళం పాడినట్లేనని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒక ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ ఏటా రూ.15 వేల చొప్పున ఇస్తామని చంద్రబాబు సహా కూటమి నేతలు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. తీరా గద్దె నెక్కాక ఈ పథకం అమలు గురించి మాట్లాడటమే మానేయడం గమనార్హం. గత వైఎస్ జగన్ ప్రభుత్వం పిల్లలను బడికి పంపే తల్లులకు అమ్మ ఒడి పథకం కింద ఏటా రూ.15 వేలు సాయం అందించింది.

జిల్లాల్లో ఇదీ పరిస్థితి

- అనంతపురం జిల్లాలో 450కి పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ ఉన్నాయి. జిల్లాలోని ఏ ఒక్క స్కూల్‌కూ యూనిఫాం క్లాత్ చేరలేదు. కొన్ని స్కూళ్లకు బూట్లు, మరి కొన్ని స్కూళ్లకు డిక్షనరీలు అందలేదు. జిల్లాలో 677 మధ్యాహ్న భోజన ఏజెన్సీల నిర్వాహకులను మార్చారు. ఆహారంలో నాణ్యత లోపించింది.
- శ్రీసత్యసాయి జిల్లాలో 345 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాకు మంజూరైన విద్యా కానుక కిట్లు 1,38,634 పంపిణీ చేసినట్లు అధికారులు చెబుతున్నప్పటికీ, పలు చోట్ల విద్యార్థులకు కొన్ని వస్తువులు అందలేదు. కిట్లు పక్కదారి పట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. 1,438 మధ్యాహ్న భోజన ఏజెన్సీల నిర్వాహకులను మార్చివేశారు. చాలాచోట్ల భోజనం నాణ్యతగా ఉండడం లేదు. కొన్ని చోట్ల కోడిగుడ్లను స్వాహా చేస్తున్నారు.
- ఉమ్మడి కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ మండలం బృందావనంలోని ప్రాథమిక పాఠశాలలో ఒక్క ఉపాధ్యాయుడు కూడా లేరు. ఇటీవల ఆళ్లగడ్డ పట్టణంలోని పాఠశాలలో పని చేస్తున్న ఓ ఉపాధ్యాయున్ని తాత్కాలికంగా డిప్యుటేషన్‌పై పంపారు. జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్న భోజనం సరిగా అమలు కావడం లేదు. వంట ఏజెన్సీలు మార్చాలని టీడీపీ నేతలు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. 1,07,225 మంది విద్యార్థులకు యూనిఫామ్స్ ఇవ్వాల్సి ఉంది. 2,600 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- చిత్తూరు జిల్లాలో అన్ని పాఠశాలల్లో గోరుముద్ద పేరు తొలగించి, 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం' అని బోర్డు రాయిస్తున్నారు. కొద్ది రోజులుగా దాదాపు 10 వేల మంది విద్యార్థులు ఇంటి నుంచి భోజనం తెచ్చుకుంటున్నారు. 909 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆక్స్‌ఫోర్డ్ డిక్షనరీ ఇంకా అందలేదు. తిరుపతి జిల్లాలో దాదాపు 4 వేల జతల బూట్లు కొలతల్లో తేడా రావడంతో పంపిణీ చేయలేదు.
- వైఎస్సార్ జిల్లాలో మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపించింది. దీంతో చాలా మంది విద్యార్థులు తినేందుకు ఆసక్తి చూపడం లేదు. మండల స్థాయికి కిట్లు అందినా, పూర్తి స్థాయిలో పంపిణీ కాలేదు.
- ప్రకాశం జిల్లాలో చాలా ప్రాంతాల్లోని స్కూళ్లలో మధ్యాహ్న భోజనం సరిగా ఉండటం లేదు. బియ్యంలో నాణ్యత లేదు. స్టాండర్డ్ మెనూ ఉండటం లేదు. కోడిగుడ్ల సైజు తగ్గింది. వందల సంఖ్యలో ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయి. కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వాటర్ ప్లాంట్ పని చేయడం లేదు. దీంతో విద్యార్థులకు బోరు నీరే దిక్కయింది. ఇంకా 20 శాతం మంది విద్యార్థులకు విద్యా కానుక కిట్ పంపిణీ చేయాల్సి ఉంది.
- ఉమ్మడి కృష్ణా జిల్లాలో 1,208 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలో వివిధ విద్యా సంస్థల్లో 140 మంది సబ్జెక్టు టీచర్ల కొరత ఉంది.
- అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలంలో నాలుగు ప్రాథమిక పాఠశాలలు ఈ ఏడాది మూతపడ్డాయి. ఆంగ్ల మాధ్యమాన్ని కొనసాగిస్తారో లేదోనన్న అనుమానంతో తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించామని తల్లిదండ్రులు చెబుతున్నారు. బేతపూడి ఎంపీపీ స్కూల్, సీతంపేట ఎంపీపీ స్కూల్, కె.ఎం పాలెం పంచాయితీలో గల ఎండపల్లిపాలెం ఎంపీపీ స్కూల్, మారేపల్లి పంచాయితీ శివరామచేనులపాలెంలో ఎంపీపీ స్కూళ్ల విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో చేరారు.
- ఏలూరు జిల్లాలో 1035 ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయి. విద్యా కానుక కిట్లు వైఎస్సార్‌సీపీ హయాంలో సిద్ధం చేసినవే పంపిణీ చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో వందకు పైగా ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు ఉన్నాయి. మధ్యాహ్న భోజనం బాగోలేదని పిల్లలు చెబుతున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలోనూ ఇదే పరిస్థితి. కిట్లు పూర్తి స్థాయిలో పంపిణీ కాలేదు. కోనసీమ జిల్లాలో 464 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది.

సర్కారు వారూ..సమస్యలివిగో..!

ఐఆర్ వెంటనే ప్రకటించాలి

ఏపీ జేఏసీ అమరావతి

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ ఉద్యోగులకు వెంటనే ఐఆర్ ప్రకటించాలని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు, కార్యదర్శి పలిశెట్టి దామోదర రావు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణమే 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించాలన్నారు. విజయవాడలోని రెవెన్యూ భవన్‌లో శనివారం నిర్వహించిన ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వీరు పాల్గొన్నారు. 12వ పీఆర్సీ కమిషనర్ రాజీనామా చేసినందున వెంటనే కొత్త కమిషనర్‌ను నియమించాలన్నారు. మహిళా ఉద్యోగులపై లైంగిక, ఇతర వేధింపులపై ఫిర్యాదుల కోసం ప్రతి కలెక్టరేట్‌లో 'షీ బాక్స్'లు ఏర్పాటు చేయాలని కోరారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వం కల్పించిన పిల్లల సంరక్షణ సెలవుల అమలుపై ఆర్థిక శాఖ నుంచి ఉత్తర్వులివ్వాలని పేర్కొన్నారు.

– సాక్షి, అమరావతి

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఏదీ?

ఏబీవీపీ

పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పిస్తూ ప్రత్యేకంగా జీవో తెస్తానని యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు జీవో మంజూరు చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర కార్యదర్శి ఎస్.యచంద్ర డిమాండ్ చేశారు. జీవో-77 రద్దు చేసేంత వరకు పీజీ కౌన్సెలింగ్ ప్రక్రియను నిలిపివేయాలని ఏబీవీపీ నాయకులు ఏపీ ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ రామ్మోహనరావును మంగళగిరిలోని ఆయన కార్యాలయంలో శనివారం కలిసి వినతిపత్రమిచ్చారు. జీవో 77ను రద్దు చేసి ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పిస్తూ మరో జీవో విడుదల చేసిన తర్వాతే పీజీ సెట్ కౌన్సెలింగ్ చేపట్టాలన్నారు. ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెంకట గోపి మాట్లాడుతూ జీవో-77 రద్దు చేయని పక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి పిలుపునిస్తుందన్నారు.

– మొగల్రాజపురం (విజయవాడ తూర్పు)

ఉద్యోగ భద్రత కల్పించాలి

'ఔట్ సోర్సింగ్' ఉద్యోగులు

రాష్ట్రంలో ఆరోగ్య (ఎన్టీఆర్ వైద్య సేవ) పథకం కింద సేవలందిస్తున్న వైద్య మిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఏపీ వైద్య సేవ దళిత, గిరిజన కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమాఖ్య ప్రతినిధులు కోరారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం పల్లాను కలిసిన ప్రతినిధులు గత 17 ఏళ్లుగా పనిచేస్తున్నామని, తమకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. అదే విధంగా సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు, ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని కోరారు. పల్లాను కలిసి వారిలో సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మాచర్ల బుజ్జి, ప్రధాన కార్యదర్శి ప్రత్యూష ఉన్నారు.

– సాక్షి, అమరావతి

ఈహెచ్‌ఎస్ పరిధి పెంచాలి

ఏపీ ఉపాధ్యాయ సంఘం

ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఉచిత వైద్య సదుపాయాలతో పాటు ఈహెచ్‌ఎస్ అమల్లో తలెత్తుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలాజీ, సత్యనారాయణ, సంఘం నేతలు శనివారం ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఎంప్లాయిస్ హెల్త్ స్కీం (ఈహెచ్‌ఎస్) పథకంలో కొన్ని ఆస్పత్రులు నగదు రహిత వైద్యసేవలు అందించడం లేదని, ఈ మేరకు మెడికల్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యాన్ని కల్పించాలని మంత్రిని కోరారు. అలాగే రీయింబర్స్‌మెంట్ సీలింగ్‌ను రూ.5లక్షలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు.

– సాక్షి, అమరావతి

పదోన్నతులు ఇవ్వాలి

టీఎస్‌యూఎస్

డీఈవో పూల్‌లో ఉన్న భాషా పండితులకు పదోన్నతి కల్పించాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం (టీఎస్‌యూఎస్) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజెస్‌కు భాషా పండితులు మాత్రమే అర్హులుగా కాగా, 2019లో లాంగ్వేజ్ పండిట్ల పోస్టులను అప్‌గ్రేడ్ చేసి సెకండ్ గ్రేడ్ టీచర్లు కూడా అర్హులుగా పరిగణించడంతో దాదాపు 1,100 మంది భాషా పండితులకు డీఈవో పూల్‌లో చోటు దక్కలేదని సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కారణంగా ఐదేళ్లుగా ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, శ్రీరామిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాఠశాల విద్య డైరెక్టర్ విజయరామరాజుకు శనివారం విజ్ఞప్తి చేశారు.

– సాక్షి, అమరావతి

సబ్సిడీ సరిచేయాలి

గొర్రెలు, మేకల పెంపకందార్లు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకల షెడ్ల నిర్మాణానికి సబ్సిడీ అందించడంలో ఉన్న వ్యత్యాసాన్ని సరిచేసి అందరికీ సమన్యాయం చేయాలని మంత్రి అచ్చెన్నాయుడికి ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం విజ్ఞప్తి చేసింది. విజయవాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయనను కలిసి సంఘం నేతలు వినతిపత్రమిచ్చారు. ప్రభుత్వం గేదెలు, ఆవుల షెడ్ల నిర్మాణానికి 90శాతం, గొర్రెలు, మేకల షెడ్ల నిర్మాణానికి 70శాతం సబ్సిడీని ప్రకటించిందని, అలా కాకుండా అన్నింటికి 90శాతం సబ్సిడీ ఇవ్వాలని కోరారు. వర్షాకాలం సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా అంటువ్యాధులు ప్రబలి గొర్రెలు మేకలు మృత్యువాత పడుతున్నాయని, వాటిని కాపాడుకునేందుకు అవసరమైన టీకాలు, డీ వార్మింగ్ మందులు ఉచితంగా అందించాలన్నారు.

– సాక్షి, అమరావతి

టాటూ.. మహాచేటు

అమెరికాలో పచ్చబొట్టు వేయించుకున్న 20 లక్షల మందికి తీవ్ర ఆరోగ్య సమస్యలు


తీవ్రమైన బ్లడ్ క్యాన్సర్ నుంచి వివిధ రకాల ఇన్ఫెక్షన్లు

టాటూ తొలగింపుతోనూ క్యాన్సర్ కారకాల పెరుగుదల

ప్రపంచ మార్కెట్‌లో విస్తరిస్తున్న టాటూ కల్చర్

టాటూ సిరాల్లో వ్యాధికారక బ్యాక్టీరియా

సొసైటీ ఫర్ మైక్రోబయాలజీ పరిశోధనలో వెల్లడి



సాక్షి, అమరావతి : ప్రపంచవ్యాప్తంగా పచ్చబొట్టు (టాటూ) సంస్కృతి విస్తరిస్తోంది. ఒకప్పుడు చేతులతో సూదులు పట్టుకుని పచ్చబొట్టు పొడిస్తే.. నేడు అత్యాధునిక మెషిన్ల సాయంతో నచ్చిన వెరైటీ, డిజైన్లలో సులభంగా టాటూలు వేస్తున్నారు. పురాతన ఆచారాలకు గుర్తుగా ఆదిమ తెగల్లో మాత్రమే ఉండే పచ్చబొట్టు సంస్కృతి నాగరిక సమాజంలో స్టేటస్ సింబల్, ఫ్యాషన్ పోకడగా మారిపోయింది. ముఖ్యంగా యువత సామాజిక మాధ్యమాల ద్వారా టాటూ సంప్రదాయాన్ని అలవర్చుకుంటున్నారు. ఈ క్రమంలోనే ప్రపంచ మార్కెట్‌లో టాటూ వ్యాపారం 2033 నాటికి రూ.5.21 లక్షల కోట్లు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉంటే, భారత్‌లోనూ పచ్చబొట్ల మార్కెట్ విస్తరిస్తోంది. ఏటా రూ.20 వేల కోట్ల మేర పచ్చబొట్ల వ్యాపారం జరుగుతుండగా 2023 నాటికి రూ.2.26 లక్షల కోట్లు ఉన్న మార్కెట్ 2032 నాటికి 5.21 లక్షల కోట్లకు చేరుకుంటుందని మార్కెట్ నిపుణుల అంచనా. కానీ.. పరిశోధకులు పచ్చబొట్లపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పచ్చబొట్టు సిరాలో అనారోగ్యకర బ్యాక్టీరియాలు బయటపడటం చూసి ఆశ్చర్యపోతున్నారు. అమెరికాకు చెందిన సొసైటీ ఫర్ మైక్రోబయాలజీ శాస్త్రవేత్తలు పచ్చబొట్ల కోసం వినియోగించే 75 సిరాలను పరీక్షించారు. వీటిలో 26 నమూనాలలో బ్యాక్టీరియాను గుర్తించారు. ఈ సిరాలలో మూడింట ఒకవంతు కంటే ఎక్కువగా బ్యాక్టీరియా ఉండటం గమనార్హం. ఇదే విషయాన్ని అప్లైడ్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ మైక్రోబయాలజీ జర్నల్ ద్వారా వెలుగులోకి తెచ్చారు.

2032 నాటికి బంగారు, వజ్రాభరణాలతో పోలిస్తే టాటూ మార్కెట్ వృద్ధి

అంశం	టాటూ	డైమండ్, జ్యూయలరీ	లగ్జరీ జ్యూయలరీ
సీఏజీఆర్	10.80	5.5 శాతం	8.9 శాతం
రూ.లక్షల కోట్లు	5.21	41.21	81.18

పరిశోధనలో ఏం తేలిందంటే..




తాజా అధ్యయనం ప్రకారం.. పచ్చబొట్టు వేసుకున్న వారిలో అత్యధికంగా 6 శాతం మందిలో ఇన్ఫెక్షన్లు అధికంగా వస్తున్నాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో 10 నుంచి 20 శాతం మంది పచ్చబొట్లతోనే కనిపిస్తున్నారు. వీరిలో 6 శాతం ఇన్ఫెక్షన్ రేటును ప్రమాదకర స్థాయితోనే శాస్త్రవేత్తలు పోల్చారు. ఉదాహరణకు.. ఒక్క అమెరికాలోనే దాదాపు 33.30 కోట్ల మంది ప్రజల్లో కనీసం 3.3 కోట్ల మందికి టాటూలున్నాయి. ఇందులో 6 శాతం మందికి ఇన్ఫెక్షన్ అంటే దాదాపు 20 లక్షల మందికి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నట్టు అంచనా వేసింది. నిజానికి అమెరికాలో టాటూ అనేది సర్వసాధారణం. అమెరికన్లలో పచ్చబొట్టు ఉన్న వారిలో 22 శాతం మందికిపైగా ఒకటి కంటే ఎక్కువ టాటూలు వేయించుకున్న ధోరణి కనిపిస్తోంది. పురుషులతో పోలిస్తే మహిళలే టాటూలు వేయించుకోవడంలో ముందుంటున్నారు. ఇందులో 18 నుంచి 29 సంవత్సరాల వయసు గల స్త్రీలలో 56 శాతం, 30 నుంచి 49 సంవత్సరాల వయసు గల మహిళలు 53శాతం ఉండటం గమనార్హం. టాటూలతో వచ్చే బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లతో పాటు అంటువ్యాధులు సోకి ప్రాణాపాయం కలిగిస్తాయని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. వీటిల్లో ముఖ్యంగా రక్తంలో బ్యాక్టీరియా చేరడం, గుండె లోపలి పొరల్లో ఇన్ఫెక్షన్ వస్తున్నాయి. ఇన్ఫెక్షన్ సోకిన వ్యక్తిలో రక్తపోటు స్థాయి అమాంతం పడిపోతుండటంతో ప్రాణాంతకంగా మారుతోంది.

కంటి ఇన్ఫెక్షన్లూ పచ్చబొట్ల చలవే

2010, 2011లో జరిగిన పలు అధ్యయనాల్లో పచ్చబొట్టు సిరాలో ఏరోబిక్ బ్యాక్టీరియాను గుర్తించాయి. తాజాగా శాస్త్రవేత్తలు 14 కంపెనీలు అమెరికాలో అమ్మకానికి ఉంచిన టాటూ సిరాల్లో 75 నమూనాలను పరీక్షించారు. వీటిలో 34 బ్యాక్టీరియాలను కనుగొన్నారు. అందులో 19 'వ్యాధికారక జాతులు'గా వర్గీకరించారు. ముఖంపై తీవ్రమైన మొటిమలు, కంటి ఇన్ఫెక్షన్లు (క్యూటి బ్యాక్టీరియం), రోగనిరోధక శక్తిలేని వ్యక్తుల్లో ఇన్ఫెక్షన్లు (స్టెఫిలోకాకస్ ఎపిడెర్మిడిస్), మూత్ర ఇన్ఫెక్షన్లు కూడా వస్తాయని గుర్తించారు. వీటితో పాటు అలెర్జీ సమస్యలు, శరీరాన్ని రక్షించే తెల్లరక్త కణాలతోపాటు ఇతర కణజాలాల సమూహాన్ని దెబ్బతీయడం, పచ్చబొట్టు చుట్టూ మచ్చలు ఏర్పడటం పెరుగుతున్నాయి.

బ్లడ్ క్యాన్సర్ ముప్పు

పచ్చబొట్టు ప్రాణాంతక లింఫోమా(బ్లడ్ క్యాన్సర్)కు కారకాలవుతున్నాయి. ఇవి శరీరంలోని అవయవాల పనితీరును దెబ్బతీసి వ్యక్తి మరణానికి దారితీస్తున్నాయి. 11,905 మందిపై పరిశోధన చేస్తే.. పచ్చబొట్టు వేసుకోని వ్యక్తులతో టాటూ ఉన్న వ్యక్తులను పోలిస్తే మొత్తం లింఫోమా ప్రమాదం 21 శాతం పెరిగింది. ఆసక్తికరంగా, లేజర్ చికిత్స ద్వారా పచ్చబొట్టు తొలగించుకున్న వ్యక్తుల్లో లింఫోమా ప్రమాదం తీవ్రంగా ఉన్నట్టు పలు అధ్యయనాలు చెబుతున్నాయి. పచ్చబొట్టు తొలగించే సమయంలో ఉత్పత్తి అయ్యే హానికరమైన సమ్మేళనాలతో ఇది సంభవిస్తున్నట్టు శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.



క్లుప్తంగా...

భవిష్యత్ చాట్ జీపీటీదే

ఇక్ఫాయ్ స్నాతకోత్సవంలో ఏఐసీటీఈ చైర్మన్ టీజీ సీతారాం

సాక్షి, హైదరాబాద్: రాబోయే రోజులన్నీ చాట్ జీపీటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి సాంకేతిక పరిజ్ఞానానిదే అని అఖిల భారత సాంకేతిక విద్యా మండలి చైర్మన్ డాక్టర్ టీజీ సీతారాం అన్నారు. అత్యాధునిక సాంకేతిక ఆవిష్కరణలు శరవేగంగా సాగుతున్నాయని చెప్పారు. ఈ సాంకేతికతపై మంచి పట్టు కలిగి ఉండాలని విద్యార్థులకు ఆయన సూచించారు. హైదరాబాద్ ఇక్ఫాయ్ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ స్నాతకోత్సవం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ.. పరిశోధన, ఆవిష్కరణల రంగంలో ఏఐసీటీఈ చేస్తున్న కృషిని వివరించారు. యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ రంగరాజన్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తును తీర్చదిద్దటంలో విద్యార్థులదే కీలక పాత్రన్నారు. నాణ్యమైన విద్య బడుగు వర్గాల వారికి చేరాల్సిన అవసరం ఉందన్నారు. ఇక్ఫాయ్ వైస్ చాన్సలర్ ఎల్ఎస్ గణేశ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

5వ తేదీ అర్ధరాత్రి వరకు 'సీఎఫ్ఎంఎస్' నిలుపుదల

సాక్షి, అమరావతి: ఓటాన్ అకౌంట్ 4 నెలల బడ్జెట్ అప్‌లోడ్ కార్యాచరణ కొనసాగుతున్న నేపథ్యంలో ఈ నెల 5వ తేదీ అర్ధరాత్రి వరకు సీఎఫ్ఎంఎస్ సేవలు అందుబాటులో ఉండవని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. 5వ తేదీ అర్ధరాత్రి తరవాత సీఎఫ్ఎంఎస్ సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపింది. మరో పక్క ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఆగస్టు 1 నుంచి నవంబర్ నెలాఖరు వరకు 4 నెలలకు చేసిన కేటాయింపులకు మించి వ్యయం చేయడానికి వీల్లేదని ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి జె.నివాస్ ఉత్తర్వులిచ్చారు. ఓటాన్ అకౌంట్ డిమాండ్స్‌లో కేటాయింపులకు మించి వ్యయం చేయకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత విభాగాధిపతులు, ఇతర ముఖ్య నియంత్రణ అధికారులపై ఉందని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

మా భార్యలను కాపురానికి పంపించండి

మామ తీరుకు నిరసనగా అల్లుళ్ల రిలే నిరాహార దీక్ష



ఏలూరు (ఆర్ఆర్‌పేట): తమ భార్యలను కాపురానికి పంపేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ తోడల్లుళ్లు ఏలూరు కలెక్టరేట్ వద్ద శనివారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలకు మొరపెట్టుకున్నా తమకు న్యాయం జరగడం లేదని ఆందోళన చేపట్టినట్లు వారు చెప్పారు. తమ మామ (ఈనాడు దినపత్రిక మాజీ రిపోర్టర్) బీకే శ్రీనివాస రామానుజ అయ్యంగార్ కుమార్తెలతో తమకు వివాహం జరిగిందని, అప్పటి నుంచి తమపై అక్రమ కేసులు పెట్టించి తమ భార్యలను కాపురానికి రాకుండా అడ్డుపడుతున్నారని కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేశామన్నారు. అయినా తమకు న్యాయం జరగకపోవడంతో ప్రస్తుతం రిలే నిరాహార దీక్షలకు దిగామని చెప్పారు. తమకు న్యాయం జరిగే వరకూ రిలే నిరాహార దీక్ష కొనసాగిస్తామని తోడల్లుళ్లు పవన్, శేషసాయి స్పష్టం చేశారు.

సామాజిక న్యాయం చేయండి

సీఎంకు సోషల్ జస్టిస్ ఫోరమ్ వినతి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అన్ని కులాలకు విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాల్లో సమన్యాయం–సామాజిక న్యాయం చేయాలని సీఎం చంద్రబాబుకు సోషల్ జస్టిస్ ఫోరమ్ (ఎస్‌జేఎఫ్) విజ్ఞప్తి చేసింది. మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయంలో శనివారం చంద్రబాబును కలిసిన ఎస్‌జేఎఫ్ రాష్ట్ర చైర్మన్ యర్రాకుల తులసీరామ్ యాదవ్, రాష్ట్ర కన్వీనర్ రావి శ్రీనివాస్ తదితర ప్రతినిధుల బృందం పలు డిమాండ్లపై వినతిపత్రం అందించింది. తాము ప్రస్తావించిన అంశాలపై మంత్రివర్గ ఉపసంఘం వేసి వాస్తవాలు పరిశీలించాలని, తద్వారా తగు న్యాయం చేయాలని కోరింది.

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం



గొట్టిపాటి రవికుమార్

జే.పంగులూరు: గత ప్రభుత్వ విధానాలతో అస్తవ్యస్తమైన విద్యుత్ రంగాన్ని గాడిలో పెట్టి నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. బాపట్ల జిల్లా, ముప్పవరంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నీటి పరిస్థితి ఆశాజనకంగా ఉందని, ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టు కూడా పూర్తిస్థాయిలో నిండిందని తెలిపారు. సీఎం చంద్రబాబుతో కలిసి శ్రీశైలం జలవిద్యుత్ కేంద్రాన్ని సందర్శించామని అక్కడ పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని చెప్పారు. సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేసి సబ్‌స్టేషన్‌లకు ఇచ్చేలా నిర్ణయించామని, రైతులకు తొమ్మిది గంటల నాణ్యమైన విద్యుత్ ఇచ్చేలా కృషి చేస్తామని తెలిపారు.

కేసు ఉన్నా.. ఉద్యోగం తొలగించరాదు

- షోకాజ్ నోటీసిచ్చి నిష్పాక్షికంగా విచారణ జరపాలి
- క్రిమినల్ కేసు పెండింగ్‌లో ఉండటం విధుల నిర్వహణకు అడ్డంకి కాదు
- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరినాథ్ కీలక తీర్పు

సాక్షి, అమరావతి: క్రిమినల్ కేసు పెండింగ్‌లో ఉన్నంత మాత్రాన ఓ ఉద్యోగిని నేరుగా ఉద్యోగం నుంచి తీసేయడానికి వీల్లేదని హైకోర్టు స్పష్టం చేసింది. నేరం నిరూపణ అయ్యేంతవరకు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి నిర్దోషి అని.. దీనిని అధికారులు విస్మరించకూడదని గుర్తు చేసింది. క్రిమినల్ కేసు పెండింగ్‌లో ఉండటం ఆ ఉద్యోగి తన అధికారిక విధులను నిర్వర్తించడానికి ఎంతమాత్రం అడ్డంకి కాదని తేల్చిచెప్పింది. క్రిమినల్ కేసు ఉన్నప్పుడు ఉద్యోగంలోంచి తీసేయాలంటే.. ముందుగా ఆ ఉద్యోగికి షోకాజ్ నోటీసు ఇవ్వడం, విచారణ జరపడం అధికారుల బాధ్యత అని తెలిపింది. నోటీసు ఇవ్వకుండా, విచారణ జరపకుండా ఉద్యోగం నుంచి తొలగించేంత భారీ శిక్ష విధించడం చట్టప్రకారం చెల్లదని స్పష్టం చేసింది. అలాంటి శిక్ష రద్దవుతుందని తేల్చి చెప్పింది. అంగన్‌వాడీ వర్కర్‌గా పనిచేస్తున్న ఓ మహిళను ఏసీబీ కేసు నెపంతో నేరుగా ఉద్యోగం నుంచి తొలగించడాన్ని హైకోర్టు తప్పు పట్టింది. సదరు మహిళను ఉద్యోగం నుంచి తొలగిస్తూ అధికారులు జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను రద్దు చేసింది.

ఇదీ కేసు

పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా విడవలూరు మండలం రామతీర్థం గ్రామానికి చెందిన కె.ధనలక్ష్మి 1998లో అంగన్‌వాడీ కార్యకర్తగా నియమితులయ్యారు. ఆ తరువాత కాంట్రాక్ట్ పద్ధతిలో సూపర్‌వైజర్ గ్రేడ్–2 పోస్టుకు ఆమెను ఎంపిక చేశారు. కాగా.. 2008 డిసెంబర్ 11న ఏసీబీ అధికారులు ఆమెపై కేసు నమోదు చేశారు. అయితే.. మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాంతీయ డిప్యూటీ డైరెక్టర్ ఫిర్యాదు మేరకు డిసెంబర్ 14న అధికారులు ఆమెను ఉద్యోగం నుంచి తొలగించారు. తనను ఏకపక్షంగా తొలగించారంటూ ఆమె 2009లో హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన హైకోర్టు ధనలక్ష్మిని అంగన్‌వాడీ వర్కర్‌గా వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించింది. అధికారులు కోర్టు ఆదేశాలను అమలు చేయకపోవడంతో ధనలక్ష్మి కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు తీవ్రంగా స్పందించడంతో విధిలేని పరిస్థితుల్లో 2010లో ఆమెను విధుల్లోకి తీసుకున్నారు. తమపై కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారన్న ఉద్దేశంతో అధికారులు ధనలక్ష్మిని ఏసీబీ కేసును సాకుగా చూపి ఉద్యోగం నుంచి తొలగిస్తూ 2011లో ప్రొసీడింగ్స్ ఇచ్చారు. వీటిని సవాల్ చేస్తూ ఆమె అదే ఏడాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫు న్యాయవాది అంబటి శ్రీకాంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. అధికారులు కావాలనే ఆమెను తప్పుడు కేసులో ఇరికించారన్నారు. ఈ విషయం నిరూపణ కావడంతో 2016లో ఏసీబీ కోర్టు ధనలక్ష్మిని నిర్దోషిగా ప్రకటించి.. కేసు కొట్టేసిందని హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. పూర్తి వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ నూనెపల్లి హరినాథ్ పైన పేర్కొన్న వ్యాఖ్యలు చేస్తూ రెండు రోజుల క్రితం తీర్పు వెలువరించారు. ధనలక్ష్మిని నాలుగు వారాల్లో తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆమె అన్ని రకాల సర్వీసు ప్రయోజనాలకు అర్హురాలని, చెల్లించాల్సిన మొత్తంలో 50 శాతం మొత్తాన్ని నాలుగు వారాల్లో చెల్లించాలని సూచించారు.

బెయిల్ ఇవ్వండి



- రాజకీయ ప్రోద్బలంతో పోలీసులు నన్ను లక్ష్యంగా చేసుకున్నారు
- నిరాధార ఆరోపణలు చేస్తున్నారు
- హైకోర్టులో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పిటిషన్లు

సాక్షి, అమరావతి: పోలింగ్ రోజున, ఆ మరుసటి రోజున తనపై రెంటచింతల, కారంపూడి పోలీసులు నమోదు చేసిన రెండు వేర్వేరు కేసుల్లో బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఆయన హైకోర్టులో రెండు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ సోమవారం విచారణ జరపనున్నారు. పాల్వాయి గేటు పోలింగ్ కేంద్రంలో ఈవీఎం ధ్వంసం చేసి.. టీడీపీ ఏజెంట్ శేషగిరిరావుపై దాడి చేశారంటూ రెంటచింతల పోలీసులు రామకృష్ణారెడ్డిపై కేసు నమోదు చేశారు. ఆ మరుసటి రోజు కారంపూడిలో సీఐ నారాయణస్వామిపై దాడి చేసి గాయపరిచారంటూ కారంపూడి పోలీసులు మరో కేసు నమోదు చేశారు. అనంతరం పిన్నెల్లిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. ప్రస్తుతం ఆయన నెల్లూరు కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఈ కేసుల్లో బెయిల్ ఇవ్వాలంటూ ఆయన ఇటీవల గురజాల కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. గురజాల కోర్టు రామకృష్ణారెడ్డి బెయిల్ పిటిషన్లను కొట్టేసింది. ఈ నేపథ్యంలో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. తనపై హత్యాయత్నం కింద నమోదు చేసిన కేసులు చెల్లవని.. అందుకు ఎలాంటి ఆధారాలు లేవని పిన్నెల్లి వివరించారు. రాజకీయ ప్రోద్బలంతో పోలీసులు తనను లక్ష్యంగా చేసుకున్నారని చెప్పారు. తాను జైలు నుంచి బయటకు రాకూడదని.. నిరాధార ఆరోపణలు చేస్తున్నారని విన్నవించారు. 37 రోజులుగా జైల్లో ఉన్నానని.. పోలీసులు దర్యాప్తు కూడా పూర్తయ్యిందని.. బెయిల్ మంజూరు సందర్భంగా ఏ షరతు విధించినా కట్టుబడి ఉంటానన్నారు. తనకు బెయిల్ ఇవ్వాలని హైకోర్టును పిన్నెల్లి కోరారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులను జైల్లో పెట్టడమే బాబు ధ్యేయం

మాజీ మంత్రి పేర్ని నాని ధ్వజం

గన్నవరం/నూజివీడు: చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ శ్రేణులపై అక్రమ కేసులు పెట్టి అన్యాయంగా జైళ్లలో పెట్టడమే ధ్యేయంగా పెట్టుకుందని మాజీ మంత్రి పేర్ని నాని ధ్వజమెత్తారు. కృష్ణాజిల్లా గన్నవరం టీడీపీ కార్యాలయం ధ్వంసం కేసులో అరెస్ట్ అయ్యి స్థానిక సబ్‌జైలులో రిమాండ్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ నేతలను శనివారం మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌తో కలిసి ఆయన పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఏడాదిన్నర క్రితం విజయవాడకు చెందిన కొంతమంది రౌడీలతో కలిసి టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీ ఆఫీస్‌పై దౌర్జన్యానికి దిగారని, ఆత్మరక్షణ కోసం వైఎస్సార్‌సీపీ శ్రేణులు తిరగబడిన ఘటనను ఆధారంగా చేసుకుని ఇప్పుడు కొత్తగా సెక్షన్లు పెట్టి, అదనంగా పేర్లు చేర్చడం దుర్మార్గమన్నారు. తొలుత నాలుగైదుగురితో మొదలైన ఈ కేసులో నిందితుల సంఖ్య ప్రస్తుతం 71కి చేరడం టీడీపీ కక్ష సాధింపు చర్యలకు పరాకాష్ట అన్నారు. ఈ అక్రమ కేసుల్లో ఇరుక్కున్న 15 మంది నూజివీడు, ఐదుగురు గన్నవరం సబ్‌జైళ్లలో మగ్గుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జైలు నుండి విడుదలైన తర్వాత వీరందరిని నేరుగా వైఎస్ జగన్ కలుస్తారని చెప్పారు.



గన్నవరం సబ్‌జైలులో కార్యకర్తలను పరామర్శించి బయటకు వస్తున్న పేర్ని నాని, కైలే అనిల్ కుమార్

రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు..

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తుందని, అభివృద్ధి, సంక్షేమం ఎక్కడా కనిపించడం లేదని పేర్ని ధ్వజమెత్తారు. టీడీపీ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసుల్లోని బాధిత కార్యకర్తలందరిని తమ పార్టీ ఆదుకుంటుందన్నారు. నిడమానూరు మాజీ సర్పంచి శీలం రంగారావు, పార్టీ నేతలు మేచినేని బాబు, రామిశెట్టి వెంకటేశ్వరరావు, నాగనబోయిన గిరీష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు సబ్‌జైలులో పరామర్శ

కృష్ణాజిల్లా గన్నవరంలోని టీడీపీ ఆఫీసుపై దాడిచేశారన్న నేరారోపణపై నూజివీడు సబ్‌జైలులో రిమాండ్‌లో ఉన్న 15 మందిని శనివారం మాజీ మంత్రి పేర్ని నాని, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పరామర్శించారు. ములాఖత్‌లో వారిని కలిసి ధైర్యం చెప్పారు.

జాతీయస్థాయిలో సత్తాచాటిన మనోళ్లు

అటల్ మారథాన్ పోటీల్లో ఏపీకి రెండోస్థానం

సాక్షి, అమరావతి: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన విద్యా సంస్కరణలు ఫలితాలనిస్తున్నాయి. నాడు–నేడుతో మారిన బడి వాతావరణం అధునాతన ల్యాబ్స్‌తో కొత్త ఆవిష్కరణలకు నాంది పలుకుతున్న విద్యార్థులు అంతర్జాతీయ కీర్తిని అందుకుంటున్నారు. తాజాగా నీతి ఆయోగ్ అటల్ ఇన్నోవేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'అటల్ మారథాన్'లో 2023–24 సంవత్సరానికి గాను ఆన్‌లైన్ ప్రాజెక్ట్ పోటీల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్ట్‌ల ద్వారా ఆంధ్రప్రదేశ్ రెండో ర్యాంకును సాధించింది. గత డిసెంబర్ 1 నుంచి జనవరి 26 వరకు దేశవ్యాప్తంగా 2,000 ప్రాజెక్టులు సమర్పించగా వాటిలో 500 ఉత్తమ ప్రాజెక్టులుగా ఎంపికయ్యాయి. ఇందులో 35 ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్‌వే కావడం విశేషం. శ్రీకాకుళం జిల్లా ఇప్పిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బయాలజీ టీచర్ (ఎస్ఏ) ఎస్.ఉమామహేశ్వరి మార్గదర్శకత్వంలో పదో తరగతి విద్యార్థులు డి.నవీన్ కుమార్, జె.ఎస్.హాసిని, హరి సింహాద్రి రూ.280 ఖర్చుతో 'సెలైన్ అలారం' ను రూపొందించారు. ఈ ప్రాజెక్ట్‌కు జాతీయ స్థాయిలో రెండో స్థానం లభించడం విశేషం. ఆస్పత్రిలో గానీ, ఇంట్లో గానీ రోగికి సెలైన్ ఎక్కిస్తున్నప్పుడు రోగి సహాయకులు గానీ, నర్స్ గానీ గమనించకపోతే బాటిల్ అయిపోయాక రోగి శరీరం నుండి రక్తం సెలైన్ పైపులోకి వస్తుంది. దీనివల్ల రోగి రక్తం కోల్పోయే ప్రమాదముంది. ఈ సమస్యను నివారించేందుకు సెలైన్‌లో ఇంకా 5 మి.లీ ద్రవం ఉండగా అలారం (సెలైన్ రిమైండర్) మోగి అప్రమత్తం చేస్తుంది. ఈ సెలైన్ అలారంను అన్ని ఆసుపత్రిల్లోనూ, ఇళ్లల్లోను ఉపయోగించేలా తయారుచేసిన విద్యార్థులను శనివారం సమగ్ర శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు విద్యార్థులను ఓ ప్రకటనలో అభినందించారు.




సెలైన్ అలారంతో ఇప్పిలి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు

తనికెళ్లకు గౌరవ డాక్టరేట్ ప్రదానం



హసన్‌పర్తి: సినీ నటుడు తనికెళ్ల భరణికి హనుమకొండలోని ఎస్సార్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ మేరకు శనివారం ఎస్సార్ యూనివర్సిటీలో జరిగిన గ్రాడ్యుయేట్స్ డే కార్యక్రమంలో తనికెళ్ల భరణి విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. డాక్టరేట్‌ను తన భార్య భవానీకి అంకితం చేస్తున్నట్టు తనికెళ్ల భరణి ప్రకటించారు.

సీనియర్ పాత్రికేయుడు కొమ్మినేనికి అవార్డు



లక్డీకాపూల్ (హైదరాబాద్): ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే ఎన్టీఆర్ జర్నలిస్ట్ అవార్డు–2024కు సీనియర్ పాత్రికేయుడు కొమ్మినేని శ్రీనివాసరావును ఎంపిక చేసినట్టు ట్రస్ట్ చైర్మన్ నందమూరి లక్ష్మీ పార్వతి తెలిపారు. ఎన్టీఆర్ జన్మదినం సందర్భంగా ఈ నెల 4న అవార్డును ప్రదానం చేయనున్నట్టు చెప్పారు.

'ఏఎస్ఆర్టీయూ' జాతీయ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

సాక్షి, అమరావతి: సెప్టెంబర్‌లో జరిగే అఖిల భారత ప్రజా రవాణా సంస్థ (ఏఎస్ఆర్టీయూ)ల క్రీడా టోర్నమెంట్ కోసం ఏపీఎస్ఆర్టీసీ నుంచి రాష్ట్రస్థాయి క్రీడాకారుల ఎంపిక పూర్తి అయ్యింది. గుంటూరు జిల్లాలోని ఏఎన్‌యూ మైదానంలో నిర్వహించిన ఎంపిక పోటీలను ఏపీఎస్ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ–అడ్మిన్) కేఎస్ బ్రహ్మానందరెడ్డి శనివారం ప్రారంభించారు.

స్కూల్ కాంప్లెక్స్ నిర్వహణ తేదీల మార్పు

సాక్షి, అమరావతి: పాఠశాల విద్యాశాఖ ఇటీవల విడుదల చేసిన అకడమిక్ కేలండర్‌లో పేర్కొన్న స్కూల్ కాంప్లెక్స్ నిర్వహణ తేదీల్లో మార్పులు చేసింది. ప్రతి నెలా రెండు రోజుల పాటు ఉపాధ్యాయులు స్కూల్ కాంప్లెక్స్ నిర్వహించాలి. అయితే, కేలండర్‌లో పేర్కొన్న తేదీల్లో పండగ, సెలవు దినాలు ఉండడంతో మార్పులు చేయాలని ఉపాధ్యాయ సంఘాలు విద్యాశాఖను కోరాయి. ఈమేరకు పాఠశాల విద్య డైరెక్టర్ విజయరామారావు మార్పులు చేసి కొత్త తేదీల జాబితాను శనివారం డీఈవోలకు పంపించారు.

వ్యవస్థలను 100 రోజుల్లో గాడిన పెడతాం



సాక్షి, అమరావతి: వంద రోజుల్లో వ్యవస్థలను గాడిన పెడతామని సీఎం చంద్రబాబు అన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం ప్రజల నుంచి వినతులు స్వీకరించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. రెవెన్యూ సంబంధిత సమస్యలపైనే అధికంగా ఫిర్యాదులు వచ్చాయని, ఈ సమస్యలకు కారణమైన అధికారులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ కారణంగా ప్రతి మండలంలోనూ ఓ భూకుంభకోణం వెలుగు చూస్తోందని, రికార్డులను కూడా తారుమారు చేశారని చంద్రబాబు ఆరోపించారు. రీసర్వే అస్తవ్యస్తంగా జరగడం వల్లే ప్రజలకు ఇబ్బందులు వస్తున్నాయని, రెవెన్యూ శాఖను గత ప్రభుత్వంలో నిర్వీర్యం చేశారని అన్నారు. మదనపల్లె ఘటనే రెవెన్యూ శాఖ నిర్వీర్యానికి ఉదాహరణ అని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రజల సమస్యలను విభాగాల వారీగా విభజించి పరిష్కరిస్తామని, వినతులు ఇచ్చేందుకు అమరావతి వరకు రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి, నియోజకవర్గాలు, జిల్లాల్లో ఫిర్యాదులు తీసుకునేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. తన పర్యటనల వల్ల ఎవరూ ఇబ్బంది పడకుండా మార్పులు తెస్తామని చంద్రబాబు తెలిపారు. అంతకుముందు సీఎం చంద్రబాబు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు.

దాడిచేస్తే ప్రతిఘటిస్తాం

- ఎమ్మెల్యే విరూపాక్షి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే విరూపాక్షి మండిపడ్డారు. ఇంకెంతమంది తలలు పగలకొడతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే హింసాకాండను విడనాడాలని హితవు పలికారు. శనివారం తాడేపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'కర్నూలు జిల్లా ఆస్పరి మండలం బిల్లేకల్‌లో టీడీపీ మూకలు రాళ్లు, కట్టెలతో దాడి చేయడంతో సీఐ, ఎస్ఐ, పోలీసులతో పాటు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. రైతుల తలలు పగిలాయి. కాళ్లు, చేతులు విరిగాయి. వైఎస్ జగన్ పాలనలో రాష్ట్రం ప్రశాంతంగా ఉండేది. ఈరోజు ఆంధ్రప్రదేశ్ అంటే అరాచకం. మంత్రి లోకేశ్ రెడ్‌బుక్ చూపిస్తూ బెదిరిస్తున్నారు. ఆయన్ని చూసి టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోతున్నారు. హత్యలు, హింస, దాడులు, ఆస్తుల విధ్వంసం ఇలాగే కొనసాగితే.. రాష్ట్రమంతా ఫ్యాక్షన్ మొదలై ఎవరూ స్వేచ్ఛగా తిరగలేని పరిస్థితి ఏర్పడుతుంది. సూపర్ సిక్స్ హామీల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే హింసను ప్రేరేపిస్తున్నట్లుగా ఉన్నారు. ఇకనైనా హింసాకాండను ఆపకపోతే ప్రజల నుంచి ప్రతిఘటన తప్పదు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలంటే బాబుకు భయమేస్తుందా? ఎన్నికల ముందు అబద్ధపు హామీలిచ్చి గద్దెనెక్కితే సరిపోదు. మాట ఇస్తే.. దాని కోసం నిలబడాలి. వైఎస్ జగన్‌ను చూసి చంద్రబాబు నేర్చుకోవాలి' అని హితవు పలికారు.

ప్రసన్నకు రూ.10 లక్షల ఆర్థిక సాయం

- సంరక్షణ బాధ్యతనూ తీసుకుంటాం : సీఎం
- వర్షాలకు మిద్దె కూలిపోవడంతో తల్లిదండ్రులు, తోబుట్టువులను కోల్పోయిన బాలిక

సాక్షి, అమరావతి: నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం చిన్న వంగలిలో వర్షాలకు మట్టి మిద్దె నానిపోయి కూలిపోవడంతో ఒకే కుటుంబంలో గురువారం అర్ధరాత్రి నలుగురు మృతి చెందిన ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో తల్లపురెడ్డి గురుశేఖర్‌తో పాటు ఆయన భార్య, ఇద్దరు పిల్లలు చనిపోయారు. రెండో కుమార్తె తల్లపురెడ్డి గురు ప్రసన్న (15) ప్రొద్దుటూరులో 10వ తరగతి చదువుకుంటోంది. రాత్రికి రాత్రి కుటుంబంలో తల్లిదండ్రులతో సహా తోబుట్టువులు చనిపోవడంతో ప్రసన్న అనాథ అయ్యింది. ఈ ఘటనపై సమాచారం తెప్పించుకున్న సీఎం ప్రసన్నకు అండగా ఉంటామని తెలిపారు. ప్రభుత్వం తరఫున రూ.10 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. ప్రస్తుతం ప్రసన్న తన నాయనమ్మ తల్లపురెడ్డి నాగమ్మ(70) సంరక్షణలో ఉందని అధికారులు సీఎంకు వివరించారు. ప్రసన్న పేరుతో రూ.10 లక్షలు డిపాజిట్ చేయడంతో పాటు వృద్ధురాలైన నాగమ్మకు కూడా రూ.2 లక్షల సాయం అందించాలని సీఎం ఆదేశించారు. జిల్లా అధికారులు ఆ బాలికకు ధైర్యం చెప్పి అండగా నిలవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. బాలిక సంరక్షణ, విద్య విషయంలో పార్టీ అండగా ఉంటుందని సీఎం ప్రకటించారు.



విశ్వసించువాడే
నిత్యజీవము గలవాడు.
- క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం; దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు; ఆషాఢ మాసం; తిథి: అమావాస్య ప.3.54 వరకు, తదుపరి శ్రావణ శుక్ల పాడ్యమి; నక్షత్రం: పుష్యమి ప.1.49 వరకు, తదుపరి ఆశ్లేష; వర్జ్యం: తె.3.25 నుండి 5.07 వరకు (తెల్లవారితే సోమవారం); దుర్ముహూర్తం: సా.4.48 నుండి 5.39 వరకు; అమృత ఘడియలు: ఉ.7.11 నుండి 9.04 వరకు

సూర్యోదయం : 5.42
సూర్యాస్తమయం : 6.29
రాహుకాలం : సా.4.30 నుండి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుండి 1.30 వరకు

సిద్ధరామయ్య (కర్ణాటక సీఎం)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

"మీ మీద ఎందుకు విచారణకు ఆదేశించకూడదో వారం లోగా సమాధానం ఇవ్వండి" అంటూ గవర్నర్ థావర్ చంద్ గెహ్లోత్ నాకు పంపిన నోటీసు గడువు ఆగస్టు 1 కి ముగిసింది. ఆ వెంటనే మంత్రులందర్నీ బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌కి పిలిపించి, "ఏం చేద్దాం శివ కుమార్?" అని అడిగాను.

శివ కుమార్ నా డిప్యూటీ.

"ఇందులో మీరు చేయవలసిందేం లేదు సీఎం గారూ! స్థిమితంగా బ్రేక్‌ఫాస్ట్ చేయండి చాలు" అన్నారు శివ కుమార్ నవ్వుతూ.

నేను నవ్వే మూడ్‌లో లేను.

224 సీట్ల అసెంబ్లీలో 66 సీట్లు మాత్రమే ఉన్న బీజేపీ, 18 సీట్లున్న జేడీఎస్‌ను కలుపుకొని 134 సీట్లున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చటానికి గవర్నర్ ఆ నోటీసును పంపినట్లు ఉంది కానీ, ల్యాండ్ ఎలాట్‌మెంట్‌లో నాపై వచ్చిన ఆరోపణలకు పంపిన నోటీసులా లేదు!

"ఒకటి గమనించారా! ల్యాండ్ ఎలాట్‌మెంట్ కేసులో మీపై గవర్నర్‌కు ఫిర్యాదు వెళ్లిన



రోజు జూలై 26. ఆ ఫిర్యాదుపై మనం గవర్నర్‌కు వివరణ ఇచ్చిన రోజు జూలై 26. గవర్నర్ మీకు నోటీసు పంపింది కూడా జూలై 26నే. అన్నీ ఒకే రోజు జరిగిపోయాయి. అంటే అర్థం... మనం ఇచ్చిన వివరణను చదవకుండానే, కనీసం చూడకుండానే గవర్నర్ మీకు నోటీసులు పంపారని!!" అన్నారు శివ కుమార్.

"మన వివరణనే కాదు, మన సీఎం గారిపై వెళ్లిన ఫిర్యాదును కూడా గవర్నర్ చదివి ఉండరని నాకు అనిపిస్తోంది..." అన్నారు ఏఎస్ పొన్నన్న. విరాజ్‌పేట ఎమ్మెల్యే అతడు. నా లీగల్ అడ్వైజర్ కూడా!

మంత్రులంతా పొన్నన్న వైపు చూశారు.

పొన్నన్న తన బ్యాగులో ఉన్న ఫిర్యాదు కాపీని బయటికి తీశారు.

"చూడండి, ఇందులో మొత్తం 60 పేజీలు ఉన్నాయి. పేజీలన్నీ శ్రద్ధగా చదివితే ఎంత లేదన్నా పేజీకి కనీసం రెండు నిమిషాలు పడుతుంది. అంటే 120 నిమిషాలు. అంటే రెండు గంటలు. కానీ గవర్నర్ తనకు ఫిర్యాదు అందిన కొద్దిసేపటికే మన సీఎం గారికి నోటీసు పంపారు! దీనిని బట్టి మన సీఎం గారిపై వెళ్లిన ఫిర్యాదును గవర్నర్ అసలు చదవనే లేదని, మన సీఎం గారిపై ఫిర్యాదు వెళ్లటానికి ముందే గవర్నర్ దగ్గర మన సీఎం గారికి పంపవలసిన నోటీసు తయారై ఉందనీ తెలుస్తోంది..." అన్నారు పొన్నన్న!

"దీనికి మనమేమీ చేయలేమా?" అన్నారు శివ కుమార్. ఆయన ముఖంలో నవ్వు మాయమైంది.

"ఆర్టికల్ 163 ప్రకారం చేయగలం. ఆర్టికల్ 361 ప్రకారం చెయ్యలేం..." అన్నారు పొన్నన్న!!

మళ్లీ మంత్రులంతా పొన్నన్న వైపు చూశారు.

"మంత్రి మండలి చెప్పినట్లు గవర్నర్ చెయ్యాలి అని ఆర్టికల్ 163 చెబుతోంది. ఆ ప్రకారం మన సీఎం గారికి ఇచ్చిన నోటీసును వెనక్కు తీసుకోవాలని గవర్నర్‌ను మనం కోరవచ్చు. ఇక ఆర్టికల్ 361 గవర్నర్ పై క్రిమినల్ కేసు పెట్టటానికి లేదని చెబుతోంది. ఆ ప్రకారం మనం ఆయనపై, 'ప్రతిపక్షాలతో చేతులు కలిపి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయాలని చూస్తున్నారని' ఫిర్యాదు చేయలేం..." అని చెప్పారు పొన్నన్న.

"ఈ ఆర్టికల్స్ భలే గమ్మత్తుగా రివర్స్‌లో ఉన్నాయే!" అని ఆశ్చర్యపోయారు అటవీశాఖ మంత్రి ఈశ్వర ఖండ్రే.

పెద్దగా నవ్వాన్నేను.

రివర్స్‌లో ఉన్నది ఆర్టికల్స్ మాత్రమేనా? సీఎం – గవర్నర్ అధికారాలు కూడానా!!

ఆ రోజు నవ్విన నవ్వునే నేనింకా ఈ రోజుకూ ఆపుకోలేక అవస్థలు పడుతుంటే ఖండ్రే వచ్చి భళ్ళున ఇంకోసారి నా నోరు నొప్పెట్టేలా నవ్వించారు.

కేంద్రానికి, రాష్ట్ర ప్రభుత్వాలకు మధ్య గవర్నర్లు వారధిగా పని చేయాలని గవర్నర్ల సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ అన్నారట!! "ఇప్పుడు చేస్తున్నది అదే కదా..." అని ఖండ్రే మాట.

పశ్చిమాసియా ఓ మందు పాతర!



జనతంత్రం

వర్ధెల్లి మురళి



ఇరాన్ – ఇజ్రాయెల్‌ల మధ్యన నిజంగానే యుద్ధం ప్రారంభమైతే దాని విధ్వంసకర ప్రభావాన్ని మొత్తం ప్రపంచమే ఎదుర్కోవలసి వస్తుంది. ఇక ఆ ప్రాంతపు సంక్షోభం గురించి చెప్పవలసిన అవసరమే లేదు. ఇజ్రాయెల్ జరిపిన గాజా దాడుల్లోనే 40 వేలమంది చనిపోయారు. పుష్కర కాలం కింద ప్రారంభమైన సిరియా అంతర్యుద్ధంలో ఇప్పటివరకు నాలుగు లక్షల మంది ప్రాణాలు పోగొట్టుకున్నట్టు అంచనా. తీవ్రమైన మానవతా హననాన్ని ఈ ప్రాంతం చవిచూసింది. ఉన్న ఊరు విడిచిపోయినవారు, కన్నబిడ్డల్ని అనాథల్ని చేసిన వారూ లక్షల సంఖ్యలో ఉన్నారు. ఒక దశలో మధ్యధరా సముద్రపు అలల మీద శవాలు తేలియాడిన విషాద సన్నివేశాలను కూడా ప్రపంచం చూసింది.

పశ్చిమాసియా సంక్షోభంతో కానీ, దాని కారణాలతోగానీ ఎటువంటి సంబంధం లేని భారతదేశం కూడా యుద్ధం ప్రారంభమైతే తీవ్ర సంకట పరిస్థితిని ఎదుర్కోవలసి వస్తుంది. హమాస్ నాయకుడు ఇస్మాయెల్ హనియా హత్య జరిగి మూడు రోజులు గడిచినా భారతదేశం నుంచి ఖండన మండనల వంటి అధికారిక ప్రకటనలేమీ రాలేదు. 'వ్యూహాత్మక నిశ్శబ్దాన్ని' పాటిస్తున్నామనుకోవాలి. నిజంగా కూడా భారత్ పరిస్థితి అటువంటిదే! రెండు దేశాలతో మనకు మంచి సంబంధాలున్నాయి. అంతకు మించి రెండు దేశాలతో అవసరాలు కూడా ఉన్నాయి.

యుద్ధమే జరిగితే ఇజ్రాయెల్‌కు అండగా నిలవక తప్పని స్థితి అమెరికాది. ఒకవేళ అలా నిలబడకపోయినట్టయితే ప్రపంచవ్యాప్తంగా అమెరికా కుదుర్చుకున్న వ్యూహాత్మక ఒప్పందాలు, ముఖ్యంగా చైనాకు వ్యతిరేకంగా ఇండో – పసిఫిక్‌లో కుదిరిన ఒప్పందాల్లో భాగస్వాములు అమెరికాను విశ్వసించకపోయే అవకాశం ఉంటుంది. సొంత దేశంలోని యూదు లాబీ అభీష్టానికి వ్యతిరేకంగా రాజకీయ నిర్ణయాలు అమెరికా తీసుకోగలదా అన్నది కూడా సందేహమే. కనుక యుద్ధంలో అమెరికా పాత్ర ఉంటుంది.

ఇజ్రాయెల్‌తో పాటు సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, జోర్డాన్, ఖతార్ తదితర దేశాలు పశ్చిమాసియాలో అమెరికాకు సన్నిహితంగా ఉంటాయి. ఈ దేశాలతో అమెరికాకు బలమైన వాణిజ్య, సహకార సంబంధాలున్నాయి. యుద్ధం ఇజ్రాయెల్ వర్సెస్ అరబ్ ఘర్షణగా మారితే ఈ మిత్రదేశాలకు కొంత ఇబ్బందికరంగా పరిణమించవచ్చు. గాజాపై ఇజ్రాయెల్ దాడులకు వ్యతిరేకంగా ఈ మధ్యకాలంలో అమెరికా విద్యార్థులు పెద్ద ఎత్తున గళం విప్పుతున్నారు. కాన్వొకేషన్ కార్యక్రమాలను పాలస్తీనా అనుకూల నినాదాలతో హోరెత్తించారు. దేశంలోని యూదు లాబీకి దీటుగా వ్యతిరేక శక్తులు కూడా బలపడుతున్న సూచనల నేపథ్యంలో ఈ యుద్ధం అధికార పార్టీ డెమొక్రట్ల పుట్టిని ఎన్నికల్లో ముంచినా ముంచవచ్చు. ఏ రకంగా ఆలోచించినా యుద్ధ నివారణే అమెరికాకు ప్రస్తుత అవసరం.

పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. ఇజ్రాయెల్‌పై దాడికి ఇరాన్ సన్నాహాలు చేస్తున్నట్టు తాజా వార్తలు సూచిస్తున్నాయి. పశ్చిమాసియాలో తిష్ఠవేసి ఉన్న అమెరికా సైన్యాలు కూడా ఇజ్రాయెల్‌కు రక్షణగా నిలవడానికి మోహరింపు మొదలుపెట్టాయి. ఇరాన్‌లో ఆ దేశపు అతిథిగా ఉన్న సమయంలో హమాస్ రాజకీయ విభాగపు నేతను హతం చేయడం ద్వారా ఇజ్రాయెల్ పెద్ద సవాల్‌నే విసిరింది. గత అక్టోబర్ మాసంలో ఇజ్రాయెల్ పౌరులపై దాడి చేసిన హమాస్ దుస్సాహసం కంటే ఈ చర్య తక్కువదేమీ కాదు. ఇది ఇరాన్‌కు విసిరిన సవాల్! ఇజ్జత్ కా సవాల్‌గా ఈ చర్యను ఇరాన్ పరిగణించకుండా ఉంటుందని భావించలేము.

ఇజ్రాయెల్ పాల్పడిన దుశ్చర్యకు కఠిన శిక్ష తప్పదనీ, ప్రతీకారం తీర్చుకుంటామనీ ఇరాన్ సుప్రీమ్ లీడర్ అయతుల్లా ఖమేనీ ఇప్పటికే ప్రకటించారు. ఇరాన్ యుద్ధంలో పాల్గొనడమంటే పశ్చిమాసియాలోని పలు ఉగ్రవాద సంస్థలు కూడా దాని వెన్నంటి ఉన్నట్టే! హమాస్‌తో పాటు లెబనాన్‌లో హెజ్బొల్లా, ఇరాక్, సిరియాల్లోని షియా మిలిషియాలు, యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులు కూడా యుద్ధంలో పాల్గొంటారు. హౌతీ తిరుగుబాటుదారుల తడాఖా ఏమిటో ఇప్పటికే ప్రపంచ వాణిజ్యం చవిచూసింది.

గాజాపై ఇజ్రాయెల్ ప్రారంభించిన ప్రతీకార దాడుల తర్వాత ఇరాన్ ఆదేశాల మేరకు యెమెన్‌లో హౌతీ తిరుగుబాటుదారులు రెచ్చిపోయారు. యూరప్ – ఆసియా దేశాల మధ్య జరిగే నౌకా వ్యాపారంలో సింహభాగం సూయెజ్ కెనాల్ ద్వారానే జరుగుతుంది. ఇది ప్రపంచ నౌకా వాణిజ్యంలో 30 శాతం. విలువ లక్ష కోట్ల డాలర్లు. యూరప్ వాణిజ్య నౌకలు మధ్యధరా సముద్రం నుంచి సూయెజ్ కెనాల్ ద్వారా ఎర్ర సముద్రంలోకి ప్రవేశించి 'ఆఫ్రికా కొమ్ము' (హార్న్ ఆఫ్ ఆఫ్రికా)గా పిలుచుకునే సోమాలీ ద్వీపకల్పానికి – అరబ్ ద్వీపకల్పానికి మధ్యనున్న సన్నని దారిగుండా బంగాళాఖాతంలోకీ, అక్కడి నుంచి హిందూ మహాసముద్రంలోకీ ప్రవేశిస్తాయి. అరబ్ ద్వీపకల్పానికి బంగాళాఖాతపు అంచున ఉన్న దేశం యెమెన్. యెమెన్‌లోని షియా తిరుగుబాటుదారులనే 'హౌతీ'లుగా పిలుస్తున్నారు. హౌతీల దాడులకు భయపడి సూయజ్ నౌకా వాణిజ్యంలో 90 శాతం ఆగిపోయింది. యూరప్ నుంచి అట్లాంటిక్ సముద్రం ద్వారా ఆఫ్రికా ఖండపు 'కేప్ ఆఫ్ గుడ్ హోప్' అంచును చుట్టి హిందూ మహాసముద్రంలోకి ప్రవేశించడానికి ఈ నౌకలకు రెండు వారాల అదనపు సమయం పట్టింది. భారీగా అదనపు వ్యయాన్ని భరించాల్సి వచ్చింది. వాణిజ్యాల్లోని అదనపు భారాన్ని అంతిమంగా మోయాల్సింది వినియోగదారులైన ప్రజలే! హౌతీల దాడుల ప్రభావం 50 దేశాల నౌకా వాణిజ్యంపై పడిందని గత జనవరిలోనే వైట్‌హౌస్ ప్రకటించింది.

ఇరాన్ – ఇజ్రాయెల్‌ల మధ్యన నిజంగానే యుద్ధం ప్రారంభమైతే దాని విధ్వంసకర ప్రభావాన్ని మొత్తం ప్రపంచమే ఎదుర్కోవలసి వస్తుంది. ఇక ఆ ప్రాంతపు సంక్షోభం గురించి చెప్పవలసిన అవసరమే లేదు. ఇజ్రాయెల్ జరిపిన గాజా దాడుల్లోనే 40 వేలమంది చనిపోయారు. పుష్కర కాలం కింద ప్రారంభమైన సిరియా అంతర్యుద్ధంలో ఇప్పటివరకు నాలుగు లక్షల మంది ప్రాణాలు పోగొట్టుకున్నట్టు అంచనా. తీవ్రమైన మానవతా హననాన్ని ఈ ప్రాంతం చవిచూసింది. ఉన్న ఊరు విడిచి పోయినవారూ, కన్నబిడ్డల్ని అనాథల్ని చేసినవారూ లక్షల సంఖ్యలో ఉన్నారు. ఒక దశలో మధ్యధరా సముద్రపు అలల మీద శవాలు తేలియాడిన విషాద సన్నివేశాలను కూడా ప్రపంచం చూసింది. ఇక ఆర్థిక వ్యవస్థల విధ్వంసం, లక్షలాది ప్రజలు శరణార్థులుగా వలస వెళ్లడాలు యుద్ధ దేశాల్లో షరా మామూలే!

పశ్చిమాసియా సంక్షోభంతో కానీ, దాని కారణాలతోగానీ ఎటువంటి సంబంధం లేని భారతదేశం కూడా యుద్ధం ప్రారంభమైతే తీవ్ర సంకట పరిస్థితిని ఎదుర్కోవలసి వస్తుంది. హమాస్ నాయకుడు ఇస్మాయెల్ హనియా హత్య జరిగి మూడు రోజులు గడిచినా భారతదేశం నుంచి ఖండన మండనల వంటి అధికారిక ప్రకటనలేమీ రాలేదు. 'వ్యూహాత్మక నిశ్శబ్దాన్ని' పాటిస్తున్నామనుకోవాలి. నిజంగా కూడా భారత్ పరిస్థితి అటువంటిదే! రెండు దేశాలతో మనకు మంచి సంబంధాలున్నాయి. అంతకు మించి రెండు దేశాలతో అవసరాలు కూడా ఉన్నాయి.

ఇరాన్‌తో భారత స్నేహ సంబంధాలు తరతరాల నాటివి. ఇరాన్ మీద అమెరికా ఆంక్షలు విధించిన సమయంలో మిత్రదేశంగా మనం బాసటగా నిలబడనప్పటికీ 'చాబహార్ పోర్టు' నిర్మాణ బాధ్యతలను మనకే అప్పగించి సౌహార్దం చాటుకున్న దేశం ఇరాన్. ఇటీవలి కాలంలో ఇజ్రాయెల్‌తో కూడా భారత్ బంధం బాగా బలపడింది. భద్రత, మిలిటరీ వంటి అంశాల్లో రెండు దేశాల మధ్య స్నేహ ఒడంబడికలున్నాయి. భారతదేశ ఇంధన అవసరాల్లో అత్యధిక భాగం పశ్చిమాసియానే తీరుస్తున్నది. ఈ ప్రాంతంలోని దాదాపు అన్ని దేశాలతోనూ భారత్‌కు దౌత్య సంబంధాలున్నాయి.

కొన్ని లక్షలమంది భారతీయులు ఈ దేశాల్లో ఉపాధి పొందుతున్నారు. ఏటా మూడు లక్షల కోట్ల రూపాయలకు పైగా ఈ ప్రవాసులు భారత్‌కు పంపిస్తున్నారు. ప్రవాసుల భద్రత పట్ల కూడా భారత్‌కు ఆందోళన ఉంటుంది. ఇటీవలనే యూఏఈ, జోర్డాన్, గ్రీస్‌లతో కలిసి 'ఇండియా – మిడిల్ ఈస్ట్ – యూరోప్ ఎకనామిక్ కారిడార్'ను కూడా భారత్ ప్రారంభించింది. ఉద్రిక్తతల కారణంగా ఈ నడవా ఇంకా నడకను మొదలుపెట్టలేకపోయింది. ఇజ్రాయెల్, యూఏఈ, అమెరికాలతో కలిసి ఏర్పాటు చేసుకున్న 'ఐ టూ – యూ టూ' ప్లాన్ పరిస్థితి కూడా ఇంతే!

ప్రచ్ఛన్న యుద్ధకాలం నాటి రెండు ధ్రువాల ప్రపంచంలో ఏ దేశమైనా ఏదో ఓ కూటమి వైపు మొగ్గవలసిన పరిస్థితులుండేవి. అలీన దేశాలకు కూడా మినహాయింపు లేదు. ఇప్పుడున్న పరిస్థితులను ఏకధ్రువ ప్రపంచంగా కూడా పిలువలేము. ఇది దేశాల మధ్య కీలక భాగస్వామ్యాల యుగం. భౌగోళిక – రాజకీయ, భౌగోళిక – ఆర్థిక అవసరాలను బట్టి ప్రాంతీయంగానూ, ఖండాంతర స్థాయుల్లోనూ ఈ వ్యూహాత్మక లేదా కీలక భాగస్వామ్య కూటములు ఏర్పాటవుతున్నాయి. ఇటువంటి భాగస్వామ్యాలు పశ్చిమాసియా దేశాలతో కూడా భారత్‌కున్నాయి. ప్రపంచంలోని మరే ఇతర ప్రాంతంలో తలెత్తే సంక్షోభం కంటే కూడా పశ్చిమాసియా సంక్షోభమే భారత్‌పై ఎక్కువ ప్రభావాన్ని చూపుతుంది. ఈ ప్రాంతంలో జరిగే యుద్ధం భారత్‌కు నిజంగా పీడకలే! కానీ, ఒక దేశపు దుశ్చర్యను ఖండించలేని స్థితిలో ఉన్న భారత్ యుద్ధాన్ని ఆపగలదని ఆశించలేము.

ఇజ్రాయెల్... అమెరికా మాట వింటుంది. రష్యా – చైనాల మాటను ఇరాన్ వినే అవకాశం ఉంది. ఈ మూడు దేశాలు కలిసి సంయుక్తంగా యుద్ధాన్ని నివారించేందుకు పూనుకుంటాయా? అది సాధ్యమయ్యే పనేనా? అసలు యుద్ధం జరగకూడదని ఈ మూడు దేశాలు కోరుకుంటున్నాయా అనేది ముఖ్యమైన ప్రశ్న. యుద్ధం జరిగితే రష్యాకు పోయేదేమీ ఉండకపోవచ్చు. ఇరాన్, సిరియాలు మిత్ర దేశాలు. వాటికి కావలసిన ఆయుధాలను నూటికి నూరు శాతం రష్యానే ఎగుమతి చేస్తున్నది. ఇప్పటికే ఆయుధ ఎగుమతులు తగ్గిపోయిన రష్యాకు ఇదో ఊరటే! కోల్పోయిన ఒకనాటి ప్రాధాన్యత మళ్లీ ఆ ప్రాంతంలో దక్కడం కంటే కావల్సిందేముంది! ఉక్రెయిన్‌కు అండగా నిలబడిన అమెరికాకు పశ్చిమాసియాలో పాఠం చెప్పే అవకాశం వస్తే ఎందుకు వదులుకుంటుంది?

దేశాల మధ్య ఉద్రిక్తతలు, వైషమ్యాలు ఉండే పరిస్థితులపై చైనా, అమెరికాలకు అభ్యంతరాలు ఉండకపోవచ్చు. కాకపోతే ఇప్పుడున్న పరిస్థితుల్లో అవి యుద్ధాన్ని కోరుకోకపోవచ్చు. అమెరికాకు ఈ ప్రాంతంలో సైన్యం ఉన్నది. సైనిక స్థావరాలున్నాయి. ఇజ్రాయెల్ వంటి బలమైన శిష్య దేశాలు, సౌదీ వంటి మిత్ర దేశాలున్నాయి. వాటితో ప్రయోజనాలున్నాయి. ఇక్కడ యథాతథ స్థితి కొనసాగడం అమెరికాకు అవసరం. ఇక్కడి బలాబలాల సమతూకం చెదిరితే ప్రపంచవ్యాప్తంగా దాని ప్రభావం పడుతుంది.

యుద్ధమే జరిగితే ఇజ్రాయెల్‌కు అండగా నిలవక తప్పని స్థితి అమెరికాది. ఒకవేళ అలా నిలబడకపోయినట్టయితే ప్రపంచవ్యాప్తంగా అమెరికా కుదుర్చుకున్న వ్యూహాత్మక ఒప్పందాలు, ముఖ్యంగా చైనాకు వ్యతిరేకంగా ఇండో – పసిఫిక్‌లో కుదిరిన ఒప్పందాల్లో భాగస్వాములు అమెరికాను విశ్వసించకపోయే అవకాశం ఉంటుంది. సొంత దేశంలోని యూదు లాబీ అభీష్టానికి వ్యతిరేకంగా రాజకీయ నిర్ణయాలు అమెరికా తీసుకోగలదా అన్నది కూడా సందేహమే. కనుక యుద్ధంలో అమెరికా పాత్ర ఉంటుంది.

ఇజ్రాయెల్‌తో పాటు సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, జోర్డాన్, ఖతార్ తదితర దేశాలు పశ్చిమాసియాలో అమెరికాకు సన్నిహితంగా ఉంటాయి. ఈ దేశాలతో అమెరికాకు బలమైన వాణిజ్య, సహకార సంబంధాలున్నాయి. యుద్ధం ఇజ్రాయెల్ వర్సెస్ అరబ్ ఘర్షణగా మారితే ఈ మిత్రదేశాలకు కొంత ఇబ్బందికరంగా పరిణమించవచ్చు. గాజాపై ఇజ్రాయెల్ దాడులకు వ్యతిరేకంగా ఈ మధ్యకాలంలో అమెరికా విద్యార్థులు పెద్ద ఎత్తున గళం విప్పుతున్నారు. కాన్వొకేషన్ కార్యక్రమాలను పాలస్తీనా అనుకూల నినాదాలతో హోరెత్తించారు. దేశంలోని యూదు లాబీకి దీటుగా వ్యతిరేక శక్తులు కూడా బలపడుతున్న సూచనల నేపథ్యంలో ఈ యుద్ధం అధికార పార్టీ డెమొక్రట్ల పుట్టిని ఎన్నికల్లో ముంచినా ముంచవచ్చు.

ఏ రకంగా ఆలోచించినా యుద్ధ నివారణే అమెరికాకు ప్రస్తుత అవసరం. అందుకు ఇరాన్‌ను నియంత్రించవలసిన అవసరం ఉన్నది. రష్యా సహకారంతో చైనా ఈ పని చేయాలని అమెరికా కోరిక. చైనాకు 'బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్'లో భాగమైన మౌలిక వసతుల ప్రాజెక్టులపై ఈ దేశాల్లో ఒప్పందాలున్నాయి. పశ్చిమాసియా యుద్ధం ఆర్థిక కారణాల రీత్యా చైనాకు కూడా ఆమోదయోగ్యం కాదని అమెరికా అంచనా. పశ్చిమాసియా సంక్షోభంలో అమెరికా కూరుకొనిపోయినట్లయితే ఇండో – పసిఫిక్‌లో తమను దిగ్బంధం చేసే ప్రయత్నాలు వెనుకడుగు వేస్తాయని చైనా దౌత్య నిపుణులు అంచనా వేసుకుంటే ఆశ్చర్యపడవలసిన పనిలేదు. ఇస్మాయెల్ హనియా హత్యను కూడా చైనా గట్టిగానే ఖండించింది. ఈ కోణంలో చూసినప్పుడు యుద్ధ నివారణకు చైనా చొరవ చూపే అవకాశాలు చాలా తక్కువ.

పెత్తందారీ దేశాల ఎత్తుగడలు ఏ రకంగా ఉన్నా పశ్చిమాసియా ఇప్పుడు పేలడానికి సిద్ధంగా ఉన్న ఒక మందుపాతరలాగా కనిపిస్తున్నది. పర్షియా, మెసపుటోమియా, ఫొనీషియన్, ఈజిప్టు నైలునదీ నాగరికతలు విలసిల్లిన చారిత్రక ధన్యభూమి ఇప్పుడు దగ్ధగీతాన్ని వినిపిస్తున్నది. ప్రపంచ జనాభాలో పశ్చిమాసియా వాటా రెండున్నర శాతం దాటదు. కానీ 30 శాతం ఆయుధాలను దిగుమతి చేసుకుంటున్న ప్రాంతం ఇదే! సగటున తొమ్మిది శాతం జీడీపీని ఈ దేశాలు ఆయుధాల కోసం తగలేస్తున్నాయి. రష్యా మార్కెట్ ఇరాన్, సిరియాలు మాత్రమే! మిగతా మార్కెటంతా అమెరికాదే! ఈ దేశాలు ఆయుధాల మీద ఏటా వెచ్చిస్తున్న ఐదు లక్షల కోట్ల రూపాయల్లో భీమునివాటా అమెరికాదే. ఒకపక్క తుపాకులు చేరవేస్తూ, 'కాల్చుకోకండి ప్లీజ్... జస్ట్ ఆడుకోండి' అంటే కుదురుతుందా? అందుకే అమెరికా శాంతి ప్రబోధాలకు పెద్దగా విలువ ఉండదు.

vardhelli1959@gmail.com

పశుపక్ష్యాదులకూ లెక్కలు తెలుసు!

విశ్లేషణ



కె.బి.గోపాలం

సంగీత జ్ఞానం అని ఒక మాట ఉంది. భక్తి లేకుండా సంగీత జ్ఞానం లేదు అంటాడు త్యాగరాజు. ఆ సంగతి పక్కన పెడితే స్వర జ్ఞానం, తాళజ్ఞానం అని సంగీతంలో రెండు భాగాలు. ఇక అక్షర జ్ఞానం అని మరొక మాట ఉంది. అంటే చదవడం, రాయడం రావడం అన్నమాట. మరి అంకెల మాట ఏమిటి?

అందరికీ ఏదో ఒక రకంగా లెక్కపెట్టడం తెలిసే ఉంటుంది. చివరకు పిల్లలకు కూడా పంపకంలో తమకు అన్యాయం జరిగిన సంగతి అర్థం అవుతుంది.

ఈ రకంగా మొత్తం మీద అందరికీ అంకెల గురించిన తెలివి ఉంటుంది. అది అనుకోకుండానే వస్తుంది. మనిషి మెదడుకు అంకెలు అర్థమవుతాయి, వాటి మధ్యన లంకె తెలుస్తుంది.

అయితే ఈ జ్ఞానం ఉన్నది ఒక్క మనుషులకే కాదు అంటున్నారు. చీమల నుంచి మొదలు తేనెటీగల దాకా ఇంకా పైజాతి జంతువుల వరకు అన్నింటికీ అంకెల గురించి తెలుసు అంటున్నారు. కోతులు, సాలెపురుగులు కూడా కొన్ని అంకెలనైనా తెలుసుకుంటాయి అంటారు పరిశోధకులు. తేనెటీగలు బయలుదేరి తేనె సేకరణ కోసం తిరుగుతూ ఏ ప్రాంతంలో ఎక్కువ పువ్వులు ఉన్నదీ సులభంగా అర్థం చేసుకుంటాయి. కోతులకు ఏ చెట్టు మీద పండ్లు ఎక్కువ ఉన్నాయో తెలుస్తుంది. ఎదుటి గుంపు గర్జనలను గుర్తించి క్రూర మృగాలు శత్రువుల సంఖ్యను తెలుసుకుంటాయి. జంతువులన్నీ ఆ రకంగా విషయాలు తెలుసుకుంటేగాని వాటి బతుకు సులభంగా సాగదు అంటారు ఆంద్రియాస్ నీడర్. ఆయన జర్మనీలోని 'ట్యూబింజెన్' విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్నారు.

సంఖ్యను గుర్తించే ఈ వెసులుబాటు జంతు జాతుల చరిత్రలో అత్యంత ప్రారంభ కాలంలోనే మొదలైంది అంటున్నారు పరిశోధకులు. అయితే మరి కొత్తగా ఈ సంగతిని గురించి ఎందుకు పట్టించుకోవాలి అన్నది ప్రశ్న.

ఒక్కసారి చూచి గుర్తుంచుకోగలిగిన అంకెల విషయంలో మనుషులకు పరిమితులు ఉన్నట్టు పరిశోధకులు గమనించారు. నాలుగు వరకు మాత్రమే సులభంగా గుర్తుంటాయి అంటున్నారు. ఒకచోట నాలుగు పుస్తకాలు ఉంటే సులభంగా గుర్తించగలుగుతాం. అంతకన్నా ఎక్కువగా ఉంటే లెక్కపెట్టవలసి వస్తుంది. ఏ విషయంలో అయినా ఇదే పరిమితి. ఇందులో కూడా రెండు అంచెలు ఉంటాయి.



ముందు సంఖ్య నిర్ణయం అవుతుంది. ఆ తరువాత ఆ సంఖ్య సరైనదేనా అని లెక్క తేలుతుంది.

క్యాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో పెట్రో పినైరో షాగాస్ ఈ విషయంలో ఆసక్తికరమైన అంశాలను తెలియజేశారు. ఇక ఏ అంకె లేకుండా... అంటే సున్నా అన్న భావన ఉన్నచోట కూడా లెక్కింపు అవసరమే అంటున్నారు. అసలు అంకెలు అన్నింటిలోకి సున్నా అన్నది చాలా గొప్పది అంటారు నీడర్. చిన్న చిన్న అంకెలు నేర్చుకున్న తర్వాత కూడా సున్నా అనే భావన నేర్చుకోవడానికి చిన్నపిల్లలకు కొంత కాలం పడుతుంది అని పరిశోధకులు గమనించారు. ఏదో ఉంది అని చెప్పడం, వాటిని లెక్కించడం వింతగా తోచదు కానీ ఏమీ లేని చోట సున్నా అన్న భావన రావడం గొప్ప విషయం.

నీడర్ బృందం వారు తమ పరిశోధన ద్వారా కోతులు, తేనెటీగలు, కాకులకు కూడా '0' అన్న విషయం తెలుసునని కనుగొన్నారు. ఈ అంశం గురించి కొంత కాలం క్రితమే 'క్వాంటా' అనే పరిశోధన పత్రికలో వ్యాసాలు వచ్చాయి.

చాలావరకు జంతువులు, లేదంటే జంతువులు అన్నింటికీ సంఖ్యాజ్ఞానం ఉంది అని సులభంగానే తెలుస్తుంది కానీ దానికి పరిమితి ఎక్కడ అన్న ప్రశ్న చిత్రమైనది. ఆస్ట్రేలియాలోని డికెన్స్ యూనివర్సిటీలో కృషి చేస్తున్న స్కార్లెట్ హోవర్డ్ ఈ అంశం గురించి పరిశోధిస్తున్నారు. జంతువు అంకెల పరిమితి మనం ఇంతకుముందు అనుకున్న ప్రకారం కాక మరీ ఎక్కువగా ఉందని కనుగొన్నారు. సున్నా అంటే ఒకటి కన్నా తక్కువ అని తెలుసునట. వాటికి కూడికలు, గుణకారాలు కూడా తెలుసునట. నిజానికి మనిషి పరిణామం చాలా కాలం తర్వాత జరిగింది. మనిషికి కూడా ఈ లెక్కలన్నీ తెలిశాయి. ఇది మొత్తం ప్రాణి ప్రపంచంలోనే ఉన్న విషయం అని పరిశోధకులకు తెలిసింది.

మనుషులు ఒకసారి చూచినా, విన్నా ఎనిమిది అంకెల వరకు సులభంగా గుర్తించగలుగుతారని కొంత కాలం క్రితమే తెలుసు. ప్రస్తుత కాలంలో మొబైల్ ఫోన్ నంబర్లు 10 అంకెలు ఉంటాయి. కనుక వాటిని ఒకసారి విని గుర్తుంచుకోవడం కష్టం అవుతున్నదట. కొంతకాలం క్రితం ఫోన్ నంబర్లలో 8 కన్నా తక్కువ అంకెలు ఉండేవి. అప్పట్లో సులభంగా గుర్తుండేవట!

ఇటువంటి విషయాలను గురించి మనం సాధారణంగా ఆలోచించం. అది సైంటిస్టుల పని అనుకుంటాం. నిజానికి ఈ విషయాలు అందరికీ సంబంధించినవి మరి!

వ్యాసకర్త సైన్స్ అంశాల రచయిత

ఉండాల్సిన దృష్టికోణం

మనం ఏ రంగు కళ్ళజోడు పెట్టుకుంటే ఆ రంగులోనే ఈ ప్రపంచం కనిపిస్తుంది అని చెప్తుంటారు. అంటే మనం ఏ దృక్కోణంలో ప్రపంచాన్ని చూస్తే అదే విధంగా మనకు అది కనిపిస్తుందన్నమాట. ఇందుకు బుద్ధుని కాలం నాటి ఒక ఉదాహరణ పరిశీలిద్దాం.

బుద్ధుడి శిష్యుడొకడు తమ విహారం నుంచి దమ్మ (ధర్మ) ప్రచారం చేయడం కోసం పొరుగూరికి వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నాడు. అప్పుడు బుద్ధుడు అతనిని పిలిచి ఆ రోజు ధర్మ ప్రచారానికి ఎక్కడికెళుతున్నావని అడిగాడు. శిష్యుడు తాను వెళ్లదలచుకున్న ప్రదేశం చెప్పాడు. 'ఆ ప్రాంతంలో ఉన్న వారు నిన్ను తిడితే ఏం చేస్తావ'ని బుద్ధుడు అడిగాడు. 'నేను సంతోషిస్తాను' అన్నాడు శిష్యుడు. 'ఎందుకని' బుద్ధుడి ప్రశ్న. 'ఫరవాలేదే వాళ్ళు నన్ను కొట్టకుండా తిట్లతో విడిచిపెట్టార'ని సంతోషిస్తా'నన్నాడు శిష్యుడు.

జ్యోతిర్మయం

'సరే, ఒకవేళ నిన్ను వాళ్ళు కొడితే ఏం చేస్తావు' అని అడిగాడు బుద్ధుడు. 'అరెరే! వీళ్ళెంత మంచివారో, ఆయుధాలతో కాకుండా చేత్తోనేగా కొట్టారనుకుంటాన'న్నాడు శిష్యుడు. 'ఒకవేళ వారు ఆయుధాలతో దాడి చేస్తే అప్పుడేం చేస్తావన్న'ది బుద్ధుడి ప్రశ్న. 'ఆహా! వీళ్ళెంత మంచివారో, వారు నన్నీ లోకం నుంచి తప్పించడానికి ఎంత మంచి పని చేశారో అని అనుకుంటాన'న్నాడు శిష్యుడు.

అంతట బుద్ధుడు అతని వంక చూసి ఆశీర్వదించి సాగనంపాడు. ఆ శిష్యుడి దృష్టిలో ఈ ప్రపంచంలో అందరూ మంచివారే. ఆ మేరకు అతను పరిపక్వత చెందాడన్న మాట!

అయితే కొందరి దృష్టి వేరేగా ఉంటుంది. ఎదుటివారు మంచి చేసినా దాన్ని అపార్థం చేసుకుంటారు. మంచిని మంచిగా గ్రహించడం వారికి తెలీదు.

చూసే చూపును బట్టే లోకం కనిపిస్తుందన్నది సుస్పష్టం.

– యామిజాల జగదీశ్

సవరణ: ఆగస్ట్ 3, శుక్రవారం నాటి ఎడిటోరియల్ పేజీలో 'వైజ్ఞానిక వేగుచుక్కలు' శీర్షిక కింద రుక్మాబాయి పేరుతో ప్రచురితమైన ఫొటో ఆనందీబాయి జోషీదిగా గమనించగలరు.

పొంచి ఉన్న కోవిడ్ జేజమ్మ!




- ప్రపంచానికి పెనువిపత్తుగా 'యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్'
- ప్రజలు, వైద్యుల్లో యాంటీబయోటిక్స్ వినియోగంపై అవగాహన అవసరం
- వ్యాధిని స్పష్టంగా నిర్ధారించాకే వైద్యులు యాంటీబయోటిక్స్‌ను సూచించాలి
- వ్యాధి నిర్ధారణ ఫలితాల్లో జాప్యాన్ని అధిగమించేందుకు ఏఐ వినియోగం
- ఇండియన్ ఇన్ఫెక్షన్ కంట్రోల్ అకాడమీ చైర్మన్ బుర్రి రంగారెడ్డి



'కోవిడ్–19 మానవాళిని మూడేళ్లు మాత్రమే ఇబ్బందులకు గురి చేసింది. దీనికి జేజమ్మలా తయారైంది యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎమ్మార్). ఇది భవిష్యత్‌లో మానవాళిని నిరంతరం ఇబ్బందులకు గురి చేయనుంది. దీనివల్ల భవిష్యత్‌లో ప్రపంచం తీవ్రమైన గడ్డు పరిస్థితిని చవిచూడబోతున్నాం' అని ఇండియన్ ఇన్ఫెక్షన్ కంట్రోల్ అకాడమీ చైర్మన్ డాక్టర్ బుర్రి రంగారెడ్డి హెచ్చరించారు. ఈ విపత్తు నుంచి బయటపడాలంటే ప్రజలు యాంటీబయోటిక్స్ విచ్చలవిడి వినియోగం తగ్గించాలని సూచించారు. వీటిని వైద్యుల సూచనలు లేకుండా సొంతంగా వినియోగించకూడదని స్పష్టం చేశారు. వైద్యులు సైతం క్లినికల్ పరీక్షల అనంతరం,, వ్యాధి నిర్ధారణ అయ్యాక ప్రోటోకాల్స్ ప్రకారమే యాంటీబయోటిక్స్‌ను చికిత్స కోసం వాడాలన్నారు. కంటికి కనిపించకుండా చాపకింద నీరులా మానవ ఆరోగ్యానికి పెను విపత్తుగా మారుతున్న ఏఎమ్మార్ నియంత్రణ, ప్రజలు, వైద్యులు పాటించాల్సిన జాగ్రత్తలను 'సాక్షి'తో రంగారెడ్డి పంచుకున్నారు. ఆయన భారత, ఏపీ ఏఎమ్మార్ యాక్షన్ ప్లాన్ రూపకల్పనలో సలహాదారుగా ఉన్నారు. ఏఎమ్మార్‌పై రంగారెడ్డి ఏమంటున్నారంటే..

సాక్షి, అమరావతి

టాప్-10లో ఇదే ప్రధానం



అలెగ్జాండర్ ఫ్లెమింగ్ కనిపెట్టిన పెన్సిలిన్ ఇంజెక్షన్ 1940 దశకంలో వినియోగంలోకి వచ్చింది. ఇది ఆరోగ్య రంగం, రోగుల సంరక్షణలో విప్లవాత్మక మార్పులను తెచ్చింది. అనంతరం రకరకాల యాంటీబయోటిక్స్ తయారీ ఊపందుకుంది. వీటివల్ల సూక్ష్మ క్రిముల ద్వారా వచ్చే అనేకానేక ఇన్ఫెక్షన్‌లను నయం చేస్తూ బ్యాక్టీరియా వ్యాప్తిని నిరోధిస్తూ వైద్య రంగం ముందుకు వెళ్లింది. పెన్సిలిన్ కనుగొన్న సమయంలోనే దీన్ని విచ్చలవిడిగా వినియోగిస్తే బ్యాక్టీరియాలో ఒకరకమైన నిరోధకత పెరిగి మనం ఇచ్చే ఏ మందులకు పని చేయకుండా సూపర్ బగ్స్‌గా మారతాయని అలెగ్జాండర్ హెచ్చరించారు. వైద్యులు, ప్రజలు లెక్కలేనితనంతో విచ్చలవిడిగా యాంటీబయోటిక్స్‌ని వినియోగించడంతో ఏఎమ్మార్ సమస్య ఉత్పన్నం అవుతోంది. ప్రపంచ ప్రజారోగ్య రంగంలో ఎదుర్కొంటున్న టాప్–10 సమస్యల్లో ఏఎమ్మార్ ప్రధానమైందని డబ్ల్యూహెచ్‌వో సైతం హెచ్చరించింది. అతిగా యాంటీబయోటిక్స్ వినియోగంతో మనుషుల్లో సూపర్ బగ్స్ పెరిగిపోతున్నాయి. దీంతో 80 శాతం యాంటీబయోటిక్స్ పనిచేయడం లేదని ఐసీఎంఆర్, డబ్ల్యూహెచ్‌వో తేల్చాయి. అడ్వాన్స్‌డ్ డ్రగ్స్ సైతం 10 మందికి ఇస్తే అందులో 9 మందిలో పనిచేయడం లేదు. సెప్సిస్ వంటి జబ్బులు వచ్చినప్పుడు యాంటీబయాటిక్స్ పనిచేయక చేతులు ఎత్తేసే పరిస్థితులు చూస్తున్నాం.

యాక్షన్ ప్లాన్‌ను ఆచరణలో పెట్టాలి

2016లో డబ్ల్యూహెచ్‌వో ఏఎమ్మార్‌ను విపత్తుగా పరిగణించి గ్లోబల్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసింది. దానికి అనుగుణంగా 2022లో యాక్షన్ ప్లాన్‌ను రూపొందించిన నాలుగో రాష్ట్రంగా ఏపీ నిలిచింది. ప్రస్తుత రోజుల్లో ఏదైనా జబ్బు చేస్తే వైద్యుడి దగ్గరకు వెళ్లిన ఒకటి రెండు రోజుల్లో నయమవ్వాలని ప్రజలు భావిస్తున్నారు. వైద్యులపై ఒత్తిడి తెచ్చి యాంటీబయోటిక్స్ రాయించుకుంటున్న వారు ఉంటున్నారు. లేదంటే ఆ వైద్యుడిని పనికిమాలిన వాడికింద లెక్కగడుతున్నారు. మరికొందరైతే వైద్య పరీక్షలు దండగని భావించి.. నేరుగా మెడికల్ షాపులకు వెళ్లి ఫార్మాసిస్ట్ ఇచ్చిన యాంటీబయోటిక్స్ వేసుకుంటున్నారు. ఈ చర్యలతో తెలియకుండానే వారి ఆరోగ్యాన్ని వారే పాడుచేసుకుంటున్నారు. చనిపోతామని తెలిసి ఏ వ్యక్తిని కావాలనే విషాన్ని కొనుక్కుని తినదు. యాంటీబయోటిక్స్ విషయంలోనూ ప్రజలు అదే విధంగా ఆలోచించాలి.

రోగులు, ప్రభుత్వాలపై ఆర్థిక భారం



ఏఎమ్మార్‌ను అత్యంత ప్రాధాన్యత అంశంగా ప్రభుత్వాలు, వైద్యులు పరిగణించాలి. లేదంటే ప్రజారోగ్య వ్యవస్థ చిన్నాభిన్నం అవుతుంది. ప్రజలు, దేశాలు ఆర్థికంగానూ నష్టపోవాల్సి వస్తుంది. గతంలో చాలా పెద్దపెద్ద జబ్బులకు పెన్సిలిన్, సల్ఫర్ డ్రగ్ ఇస్తే మూడు నుంచి నాలుగు రోజుల్లో రోగి కోలుకుని ఇంటికి వెళ్లిపోయే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం చాలా సందర్భాల్లో అవి పనిచేయకపోవడంతో ఒక డోస్, రెండో డోస్ అని డోస్‌ల మీద డోస్‌లు యాంటీబయోటిక్ మందులు వాడాల్సి వస్తోంది. దీంతో రోగులు, ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతోంది. చికిత్సా సమయం పెరుగుతోంది. ఒక రోగాన్ని తగ్గించడం కోసం యాంటీబయోటిక్స్‌ను డోస్‌ల మీద డోస్‌లు ఇవ్వడం శరీరంలో మరో సమస్యకు దారితీస్తోంది. జీర్ణవ్యవస్థలో ఉండే మంచి బ్యాక్టీరియా నిర్వీర్యమై, జీర్ణకోశ వ్యాధులు ఎక్కువవుతున్నాయి.

క్లుప్తంగా...

అక్టోబర్‌లో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు

- టీటీడీ అదనపు ఈవో సిహెచ్.వెంకయ్య చౌదరి



తిరుమల: తిరుమలలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు అక్టోబర్‌లో నిర్వహించనున్నట్లు టీటీడీ అదనపు ఈవో సీహెచ్.వెంకయ్య చౌదరి తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో శనివారం శ్రీవారి బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. అక్టోబర్ 4న ధ్వజారోహణం, 8న గరుడసేవ, 9న స్వర్ణరథం, 11న రథోత్సవం, 12న చక్రస్నానం నిర్వహిస్తారని చెప్పారు. వాహన సేవలు ప్రతి రోజు ఉదయం 8 గంటలకు, సాయంత్రం7 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. గరుడ సేవ రోజున భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, అందుకే అక్టోబర్ 7న రాత్రి 11 గంటల నుంచి 8వ తేదీ అర్ధరాత్రి వరకు ద్విచక్ర వాహనాల రాకపోకలపై నిషేధం అమలు కానుందన్నారు. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరిగే సమయంలో వయోవృద్ధులు, వికలాంగులు, ఎన్‌ఆర్‌ఐలు, చిన్న పిల్లల తల్లిదండ్రులతో సహా అన్ని ఆర్జిత సేవలు, ప్రత్యేక దర్శనాలను టీటీడీ రద్దు చేసిందని వివరించారు. ఈ సమావేశంలో ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ్‌కుమార్, సీఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీశైలంలో రేపటి నుంచి శ్రావణమాసోత్సవాలు

- రెండు, నాల్గవ శుక్రవారాల్లో ఉచిత సామూహిక వరలక్ష్మీవ్రతం



శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం దేవస్థానంలో సోమవారం నుంచి సెప్టెంబర్ 3 వరకు శ్రావణ మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో డి.పెద్దిరాజు తెలిపారు. శనివారం ఆయన ఉత్సవ ఏర్పాట్లను విలేకరులకు వివరించారు. శ్రావణ మాసంలో ఆగస్టు 15– 19 వరకు భక్తులకు స్వామివారి అలంకార దర్శనం మాత్రమే కల్పిస్తామని, ఏకాదశి, వరలక్ష్మీ వ్రతం, శ్రావణపౌర్ణమి మొదలైన పర్వదినాల కారణంగా ఈ ఐదు రోజుల్లో స్పర్శదర్శనానికి అనుమతి ఉండదన్నారు. రద్దీ కారణంగా శ్రావణ శని, ఆది, సోమవారాలు, శ్రావణ పౌర్ణమి (మొత్తం16రోజుల పాటు) రోజుల్లో గర్భాలయ అభిషేకాలు నిలుపుదల చేశామన్నారు. రద్దీ రోజుల్లో సామూహిక అభిషేకాలు, ఆర్జిత కుంకుమార్చనలు రద్దు చేసినట్లు వెల్లడించారు. ఇతర రోజుల్లో గర్భాలయ అభిషేకాలు యథావిధిగా కొనసాగుతాయన్నారు. రద్దీరోజుల్లో సామూహిక అభిషేక సేవాకర్తలకు స్వామివారి అలంకార దర్శనం మాత్రమే ఉంటుందన్నారు.

అరకు ఆస్పత్రిలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలి

- ఆరోగ్యశాఖ మంత్రికి సికిల్‌సెల్ బాధితుల వినతి



సాక్షి, అమరావతి: అరకు ఏజెన్సీ ప్రాంతంలో ఎక్కువ మంది సికిల్ సెల్ ఎనీమియా వ్యాధితో బాధపడుతున్నారని, రక్త మార్పిడి కోసం పాడేరు, విశాఖపట్నం వెళ్లాల్సి వస్తోందని పలువురు బాధితులు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తెచ్చారు. శనివారం విజయవాడలో మంత్రిని కలిసి అరకు ఆస్పత్రిలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని కోరారు. అక్కడే వ్యాధి నిర్ధారణ పరీక్షల నిర్వహణ, సికిల్ సెల్ బాధితులకు రూ.15 వేల పెన్షన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మంత్రిని కలిసిన వారిలో సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీదేవి, సైంటిస్ట్ డాక్టర్ బిరుదు రవిబాబు ఉన్నారు.

బ్రహ్మజెముడు సాగుపై అధ్యయనం



గుత్తి రూరల్: అనంతపురం జిల్లా గుత్తి మండలం ఊటకల్లు గ్రామంలో రైతు వెంకటేశ్వర రెడ్డి సాగు చేస్తున్న బ్రహ్మజెముడు పంటను రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, వాటర్‌షెడ్స్ జాయింట్ కమిషనర్ శోధ రెడ్డి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ఏపీడీ సుధాకర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. బ్రహ్మజెముడు ఉపయోగాలను రైతును అడిగి తెలుసుకున్నారు. ఈ పంటను పాడి పశువులకు దాణాగా వేయడం ద్వారా పాల దిగుబడి పెరుగుతుందని, ఔషధాల తయారీకి కూడా ఉపయోగపడుతుందని, లెదర్ ఉత్పత్తుల తయారీలో విరివిగా వినియోగిస్తున్నారని రైతు వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఈ పంటకు ఎరువులు, పురుగు మందులు ఎక్కువగా అవసరం ఉండదని, వర్షాలు లేకున్నా బెట్ట పరిస్థితులను తట్టుకొని మొక్కలు ఎదుగుతాయని వివరించారు.

తాళ్లతో బంధించి దళిత యువకుడిపై దాడి

- కాకినాడ జిల్లా సామర్లకోట మండలంలో ఘటన
- ప్రేమ పేరుతో అల్లరి చేశాడని యువకుడిపై యువతి ఫిర్యాదు





తాళ్లతో బందీగా ఉన్న అజయ్ (ఇన్‌సెట్) ఆటోలో ఆస్పత్రికి తరలింపు

సామర్లకోట: ప్రేమిస్తున్నానని చెప్పిన ఓ దళిత యువకుడిపై యువతి కుటుంబ సభ్యులు దాడి చేసి తాళ్లతో బంధించి చిత్రహింసలు పెట్టారని దళిత సంఘాలు ఆరోపిస్తున్నాయి. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం పీబీ దేవం గ్రామంలో శనివారం ఈ ఘటన జరిగింది. సామర్లకోట సీఐ ఆర్.అంకబాబు కథనం ప్రకారం..గ్రామానికి చెందిన దళిత యువకుడు చాపల అజయ్ కుమార్.. అదే గ్రామానికి చెందిన అగ్రవర్ణానికి చెందిన యువతిని ప్రేమిస్తున్నానంటూ ఆమె ఇంట్లోకి వెళ్లి అల్లరి చేశాడు. దీనిపై ఆ యువతి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. యువతిని ప్రేమిస్తున్నానని చెప్పిన నేరానికి ఆమె కుటుంబ సభ్యులు ఆ యువకుడి చేతులు కట్టి, చిత్రహింసలకు గురి చేయగా అతడు తీవ్రంగా గాయపడ్డాడని దళిత సంఘాలు చెబుతున్నాయి. ఈ ఘటనపై ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేస్తామని సీఐ చెప్పారు. దళిత యువకుడిని చిత్రహింసలకు గురి చేశారనే ఆరోపణలతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. దీంతో గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. కాగా, దళిత యువకుడిపై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు పిట్టా వరప్రసాద్ డిమాండ్ చేశారు. అజయ్, ఆ యువతి కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారని, ఈ నెల 1న ఇద్దరూ కలసి బయటకు వెళ్లారని, రాత్రి సమయంలో ఆ యువతిని అజయ్ కుమార్ ఇంటి వద్ద క్షేమంగా దింపాడని చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న యువతి కుటుంబ సభ్యులు ఆమెను చిత్రహింసలు పెడుతున్నారనే విషయం తెలిసి, అజయ్ శనివారం ఆమె ఇంటికి వెళ్లాడని దీంతో యువతి కుటుంబీకులు అతడిని తాళ్లతో బంధించి చిత్రహింసలకు గురి చేశారని ఆరోపించారు. బందీగా ఉన్న అజయ్ కుమార్‌ను పోలీసులు విడిపించి, కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారని చెప్పారు.



కృష్ణాజిల్లా మోపిదేవి శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.శ్రీనివాస్ కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. తొలుత నాగపుట్టలో పాలుపోసి మొక్కు చెల్లించారు. సర్పదోష నివారణ పూజ జరిపించారు. స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. - మోపిదేవి



తిరుమల శ్రీవారిని సెంట్రల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ చైర్మన్ విజయ భారతి సహని శనివారం దర్శించుకున్నారు. ఈమెకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. - తిరుమల



తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ శనివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. అలాగే శ్రీకాళహస్తిలోని శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికారు.

- తిరుమల/శ్రీకాళహస్తి (తిరుపతి జిల్లా)

చంద్రబాబే ఇసుక తవ్వుకోమంటే.. మీరు పట్టుకుంటారా?

- పలమనేరులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న టీడీపీ నేత ట్రాక్టర్లు సీజ్ చేసిన సీఐ
- పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించిన టీడీపీ నేతలు



సీఐతో వాగ్వాదానికి దిగిన టీడీపీ నేతలు

పలమనేరు (చిత్తూరు జిల్లా): 'సీఎం చంద్రబాబే ఇసుకను ఉచితంగా తరలించుకోవాలని చెబుతున్నారు. మీరేందుకు మా ట్రాక్టర్లను సీజ్ చేశారు. అయినా టీడీపీ వారి ట్రాక్టర్లనే పట్టుకుంటారా...' అంటూ పలమనేరు పోలీసులపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు రెచ్చిపోయారు. స్టేషన్‌ను ముట్టడించి గందరగోళం సృష్టించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పలమనేరు సీఐ చంద్రశేఖర్ సిబ్బందితో కలిసి శనివారం ఉదయం పట్టణంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో రూరల్ మండలం ముడివారిపల్లికి చెందిన టీడీపీ నేత పెద్దబ్బకు సంబంధించిన రెండు ఇసుక ట్రాక్టర్లు వచ్చాయి. వీటికి రికార్డులు లేకపోవడంతో సీఐ సీజ్‌చేసి, వాటిలో ఇసుక ఉన్నందున స్థానిక తహసీల్దార్‌కు అప్పగించారు. దీంతో టీడీపీ వారి ట్రాక్టర్లనే పట్టుకుంటారా... అంటూ మండలంలో ఇసుకను తరలించే టీడీపీ నాయకులు, వారి అనుచరులు పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని ధర్నాకు దిగారు. 'గత ప్రభుత్వ హయాంలో వైఎస్సార్‌సీపీ వాళ్లు యథేచ్ఛగా ఇసుకను దోపిడీ చేసినా పట్టించుకోని మీరు... టీడీపీ వారి ట్రాక్టర్లను కావాలనే సీజ్ చేస్తున్నారు...' అంటూ సీఐపై ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఎం చంద్రబాబే ఇసుకను ఉచితంగా తీసుకువెళ్లాలని చెబుతుంటే మీరెందుకు సీజ్ చేస్తున్నారని ప్రశ్నించారు. ఆ ట్రాక్టర్లకు రికార్డులు లేనందువల్ల సీజ్ చేశామని సీఐ వివరించినా పట్టించుకోకుండా ఆయనతో వాగ్వాదానికి దిగారు. మరోవైపు నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణులు పోలీస్ స్టేషన్‌కు చేరుకోవడంతో ఉద్రిక్తంగా మారింది. దీంతో గంగవరం సీఐ చిన్నగోవింద్ వచ్చి టీడీపీ నాయకులకు నచ్చజెప్పినా ఫలితం లేకపోయింది. టీడీపీ నాయకులు మరింత రెచ్చిపోయి గత ప్రభుత్వంలో ఇసుకను తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ హైవేపై రాస్తారోకో చేపట్టారు. ఈ విషయాన్ని డీఎస్పీతో చర్చిస్తామని సీఐలు చెప్పడంతో వివాదం సద్దుమనిగింది.

వేధింపులు తట్టుకోలేక 'అంగన్‌వాడీ' ఆత్మహత్యాయత్నం

- ఓ విలేకరి, టీడీపీ నాయకులపై భర్త ఫిర్యాదు
- వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారనే కక్ష సాధింపు



ఆస్పత్రిలో అంగన్‌వాడీ కార్యకర్త నాగరత్న

రాయచోటి: తెలుగుదేశం పార్టీ నాయకులు, ఓ విలేకరి (సాక్షి, ఈనాడు కాదు) వేధింపులు భరించలేక అంగన్‌వాడీ కార్యకర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఘటన శనివారం అన్నమయ్య జిల్లా సంబేపల్లి మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, భర్త వీరభద్ర కథనం మేరకు.. దుద్యాల పంచాయతీ పెద్దజంగంపల్లికు చెందిన అంగన్‌వాడీ కార్యకర్త జె. నాగరత్నకు గత ప్రభుత్వంలో జగనన్న ఇల్లు మంజూరైంది. ఆమె భర్త వీరభద్ర వైఎస్సార్‌సీపీ సానుభూతి పరుడు. గత సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రచారంలో చురుగ్గా పాల్గొన్నాడనే నెపంతో.. తమ ఇంటిని కూల్చివేస్తామని భార్యాభర్తలను టీడీపీ నేతలు, సదరు విలేకరి వేధింపులకు గురి చేస్తుండేవారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి రోజూ కుటుంబంపై జరుగుతున్న ఘటనలకు బతుకు మీద విరక్తి చెందడంతో పురుగుల మందు తాగిందని భర్త వీరభద్ర కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆమెను రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

అంగన్‌వాడీల నిరసన..

అంగన్‌వాడీ వర్కర్ నాగరత్నమ్మకు మద్దతుగా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఎదుట అంగన్‌వాడీలు నిరసన ప్రదర్శన చేశారు. సీఐటీయూ నాయకులు రామాంజనేయులు, శ్రీనివాసులు, భాగ్యలక్ష్మి, సీపీఎం , సీపీఐ నాయకులు , ఐసీడీఎస్ పీడీ శశికళ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు. అంగన్‌వాడీ సిబ్బందిని వేధింపులకు గురిచేస్తున్న టీడీపీ నాయకులు, ఓ పత్రిక విలేకరిని కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు. బాధితురాలిని పరామర్శించిన మాజీ డీసీఎంఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, వడ్డి వెంకటరమణారెడ్డి.. ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఇద్దరు 'ఎర్ర' స్మగ్లర్లు అరెస్ట్

తిరుపతి మంగళం: అక్రమంగా తరలిస్తున్న రూ.1.50కోట్ల విలువజేసే ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని.. ఇద్దరు స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు శనివారం తెలిపారు. మీడియాకు వివరాలు వెల్లడించారు. గత రెండు రోజుల నుంచి టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ చెంచుబాబు నేతృత్వంలో ప్రొద్దుటూరు నుంచి శ్రీసత్యసాయి జిల్లా, చెన్నై మార్గంలోని కొత్తపల్లి మండలం, పుట్టపర్తి ఫారెస్ట్ డివిజన్ పరిధిలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం పుట్టపర్తి ఫారెస్ట్ డివిజన్, పెనుకొండ రేంజ్ పరిధిలోని బెంగళూరు–హైదరాబాద్ హైవేలో ఆర్‌ఎస్‌ఐ మురళీధర్‌రెడ్డి బృందం తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ ఇన్నోవా వాహనం ఆగకుండా వెళ్లిపోయింది. ఆ వాహనాన్ని వెంబడించిన పోలీసులు.. ఇద్దరు స్మగ్లర్లను అదుపులోకి తీసుకుని రూ.1.50కోట్ల విలువజేసే 84 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మండలం, గోపవరం పంచాయతీకి చెందిన షేక్ హుసేన్ వల్లి (24), గొండూరు మండలం, మల్లెల గ్రామానికి చెందిన కాసెట్టి మల్లికార్జున (37) పట్టుబడిన వారిలో ఉన్నారు.

అధికారుల నిర్లక్ష్యానికి నిండుప్రాణం బలి

- కరెంట్ బిల్లు చెల్లించలేదని లైన్ కట్‌చేసిన అధికారులు
- సరఫరా లేదని తీగ పట్టుకున్న రైతుకు షాక్



రైతు శ్రీరామిరెడ్డి మృతదేహం

లింగాల: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం.. ఓ అన్నదాత ప్రాణం తీసింది. బిల్లు చెల్లించలేదని మోటారు వద్ద వైరు కట్ చేసిన అధికారులు... ఆనక సరఫరా నిలిపివేయడం మర్చిపోయారు. ఇది తెలియని రైతుకు వైరు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని తాతిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన మృతుడు కేశంరెడ్డి శ్రీరామిరెడ్డి(57)కి మూడు కరెంట్ సర్వీసులు ఉన్నాయి.. ఒక్కో సర్వీసుకు నెలకు రూ.30 చొప్పున ఏడు నెలలకు రూ.210 చెల్లించాలి. ఈ లెక్కన మూడు సర్వీసులకు రూ.610 చెల్లించలేదు. దీంతో అధికారులు మోటారు వద్ద కరెంట్ కట్ చేసి వెళ్లిపోయారు. సరఫరా నిలిపివేయడం మర్చిపోయారు. అయితే అరటితోట ఎండుతోందన్న ఉద్దేశంలో రైతు శ్రీరామిరెడ్డి అధికారుల అనుమతి తీసుకోకుండా వైరు సవరించేందుకు ప్రయత్నించాడు. వెంటనే షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దీనిపై ట్రాన్స్‌కో ఏఈ బాల సంజీవులు మాట్లాడుతూ అనుమతి లేకుండా సరఫరా ఉన్న సమయంలో లైన్ సవరించేందుకు ప్రయత్నం చేయడంతోనే రైతుమృతి చెందినట్లు పేర్కొన్నారు.

ముగిసిన మావోయిస్టు అమరవీరుల వారోత్సవాలు

ఏవోబీలో ప్రశాంతం.. కానరాని మావోయిస్టుల ఉనికి



పోలీసు బలగాల గాలింపు చర్యలు

సాక్షి,పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చిన అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. అమరవీరుల వారోత్సవాల ప్రకటనతో జిల్లా వ్యాప్తంగా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లాతో పాటు సరిహద్దు ఒడిశాలోను పోలీస్ బలగాలు పెద్ద ఎత్తున గాలింపు చర్యలు చేపట్టాయి. ఏవోబీలో ఇటీవల మావోయిస్టుల కదలికలు ఉన్నాయనే అనుమానంతో పోలీస్ బలగాలు ప్రతికూల వాతావరణంలో అటవీ ప్రాంతాల్లో మకాం వేశాయి. భారీ వర్షాలు, వరదలను సైతం లెక్క చేయకుండా అడవిలో జల్లెడ పట్టాయి. పోలీస్ పార్టీల నిర్బంధంతో పాటు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో మావోయిస్టుల ఉనికి ఏవోబీలో కానరాలేదు. ఏవోబీ వ్యాప్తంగా ఎక్కడ మావోయిస్టుల సంస్మరణ వారోత్సవాలు జరిపిన సమాచారం కూడా లేదు. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దులో మావోయిస్టుల సంచారం అధికంగా ఉండడంతో ఆ ప్రభావం ఏవోబీలోను ఉంటుందని పోలీస్‌శాఖ అప్రమత్తమై ప్రత్యేక వ్యూహంతో ముందుకెళ్లింది. ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలను సురక్షిత ప్రాంతాలకే పరిమితం చేసింది. మావోయిస్టుల అమరవీరుల వారోత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో పోలీస్‌శాఖతో పాటు ఏవోబీలోని గిరిజనులు ఊపిరి పీల్చుకున్నారు.

శాసన మండలిలో వైద్యులకు అవకాశం ఇవ్వండి

మంత్రి దుర్గేష్‌కు ఏపీ ఐఎంఏ ప్రతిపాదన

రాజానగరం: శాసన మండలిలో వైద్యులకు అవకాశం కల్పించాలని ఐఎంఏ ఏపీ అధ్యక్షుడు డాక్టర్ ఎంజేసీ నాయుడు టూరిజం, సాంస్కృతిక వ్యవహారాల శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను కోరారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగే సౌత్ జోన్ వైద్య, విజ్ఞాన సదస్సు తూర్పు గోదావరి జిల్లా, రాజానగరంలోని జీఎస్ఎల్ వైద్య కళాశాలలో శనివారం ప్రారంభమైంది. ఈ సదస్సును మంత్రి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ డాక్టర్లు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ ఉండాలని, అప్పుడే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించగలుగుతారన్నారు. డాక్టర్ ఎంజేసీ నాయుడు మాట్లాడుతూ పలు అంశాలపై చర్యలు తీసుకోవాలని మంత్రికి విన్నవించారు.

యుద్ధమేఘాలు!



మధ్య ప్రాచ్యానికి తరలుతున్న అమెరికా విమానవాహక నౌక యూఎస్ఎస్ అబ్రహం లింకన్

క్షిపణి దాడిలోనే హనియె చనిపోయారు

- ఇరాన్ వెల్లడి
- ప్రతీకారం తప్పదని ఇజ్రాయెల్‌కు హెచ్చరిక

జెరూసలేం: హమాస్ రాజకీయ విభాగం చీఫ్ ఇస్మాయిల్ హనియె మృతికి స్వల్ప శ్రేణి క్షిపణి దాడే కారణమని ఇరాన్ సైన్యంలో అత్యంత కీలకమైన రివల్యూషనరీ గార్డ్స్ విభాగం ప్రకటించింది. అమెరికా మద్దతుతోనే ఇజ్రాయెల్ ఈ దాడికి తెగబడిందని శనివారం ఆరోపించింది. ''హనియె బస చేసిన భవనాన్ని 7 కిలోల బరువున్న పేలుడు పదార్థంతో కూడిన రాకెట్ తాకింది. దాంతో భవనం ధ్వంసమైంది'' అని తెలిపింది. యుద్ధోన్మాద ఇజ్రాయెల్‌కు తగు సమయంలో తగు రీతిలో దీటుగా బుద్ధి చెబుతామని హెచ్చరించింది. అయితే దాడి జరిగిన ప్రాంతం తదితరాలకు సంబంధించిన వివరాలను మాత్రం వెల్లడించలేదు.

మధ్యప్రాచ్యంలో అమెరికా భారీ మోహరింపులు

- భారీ యుద్ధ నౌకలు, ఫైటర్ జెట్ల తరలింపు

టెల్‌అవీవ్/వాషింగ్టన్: పశ్చిమాసియాపై యుద్ధమేఘాలు దట్టంగా కమ్ముకుంటున్నాయి. హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియె హత్య, అందుకు దీటైన ప్రతీకారం తప్పదన్న ఇరాన్ హెచ్చరికలు అగ్గి రాజేశాయి. ఇజ్రాయెల్‌పై ఇరాన్ దూకుడు చర్యలకు దిగితే అడ్డుకునేందుకు అమెరికా అదనపు యుద్ధ నౌకలు, బాలిస్టిక్ మిసైల్ డిఫెన్స్ క్రూయిజర్లు, డిస్ట్రాయర్లు, ఎఫ్–22 ఫైటర్ జెట్ స్క్వాడ్రన్‌ను మధ్యప్రాచ్యానికి తరలిస్తోంది. పసిఫిక్ సముద్రంలో ఉన్న విమానవాహక నౌక యూఎస్ఎస్ అబ్రహం లింకన్‌ను కూడా తరలించాల్సిందిగా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ ఆదేశించారు. మిసైల్ డిఫెన్స్ బలగాలకు కూడా సర్వసన్నద్ధంగా ఉండాలంటూ ఆదేశాలు వెళ్లాయి. ఇరాన్ సమీపంలో భూతల బాలిస్టిక్ మిసైల్ డిఫెన్స్ వ్యవస్థలను మోహరించే ప్రయత్నాలు కూడా జోరందుకున్నాయి. 40 ఎఫ్ఏ–18 సూపర్ హార్నెట్, ఎఫ్–35 అటాక్ ప్లేన్లతో కూడిన విమానవాహక నౌక థియోడర్ రూజ్‌వెల్ట్ అరేబియా తీర సమీపంలో; 30 యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, 4,500 మంది మరైన్లు, నావికా దళ సభ్యులతో కూడిన యూఎస్ఎస్ వాస్ప్ కూడా తూర్పు మధ్యధరా సముద్రంలో పహారా కాస్తున్నాయి.

మరో హమాస్ నేత హతం

శనివారం గాజాపై వైమానిక దాడుల్లో హమాస్ సైనిక విభాగ కీలక నేత హైథమ్ బలిదీతో పాటు డజన్లకొద్దీ పాలస్తీనియన్లు మరణించినట్టు సమాచారం. వెస్ట్‌బ్యాంక్‌లో 9 మంది పాలస్తీనా తీవ్రవాదులను మట్టుబెట్టినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది.

ఇజ్రాయెల్ కోసం ఎందాకైనా: అమెరికా

ఇజ్రాయెల్‌కు దన్నుగా నిలిచేందుకు అవసరమైతే మరిన్ని చర్యలూ చేపడతామని పెంటగాన్ తాజాగా ప్రకటించింది. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య యుద్ధ వాతావరణ నెలకొనడం ఈ ఏడాది ఇప్పటికే ఇది రెండోసారి. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ దేశవ్యాప్త హై అలర్ట్ ప్రకటించింది. అయితే ఉద్రిక్తలు పెరగడం ఎవరికీ మంచిది కాదని పెంటగాన్ అధికార ప్రతినిధి సబ్రీనాసింగ్ అన్నారు. మధ్యప్రాచ్యంలో తాజా పరిస్థితులపై ఇజ్రాయెల్ రక్షణ మంత్రి యొవ్ గాలంట్‌తో లాయిడ్‌సుదీర్ఘంగా ఫోన్లో మాట్లాడినట్టు తెలిపారు.

ఆరు ప్రాణాలు నిలబెట్టారు

వయనాడ్‌లో కొండ గుహలో చిక్కుకున్న గిరిజన కుటుంబం

- ఐదు రోజులుతిండిలేక నలుగురు చిన్నారులు, తల్లిదండ్రులు విలవిల
- ఎనిమిది గంటలు శ్రమించి రక్షించిన కేరళ అటవీ సిబ్బంది



బాధిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న మోహన్‌లాల్

వయనాడ్: దట్టమైన అడవిలో అదొక కొండ గుహ.. చుట్టూ చిమ్మచీకటి.. ఒకటి నుంచి నాలుగేళ్ల వయసున్న నలుగురు చిన్నారులు, వారి తల్లిదండ్రులు ఐదు రోజులపాటు అక్కడే తలదాచుకున్నారు. తాగడానికి వర్షపు నీరు తప్ప తినడానికి తిండి లేదు. ఆకలితో అలమటించిపోయారు. అటవీ సిబ్బంది 8 గంటలపాటు శ్రమించి ఆ కుటుంబాన్ని రక్షించారు. ఆరుగురి ప్రాణాలను కాపాడారు. కేరళలో వరద బీభత్సానికి సాక్షిగా నిలిచిన వయనాడ్ జిల్లాలోని అట్టమల అడవిలో జరిగిన ఈ సాహసోపేతమైన ఆపరేషన్ తాలూకు వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అటవీ సిబ్బందే అసలైన హీరోలంటూ జనం ప్రశంసిస్తున్నారు.

వయనాడ్‌లో పనియా జాతి గిరిజనులు అధికంగా ఉంటారు. ఇతర సామాజికవర్గాలకు దూరంగా జీవిస్తుంటారు. అటవీ ఉత్పత్తులను విక్రయించి జీవనోపాధి పొందుతుంటారు. అందుకోసం గిరిజన దంపతులు నలుగురు పిల్లలను వెంట తీసుకుని కొండల్లోకి వెళ్లారు. భీకర వర్షం మొదలవడంతో కొండ గుహలో తలదాచుకున్నారు. వర్షం తగ్గకపోవడం, కొండచరియలు విరిగిపడుతుండడంతో కిందికొచ్చే సాహసం చేయలేకపోయారు. ఆహారం కోసం వెతుకుతూ తల్లి ఐదు రోజుల తర్వాత కిందికి రావడంతో అధికారులు గమనించారు. గుహలో నలుగురు పిల్లలు, భర్త ఉన్నారని చెప్పడంతో అటవీ సిబ్బంది వెంటనే రంగంలోకి దిగారు. భారీ వర్షం, అడుగడుగునా రాళ్లు, బురదలో అడుగువేయడమే కష్టమవుతున్నా గుహకు చేరుకున్నారు. ముందుగా ఆకలితో నీరసించిపోయిన చిన్నారుల కడుపు నింపారు. వాళ్లను తాళ్లతో తమ ఒంటికి కట్టుకొని జాగ్రత్తగా తీసుకొచ్చారు. ఆ క్రమంలో కొండపై నుంచి తాళ్ల సాయంతో దిగాల్సి వచ్చింది. ఆ ఫొటోలను సోషల్ మీడియాలో జనం విపరీతంగా షేర్ చేశారు.

350 మందికిపైగా మృతులు!

వయనాడ్ విపత్తు మృతుల సంఖ్య 350 దాటినట్లు తెలుస్తోంది. శనివారం అధికారులు మాత్రం 218 మంది చనిపోయినట్లు వెల్లడించారు. నిర్వాసితులకు సురక్షిత ప్రాంతంలో టౌన్‌షిప్ ఏర్పాటుచేసి ఇళ్లు కట్టిస్తామని సీఎం పినరయి విజయన్ చెప్పారు. ప్రకటించారు.

మోహన్ లాల్ రూ.3 కోట్ల విరాళం

ప్రముఖ సినీ నటుడు మోహన్‌లాల్ శనివారం వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు. భారత ప్రాదేశిక సైన్యంలో లెఫ్టినెంట్ కల్నల్ హోదా ఉన్న ఆయన బాధితులను పరామర్శించారు. సహాయక సిబ్బంది సేవలను కొనియాడారు. వరద విలయానికి నామారూపాల్లేకుండాపోయిన నివాసాలను చూసి చలించిపోయారు. పునరావాస చర్యలకు రూ.3 కోట్ల విరాళం ప్రకటించారు.



5 రోజులుగా గుహలో చిక్కిన చిన్నారులను సురక్షితంగా తీసుకొస్తున్న సిబ్బంది

సొమాలియాలో ఉగ్రదాడి.. 32 మంది మృతి

మొగదిషు: సొమాలియా రాజధాని మొగదిషులో హోటల్‌పై ఉగ్రవాదులు జరిపిన దాడిలో 32 మంది చనిపోగా మరో 63 మంది గాయపడ్డారు. శుక్రవారం సాయంత్రం లిడో బీచ్‌లోని హోటల్ సమీపంలో ఆత్మాహుతి బాంబర్ తనను పేల్చేసుకున్నాడు. అనంతరం ఉగ్రవాదులు కాల్పులకు పాల్పడ్డారు. ఒక జవాను మృతి చెందగా, మరొకరు గాయపడ్డారని అధికారులు తెలిపారు. మిగతా బాధితులంతా సామాన్య లేనన్నారు. ఇది తమ పనేనని అల్‌కాయిదా అనుబంధ అల్ షబాబ్ ప్రకటించుకుంది.

మీరే సంధానకర్తలు

గవర్నర్ల సదస్సులో రాష్ట్రపతి


న్యూఢిల్లీ: కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య గవర్నర్లు అనుసంధానకర్తలుగా వ్యవహరించాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సూచించారు. శనివారం ముగిసిన గవర్నర్ల రెండు రోజుల సదస్సులో ఆమె ప్రసంగించారు. శాఖల మధ్య మరింత సమన్వయానికి చర్యలపై సదస్సులో చర్చించినట్టు రాష్ట్రపతి భవన్ పేర్కొంది. మెరుగైన పనితీరుకు రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సమాచారాన్ని పొందేందుకు, నిరంతర సంప్రదింపులకు సాగించడంలో గవర్నర్లు సంశయించరాదని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ సూచించారు. రాజ్‌భవన్‌లలో ఆదర్శ పాలనా నమూనాను రూపొందించడానికి గవర్నర్లు కృషి చేయాలని ప్రధాని మోదీ సూచించారు. గవర్నర్లు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని, డిజిటైజేషన్‌ను ప్రోత్సహించాలని కోరారు.

కోల్‌కతాను ముంచెత్తిన వానలు

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వానలు కురుస్తున్నాయి. తీవ్ర అల్పపీడనం కారణంగా శనివారం కురిసిన భారీ వర్షాలతో కోల్‌కతాతోపాటు పరిసర హౌరా, సాల్ట్‌లేక్, బారక్‌పోర్‌ల్లోని పలుప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. అయితే, ట్రాఫిక్ అంతరాయం ఏర్పడలేదని అధికారులు తెలిపారు. కోల్‌కతా విమానాశ్రయం లోపల కూడా నీరు నిల్చినప్పటికీ విమాన సర్వీసులు కొనసాగాయన్నారు. పార్కింగ్ ప్రాంతాల్లో నిల్చిన నీటిని పంపులతో తోడి వేసినట్లు చెప్పారు. వచ్చే 24 గంటలు కూడా విస్తారంగా వానలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. పశ్చిమ్ బర్ధమాన్ జిల్లాలో కాజీ నజ్రుల్ ఇస్లాం విమానాశ్రయంలో భారీగా వాన నీరు చేరడంతో రాకపోకలను నిలిపేశారు.

ఆహార మిగులు దేశంగా భారత్

అంతర్జాతీయ వ్యవసాయ ఆర్థికవేత్తల సదస్సులో మోదీ



సాక్షి, న్యూఢిల్లీ: భారత్ ఆహార మిగులు దేశంగా మారిందని, ప్రపంచ ఆహార, పౌష్టికాహార భద్రతకు పరిష్కారాలను అందించేందుకు కృషి చేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. భారత ఆర్థిక విధానాలకు వ్యవసాయమే కేంద్ర బిందువని, ఆహార భద్రతకు చిన్న రైతులే అతి పెద్ద బలమని స్పష్టంచేశారు. శనివారం ఢిల్లీలో 32వ అంతర్జాతీయ వ్యవసాయ ఆర్థికవేత్తల సదస్సులో ఆయన మాట్లాడారు. 65 ఏళ్ల క్రితం వ్యవసాయ రంగంలో అనేక సవాళ్లను ఎదుర్కొన్న భారత్ నేడు ఆహార మిగులు దేశంగా మారిందని హర్షం వ్యక్తం చేశారు. పాలు, పప్పులు, సుగంధ ద్రవ్యాల ఉత్పత్తిలో ప్రపంచంలో అగ్రస్థానంలో ఉందని, ఆహార ధాన్యాలు, పండ్లు, కూరగాయలు, పత్తి, చక్కెర, టీ, చేపల ఉత్పత్తిలో రెండో స్థానంలో ఉందని తెలిపారు. ప్రపంచ సంక్షేమానికి భారత్‌ను 'విశ్వ బంధు'గా అభివర్ణించారు.

ప్రకృతి సాగుతో సానుకూల ఫలితాలు

ప్రకృతి వ్యవసాయాన్ని భారీగా ప్రోత్సహించడంతో దేశంలో సానుకూల ఫలితాలు కనిపిస్తున్నాయని మోదీ తెలిపారు. సుస్థిరమైన, ప్రతికూల వాతావరణాన్ని తట్టుకోగల సాగు విధానాలపై ఈ బడ్జెట్‌లో ప్రత్యేకంగా దృష్టి పెట్టామన్నారు. పంటల పరిశోధన, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నట్టు చెప్పారు. గడిచిన పదేళ్లలో భిన్న వాతావరణ పరిస్థితులను తట్టుకోగలిగే దాదాపు 1,900 కొత్త వంగడాలను రైతులకు అందజేసినట్లు చెప్పారు. సాంప్రదాయ రకాల కంటే 25 శాతం తక్కువ నీరు అవసరమయ్యే వరి రకాలను అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. భారత తృణధాన్యాల బుట్టను ప్రపంచంతో పంచుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

సాంకేతికత పరిజ్ఞానంతో అనుసంధానం

వ్యవసాయాన్ని ఆధునిక సాంకేతికత పరిజ్ఞానంతో అనుసంధానిస్తున్నామని మోదీ వెల్లడించారు. సోలార్ ఫార్మింగ్ మొదలుకుని ఈ–నామ్ తదితరాలను ఉదాహరించారు. సంప్రదాయ రైతుల నుండి అగ్రికల్చర్ స్టార్టప్‌ల వరకు, సహజ వ్యవసాయం నుండి ఫార్మ్ వ్యవసాయం వరకు వివిధ వ్యవసాయ, అనుబంధ రంగాల ఆధునీకరణ గురించి వివరించారు. పదేళ్లలో 90 లక్షల హెక్టార్లను మైక్రో ఇరిగేషన్ కిందకు తీసుకొచ్చామన్నారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద ఒక్క క్లిక్‌తో 10 కోట్ల మంది రైతుల బ్యాంకు ఖాతాలకు డబ్బు బదిలీ చేస్తున్నామన్నారు. పంటల సర్వే కోసం డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తెచ్చామని చెప్పారు. తమ ప్రభుత్వం చేపట్టిన ఆధునిక చర్యలు భారతదేశంలోని రైతులకు ప్రయోజనం చేకూర్చడమే కాకుండా ప్రపంచ ఆహార భద్రతను బలోపేతం చేస్తాయన్నారు. అంతర్జాతీయ వ్యవసాయ ఆర్థికవేత్తల సదస్సుకు 70 దేశాల నుంచి వెయ్యి మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. ఈ నెల 7వ తేదీ వరకు ఈ సదస్సు జరుగుతుంది.

'ఫాక్స్'లో అయితేనే డిబేట్!

- ఏబీసీకి రాను: ట్రంప్ మెలిక
- ఇదెక్కడి పలాయనవాదం?
- దుయ్యబట్టిన హారిస్ వర్గం



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ప్రధాన ప్రత్యర్థులైన డొనాల్డ్ ట్రంప్, కమలా హారిస్ మధ్య అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్న ప్రెసిడెన్షియల్ డిబేట్ జరిగే అవకాశాలు సన్నగిల్లుతున్నాయి. సెప్టెంబర్ 10న ఏబీసీ చానల్లో హారిస్‌తో జరగాల్సిన డిబేట్ నుంచి తప్పుకుంటున్నట్టు ట్రంప్ ప్రకటించారు. ''నిజానికది జో బైడెన్‌తో జరగాల్సిన డిబేట్. ఆయన ఎన్నికల బరి నుంచి తప్పుకున్నందున ఆ డిబేట్ కూడా రద్దయినట్టే'' అని వాదించారు. ఈ మేరకు సొంత సోషల్ మీడియా హాండిల్ 'ట్రూత్'లో తాజాగా ట్రంప్ పలు పోస్టులు పెట్టారు. ఫాక్స్ న్యూస్ చానల్లో అయితేనే డిబేట్‌కు వస్తానంటూ మెలిక పెట్టారు. ''సెప్టెంబర్ 4న పెన్సిల్వేనియాలో ఫాక్స్ స్టూడియోలో హారిస్ చర్చకు రావాలి. ఖాళీ స్టూడియోలో కాకుండా కిక్కిరిసిన ప్రేక్షకుల నడుమ డిబేట్ చేద్దాం'' అని సవాలు విసిరారు. దీనిపై హారిస్ వర్గం మండిపడింది. పిరికితనంతో డిబేట్ నుంచి ట్రంప్ పారిపోతున్నారంటూ ఎద్దేవా చేసింది. ఈ నేపథ్యంలో ట్రంప్ రాకపోయినా కేవలం హారిస్‌తో ఏబీసీ డిబేట్ కొనసాగుతుందా అన్నది చూడాల్సి ఉంది. డెమొక్రాట్ల తరఫున అధ్యక్షుడు బైడెన్‌కు బదులు హారిస్ అధ్యక్ష రేసులో అడుగు పెట్టినప్పటి నుంచీ ఆమెతో డిబేట్‌కు ట్రంప్ వెనకా ముందాడుతూ వస్తున్నారు. తామిద్దరి గురించీ అమెరికన్లకు ఇప్పటికే అంతా తెలుసంటూ వ్యాఖ్యలు చేశారు. కానీ తనతో డిబేట్‌కు రావాల్సిందేనని హారిస్ పట్టుబడుతున్నారు.

గూగుల్‌పై ట్రంప్ మండిపాటు

తన వార్తలను, ఫొటోలను గూగుల్ సెన్సార్ చేస్తోందని, ప్రజలకు వాస్తవాలు చేరనివ్వడం లేదని ట్రంప్ మండిపడ్డారు. తనకు సంబంధించిన వార్తలను, సమాచారాన్ని ఫేసుబుక్‌లో సెన్సార్ చేసినందుకు సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ తనకు క్షమాపణ చెప్పారన్నారు.

అల్లుడ్ని కాల్చి చంపిన రిటైర్డ్ ఐపీఎస్

కోర్టు సముదాయంలోనే ఘటన

చండీగఢ్: పంజాబ్‌లో మాల్విందర్ సింగ్ సిద్ధు అనే మాజీ ఐపీఎస్ అధికారి దారుణానికి పాల్పడ్డారు. సొంత అల్లున్ని కోర్టు ఆవరణలోనే కాల్చి చంపారు. మాల్వీందర్ కుమార్తె, ఐసీఏఎస్ అధికారి హర్‌ప్రీత్ సింగ్ దంపతుల మధ్య విడాకుల వ్యవహారం నడుస్తోంది. రెండు కుటుంబాలు శనివారం చండీగఢ్ జిల్లా కోర్టు సముదాయానికి వచ్చారు. వాష్ రూం చూపించాలంటూ హర్‌ప్రీత్‌ను మాల్విందర్ పక్కకు తీసుకెళ్లారు. ఒక్కసారిగా కాల్పులకు దిగడంతో హర్‌ప్రీత్ అక్కడికక్కడే చనిపోయారు. పోలీసులు మాల్వీందర్‌ను అరెస్ట్ చేసి, తుపాకీని స్వాధీనం చేసుకున్నారు.

కేదార్‌నాథ్‌లో సాగుతున్న సహాయక చర్యలు

సురక్షిత ప్రాంతాలకు 10 వేల మంది తరలింపు

రుద్రప్రయాగ్/సిమ్లా: ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్‌లో చిక్కుకుపోయిన తీర్థయాత్రికుల కోసం మూడు రోజులుగా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు 10,500 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కేదార్‌నాథ్, భింబలి, గౌరీకుండ్‌ల్లో చిక్కుకుపోయిన మరో 1,500 మందిని బయటకు తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. వారంతా సురక్షితంగానే ఉన్నారని స్పష్టం చేసింది. యాత్రికులను తరలించేందుకు వైమానిక దళం చినూక్, ఎంఐ–17 హెలికాప్టర్లను శుక్రవారం రంగంలోకి దించింది. పర్వత మార్గంలో కుండపోతగా కురిసిన వర్షాల కారణంగా పలువురు గల్లంతైనట్లు వస్తున్న వార్తలను అధికారులు ఖండించారు. శుక్రవారం లించోలిలో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తిని యూపీలోని సహరాన్‌పూర్‌కు చెందిన శుభమ్ కశ్యప్‌గా గుర్తించారు. భారీ వర్షాల కారణంగా గౌరీకుండ్-కేదార్‌నాథ్ ట్రెక్కింగ్ మార్గంలో 25 మీటర్ల మేర రహదారి కొట్టుకుపోయింది. అడ్డంకులను తొలగించి, రహదారిని పునరుద్ధరించే వరకు వేచి ఉండాలని రుద్రప్రయాగ్ యంత్రాంగం యాత్రికులను కోరింది.

హిమాచల్‌లో ఆ 45 మంది కోసం గాలింపు

హిమాచల్ ప్రదేశ్‌లోని కులు, సిమ్లా, మండి జిల్లాల్లో వరద బీభత్సంలో గల్లంతైన 45 మంది కోసం గాలింపు కొనసాగుతోంది. మండి జిల్లా రాజ్‌బన్ గ్రామంలో రాతి కింద చిక్కుకున్న వ్యక్తిని గుర్తించారు. కులు జిల్లా సమేజ్ గ్రామంలో గల్లంతైన పోయిన 30 మంది కోసం డ్రోన్ల సాయంతో గాలిస్తున్నారన్నారు. శ్రీఖండ్ మహాదేవ్ ఆలయంలో చిక్కిన 300 మంది, మలానాలో చిక్కుకున్న 25 మంది పర్యాటకులు క్షేమంగా ఉన్నారని అధికారులు చెప్పారు.



కేదార్‌నాథ్ యాత్రికులను సురక్షితంగా తరలిస్తున్న భద్రతా సిబ్బంది

న్యాయప్రక్రియతో జనం విసుగెత్తిపోయారు

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్



న్యూఢిల్లీ: దేశంలో కోర్టులకు సంబంధించిన వ్యవహారాలు, సుదీర్ఘంగా సాగే న్యాయ వ్యవస్థ ప్రక్రియతో ప్రజలు విసుగెత్తిపోయారని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ చెప్పారు. వివాదాల పరిష్కారానికి లోక్ అదాలత్‌లు చక్కటి ప్రత్యామ్నాయ వేదికలని చెప్పారు. వాటిని ఉపయోగించుకోవాలని ప్రజలకు సూచించారు. శనివారం సుప్రీంకోర్టులో ప్రత్యేక లోక్ అదాలత్ వారోత్సవంలో ఆయన మాట్లాడారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న వివాదాలను, కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకొనే అవకాశం ఉందని, ఇరుపక్షాల అంగీకారంతో రాజీ పడొచ్చని వెల్లడించారు. న్యాయస్థానాల్లో న్యాయం చేకూర్చే ప్రక్రియ కక్షిదారులకు ఒక శిక్షగా మారిపోయిందని, ఇది నిజంగా న్యాయమూర్తులకు ఆందోళన కలిగించే విషయమని జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు. ఈ పరిస్థితిలో మార్పు రావాలని ఆకాంక్షించారు.

బీజేపీ అధికార జిహాద్‌కు పాల్పడుతోంది: ఉద్ధవ్



పుణే: ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు రాజకీయ పార్టీలను చీల్చడం వంటి చర్యలతో కేంద్రంలోని బీజేపీ అధికార జిహాద్‌కు పాల్పడుతోందని శివసేన(యూబీటీ) ఉద్ధవ్ ఠాక్రే మండిపడ్డారు. శనివారం ఆయన పుణేలో జరిగిన పార్టీ ర్యాలీలో మాట్లాడారు. ఈ సందర్భంగా తనను ఔరంగ జేబ్ ఫ్యాన్ క్లబ్ అధ్యక్షుడంటూ గత నెలలో హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను పరోక్షంగా ప్రస్తావిస్తూ.. ఆ బీజేపీ అగ్ర నేత అఫ్గాన్ రాజు అహ్మద్ షా అబ్దాలీ రాజకీయ వారసుడంటూ ఎద్దేవా చేశారు. మూడో పానిపట్ యుద్ధంలో మరాఠాలను అబ్దాలీ ఓడించాడు. మరోవైపు మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఫడ్నవీస్‌నూ ఉద్ధవ్ పరోక్షంగా హెచ్చరించారు. 'రాజకీయాల్లో నువ్వైనా ఉండాలి, లేదా నేనైనా ఉండాలి..తేల్చుకుందాం'అంటూ సవాల్ విసిరారు. 'కొందరు నేను సవాల్ విసిరానని అనుకుంటున్నారు. నల్లులతో సవాల్ చేయాల్సిన అవసరమే లేదు. వాటిని నలిపేస్తాను'అని అన్నారు.

ట్రంప్‌కు భద్రత కల్పించడంలో విఫలమయ్యాం

అమెరికా సీక్రెట్ సర్వీస్ విభాగం ఒప్పుకోలు



కింబర్లీ చియాటిల్

వాషింగ్టన్: పెన్సిల్వేనియాలో జూలై 13వ తేదీన ఎన్నికల ర్యాలీ సమయంలో మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై హత్యాయత్నం ఘటన తమ వైఫల్యమేనని అమెరికా సీక్రెట్ సర్వీస్ విభాగం పేర్కొంది. ఆయనకు భద్రత కల్పించడంలో వైఫల్యానికి తమదే బాధ్యతని తెలిపింది. బట్లర్ ఎన్నికల ర్యాలీలో ప్రసంగిస్తున్న ట్రంప్‌పై ఓ యువకుడు కాల్పులకు పాల్పడటం తెల్సిందే. ఆ ఘటన నుంచి ఆయన త్రుటిలో తప్పించుకున్నారు. ఒక బుల్లెట్ మిల్లీమీటర్ దూరం నుంచి దూసుకెళ్లగా, మరో బుల్లెట్ ఆయన చెవిని గాయపర్చింది. అప్పటి ఘటనకు బాధ్యత వహిస్తూ సీక్రెట్ సర్వీస్ డైరెక్టర్ కింబర్లీ చియాటిల్ రాజీనామా చేయగా, ఆమె స్థానంలో రొనాల్డ్ రోవె తాత్కాలిక డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు.

పంజాబ్ సీఎం పారిస్ యాత్రకు కేంద్రం నిరాకరణ



చండీగఢ్: పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్ ఫ్రాన్స్ వెళ్లేందుకు కేంద్రం అనుమతివ్వలేదని అధికార వర్గాలు తెలిపాయి. ఒలింపిక్స్‌లో ఆడే భారత హాకీ జట్టుకు మద్దతు తెలిపేందుకు ఆయన పారిస్ వెళ్లాలనుకున్నట్టు వివరించాయి. ''ఆగస్టు 3 నుంచి 9 దాకా పారిస్ వెళ్లేందుకు మాన్ అనుమతి కోరారు. జెడ్‌ప్లస్ కేటగిరీ భద్రత ఉన్న మాన్‌కు ఇంత త్వరగా ఆ స్థాయి భద్రతను కల్పించడం అసాధ్యమని శుక్రవారం కేంద్రం సమాచారమిచ్చిందన్నారు. ఆగస్టు 4 నుంచి 7 దాకా అమెరికాలోని కెంటకీలో జరిగే అసెంబ్లీ స్పీకర్ల సదస్సులో పాల్గొనేందుకు తనకు కూడా కేంద్రం అనుమతివ్వలేదని పంజాబ్ అసెంబ్లీ స్పీకర్ కుల్తార్ సింగ్ సంధ్వాన్ చెప్పారు. తనతోపాటు కర్ణాటక, కేరళ, హిమాచల్ స్పీకర్లకు అనుమతి నిరాకరించిన కేంద్రం మేఘాలయ స్పీకర్‌కు మాత్రం ఓకే చెప్పిందన్నారు.

9/11 దాడుల సూత్రధారి నేరాంగీకార ఒప్పందం తిరస్కరించిన రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్

అవి మరణశిక్ష కేసులేనని స్పష్టీకరణ



9/11 ప్రధాన సూత్రధారి ఖాలిద్ షేక్ మహ్మద్

వాషింగ్టన్: సుమారు 3 వేల మందిని బలి తీసుకున్న 2001, సెప్టెంబర్ 11 దాడులకు పథకం వేసిన ఖాలిద్ షేక్ మహ్మద్ పెట్టుకున్న నేరాంగీకార ఒప్పందాన్ని అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ తోసిపుచ్చారు. వీరిపై కేసులను మరణ శిక్ష విధించిన కేసులుగా తిరిగి పునరుద్ధరించే ఉత్తర్వులపై సంతకాలు చేశారు. ఖాలిద్ షేక్, అతడి అనుచరులు వాలిద్ బిన్ అట్టాష్, ముస్తాఫా అల్ హౌసవిలు ప్రస్తుతం గ్వాంటానమో బే జైల్లో ఉన్నారు. అప్పటి దాడులకు తమదే బాధ్యతంటూ వీరు పెట్టుకున్న అర్జీని అక్కడి యుద్ధ నేరాలను విచారించే కోర్టు జడ్జి సుసాన్ ఎస్కల్లియర్ ఆమోదించారు. ఈ ఒప్పందం మేరకు వీరిపై ఉన్న మరణశిక్ష యావజ్జీవంగా మారేందుకు మార్గం ఏర్పడింది. ఈ మేరకు అప్పటి ఘటనలో చనిపోయిన మూడు వేల మంది కుటుంబాలకు ఉత్తరాలు పంపారు. దీనిపై బాధిత కుటుంబాలతోపాటు ప్రతిపక్ష రిపబ్లికన్ పార్టీ మండిపడింది. ఆ ముగ్గురికీ మరణ శిక్ష పడాల్సిందేనని పట్టుబట్టింది. దీంతో మంత్రి ఆస్టిన్ రంగంలోకి దిగారు. తాజా పరిణామపు ప్రాధాన్యం దృష్ట్యా తుది నిర్ణయం తీసుకునే అధికారం తనకుందంటూ, ఆ ఒప్పందాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

9 నుంచి 15 వరకు 'హర్ ఘర్ తిరంగా'

ఇళ్ల వద్ద జాతీయ జెండా ఎగురవేయాలని అమిత్ షా పిలుపు



సాక్షి, న్యూఢిల్లీ: 'హర్ ఘర్ తిరంగా'ప్రచారంలో భాగంగా ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు ప్రతీ ఒక్కరూ తమ ఇళ్ల వద్ద త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అంతేగాక ప్రజలు త్రివర్ణ పతాకంతో దిగిన సెల్ఫీలను 'హర్ ఘర్ తిరంగా'వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని శనివారం ఆయన 'ఎక్స్'లో కోరారు. ప్రధాని మోదీ ప్రారంభించిన హర్ ఘర్ తిరంగా ప్రచారం రెండేళ్లలో జాతీయ ఉద్యమంగా మారిందని అమిత్ షా పేర్కొన్నారు.

దేశవ్యాప్తంగా పెరిగిన ఖరీఫ్ సాగు



సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు విస్తీర్ణం పెరిగిందని కేంద్ర వ్యవసాయ శాఖ తెలిపింది. వరి, పప్పులు, పెసర, రాగి, మొక్కజొన్న, నూనెగింజలు, చెరకు తదితర పంటలు కలిపి ఈ ఏడాది ఇప్పటి వరకు 904 లక్షల హెక్టార్లలో సాగైనట్లు ఓ ప్రకటనలో తెలిపింది. గత ఏడాది ఇదే సమయానికి 879.22 లక్షల హెక్టార్లలోనే రైతులు పంటలను సాగు చేశారని పేర్కొంది. అదేవిధంగా, గత ఏడాది 263.01 లక్షల హెక్టార్లలో వరి సాగు కాగా ఈ ఏడాది 276.91 హెక్టార్లలో సాగు చేశారు. గతేడాది ఇదే సమయానికి 99.71 లక్షల హెక్టార్లలో పప్పు ధాన్యాలు సాగు జరగ్గా, ఈ ఏడాది 110.61 లక్షల హెక్టార్లకు పెరిగింది. వీటితో పాటు గతేడాది 174.53 లక్షల హెక్టార్లలో నూనెగింజల సాగవగా ఈసారి 179.69 లక్షల హెక్టార్లకు చేరినట్లు కేంద్రం తెలిపింది. గతేడాదితో పోలిస్తే ముతక తృణ ధాన్యాలు, చెరకు సాగు కూడా పెరిగింది. సాగు పెరగడంతో పప్పు, నూనెగింజల ధరలు తగ్గొచ్చని కేంద్రం అంచనా వేస్తోంది.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
ఆదివారం । 4 । ఆగస్టు । 2024

జలనారాయణ ఆలయంలో దీపారాధన పూజలు


దీపారాధన పూజల్లో పాల్గొన్న భక్తులు

తిరువళ్లూరు: పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీ జలనారాయణ పెరుమాల్ ఆలయంలో దీపారాధన పూజలు శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ పూజల్లో పాల్గొనడం ద్వారా కష్టాలు, వివాహ సమస్యలు తొలగుతుందన్న నమ్మకంతో వుండడంతో పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాదాలు, మంగళసూత్రం, పసుపు, కుంకుమ తదితర వాటిని అందజేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. పూజల అనంతరం పూంగు ళి, పద్మావతి అమ్మవారు ప్రత్యేక దర్శనంలో దర్శనమిచ్చారు.

న్యూస్‌రీల్

దైవ దర్శనానికి వెళ్తూ మృత్యుఒడిలోకి!

- రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురి దుర్మరణం

సాక్షి, చెన్నై: దైవ దర్శనానికి మోటారు బైక్‌పై వెళ్తున్న ఓ కుటుంబాన్ని కారు రూపంలో శనివారం మధ్యాహ్నం మృత్యువు కబళించింది. అతి వేగంగా దూసుకొచ్చిన ఓ కారు అదుపు తప్పి డివైడర్‌ను దాటి ఎదురు రోడ్డులోకి రావడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వివరాలు.. దిండుగల్ జిల్లా రెట్టలాపురానికి చెందిన జోషఫ్(25) ఎలక్ట్రీషియన్. ఆయనకు భార్య అరుణ(25), రక్షన్ జో(7), రక్షిత(5) కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరంతా శనివారం ఉదయం మోటారు బైక్‌పై పళని ఆలయానికి బయలు దేరారు. మార్గం మధ్యలో నత్తం- దిండుగల్ రోడ్డులోని ఓ ఏటీఎం వద్ద తమకు కావాల్సిన నగదు డ్రా చేసుకుని ముందుకు కదిలారు. ఈ సమయంలో దిండుగల్ నుంచి నత్తం వైపుగా అతి వేగంగా దూసుకొచ్చిన కారు అదుపు తప్పింది. డివైడర్‌ను దాటి ఎదురు రోడ్డులోకి వచ్చి బైక్ మీద వెళ్తున్న వాళ్లను ఢీకొంది. దీంతో ఘటనా స్థలంలోనే జోషఫ్, అరుణ, రక్షన్ జో, రక్షిత మరణించారు. మరో మోటారు బైక్‌పై వెనుక వస్తున్న అదే ప్రాంతానికి చెందిన కులందై స్వామి, సరోజా దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానికులు నత్తం ఆస్పత్రికి తరలించారు. ఈప్రమాదంతో కారులో ఉన్న వారు ఉడాయించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృత దేహాలను పోస్టుమార్టానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు చెట్టును ఢీకొన్న ప్రమాదంలో మరో నలుగురు..

సాక్షి, చెన్నై : అదుపు తప్పిన కారు రోడ్డు పక్కగా ఉన్న చింత చెట్టును ఢీకొన్న ఘటనలో నలుగురు మరణించారు. వివరాలు..విరుదునగర్ జిల్లా అరుప్పుకోట్టై సమీపంలోని సాయల్‌కుడి మార్గంలో అతివేగంగా దూసుకొచ్చిన ఓ కారు శనివారం రాత్రి అదుపుతప్పి చింత చెట్టును ఢీకొట్టింది. ఈ కారులో ప్రయాణిస్తున్న ఉపాధ్యాయుడు బాల మురుగన్ (38), మణి (18), చిన్నదురై (22)తో పాటు మరొకరు సంఘటనా స్థలంలోనే మరణించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కారులో మద్యం తరలించిన ప్రభుత్వ బస్సు డ్రైవర్ అరెస్టు

తిరువొత్తియూరు: కారులో అక్రమంగా మద్యం తరలిస్తున్న ప్రభుత్వ బస్ డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. కాంచీపురం జిల్లా, మద్యం నిరోధక శాఖ ఎస్‌ఐ చంద్రశేఖర్ నేతృత్వంలో పోలీసులు వాలాజాబాద్‌లో వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన కారును నిలిపి సోదా చేశారు. అందులో 66 మద్యం బాటిల్స్‌ను పుదుచ్చేరి నుంచి అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని డ్రైవర్ ఇమ్మాన్యుయేల్ (49)ను అరెస్టు చేశారు. ఇతడు కాంచీపురం ఓరిగై ప్రభుత్వ బస్సు డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్నట్లు తెలిసింది.

అర్ధరాత్రి లారీ ఢీ..

- సమయపురం మారియమ్మన్ ఆలయ ప్రవేశ ద్వారానికి పగుళ్లు

తిరువొత్తియూరు: తిరుచ్చి, సమయపురం మారియమ్మన్ ఆలయానికి చెందిన ప్రవేశ ద్వారాన్ని లారీ ఢీ కొట్టడంతో స్తంభానికి పగుళ్లు ఏర్పడ్డాయి. వివరాలు.. శక్తి క్షేత్రాలలో తిరుచ్చి సమయపురం మారియమ్మన్ దేవస్థానం మొదటి వరుస ఉంది. ఈ ఆలయానికి తమిళనాడులోని వివిధ జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు ఈ ఆలయాన్ని సందర్శిస్తారు. ఈ ఆలయానికి సమయపురం కూడలి రోడ్డు వద్ద బ్రహ్మాండమైన ప్రవేశ ద్వారం ఉంది. ఇది సుమారు 40 సంవత్సరాల క్రితం నిర్మించారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి వరిధాన్యం బస్తాల లోడుతో మన్నచనల్లూర్‌కు వెళ్తున్న లారీ అర్ధరాత్రి అదుపు తప్పి ఈ ప్రవేశ ద్వారాన్ని ఢీకొంది. దీంతో ప్రవేశ ద్వారం ఎడమ వైపున ఉన్న స్తంభానికి దిగువన పగుళ్లు ఏర్పడ్డాయి. సమయపురం పోలీసులు విచారణ చేస్తున్నారు.

శ్రీలంక జైలు నుంచి చెన్నై చేరుకున్న తమిళ జాలర్లు


చెన్నై విమానాశ్రయానికి చేరుకున్న జాలర్లు

సేలం: రామనాథపురం జిల్లాకు చెందిన 15 మంది జాలర్లు, పుదుకోట్టైకు చెందిన ఆరుగురు జాలర్లు ఈ ఏడాది జూలై లో భారత సముద్ర జల్లాల్లో చేపలు పడుతుండగా.. శ్రీలంక సముద్ర తీర బలగాలు 21 మంది జాలర్లను అరెస్టు చేశాయి. అదే విధంగా రెండు పడవలను, జాలర్ల వద్ద ఉన్న వలలను స్వాధీనం చేసుకున్నారు. తర్వాత అదుపులోకి తీసుకున్న 21 మంది జాలర్లను శ్రీలంక జైలుకు తరలించారు. వారిని శ్రీలంక కోర్టులో హాజరు పరిచి అక్కడి జైలులో బంధించారు. ఈ క్రమంలో తమిళ జాలర్లను విడుదల చేయించాలని కోరుతూ కేంద్ర మంత్రి జయశంకర్‌కు ముఖ్యమంత్రి స్టాలిన్ లేఖను పంపించారు. తర్వాత శ్రీలంకలో ఉన్న భారత దౌత్య అధికారులు శ్రీలంక అధికారులతో చర్చించారు. ఈ క్రమంలో 21 మంది జాలర్లను రెండు రోజులు క్రితం శ్రీలంక కోర్టు విడుదల చేసింది. వారిని భారత దౌత్యాధికారులకు అప్పగించారు. దీంతో వారిని తమిళనాడుకు తరలించే ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి వారు విమానంలో చెన్నైకి వచ్చారు. వారిని రాష్ట్ర మత్స్యకారుల సంక్షేమ శాఖ అధికారులు ఆహ్వానించారు.

కావేరమ్మకు నీరాజనం

కావేరి నదీ పరీవాహక ప్రదేశాల్లో ఆడి పెరుక్కు శనివారం కోలాహలంగా సాగింది. భక్తిశ్రద్ధలతో కావేరి తల్లికి పూజలతో జనం నీరజనాలు పలికారు. రాష్ట్రాన్ని, తమ జీవితాల్ని సుభిక్షం చేయాలని, ఈ ఏడాది సాగు ఆశాజనకంగా ఉండాలని ప్రార్థించారు. అలాగే మరికొన్ని నదీ తీరాలలోనూ విశేష పూజలు నిర్వహించారు.


కావేరి తీరంలో కర్పూర నీరాజనం




పండించిన పంటలతో రైతుల పూజలు

- తీరంలో మిన్నంటిన భక్తిభావం
- కోలాహలంగా ఆడి పెరుక్కు
- పలు నదీ తీరాల్లో ప్రత్యేక పూజలు
- శ్రీ రంగనాథుడు సారె సమర్పణ

సాక్షి, చెన్నై: తమిళనాట ఆడి మాసానికి విశేష ప్రాముఖ్యత ఉంది. ఈ మాసంలో రాష్ట్రవ్యాప్తంగా భక్తిభావం మిన్నంటుతుంది. గ్రామ గ్రామానా అమ్మవారి ఆలయాల్లో ఉత్సవాలు, పూజలు భక్తిశ్రద్ధలతో జరుగుతాయి. ప్రతి మంగళ, శుక్ర, ఆదివారాల్లో ఇంటింటా పూజలు చేయడమే కాకుండా అమ్మవారి ఆలయాలలో అభిషేకాది పూజలు, అలంకరణలు జరుగుతాయి. ఆడి అమావాస్య రోజున పితృదేవుళ్లకు తర్పణాలు పెట్టడం జరుగుతోంది. ఇక ఈ మాసంలో ఆడి పెరుక్కు సంబరాలను నదీ తీరాల్లో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇందుకోసం ప్రతి ఏటా మేట్టూరు డ్యాం నుంచి ప్రత్యేకంగా నీటిని విడుదల చేయడం జరుగుతోంది. ఈ ఏడాది నీరు విడులయ్యేనా? అని ఎదురు చూసిన డెల్టా జిల్లాల వాసులకు నైరుతి రుతు పవనాలు కరుణించాయి. రోజుల వ్యవధిలో మేట్టూరు జలాశయం నిండి ఉబరి నీరు ఉధృతంగా డెల్టా జిల్లాల వైపుగా పరుగులు తీస్తోంది. మహోగ్రంగా పరవళ్లు తొక్కిన కావేరి శనివారం కాస్త శాంతించింది. సెకనుకు లక్ష క్యూసెక్కుల నీరు విడుదల వదలడంతో భద్రతా కారణాల దృష్ట్యా, ఎంపిక చేసిన చోట్ల, ముందస్తు ఏర్పాట్లు జరిగిన ప్రాంతాలలోనే ఆడి పెరుక్కు స్నానాలకు అవకాశం కల్పించారు.

పూజలతో సందడి..

కర్ణాటక నుంచి కావేరి తొలుత ప్రవేశించి ధర్మపురి జిల్లాలో పరిధిలో, ఆ తదుపరి ఉన్న కృష్ణగిరి జిల్లా తీరంలో ఈసారి ఆడి పెరుక్కు మిన్నంటింది. కావేరి పరవళ్లు తొక్కుతుండడంతో పెద్ద ఎత్తున జనం ఎంపిక చేసిన ప్రదేశాలలో పూజలు చేశారు. తిరుచ్చిలోని శ్రీరంగం, ముక్కొంబు, పనై కురిచ్చి, వేంగూరు, తిరువాలర్ సేలై, కంబరస పేట, పడితురైలలో ప్రజలు పెద్దఎత్తున అమ్మా మండపం వద్ద ఏర్పాటు చేసిన కావేరి ఘాట్ వద్దకు చేరుకుని పవిత్ర స్నానాలతో పూజలతో నిమగ్నమయ్యారు. పవిత్ర తంజావూరులోని తిరువయ్యారు ఘాట్ వద్ద భక్తుల సందడి నెలకొంది. పూంబుహార్ వద్ద, రత్న పురేశ్వర ఆలయం వద్ద , భవానీ, కావేరి, అమరావతి నదుల సంగమ క్షేత్రం వద్ద ఆడిపెరుక్కు ఉత్సవం మిన్నంటింది. ఉదయాన్నే నవ దంపతులు, కుటుంబాలు, యువతీ, యువకులు, పిల్లలు, అన్నదాతలు పెద్దఎత్తున కావేరి తీరానికి తరలి వచ్చారు. కావేరి తల్లికి కృతజ్ఞతలు తెలుపుతూ పూజాది కార్యక్రమాలు చేశారు. మహిళలు, నవ దంపతులు గాజులు, బియ్యం, పసుపు కుంకుమలు, తమల పాకులను కళసాల మధ్య ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. పలు రకాల ఫలాలను ఉంచి మొక్కులను తీర్చుకుని కర్పూర నీరాజనాలు సమర్పించారు. పవిత్ర స్నానాలు ఆచరించినానంతరం తమ మంగళ సూత్రాల్ని మార్చుకున్నారు. నవ దంపతులు తమ వివాహ సందర్భంగా ఉపయోగించిన పూల మాలల్ని తీసుకొచ్చి కావేరి నదిలో కలిపేశారు. అన్నదాతలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి విత్తనాల్ని, గత ఏడాది తమ చేతికి అందిన పంటల్ని కావేరి నదీ తీరంలో ఉంచి పూజలు చేశారు. అనంతరం ఆ పరిసరాల్లోని గ్రామ దేవతల ఆలయాల్ని సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు. పెళ్లి కాని కన్యలు, యువకులు, పిల్లల భాగ్యం లేని వాళ్లు కావేరి తీరంలో ప్రత్యేక పూజలు చేశారు. పవిత్ర స్నానం అనంతరం పసుపు తాడును తమ చేతికి కట్టుకున్నారు. మరి కొందరు అక్కడి వేప, రావి చెట్లకు కట్టారు.

కావేరి తల్లికి సారె..

ఆడి పెడుక్కు సందర్భంగా తిరుచ్చి శ్రీరంగం శ్రీరంగనాథ స్వామి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిగాయి. 11.30 గంటలకు స్వామివారు బంగారు పల్లకిలో ఊరేగింపుగా కావేరి తీరానికి వచ్చారు. అమ్మా మండపంలో స్వామికి వారికి ప్రత్యేక పూజలు జరిగాయి. రాత్రి వరకు స్వామి వారు భక్తులకు ఇక్కడే దర్శనం ఇచ్చారు. 8.30 గంటలకు ఆలయానికి వెళ్లారు. ముందుగా 4.30 గంటలకు స్వామి వారి తరపున కావేరి తల్లికి పట్టు చీర, పసుపు కుంకుమలు, చందనం, పూల మాలలు తదితర సారె సమర్పణ కార్యక్రమం కనుల పండువగా జరిగింది. ఇక మదురైలో వైగై నదీ, తిరునల్వేలి, కన్యాకుమారిలలో తామరభరణి నదీ, ఈరోడ్‌లో భవానీ నది, కోయంబత్తూరు నొయ్యల్ నది తదితర నదీ తీరాల్లోనూ ఆడి పెరుక్కు సంబరాలు మిన్నంటాయి. కాగా వరద ఉధృతి కారణంగా సేలం జిల్లా పూలాం పట్టి, కోనరిపట్టి, నెడుంకులంలో కావేరి నది వైపుగా మార్గాలను మూసివేశారు. ఏ ఒక్కరూ అటు వైపుగావెళ్ల లేని పరిస్థితి నెలకొనడంతో స్థానిక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇక్క కావేరి తీరంలో ఉత్సవం కళ తప్పినా, పిల్లికురిచ్చి కాలువలో నీటి పరవళ్లతో అక్కడ పూజలు నిర్వహించారు.




కన్యపూజ, నూతన జంట పూజలు


మహిళల కర్పూర హారతి


తాళిబొట్టు మార్చుకుంటున్న మహిళలు


కావేరి తీరంలో పోలీసు భద్రత


కావేరి తీరంలోని కాళింగరాయన్ కాలువ వద్ద పూజలు

ముత్తమిళ్ మురుగన్ మహానాడుకు సన్నద్ధం

- ఏర్పాట్లు ముమ్మరం

సాక్షి, చెన్నై: ముత్తమిళ్ మురుగన్ మహానాడుకు రాష్ట్ర దేవదాయ శాఖ సన్నద్ధమైంది. ఏర్పాట్లపై దృష్టి పెడుతూ పందిరి గుంజం నాటే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. హిందూ, దేవదాయ శాఖ మంత్రి పి.కె. శేఖర్ బాబు పందిరి గుంజను నాటి అంతర్జాతీయ ముత్తమిళ్ మురుగన్ మహానాడు పనులను ప్రారంభించారు. పళనిలో అంతర్జాతీయ ముత్తమిళ్ మురుగన్ మహానాడు ఈ నెల 24, 25 తేదీలలో జరగనుంది. ఈ మహానాడులో దేశవ్యాప్తంగానే కాకుండా అంతర్జాతీయంగా ఉన్న మురుగన్ భక్తులు, ఆధ్యాత్మిక నేతలు పెద్దసంఖ్యలో తరలిరానున్నారు. ఈ సందర్భంగా తమిళ్ కడవులు మురుగన్ పేరును ప్రపంచ వ్యాప్తంగా విస్తరింప చేసిన వారిలో 15 మందికి అవార్డులు అందజేయనున్నారు. ఈ మహానాడుకు ఆరు పడై వీడులలో ఒకటిగా ఉన్న దండాయుధ పాణిగా మురుగన్ కొలువైన పళనిని వేదికగా ఎంపిక చేశారు. పళనియాండవర్ ఆర్ట్స్, సాంస్కృతిక కళాశాల ప్రాంగణంలో మహానాడుకు ఏర్పాట్లు చేపట్టారు. పనులపై దృష్టి పెడుతూ పందిరి గుంజ నాటే కార్యక్రమం శనివారం జరిగింది. ఇందులో దేవదాయ శాఖ మంత్రి శేఖర్ బాబు పాల్గొని పందిరి గుంజను నాటి మహానాడు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తిరువణ్ణామలై ఆధీనం పొన్నంబాల్ దేశిక పరమాచార్య స్వామి, తిరుకయిలాయ పరమ్ పరై, పెరూర్ ఆధీనం కుమర గురుపర స్వామి, మైలం బొమ్మపురి ఆధీనం శివజ్ఞాన బాలయ స్వామి, రత్నగిరి బాలమురుగనడిమై స్వామి, పార్లమెంట్ సభ్యుడు సచ్చితానందం, ఎమ్మెల్యేలు సెంథిల్ కుమార్, గాంధీరాజన్, దేవదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, దిండుగల్ జిల్లా కలెక్టర్ పూంకొడి, జిల్లా ఎస్పీ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.


పందిరి గుంజను నాటుతున్న మంత్రి పి.కె. శేఖర్ బాబు

రెండు రోజుల్లో ముగ్గురు ఖైదీలు మృతి

అన్నానగర్: తేని జిల్లా వరుసనాట్టుకి చెందిన రాజా (31). తిరుపూర్ హత్య కేసులో యావజ్జీవ కారాగార శిక్ష పడి కోయంబత్తూరు సెంట్రల్ జైలులో ఉన్నాడు. శనివారం జైలులో ఛాతికి చికిత్స పొందుతూ మృతి చెందాడు. అదేవిధంగా రెండు రోజుల క్రితం శరవనం బట్టికి చెందిన అండర్ ట్రయల్ ఖైదీ రాజ్ కుమార్ (56) జైలులో ఉండగా ఛాతీ నొప్పితో మరణించాడు. కరూర్‌కు చెందిన శివ శుక్రవారం జైలులో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో కోయంబత్తూరు సెంట్రల్ జైలులో 2 రోజుల్లో వ్యవధిలో ముగ్గురు ఖైదీలు మృతి చెందడం చర్చనీయాంశంగా మారింది.

కోటి వ్యయంతో పాఠశాల అభివృద్ధి

కొరుక్కుపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాలతో చెన్నై కార్పొరేషన్ 108వ వార్డు, విరుగంబాక్కంలోని కార్పొరేషన్ స్కూల్ పునర్నిర్మాణానికి రూ. కోటి నిధిని ప్రకటించారు. దీనికి సంబంధించి పనులను విరుగంబాక్కం ఎమ్మెల్యే ప్రభాకర్‌రాజా, 128వ వార్డు సభ్యురాలు ఎల్‌డీ రత్న లోకేశ్వరన్ పరిశీలించి పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారన్‌ను ఆదేశించారు.

వందే మెట్రో ట్రయల్ రన్ సక్సెస్

- చెన్నై బీచ్ నుంచి కాట్పాడి వరకు పరుగు
- త్వరలో పూర్తి స్థాయిలో పట్టాలపైకి..


వందే మెట్రో రైలు

సాక్షి, చెన్నై: వందే మెట్రో రైలు ట్రయల్ రన్ శనివారం విజయవంతమైంది. దేశంలో అతివేగంగా ప్రయాణించే రైలుగా వందే భారత్ ప్రసిద్ధి చెందిన విషయం తెలిసిందే. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ప్రలు మార్గాలలో నడుస్తున్న వందే భారత్‌కు ప్రయాణికుల నుంచి అమిత స్పందన వస్తోంది. దీనికి కొనసాగింపుగా వందే మెట్రో రైల్‌ను నడపడానికి రైల్వే యంత్రాంగం చర్యలు చేపట్టింది. అతి తక్కువ దూరంలో ఉండే రెండు నగరాలను కలిపే విధంగా వందే మెట్రో రైలును పరిచయం చేయడానికి రైల్వే నిర్ణయించింది. ఈ మేరకు చెన్నై ఐసీఎఫ్‌లో వందేమెట్రో రూపుదిద్దుకుంది. ఈ రైలు ట్రయల్ రన్‌ను శనివారం నిర్వహించారు. చెన్నై బీచ్ నుంచి కాట్పాడి మధ్య ఈ వందే మెట్రో రైల్ ట్రయల్ రన్‌ను విజయవంతం చేశారు.

12 బోగీలతో..

12 బోగీలు కలిగిన వందే మెట్రో రైల్ ట్రయల్ రన్ శనివారం ఉదయం జరిగింది. చెన్నై ఐసీఎఫ్ నుంచి ఉదయం 8.15 గంటలకు బయలుదేరి 9 గంటలకు చెన్నై బీచ్‌కు ఈ రైలు చేరుకుంది. 9.30 గంటలకు చెన్నై బీచ్ నుంచి కాట్పాడికి బయలు దేరిన వందే మెట్రో రైలు రాయపురం, పెరంబూరు, విల్లివాక్కం మార్గంగా వెళ్లింది. 11.55 గంటలకు కాట్పాడికి చేరుకున్న ఈ రైలు, మధ్యాహ్నం 12.55 గంటలకు తిరుగుపయనమైంది. మధ్యాహ్నం 2 గంటలకు చెన్నై బీచ్‌కు చేరుకుంది. 12 బోగీలను కలిగిన ఈ వందే మెట్రో రైలులో ఏసీ సౌకర్యం, ప్రయాణికులను ఆకర్షించే అలంకరణలు, సౌకర్యవంతమైన సీట్లు, అత్యాధునిక గ్రీన్ టాయిలెట్‌లు, ఆటోమేటిక్ డోర్‌లు వంటి పలు సౌకర్యాలు ఉన్నాయి. ఒక్కో బోగీలో 104 మంది ప్రయాణికులు కూర్చునేందుకు ఏర్పాట్లు చేశారు.

వయనాడ్ మృతుల్లో 24 మంది తమిళులు

- మరో 25 మంది కోసం తీవ్ర అన్వేషణ
- తాంబరం నుంచి డాగ్‌స్క్వాడ్
- శిబిరాలలో ఐఏఎస్ బృందం పరిశీలన
- నీలగిరుల్లో అధికారుల అప్రమత్తం




చూరల్ మలైలో సహాయక బృందాల గాలింపు, నీలగిరిలో ప్రమాదకరంగా ఉన్న ప్రదేశాలలో సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ లక్ష్మీభవ్య

సాక్షి, చెన్నై: వయనాడ్ వరద ప్రళయం తమిళ కుటుంబాల్ని కన్నీటి సంద్రంలో ముంచింది. మొత్తం 24 మృతదేహాలు ఇప్పటి వరకు లభించగా.. వారిలో తమిళనాడు పూర్వీకంగా కలిగిన కుటుంబాలకు చెందిన వారు 21 మంది. సరిహద్దు జిల్లాల నుంచి పనికోసం వెళ్లిన ముగ్గురు కూలీలు ఉన్నారు. మరో 25 మంది గల్లంతయ్యారు. వీరి కోసం వయనాడ్‌లోని చూరల్ మలై, ముండగై, అట్టమలైలలో తీవ్ర అన్వేషణ సాగుతోంది. చెన్నై తాంబరం నుంచి ఐదు శునకాలతో డాగ్ స్క్వాడ్ వయనాడ్‌కు చేరుకుని గాలింపు చర్యలు చేపడుతోంది. వివరాలు.. కొండ చరియలు విరిగి పడడం, బురదతో వరద ప్రళయం కారణంగా కేరళ వయనాడ్‌లోని చూరల్‌మలై, ముండగై, అట్టమలై ప్రాంతాలు కనుమరుగైన పరిస్థితి తెలిసిందే. 300లకు పైగా మృతదేహాలను వెలికి తీశారు. మరో 200 వందల మందికి పైగా గల్లంతై ఉండడంతో వారి మృతదేహాల కోసం నదీ తీరాలలో తీవ్ర గాలింపు సాగుతోంది. ఈ ప్రళయంలో తమిళనాడులోని నీలగిరికి చెందిన ముగ్గురు తొలుత మరణించారు. వీరి మృతదేహాలను గుర్తించి స్వస్థలాలకు పంపించారు. అదే సమయంలో చూరల్ మలై, ముండగై, అట్టమలైలలోని తేయాకు తోటలతో తమిళులు అధికంగా ఉన్నట్లు వచ్చిన సమాచారంతో వారి జాడ కోసం తీవ్ర అన్వేషణ సాగుతూ వచ్చింది.

పరిశీలన మేరకు వెలుగులోకి..

రాష్ట్రానికి చెందిన ఐఏఎస్‌లు సమీరన్, జానీ టామ్ వర్గీస్‌లతో కూడిన రెస్క్యూ బృందం వయనాడ్‌లో 5 రోజులుగా తిష్ట వేసింది. తమిళుల వివరాల సేకరణలో నిమగ్నమైంది. ఇక్కడి శిబిరాలలో ఉన్న వారిని ఐఏఎస్‌లు స్వయంగా వెళ్లి ఓదార్చారు. తమిళుల వివరాలను సేకరించారు. వరద ప్రళయానికి గురైన ప్రాంతానికి చెందిన కొందరు ప్రజలు, తేయాకు తోటలలో వరదల నుంచి సురక్షితంగా బయటపడ్డ మరి కొందరు ఇచ్చిన సమాచారంతో తమిళుల వివరాలను అధికారులు సేకరించారు. మరణించిన వారిలో 24 మంది తమిళులు ఉన్నట్లు తేల్చారు. ఇందులో ముగ్గురిని గుర్తించి స్వస్థలాలకు మృతదేహాలను ఇప్పటికే పంపించారు. 21 మంది మృతదేహాలను గుర్తించే పనిలో అధికారులు ఉన్నారు. మరో 25 మంది జాడే లేదు. వీరు ఇక జీవించి ఉండే అవకాశాలు లేవన్న నిర్ధారణకు వచ్చినా, వారి మృతదేహాల కోసం తీవ్ర గాలింపు సాగుతోంది. ఇందుకోసం తాంబరం నుంచి 5 డాగ్ స్క్వాడ్ బృందాలు రంగంలోకి దిగాయి. మృతదేహాల కోసం గాలింపులో శునకాలు సైతం నిమగ్నమయ్యాయి. గల్లంతైన వారిలో, మరణించిన వారిలో మెజారిటీ శాతం మంది తమిళనాడు పూర్వీకంగా కలిగి వయనాడ్ పరిసరాలలో స్థిర పడ్డ కుటుంబాలే ఉన్నాయి. వీరికి అన్ని రకాల గుర్తింపు కార్డులు కేరళకు సంబంధించి ఉన్నా, తమిళనాడుతో సంబంధాలు కొనసాగిస్తున్నారు. వీరి బంధువులు, ఆప్తులు తమిళనాడులోని కోయంబత్తూరు. నీలగిరి, తేని తదితర జిల్లాలో ఉన్నారు.

జాబితా సేకరణలో..

ఐఏఎస్ అధికారి సమీరన్ ఓ మీడియాతో మాట్లాడుతూ, అన్ని శిబిరాలకు తాము వెళ్లామని, అక్కడున్న తమిళులను గుర్తించి వారితో మాట్లాడటం జరిగిందన్నారు. 130 మంది తమిళులు సురక్షితంగా ఉన్నారని, వీరిలో ఒకరు మాత్రం తమిళనాడుకు చెందిన వ్యక్తి అని , మిగిలిన 129 మంది తమిళనాడు పూర్వీకంగా కలిగి వయనాడ్ పరిసరాలలో స్థిర పడ్డ వారే అని వివరించారు. 25 మంది జాడ కాన రావడం లేదని, వీరిలో ముగ్గురు మాత్రం తమిళనాడుకు చెందిన వారు అని పేర్కొన్నారు. మేప్పాడి శిబిరంలో తాము ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌కు కూడా సమాచారం వస్తోందని, తిరునల్వేలికి చెందిన జోష్ ప్రకాష్, అవంతిక, జయకుమార్ ఇక్కడ పని నిమిత్తం వచ్చి గల్లంతైనట్లుగా ప్రస్తుతం తమకు సమాచారం వచ్చిందన్నారు. అలాగే, మరికొందరి వివరాలు సైతం వచ్చి ఉన్నాయని, అన్నింటిని పరిశీలించి గాలింపును తీవ్రతరం చేసి ఉన్నామన్నారు. కేరళ అధికారులతో కలిసి సమగ్ర వివరాలను సేకరించి పూర్తి స్థాయిలో తమిళుల జాబితాను సిద్ధం చేస్తున్నామన్నారు. సీఎం స్టాలిన్ తమతో వీడియో కాల్ ద్వారా మాట్లాడారని, అవసరమైన చర్యలు తీసుకునేందుకు , మరింత సహకారం అందిస్తామని తమకు సూచించినట్లు చెప్పారు.

విరాళాలు..

వయనాడ్ ప్రళయంతో కేరళకు తమిళనాడు నుంచి విరాళాలు హోరెత్తుతున్నాయి. ఇక్కడి నుంచి నిధులతో పాటు పలువురు వస్తువులను పంపిస్తున్నాయి. కేరళ ప్రభుత్వానికి కాటాన్ కొళత్తూరు ఎస్‌ఆర్‌ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విద్యాసంస్థ చాన్స్‌లర్ టీఆర్ పారివేందర్ రూ.కోటి విరాళం ప్రకటించారు. నటి నయన తార రూ. 20 లక్షలు ప్రకటించారు. చెన్నై పెరింగి మలై సెవన్ వెల్స్‌ప్రాంతానికి చెందిన ఎంటీసీ డ్రైవర్ త్యాగరాజన్ కుమారుడు కార్తీక్(10) తన హుండీలోని రూ. 2 వేలును విరాళంగా అందజేశారు. సినీ నటుడు మన్సూర్ అలీఖాన్ వయనాడ్ మృతులకు కన్నీటి నివాళులర్పిస్తూ వీడియో సందేశం విడుదల చేశారు.

నీలగిరులలో పరిశీలన..

వయనాడ్ పరిస్థితి నీలగిరులకు ఎదురు కాకుండా ముందు జాగ్రత్తల చర్యలను విస్తృతం చేశారు. నీలగిరుల్లో ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాలలో అధికారులు పరిశీలన చేశారు. ప్రధానంగా పర్యాటక ప్రదేశం ఊటీలో కొండ చరియలు, మట్టి చరియలు విరిగి పడేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలను కలెక్టర్ లక్ష్మీ భవ్య నేతృత్వంలో బృందం ఉదయం నుంచి పరిశీలన చేపట్టింది. ఓ ప్రాంతంలో ప్రమాదకరంగా రెండు గృహాలు ఉండడంతో అక్కడి వారిని శిబిరాలకు తరలించి, ఆ ఇళ్లకు తాత్కాలికంగా సీల్ వేశారు. ఊటీ, కోత్తగిరి, కున్నూరు, కూడలూరు పరిసరాలు, మార్గాలలో ముందు జాగ్రత్తలపై అధికారులు విస్తృత చర్యలు చేపట్టారు. అలాగే నీలగిరులలో సిద్ధంగా ఉన్న రెస్క్యూ బృందాలు, సిద్ధం చేసిన అన్ని రకాల సహాయ సామాగ్రిని కలెక్టర్ పరిశీలించారు.

క్లుప్తంగా

జాలరి మృతదేహం అప్పగింత


మృతదేహాన్ని స్వాధీనం చేసుకుంటున్న నావికాదళం

సాక్షి, చెన్నై: నడి సముద్రంలో శ్రీలంక నావికా దళం దాడిలో మరణించిన జాలరి మృత దేహం అతడి కుటుంబానికి శనివారం అప్ప గించారు. వివరాలు.. రామనాథపురం జిల్లా రామేశ్వరానికి చెందిన జాలర్లపై శ్రీలంక నావిదాళం దాష్టీకం గురించి తెలిసిందే. వీరి దాడిలో రామేశ్వరానికి చెందిన మలై స్వామి మరణించాడు. రామచంద్రన్ గల్లంతయ్యాడు. ఇతడి మృతదేహం కోసం భారత్, శ్రీలంక నావికా దళం తీవ్రంగా గాలించింది. ఈ పరిస్థితులలో శ్రీలంక ఒడ్డుకు చేరిన మలైస్వామి మృతదేహాన్ని అక్కడి మార్చురీలో ఉంచారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల ఒత్తిడితో మృతదేహాన్ని అప్పగించేందుకు శ్రీలంక అధికారులు నిర్ణయించారు. శనివారం ఉదయాన్నే ప్రత్యేక బోట్‌లో మృతదేహాన్ని తీసుకొచ్చి భారత సరిహద్దులో అప్పగించారు. భారత నావికా దళం, కోస్టు గార్డు అధికారులు మృత దేహాన్ని స్వాధీనం చేసుకున్నారు.రామేశ్వరంలో అతడి కుటుంబానికి అప్పగించారు. ఈ దాడులకు నిరసనగా జాలర్లు ఆందోళన కొనసాగించడమే కాకుండా, నిరసన జరుగుతున్న ప్రదేశంలో మలైస్వామి మృతదేహాన్ని ఉంచి నివాళులర్పించారు.

విద్యార్థి హత్య

• ఐదుగురి అరెస్టు

అన్నానగర్: పుదుకోట్టై జిల్లా విరాలిమలై పక్కనే ఉన్న అన్బు నగర్ ప్రాంతానికి చెందిన రంజిత్ కన్నన్ (17). తిరుచ్చిలోని కాజమలైలోని ఫాదర్ పెరియార్ గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్సెలో జూనియర్ స్థాయిలో కెమిస్ట్రీ చదువుతున్నాడు. ఈక్రమంలో శుక్రవారం తిరువరంగం గణపతి నగర్‌లోని తన బంధువుల ఇంటికి వెళ్లిన అతను ఆ ఇంటి సమీపంలోని గీతాపురం ప్రాంతంలో పొంగిపొర్లుతున్న కావేరి నదిని చూస్తూ ఉన్నాడు. ఆ సమయంలో, ఆ ప్రాంతంలో మద్యం సేవించిన కొందరు రంజిత్ కన్నన్ బయటి ఊరు వ్యక్తి కావడంతో కర్రతో దాడి చేశారు. ఈ ఘటనలో గాయపడిన రంజిత్ కన్నన్ రక్తపుమడుగులో స్పృహతప్పి పడిపోయాడు. ఆ తర్వాత సమీపంలో ఉన్న కొందరు వెంటనే అతడిని రక్షించి తిరుచ్చి తనియార్ ఆస్పత్రికి తరలించారు. తదుపరి చికిత్స నిమిత్తం తిరుచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ రంజిత్ కన్నన్ శనివారం మృతి చెందాడు. తిరువరంగం పోలీసులు కేసు నమోదు చేసి నవీన్ కుమార్ (24), విజయ్ (23) సురేష్ (25) ఇద్దరు మైనర్లను అరెస్టు చేశారు.

సుందరంగా గిండి చిల్డ్రన్స్ నేచర్ పార్క్


పార్కును ప్రారంభిస్తున్న సీఎం స్టాలిన్

• రూ. 30 కోట్లతో కొత్త శోభ
• ప్రారంభించిన సీఎం స్టాలిన్



పార్కులోని సెల్ఫీపాయింట్‌ను పరిశీలిస్తున్న సీఎం

సాక్షి, చెన్నై : చెన్నై గిండి చిల్డ్రన్స్ పార్కు పేరు మారింది. ఇక గిండి చిల్డ్రన్స్ నేచర్ పార్కుగా పిలవనున్నారు. ఆ మేరకు పచ్చదనంతో సుందరంగా ఈ పార్కును రూ. 30 కోట్లతో కొత్త శోభ సంతరించుకునే విధంగా తీర్చిదిద్దారు. దీనిని శనివారం సీఎం ఎంకే స్టాలిన్ ప్రారంభించారు. వివరాలు. చెన్నై నగర, పరిసర వాసులకు గిండి చిల్డ్రన్స్ పార్కు గురించి తెలిసిందే. ఇక్కడ అన్ని రకాల వన్యప్రాణులు, పక్షులు, సీతాకోక చిలుకలు వంటివి ఉన్నాయి. దీనిని ప్రకృతి రమణీయతతో మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 30 కోట్లను కేటాయించింది. అంతేకాకుండా గిండి చిల్డ్రన్స్ పార్కును గిండి చిల్డ్రన్స్ నేచర్ పార్క్‌గా మార్చే రీతిలో సుందరీకరణ పనులు జరిగాయి. ఉదయం జరిగిన కార్యక్రమంలో ఈపార్కును ప్రారంభించారు. ఇక్కడున్న అన్ని రకాల వసతులను సీఎం పరిశీలించారు. ఇక్కడ ప్రస్తుతం అతిపెద్ద ఆక్వాటిక్ బర్డ్‌హౌస్, వన్యప్రాణులు, జంతువులు, పక్షులు వివరాలను తెలుసుకునేందుకు వీలుగా క్యూర్ కోడ్ , ప్రత్యేకంగా లైటింగ్స్, గ్రంథాలయం, వాటర్ ఫౌండేన్, క్రీడా మైదానం, వర్షపు నీటి సేకరణకు ఏర్పాట్లతో పాటు భద్రత నిమిత్తం నిఘా నేత్రాలను అడుగడుగునా ఏర్పాట్లు చేశారు. ఫుడ్ కోట్, సెల్ఫీ పాయింట్ సైతం ఏర్పాటు చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వన్యప్రాణులను రక్షించడానికి, అటవీ ప్రాంతాల్లో అగ్నిప్రమాదం తదితరవాటిని అరికట్టేందుకు ప్రత్యేకంగా సిద్ధం చేసిన 9 వాహనాలకు ఈసందర్భంగా సీఎం స్టాలిన్ జెండా ఊపారు. ''ఇంటిగ్రేటెడ్ ఏనుగు గణన నివేదిక 2024'' విడుదల చేశారు. కర్ణాటక, కేరళ, తమిళనాడు వంటి దక్షిణ భారత రాష్ట్రాలు, ఆంధ్రప్రదేశ్ సరిహద్దు జిల్లాలను కలుపుకుని 26 అటవీ డివిజన్లలో జరిగిన సర్వే ఆధారంగా ఈ నివేదికను సిద్ధం చేశారు. నిర్వహించారు. ఈ సర్వేలో 1,836 మంది అటవీ ఉద్యోగులు, 342 మంది వలంటీర్లు పాల్గొన్నారు. 2023 లెక్కల ప్రకారం తమిళనాడులో ఏనుగుల సంఖ్య 2,961 ఉండగా, 2024 నివేదిక మేరకు ఏనుగుల సంఖ్య 3063కి పెరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్ముడి, ఎం సుబ్రమణియన్, మది వేందన్, చెన్నై కార్పొరేషన్ మేయర్ ప్రియ, ఎంపీ తమిళచ్చి తంగ పాండియన్,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివ దాస్ మీనా తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఎస్సీ ఎస్టీ వర్గీకరణకు సుప్రీం కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం, అరుంధతీయులకు 3 శాతం రిజర్వేషన్ ధ్రువీకరణతో ఆయా సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. పలుసంఘాల నేతలు సీఎం స్టాలిన్‌ను కలిసి కృతజ్ఞతలు చెబుతున్నాయి.

ఆధునికతకు తగ్గట్టు కొత్త రకం ఈవీలు

సాక్షి, చెన్నై: విస్తరిస్తున్న ఆధునికతకు అనుగుణంగా కొత్త రకం ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలను ప్రజల ముంగిటకు తీసుకొస్తున్నామని ఈవీ స్టార్టప్ రివర్ సంస్థ సీఈఓ అరవింద్ మణి తెలిపారు. చెన్నై అన్నానగర్‌లో ఏర్పాటు చేసిన స్టోర్‌లో రివర్ ఈవీ స్కూటర్లను, ఇతర పరికరాలను ఆయన శనివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, ఈవీ స్టార్టప్‌గా ఉన్న రివర్ సంస్థ ఆధునికతకు అనుగుణంగా కొత్త రకం ఈవీలను సిద్ధం చేస్తూ వస్తున్నట్టు వివరించారు. కొచ్చి, కోయంబత్తూరు, త్రివేండ్రం, అహ్మదా బాద్ సూరత్, ముంబై, పుణె, నాగ్ పూర్‌లలో ఈవీలను పరిచయం చేయడానికి సిద్ధమవుతున్నామన్నారు. వాహనదారుల అభిరుచులకు అనుగుణంగా అన్ని రకాల సౌకర్యాలను ఈవీలను పరిచయం చేశామన్నారు.

ఆన్‌లైన్ యాప్‌లో రుణం తీసుకున్న మహిళ ఆత్మహత్య

అన్నానగర్: రుణం తీసుకుని తిరిగి చెల్లించకపోవడంతో ఫొటోను ఆన్‌లైన్ యాప్‌లో ప్రచురిస్తానని నిర్వాహకులు బెదిరించడంతో శనివారం ఆమె ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వివరాలు.. తూత్తుక్కుడి పాల్ పాండినగర్‌కు చెందిన మిథున్ కార్తికేయన్. ఇతని భార్య కావ్యసుధ (22). వీరికి రెండేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఏడాది వయసున్న కుమారుడు ఉన్నాడు. ఆన్‌లైన్ యాప్ ద్వారా కావ్యసుధ రూ. లక్ష 50 వేలు రుణం తీసుకున్నట్లు తెలుస్తుంది. రూ.50 వేలు చెల్లించలేదని సమాచారం. దీంతో ఆన్‌లైన్ లోన్ కంపెనీ సభ్యులు కావ్యసుధను తరచూ సెల్‌ఫోన్‌లో సంప్రదించి బెదిరించినట్లు సమాచారం. తన సెల్‌ఫోన్‌ను హ్యాక్ చేసి అందులోని ఫొటోలు, సెల్‌ఫోన్ నంబర్లను కూడా తీసుకుని, వాటిని వెబ్‌సైట్‌లో ప్రచురిస్తామని బెదిరించినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని కావ్యసుధ కుటుంబీకులకు తెలియజేసి ఆ సెల్‌ఫోన్ నంబర్ ఉపయోగించడం మానేసింది. అయితే ఆన్‌లైన్ కంపెనీ ప్రతినిధులు ఆమె సెల్‌ఫోన్‌లోని బంధువుల సెల్‌ఫోన్ నంబర్‌లను సంప్రదించి బెదిరించడం ప్రారంభించినట్లు సమాచారం. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన కావ్యసుధ శనివారం తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మిథున్ కార్తికేయన్ తన భార్య ఉరిపై వేలాడుతూ ఉండడం చూసి దిగ్భ్రాంతి చెందాడు. దీనిపై సమాచారం అందుకున్న తూత్తుక్కుడి సిప్‌కాట్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కావ్యసుధ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూత్తుకుడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు ఆ టన్‌లైన్ కంపెనీ నిర్వాహకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కావ్యసుధ ఆత్మహత్యపై తూత్తుకుడి అసిస్టెంట్ కలెక్టర్ ప్రభు విచారణ చేపట్టారు.

విద్యార్థుల భవిష్యత్‌కు కెరీర్ గైడెన్స్


సదస్సులో పాల్గొన్న విద్యావేత్తలు, అధికారులు

సాక్షి, చెన్నై: విద్యార్థుల భవిష్యత్తుకు దోహదపడే విధంగా కెరీర్ గైడెన్స్ ప్రోగ్రామ్‌లను విస్తృతం చేయాలని విద్యావేత్తలు వ్యాఖ్యానించారు. చెన్నై వినాయక మిషన్స్ క్యాంపస్‌లో జిల్లా ఉపాధి , కెరీర్ గైడెన్స్ సెంటర్‌తో కలిసి కెరీర్ గైడెన్స్ ప్రోగ్రామ్, జాబ్ ఫెయిర్ శనివారం జరిగింది. ఇందులో ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సెల్వకుమార్, చెన్నై ఉపాధి, కెరీర్ గైడెన్స్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆర్. దేవేంద్రన్, చీఫ్ నాలెడ్జ్ ఆఫీసర్ విన్సెంట్ ఆరోగ్యనాథన్, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి రంగనాయకి, టీబీఏస్ అకాడమీ డైరెక్టర్ విజయ గణేష్‌తోపాటు విద్యా వేత్తలు,ప్రతినిధులు పాల్గొన్నారు. ఏవీఐటీ, ఎస్ఏఎస్, మేనేజ్ మెంట్ స్టడీస్‌లో తొలి, రెండవ,మూడవ సంవత్సర విద్యార్థులకు భవిష్యత్తు కార్యాచరణ, మార్గాలు, వివిధ రంగాలలో విజయం , ఎంపిక, పరిశ్రమలు, ఉద్యోగం , నైపుణ్యాలు , అర్హతలు తదితర సమగ్ర సమాచారాలను వివరించారు.

తిరుత్తణిలో ఆడి పెరుక్కు వేడుకలు



తిరుత్తణి: ఆడిపెరుక్కు సందర్భంగా తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామిని శనివారం భక్తులు భారీగా దర్శించకున్నారు. ఈ సందర్భంగా వేకువజామున విశేష అభిషేక ఆరాధన పూజలు చేపట్టి బంగారు. వజ్రాభరణాలతో స్వామిని అలంకరించారు. మహిళలు తాళిబొట్టు మార్చుకుని స్వామికి మొక్కులు చెల్లించారు. ఆలయ అధికారులు భక్తుల సౌకర్యార్థం పాలు, అన్నదానం చేశారు.

విశేష అలంకరణలో ఉత్సవర్లు

సైదాపేట రైల్వే స్టేషన్ సమీపంలో విద్యార్థుల ఘర్షణ

• రాళ్లు రువ్వుకుంటూ బీభత్సం

తిరువొత్తియూరు: సైదాపేట రైల్వే స్టేషన్ సమీపంలో పచ్చయప్పన్ కళాశాల విద్యార్థులు రాళ్లతో ఒకరిపై ఒకరు దాడి చేసిన ఘటనలో పోలీసులు ముగ్గురిని అరెస్టు చేశారు. వివరాలు.. తాంబరం నుంచి చెన్నై బీచ్‌కి శుక్రవారం ఉదయం రైలు వెళ్తోంది. సైదాపేట రైల్వేస్టేషన్ సమీపంలో రైలు రాగానే ఈ రైలులో ప్రయాణిస్తున్న నందనం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు, పచ్చయ్యప్పన్ కళాశాల విద్యార్థులు హఠాత్తుగా ఘర్షణ పడ్డారు. ఆ సమయంలో రైల్వే ట్రాక్‌పై ఉన్న రాళ్లను తీసుకుని విద్యార్థులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఫలితంగా రైలు అద్దాలు దెబ్బతిన్నాయి. చేతిలో కత్తులతో సహా మారణాయుధాలతో విద్యార్థులు ఘర్షణకు దిగడంతో 3 బోగీల్లో ఉన్న ప్రయాణికులు భయంతో కేకలు వేస్తూ పరుగులు తీశారు. ఈ ఘటనపై రైలు డ్రైవర్ మాంబళం రైల్వే భద్రతా పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనలో రైలు కిటికీ అద్దం పగిలి రైలులో ప్రయాణిస్తున్న ఇద్దరు ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఈ దాడిలో విద్యార్థులు రాళ్లు రువ్విన ఘటన ఆ ప్రాంతంలో కలకలం రేపింది. రైల్వే భద్రతా బలగాలు ఘటనా స్థలానికి చేరుకోవడంతో విద్యార్థులు అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో మాంబళం రైల్వే పోలీసులు విద్యుత్ రైలుపై రాళ్లదాడి ఘటనపై కేసు నమోదు చేసి రైల్వే స్టేషన్‌లోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. ఇందులో పచ్చయప్పన్ కళాశాలకు చెందిన కణ్ణన్, వేలవన్, కత్తిని కలిగి వున్న హరన్‌ను అరెస్టు చేశారు. తరువాత ముగ్గురిని పోలీస్ స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. అలాగే ఈ ఘటనలో ప్రమేయం ఉన్న మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు.

జీవిత ఖైదీ ముందస్తు విడుదల

• సత్ప్రవర్తన ఆధారంగా కోర్టు ఉత్తర్వులు

కొరుక్కుపేట: 2011లో పెళ్లికి నిరాకరించిన ప్రేమికుడి మూడున్నరేళ్ల చిన్నారిని కిడ్నాప్ చేసి, గొంతుకోసి చంపిన కేసులో పూవరసి అనే మహిళకు చెన్నై సెషన్స్ కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. మృతిదేహాన్ని సూట్‌కేస్‌లో పెట్టి బస్సులో వదిలేశారు. ఈ శిక్షను హైకోర్టు ధృవీకరించింది. ఈ కేసులో అన్నా 113వ జయంతి సందర్భంగా 10 ఏళ్ల శిక్షను పూర్తి చేసుకున్న జీవిత ఖైదీలను ముందస్తుగా విడుదల చేయాలని తమిళనాడు ప్రభుత్వం 2021లో ఉత్తర్వులు జారీ చేసింది. దాని ఆధారంగా పూవరసిని త్వరగా విడుదల చేయాలని ఆమె భర్త మణికంఠన్ ప్రభుత్వానికి పిటిషన్ వేశారు. అయితే ప్రభుత్వం ఈ దరఖాస్తును తిరస్కరించింది. దీనిపై మణికందన్ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని న్యాయమూర్తులు ఎంఎస్ రమేష్, సుందర్ మోహన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. మణికంఠన్ తరపు న్యాయవాది ఎస్. మనోకరన్ తమిళనాడు ప్రభుత్వ ఆదేశాల మేరకు పదేళ్ల శిక్షా కాలం పూర్తి చేసుకున్న పూవరసిని త్వరగా విడుదల చేసేలా ఆదేశించాలని అన్నారు. కేసును విచారించిన న్యాయమూర్తులు పూవరసి సత్ప్రవర్తనను పరిగణనలోకి తీసుకుని.. పదేళ్ల శిక్ష పూర్తి చేసుకున్న ఆమెను ముందస్తుగా విడుదల చేయాలని తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించింది.

భర్త హత్య కేసులో భార్య నిర్దోషిగా..

బ్రాందీలో విషం కలిపి భర్తను హత్య చేసిన కేసులో జీవిత ఖైదు పడిన భార్యను మద్రాసు హైకోర్టు నిర్దోషిగా ప్రకటించింది. వివరాలు.. విల్లుపురం జిల్లాకు చెందిన సులోచనకు ఓ అబ్బాయితో అక్రమ సంబంధం ఉందని ఆమె భర్త అనుమానించాడు. దంపతుల మధ్య గొడవలు వచ్చాయి. ఈ క్రమంలో 2012 నవంబర్ 12న బ్రాందీ కొనివ్వమని భర్త అడగడంతో భార్య కొనిచ్చింది. ఇందులో విషం కలిపి ఉండడంతో భర్త మరణించాడు. దీంతో 2016 డిసెంబరులో కాళ్లకురిచ్చి సెషన్స్ కోర్టు ఈ కేసును విచారించి సులోచనకు జీవిత ఖైదు విధించింది. ఈ తీర్పుపై సులోచన మద్రాసు హైకోర్టులో అప్పీల్ చేసింది. ఎంఎస్ రమేష్, కందర్‌మోగ్‌తో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించారు. పిటిషనర్ తరపున న్యాయవాది సీఎస్ఎస్ పిళ్లై వాదించారు,. ఈ కోర్టు పిటిషనర్‌కు అనుకూలంగా తీర్పిచ్చి నిర్దోషిగా ప్రకటించింది.

విజయ్, మీనాక్షీ చౌదరి మధ్య స్పార్క్..!


గోట్ చిత్రంలో విజయ్‌తో నటి మీనాక్షీ చౌదరి

తమిళసినిమా: నటుడు విజయ్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం గోట్. వెంకట్‌ప్రభు దర్శకత్వంలో ఏజీఎస్ ఎంటర్‌టెయిన్‌మెంట్ సంస్థ నిర్మిస్తున్న ఈ భారీ సైన్స్‌ఫిక్ యాక్షన్ ఎంటర్‌టెయినర్ కథా చిత్రం ఇది. నటి మీనాక్షీ చౌదరి నాయకిగా నటించిన ఇందులో నటి స్నేహా, లైలా, నటుడు ప్రశాంత్, ప్రభుదేవా, అజ్మల్, మైక్ మోహన్, జయరాం, యోగిబాబు తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. యువన్‌శంకర్ రాజా సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రంలో నటుడు విజయ్ తండ్రీ కొడుకులుగా ద్విపాత్రాభినయం చేయడం విశేషం. ఇందులో కొడుకు పాత్ర కోసం విజయ్‌ని అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చాలా యంగ్‌గా చూపిస్తున్నారు దర్శకుడు వెంకట్‌ప్రభు. కాగా ఇందులో విజయ్ మూడు డిఫరెంట్ గెటప్‌లలో కనిపించనున్నట్లు తెలిసింది. గోట్ చిత్రం సగ భాగాన్ని చూసిన విజయ్ సూపర్‌గా ఉందని దర్శకుడిని ప్రశంసించారని సమాచారం. కాగా ఈ చిత్రంలోని రెండు పాటలను ఇప్పటికే విడుదల చేయగా విజయ్ అభిమానులను విపరీతంగా అలరిస్తున్నాయి. కాగా తాజాగా స్పార్క్ అనే పల్లవితో సాగే పాటను శనివారం విడుదల చేశారు. ఈ పాటలో యంగ్ విజయ్‌తో నటి మీనాక్షీ చౌదరి నటించారు. దీనికి సంబంధించిన రొమాంటిక్ ఫొటోను విడుదల చేశారు. కాగా ఈ స్టైలిష్ పాటను గంగై అమరన్ రాయగా సంగీతదర్శకుడు యువన్‌శంకర్‌రాజా, గాయని వృషా బాలు పాడారు. ఈ పాటతో కూడిన ఫుల్ వీడియోను చిత్ర వర్గాలు విడుదల చేశారు. కాగా పలు విశేషాలతో కూడిన ఈ చిత్రంపై ఇప్పటికే సినీ వర్గాల్లోనూ, ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈనేపథ్యంలో గోట్ సెప్టెంబర్ నెల 5వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా తెరపైకి రానుంది.


నటి ఆండ్రియా

నాకలాంటి ఆలోచనే లేదు

తమిళసినిమా: నటిగా, గాయనిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్న భామ ఆండ్రియా. ఈమె పలాన పాత్ర అని కాకుండా నచ్చితే చాలు ఎలాంటి పాత్రనైనా చేయడానికి సిద్ధం అంటారు. ఇప్పటికే కథానాయకిగానూ, ప్రతినాయకిగానూ నటించి పేరు తెచ్చుకున్నారు. అంతేకాదు వేశ్య పాత్రలోనూ మెప్పించిన ఆండ్రియా నిత్యం వార్తల్లో ఉండే రకం. తన గ్లామరస్ ఫొటోలతో సామాజిక మాధ్యమాల్లో అభిమానులను అలరించే ఈమె పలు చిత్రాల్లో పాడిన పాటలు సూపర్‌హిట్ అయ్యాయి. సంచలనాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన ఆండ్రియా బహుభాషా నటి. తమిళం, తెలుగు, మలయాళం తదితర భాషల్లో నటిస్తున్నారు. సంగీత కచ్చేరిల్లోనూ తరచూ పాల్గొంటుంటారు. ప్రస్తుతం మాస్క్ చిత్రంలో నటుడు కవిన్‌తో కలిసి నటిస్తున్న ఆండ్రియా ఇటీవల ఒక భేటీలో పేర్కొంటూ ప్రస్తుతం కొత్తగా పాటలు పాడలేదని, త్వరలోనే మళ్లీ గాయనిగా అభిమానులను రంజింపజేస్తానని చెప్పారు. చారిత్రాత్మక కథా చిత్రాల్లో నటించాలని కోరుకుంటున్నారా? అని చాలా మంది అడుగుతున్నారన్నారు. అలాంటి ఆశ ఏమీ లేదని అన్నారు. తాను ఇప్పటికే ఈ రంగంలో కోరుకున్న థ్రిల్లర్, హార్రర్, ఎడ్వెంచర్, ప్రేమ కథలు వంటి పాత్రల్లో నటించేశానని చెప్పారు. వడచెన్నై చిత్రంలో మీరు నటించిన చంద్ర అనే పాత్రకు మంచి పేరు వచ్చింది. వడచెన్నై- 2 చిత్రాన్ని తెరకెక్కిస్తానని దర్శకుడు వెట్రిమారన్ చెప్పారని, అందులోనూ మీరు నటిస్తారా? అన్న ప్రశ్నకు ఆండ్రియా బదులిస్తూ ఆ విషయాన్ని దర్శకుడు వెట్రిమారన్‌ను అడగాలన్నారు. అయితే వడచెన్నై- 2 చిత్రం తెరకెక్కితే అందులో చంద్ర పాత్రను తాను కచ్చితంగా పోషిస్తానని, ఈ విషయంలో ఎలాంటి సందేహం లేదన్నారు. నటుడు విజయ్ రాజకీయ రంగప్రవేశం చేయడం గురించి మీ అభిప్రాయం ఏమిటన్న ప్రశ్నకు ఆయన రాజకీయ రంగప్రవేశం చేయడం చాలా సంతోషం అని, అయితే తనకు మాత్రం అలాంటి ఆలోచన లేదని నటి ఆండ్రియా చెప్పారు.

కోలీవుడ్ టాక్స్


మిరుదన్ చిత్రంలో నటుడు జయంరవి, నటి లక్ష్మీమీనన్



జయంరవి హిట్ చిత్రానికి సీక్వెల్

తమిళసినిమా: చేతి నిండా చిత్రాలతో బిజీగా ఉన్న నటుడు జయం రవి. ప్రస్తుతం ఈయన బ్రదర్, జీనీ, కాదలిక్క నేరమిల్లై చిత్రాల్లో నటిస్తున్నారు. వీటిలో బ్రదర్ చిత్రం నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకుని త్వరలో తెరపైకి రావడానికి సిద్ధం అవుతోంది. కాగా నటుడు జయం రవి 2016లో కథానాయకుడిగా నటించిన చిత్రం మిరుదన్. నటి లక్ష్మీమీనన్ నాయకిగా నటించిన ఈ చిత్రాన్ని శక్తి సౌందర్‌రాజన్ తెరకెక్కించారు. నటి అనికా సురేందరన్ నటుడు జయం రవికి చెల్లెలిగా నటించగా, నటి లక్ష్మీమీనన్ ఆయన్ని ప్రేమించే నాయకిగా నటించారు. ఆమె జోంబీ బారిన పడడంతో తనను కాపాడే ప్రయత్నంలో పోలీస్ అధికారి అయిన జయం రవి కూడా జోంబీగా మారే ఇతి వృత్తంతో రూపొందిన చిత్రం మిరుదన్. కాగా ఈ తరహా జోంబీల ఇతి వృత్తంతో ఆంగ్లంలోనే వచ్చాయి. అలా తొలిసారిగా దక్షిణాదిలో జోంబీల ఇతి వృత్తంతో రూపొందిన చిత్రం మిరుదన్. ఈ చిత్రం అప్పట్లో మంచి విజయాన్ని సాధించింది. కాగా మిరుదన్ చిత్రానికి సీక్వెల్‌ను రూపొందించడానికి దర్శకుడు శక్తి సౌందర్‌రాజన్ సన్నాహాలు చేస్తున్నట్లు తాజా సమాచారం. అంతే కాదు ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ కార్యక్రమాలు ఆయన మొదలెట్టేశారట. వచ్చే ఏడాది ప్రథమార్థంలో మిరుదన్ 2 చిత్రం సెట్ పైకి వెళ్లనున్నట్లు సమాచారం. దీన్ని ఒక ప్రముఖ చిత్ర నిర్మాణ సంస్థ నిర్మించనున్నందని తెలుస్తోంది. కాగా ఈ చిత్రంలో నటుడు జయం రవి హీరోగా నటించనున్నారనే ప్రచారం జరుగుతోంది. అయితే హీరోయిన్‌గా నటి లక్ష్మీమీనన్‌నే నటింపజేస్తారా? లేక మరెవరినైనా ఎంపిక చేస్తారా? అన్నది వేచి చూడాలి. అయితే ఇటీవల నటి లక్ష్మీమీనన్‌కు సరైన అవకాశాలు లేవన్నది గమనార్హం. దీంతో మిరుదన్ 2 చిత్రంలో మరో నటి నాయకిగా నటించడానికే ఎక్కువ అవకాశాలు ఉన్నాయి.

అజిత్ @ 32


అజిత్ @ 32 పోస్టర్

తమిళసినిమా: కోలీవుడ్‌లో అల్టిమేట్ స్టార్ అంటే ఎవరైనా చెప్పేది నటుడు అజిత్ అనే. ఆయనకు ప్రేమతో అభిమానులు ఇచ్చిన బిరుదు ఇది. అయితే అలాంటి వాటికి దూరంగా ఉండే అజిత్ ఆ బిరుదునే కాదు, అభిమాన సంఘాలనూ రద్దు చేశారు. తన అభిమానులు అభిమానం పేరుతో తమ ఉజ్వల భవిష్యత్తును పాడు చేసుకోరాదని, వారి తమ తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోవాలని హితవు పలుకుతారు. అయినప్పటికీ అజిత్ కొత్త చిత్రాల విడుదల సమయంలో ఆయన అభిమానులు హంగామా చేస్తూనే ఉంటారు. కాగా అజిత్ అనే నటుడు కథానాయకుడిగా పరిచయం అయిన చిత్రం అమరావతి. చక్కని ప్రేమ కథాంశంతో రూపొందిన ఆ చిత్రం విడుదలై 32 ఏళ్లు అయ్యింది. అంటే నటుడిగా అజిత్ పుట్టి 32 ఏళ్లు అయ్యిందన్నమాట. ఇక లవర్ బాయ్‌గా కెరీర్‌ను ప్రారంభించిన అజిత్ ఇప్పుడు పవర్‌ఫుల్ యాక్షన్ హీరోగా రాణిస్తున్నారు. కాగా నటుడుగా 32 ఏళ్లు పూర్తి చేసుకున్న అజిత్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ విడాముయర్చి చిత్ర యూనిట్ ఓ ప్రకటనను శనివారం విడుదల చేశారు. అందులో రక్తం చిందిస్తున్న అజిత్ నలుపు తెలుపు ఫొటోను పొందుపరిచారు. అంతే కాకుండా '32 ఏళ్లు- ధీర సాధనలు-ఆరని రణాలు-ఎవరినైనా ఎదురించి గెలిచే నిరంతర ప్రయత్నం' అని పేర్కొన్నారు. ఈ పోస్టర్ ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. కాగా అజిత్ ప్రస్తుతం విడాముయర్చి చిత్రంతో పాటు, గుడ్ బ్యాడ్ అగ్లీ అనే చిత్రాల్లో నటిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న విడాముయర్చి చిత్రంలో నటి త్రిష నాయకిగా నటిస్తుండగా నటుడు అర్జున్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. మగిళ్ తిరుమేణి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్ర షూటింగ్ తుది షెడ్యూల్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతుంది. తదుపరి గుడ్ బ్యాడ్ అగ్లీ చిత్ర షూటింగ్‌లో అజిత్ పాల్గొననున్నారు. దీనికి ఆదిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. దీని తరువాత కేజీఎఫ్ ఫేమ్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో నటించనున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇటీవల అజిత్ దర్శకుడు ప్రశాంత్ నీల్‌ను కలవడంతో ఈ ప్రచారం తెరపైకి వచ్చింది. అయితే ఇందులో నిజం ఎంత అన్నది అధికారికంగా వెల్లడి కావాల్సి ఉంది.

వెబ్ ప్రపంచంలోకి ఐశ్వర్య లక్ష్మి


నటి ఐశ్వర్య లక్ష్మి

తమిళసినిమా: బహుభాషా కథానాయకిగా రాణిస్తున్న మలయాళ నటి ఐశ్వర్య లక్ష్మి. ఈమె నిర్మాత కూడా. మలయాళంలో పలు సక్సెస్‌ఫుల్ చిత్రాలను నిర్మించారు. ఇక పోతే తమిళంలో జగమే తంతిరం, యాక్షన్, కట్టాకుస్తీ, పొన్నియిన్ సెల్వన్ తదితర చిత్రాల్లో నటించారు. ప్రస్తుతం కమలహాసన్ కథానాయకుడిగా మణిరత్నం దర్శకత్వంలో రూపొందుతున్న భారీ యాక్షన్,థ్రిల్లర్ థగ్ లైఫ్ చిత్రంలో ముఖ్య పాత్రను పోషిస్తున్నారు. కొన్ని తెలుగు చిత్రాల్లోనూ నటిస్తున్న ఐశ్వర్య లక్ష్మి తాజాగా వెబ్ ప్రపంచంలోకి అడుగు పెడుతున్నారని తెలిసింది. యాలీ ఫిలింస్ సంస్థ నిర్మిస్తున్న తమిళ వెబ్‌సిరీస్‌లో నటి ఐశ్వర్యలక్ష్మి ప్రధాన పాత్రను పోషించనున్నట్లు తెలిసింది. నవ దర్శకుడు పరిచయం అవుతున్న ఈ వెబ్ సిరీస్‌కు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశం ఉంది. కాగా చాలా మంది ప్రముఖ నటీమణులు ఇప్పుడు వెబ్ సిరీస్‌లో నటించడానికి ఆసక్తి చూసుతున్నారు. ఆ కోవలో నటి ఐశ్వర్యలక్ష్మి కూడా చేరుతున్నారన్న మాట.

క్లుప్తంగా

మూర్ఛపోయి సబ్ ఇన్‌స్పెక్టర్ మృతి

కొరుక్కుపేట: చతురగిరి సుందర మహాలింగం ఆలయ మెట్లు ఎక్కుతూ మూర్ఛపోయిన సబ్ ఇన్‌స్పెక్టర్ బాలసుబ్రమణి (34) మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. శ్రీవిల్లిపుత్తూరు మేగమలై హిల్ టైగర్ రిజర్వ్‌లో 4500 అడుగుల ఎత్తులో చతురస్రాకారంలో ఉన్న చతురగిరి సుందర మహాలింగం ఆలయం ఉంది. ఈ ఆలయానికి వెళ్లడానికి కరదుమూర్ జోన్ పర్వత మార్గం మీదుగా దాదాపు 10 కిలోమీటర్లు నడవాలి. అమావాస్య సందర్భంగా ఆగస్టు ఒకటి నుంచి 3వ తేదీ వరకు భక్తులను కొండపై స్వామివారి దర్శనానికి అనుమతించారు. ఈ క్రమంలో శుక్రవారం కోయంబత్తూరు జిల్లా ఆహార అక్రమ రవాణా నిరోధక విభాగంలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న శివగంగై జిల్లా మనమదురై కన్నార్‌రాయ్ వీధికి చెందిన బాల సుబ్రమణి ఆలయానికి బయలుదేరారు. ఆయనతోపాటు భార్య యువనేశ్వరి, బంధువులు చతురగిరి ఎక్కారు. చతురగిరి మలై వెళ్లే మార్గంలో చప్పూరు వనచరాగం బాపదత్తంకోయిలో పిచ్చిన్నపాసుకిడై అనే ప్రదేశంలో వెళుతుండగా బాలసుబ్రమణి మూర్ఛపోయి పడిపోయాడు. ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన వృద్ధురాలు..

తిరువళ్లూరు: ఇంటికి సమీపంలోని చెత్తకుప్పలను కాల్చే సమయంలో చీరకు నిప్పంటుకుని కాలిన గాయాలతో చికిత్స పొందుతున్న వృద్ధురాలు మృతి చెందింది. తిరువళ్లూరు జిల్లా ఇరుళంజేరి గ్రామానికి చెందిన వజ్రవేలు భార్య కల్యాణి(74) గత 30వ తేదీన ఇంటి వద్ద ఉన్న చెత్తకుప్పల నిప్పు పెట్టింది. ఆ సమయంలో వృద్ధురాలి చీర కు నిప్పంటుకోవడంతో గాయపడింది. ఆమె చెన్నై కేఎంసీ ఆస్పత్రిలో చికిత్స మృతి చెందింది. కొడుకు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మప్పేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును చేస్తున్నారు.

కూవం నదిలో మృతదేహం

తిరువళ్లూరు: కూవం నదిలో శవమై తేలిన వృద్ధురాలి మృతదేహాన్ని పోలీసులు గుర్తించి శవపరీక్ష నిమిత్తం తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వివరాలు.. వెంగత్తూరు కండ్రిగ ప్రాంతానికి చెందిన మురుగన్ భార్య కాంత(74). గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం అదృశ్యమైంది. ఆమె కోసం పలు ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో తిరువళ్లూరు సమీపంలోని కూవం నదిలో వృద్ధురాలి మృతదేహాన్ని గుర్తించి పోలీసులు బయటకు తీసి శవపరీక్ష నిమిత్తం తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విచారణలో గత గురువారం అదృశ్యమైన కాంతగా గుర్తించారు. మృతురాలి కొడుకు అరుణాచలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దాడి కేసులో వ్యక్తి అరెస్టు

తిరుత్తణి: పట్టణంలో నడిచి వెళుతున్న యాచకుడు, వృద్ధురాలిపై దాడి చేసిన కేసులో ఓ యువకుడిని శనివారం పోలీసులు అరెస్టు చేశారు. తిరుత్తణి పాత ధర్మరాజు ఆలయం వద్ద తెల్లవారుజామున నడిచి వెళుతున్న యాచకుడు బలరామన్(48), ఎంజీఆర్ నగర్‌కు చెందిన కుప్పమ్మాళ్(65)పై దుండగులు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ సంఘటనకు సంబంధించి తిరుత్తణి పోలీసులు కేసు నమోదు చేసి ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాల సాయంతో తిరుత్తణి జ్యోతినగర్‌కు చెందిన కార్తి(24)ను అరెస్టు చేశారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విజిలెన్స్ తనిఖీలు



తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ పోలీసులు

వేలూరు: తిరువణ్ణామలై జిల్లా సెంగం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విజిలెన్స్ పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేసి, లెక్కలో లేని నగదును స్వాధీనం చేసుకున్నారు. సెంగంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో 80 రెవెన్యూ గ్రామాలున్నాయి. ఇక్కడ రోజూ వ్యవసాయ భూములతోపాటు ఇళ్ల స్థలాల విక్రయ రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. కార్యాలయంలోని కొంత మంది అధికారులు ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు వచ్చిన వారి వద్ద లంచాలు వసూలు చేస్తున్నట్లు విజిలెన్స్ పోలీసులకు రహస్య సమాచారం అందింది. దీంతో విజిలెన్స్ డీఎస్పీ వేల్‌మురుగన్ అధ్యక్షతన పోలీసులు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లెక్కలో లేని రూ.78 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు.

నిబంధనల మేరకే రసాయనాలు విక్రయించండి

తిరువళ్లూరు: ప్రభుత్వ నిబంధనలకు మేరకే రసాయన పదార్థాలను విక్రయించాలని ఆవడి పోలీసు కమిషనర్ శంకర్ పరిశ్రమ నిర్వాహకులకు సూచించారు. కళ్లకురుచ్చి జిల్లా కరుణాపురంలో కల్తీసారా తాగి 70 మందికి పైగా మృతి చెందిన సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా కలకలం సృష్టించిన విషయం తెలిసిందే. కల్తీసారాలో ఎథైన్ భారీగా ఉపయోగించడమే ప్రాణనష్టానికి కారణమన్న ఆరోపణలున్నాయి. ఎథైన్‌ను అక్రమంగా తరలించి కల్తీసారా తయారీకి ఉపయోగించినట్టు నిర్ధారించారు. ఈ క్రమంలోనే తిరువళ్లూరు జిల్లా సెంగుండ్రంలోని రసాయ పదార్థాలు, ఎథైన్, మిథేన్ రసాయ పదార్థాల తయారీదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆవడి పోలీసు కమిషనర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. రసాయన పదార్థాలను విచ్చలవిడిగా విక్రయించడం ద్వారానే ప్రాణనష్టం జరిగిందన్నారు. పరిశ్రమలు రసాయన పదార్థాలను సక్రమంగా విక్రయించాలని, నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్వాతంత్ర్యయోధుడు ధీరన్‌కు నివాళి

- చెన్నైలో సీఎం పుష్పాంజలి
- రాష్ట్ర వ్యాప్తంగా వర్ధంతి కార్యక్రమాలు



ధీరన్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం స్టాలిన్, మంత్రులు

సాక్షి, చెన్నై : స్వాతంత్ర్య సమర యోధుడు ధీరన్ చిన్నమలై 219వ వర్ధంతి సందర్భంగా చెన్నై, ఈరోడ్‌లో శనివారం నివాళులర్పించే కార్యక్రమాలు నిర్వహించారు. అంగ్లేయుల్ని ఎదిరించి శంఖగిరి కోటలో ఉరి తీయబడిన స్వాతంత్ర్య సమరయోధుడు ధీరన్ చిన్నమలైను స్మరిస్తూ చెన్నై గిండిలో విగ్రహాన్ని, ఈరోడ్‌లోని ఆయన స్వగ్రామం ఓడని గ్రామంలో స్మారక మందిరం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. శనివారం ధీరన్ వర్ధంతి కావడంతో గిండి తిరువీకా పారిశ్రామిక వాడలోని ఆయన విగ్రహం వద్ద సీఎం ఎంకే స్టాలిన్ నివాళులర్పించారు. సీఎంతోపాటు మంత్రులు పొన్ముడి, స్వామినాథన్, మేయర్ ప్రియ తదితరులు ధీరన్ చిత్ర పటం వద్ద పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ధీరన్ వీరత్వాన్ని సీఎం గుర్తు చేశారు. ఉరి తాడుకు ముద్దాడి మరీ ప్రాణత్యాగం చేసిన వీరుడు ధీరన్ అని, ఆయన్ని గౌరవించేలా అధికారిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అలాగే



అన్నాడీఎంకే నేతల నివాళి

ఆయన కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం ముందుకెళుతుందన్నారు. అనంతరం అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామి తరఫున మాజీ మంత్రులు, ఆ పార్టీ నాయకులు తరలి వచ్చి అంజలి ఘటించారు. బీజేపీ తరఫున కరునాగరాజన్, తమిళ మానిల కాంగ్రెస్ నేత జీకే వాసన్ తదితరులు పుష్పాంజలి ఘటించారు. ధీరన్‌ను ఉరి తీసిన సేలం జిల్లా శంఖగిరి కోటలో ఆయన చిత్ర పటం ఏర్పాటు చేసి, మంత్రి ముత్తుస్వామి, ఎమ్మెల్యే ఈవీకేఎస్ ఇళంగోవన్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సెల్వ పెరుంతొగైలు అంజలి ఘటించారు. ఈ కోటలోనే ఆయన స్మారక మందిరాన్ని ప్రభుత్వం నిర్మించింది. ఇక్కడ అధికారులు, మంత్రి తదితరులు ధీరన్ చిత్ర పటం వద్ద పుష్పాంజలి ఘటించారు. ఆయన పుట్టిన గడ్డ ఈరోడ్ జిల్లా ఓడని గ్రామంలో ఉన్న స్మారక మందిరంలోని ధీరన్ విగ్రహానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు పుష్పాంజలి ఘటించారు.

ఘనంగా ఆడి ఉత్సవాలు



ఆడి ఉత్సవాల్లో దీపాలు వెలిగించి, పూజలు చేస్తున్న అటవీ ప్రాంత వాసులు

వేలూరు: కాట్పాడి సమీపంలోని వట్టపారై అటవీ ప్రాంతంలో కన్నియమ్మన్ ఆలయంలో ఆడి మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అటవీ ప్రాంతంలోని సుమారు 18 గ్రామాలకు చెందిన ప్రజలు కలిసి తమిళ ఆడిమాసంలోని మూడో శుక్రవారం పూజలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా 25వ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. తొలుత 18 గ్రామాలకు చెందిన మహిళలు పొంగళ్లు పెట్టి, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం పంబ మేళం కొట్టి అమ్మవారిని రప్పించారు. ఆ సమయంలో మహిళా భక్తులపై అమ్మవారు పరవశమై భక్తులకు ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పుష్పాలంకరణలు చేసి కర్పూర హారతులు పట్టారు. అనంతరం మధ్యాహ్నం 18 గ్రామాలకు చెందిన భక్తులకు ఒకే చోట అన్నదానం చేశారు. ఈ పూజల్లో ఉత్సవ కమిటీ చైర్మన్ ఏలుమలై, కార్యదర్శి నాగప్పన్, కోశాధికారి కన్నియప్పన్, భాస్కరన్, గ్రామ పెద్ద పాండురంగన్, అటవీ ప్రాంత గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్ని విద్యలూ నేర్చుకోవాలి



విజేతలతో అతిథులు , నిర్వాహకులు

కొరుక్కుపేట: విద్యార్థులు డిగ్రీలతోపాటు అన్ని విద్యలు నేర్చుకోవాలని డాక్టర్ దిట్టకవి అనంత పద్మనాభమూర్తి సూచించారు. స్థానిక పట్టాభిరామ్‌లోని ధర్మమూర్తిరావు బహదూర్ కలవల కన్నన్ చెట్టి హిందూ కళాశాల తెలుగు శాఖ, తెలుగు భాషా సమితి ఆధ్వర్యంలో జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య, రంగస్థల ప్రముఖ నటశిరోమణి బళ్ళారి రాఘవ జయంతులను పురస్కరించుకుని సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అనంత పద్మనాభమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి విద్యార్థులే కాదు అందరూ అనేక విద్యలను నేర్చుకోవడం అవసరమన్నారు. ఏ విద్య అయినా జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు మనకి ఉపయోగపడుతుందని, అదే కొన్నిసార్లు జీవనాధారం కూడా కావచ్చని అన్నారు. ఈ కార్యక్రమానికి కళాశాల సంచాలకులు ఎస్ రాజేంద్ర నాయుడు గౌరవ అతిథిగా హాజరై మహానటి సూర్యకాంతం తనయుడు కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొనడం అదృష్టమన్నారు. అంతకుముందు కళాశాల ప్రధాన అధ్యాపకులు కల్విక్కరసి, రాజేంద్ర నాయుడు, అనంత పద్మనాభమూర్తి, తెలుగు శాఖ అధ్యాపకులు తుమ్మపూడి కల్పన, శాఖాధ్యక్షుడు సురేష్ తదితరులు పింగళి వెంకయ్య, బళ్ళారి రాఘవ చిత్రపటాల వద్ద నివాళులు అర్పించారు. అనంతరం కల్పనాగుప్త ఆధ్వర్యంలో అంతర్ శాఖల క్విజ్ కార్యక్రమం నిర్వహించారు. విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.

పిల్లల అక్రమ రవాణా అరికట్టడమే లక్ష్యం



క్రికెట్ కోచింగ్‌లో కాన్సులేట్ సిబ్బందితో హరిహరన్, కోచ్‌లు

కొరుక్కుపేట: పిల్లల అక్రమ రవాణా అరికట్టడం, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా ఎంబసీ, కాన్సులేట్ అండ్ హై కమిషనర్ సిబ్బందికి తొలి డీపీఎల్-డిప్లామాట్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు ఐసీడబ్ల్యూఓ సెక్రటరీ హరిహరన్ తెలిపారు. చెన్నై అశోక్‌నగర్‌లోని కాశీ టాకీస్‌లో శుక్ర, శనివారాల్లో డీపీఎల్ -డిప్లామాట్ క్రికెట్ టోర్నమెంట్‌కు సంబంధించిన క్రికెట్ కోచింగ్ నిర్వహించారు. ఇందులో కాన్సులేట్ జనరల్ సిబ్బంది పాల్గొని క్రికెట్ శిక్షణ పొందారు. ఈ సందర్భంగా హరిహరన్ మాట్లాడుతూ ఈనెల 8 నుంచి 10 వతేదీ వరకు చెన్నైలో తొలి డీపీఎల్ -డిప్లామాట్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

ఓపెన్ ఎయిర్ కారులో బీర్ తాగిన ప్రేమజంట

యువకుడి అరెస్టు

అన్నానగర్: నడిరోడ్డుపై ఓపెన్ ఎయిర్ కారులో ఓ ప్రేమజంట బీరు తాగిన సంఘటన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఇందుకు సంబంధించి ఓ యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. కొన్ని రోజుల కిందట చెన్నై సమీపంలోని పల్లావరం-తురైపాక్కం రేడియల్ రోడ్డు మీదుగా ఓ కారులో వెళుతూ ఓ ప్రేమజంట కారులోంచి బయటకు వచ్చి బహిరంగ ప్రదేశంలో నిలబడి మాట్లాడుకుంటున్నారు. హఠాత్తుగా ఇద్దరూ రొమాన్స్ చేశారు. యువతితో కబుర్లు చెబుతుండగా యువకుడు బీరు తాగుతున్నాడు. రద్దీగా ఉండే రోడ్డుపై కారుకు ముందు, వెనుక చాలా వాహనాలు వెళుతున్నా గమనించని ప్రేమజంట చేసిన ఈ చర్యను వాహనచోదకులు వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టారు. ఆ వీడియో వైరల్‌గా మారింది. ఇలాంటి పనులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నెటిజన్లు కోరారు. ఈ మేరకు తురైపాక్కం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బీరు బాటిల్‌తో కారులో షికార్లు కొట్టింది పెరుంగుడికి చెందిన సంజయ్ (23) అని తేలింది. దీంతో పోలీసులు సంజయ్‌ను శనివారం అరెస్టు చేసి, కారును స్వాధీనం చేసుకున్నారు.

నిరంతర సాధనతోనే సీఏలో విజయం



సీఏ విద్యార్థులకు అవార్డులు అందజేస్తున్న సీఏ అనీష్, సీఏ కార్తీక్

కొరుక్కుపేట: సీఏ పూర్తి చేయడం అంటే అందరూ చాలా కష్టం అనుకుంటారని, అయితే నిరంతర సాధనతో అలవోకగా సీఏ పూర్తి చేయవచ్చని అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, అధ్యాపకులు అభిప్రాయపడ్డారు. చెన్నై మైలాపూర్‌లోని ఆర్‌ఆర్ సభ ప్రాంగణంలో శనివారం సీఏ విద్యార్థులకు అనీష్ నూర్ మహమ్మద్ (ఏఎన్ఎం) అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఇందులో సీఏ పూర్తి చేసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు 700 మంది పాల్గొన్నారు. గత మే 2024 సీఏ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ఈ అవార్డులను అందజేశారు. 250 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసీఏఐ సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు సీఏ రాజేంద్రప్రసాద్ పాల్గొని విద్యార్థులకు అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులను అవార్డులతో ఘనంగా సత్కరించారు. సీఏ అనీష్, సీఏ కార్తీక్ మణికొండ, సీఏ రామ్ హర్ష, సీఏ నివేద శంకర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుత్తణిలో భారీ వర్షం

తిరుత్తణి: పట్టణంలో శుక్రవారం రాత్రి గంట పాటు భారీ వర్షం కురిసింది. ప్రధానరోడ్లలో వర్షపు నీరు నిల్వ చేరడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. దీంతో ఆడికృత్తిక వేడుకల సందర్భంగా రోడ్లపై ఏర్పాటు చేసిన తాత్కాలిక దుకాణాల వ్యాపారులు అవస్థలు పడ్డారు. అలాగే పట్టణంలోని మపోసీ రోడ్డు, గాంధీ రోడ్డు, హాస్పిటల్ రోడ్డులో వర్షపు నీటితో పాటు మురుగు నీరు నిల్వ చేరడంతో ప్రయాణికులు, వాహన చోదకులు కష్టాలు ఎదుర్కొన్నారు. ఆడి కృత్తిక వేడుకలు ముగిసిన రెండు రోజుల వ్యవధిలో భారీ వర్షం కురవడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



జలమయమైన మపోసీ రోడ్డు

రిమోట్ విషయంలో ఘర్షణ

– ఉరివేసుకుని విద్యార్థి మృతి

తిరువళ్లూరు: టీవీ చూసే సమయంలో రిమోట్ కోసం అన్న, తమ్ముడి మధ్య ఏర్పడిన చిన్నపాటి వివాదం ఒకరి ఆత్మహత్యకు కారణమైంది. వివరాలు.. తిరువళ్లూరు జిల్లా కడంబత్తూరు యూనియన్ కావం కొలత్తూరు గ్రామానికి చెందిన తాపీ మేస్త్రీ సెంథిల్. ఇతడికి భార్యతో పాటు యువన్‌శంకర్(16) మణిరత్నం(14) అనే ఇద్దరు కొడుకులు వున్నారు. తాపీ పనులకు వెళ్లిన సెంథిల్ అతడి భార్య శుక్రవారం రాత్రి ఆలస్యంగా వచ్చినట్లు తెలుస్తోంది. ఈ సమయంలో మణిరత్నం, యువన్ శంకర్ మధ్య టీవీ, రిమోట్ కోసం స్వల్పంగా ఘర్షణ జరిగినట్టు తెలుస్తుంది. దీంతో యువన్‌శంకర్ రిమోట్‌ను పగలగొట్టి బయటకు వెళ్లిపోయాడు. చాలా సమయమైనా యువన్‌శంకర్ రాకపోవడంతో ఇంటి నుంచి అన్న ఎక్కడికో వెళ్లిపోయాడని, తల్లిదండ్రులు వస్తే కొడుతారని భయంతో మణిరత్నం ఇంటికి సమీపంలోని చింతచెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆలస్యంగా ఇంటికి వచ్చిన సెంథిల్ అతడి భార్య ఇద్దరు కొడుకుల కోసం గాలించగా చింతచెట్టుకు చిన్నకొడుకు ఉరివేసుకుని వేలాడుతూ వుండడాన్ని గుర్తించి బోరున విలపించారు. వెంటనే స్థానికులు ఉరికి వేలాడుతున్న మణిరత్నంను కిందకు దింపగా అప్పటికే మృతి చెందాడు. ఈ లోగా పెద్ద కొడుకు ఇంటికి వచ్చి దిగ్భ్రాంతి చెందాడు. తల్లిదండ్రులకు జరిగిన విషయం తెలిపి బోరున విలపించాడు. కడంబత్తూరు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించారు.

అవయవదానానికి యువత ముందుకు రావాలి



దాతల కుటుంబాలను సత్కరిస్తున్న విశ్రాంత డీజీపీ రవి, నిర్వాహకులు

కొరుక్కుపేట: అవయవదానంలో తమిళనాడు రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా ఉందని గ్రేటర్ చెన్నై పోలీసు విశ్రాంత డీజీపీ డాక్టర్ ఎం రవి అన్నారు. అవయవదానం చేసేందుకు యువత ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. భారతీయ అవయవ దాన దినోత్సవాన్ని చెన్నై వడపళనిలోని సిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అవయవ దానం చేసిన దాతల కుటుంబాలను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అవయవదాతలు చిరస్మరణీయులని వ్యాఖ్యానించారు. అవయవ దానం చేసే వారి కుటుంబాలకు ప్రభుత్వం సాయం అందించాలని, భరోసాను కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిమ్స్ వైద్యులు పాల్గొన్నారు.

ఖైదీ నుంచి సెల్‌ఫోన్ స్వాధీనం

అన్నానగర్: పుళల్ జైలు ఖైదీ నుంచి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. చెన్నైలోని ఐనావరం గ్రామానికి చెందిన శివశంకర్ (26) గంజాయి కేసులో గత నెలలో సెంబియం పోలీసులు అరెస్టు చేసి, పుళల్ రిమాండ్ జైలులో ఉంచారు. శుక్రవారం రాత్రి జైలు పోలీసులు నిత్యం పెట్రోలింగ్ చేస్తుండగా ఖైదీ శివశంకర్ సెల్‌ఫోన్‌లో ఎవరితోనో రహస్యంగా మాట్లాడుతున్నాడు. జైలు పోలీసులు అతడిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన పుళల్ పోలీసులకు జైలులో ఉన్న ఖైదీకి సెల్‌ఫోన్ ఎలా వచ్చింది? సెల్‌ఫోన్‌లో ఎవరితో మాట్లాడాడు? అనే పలు కోణాలలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కావేరిలో తగ్గని ఉధృతి

- నామక్కల్‌లో పలు చోట్ల వరద
- బాధితులకు పళనిస్వామి పరామర్శ
- తీర గ్రామాల్లో వైద్య శిబిరాల ఏర్పాటుకు చర్యలు

సాక్షి, చెన్నై : కావేరి నదిలో నీటి ఉధృతి తగ్గడం లేదు. మెట్టూరు నుంచి లక్ష క్యూ సెక్కులకు పైగా నీరు డెల్టా జిల్లాల వైపు ప్రవహిస్తోంది. నీటి ఉధృతి కారణంగా నామక్కల్ జిల్లా కుమారపాళయం, పళ్లిపాళయంలో లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు చొచ్చుకు వచ్చాయి. మెట్టూరు జలాశయం నిండడంతో ఉబరి నీటిని బయటకు విడుదల చేస్తున్నారు. ఈ నీరు డెల్టా జిల్లాల వైపు ప్రవహిస్తోంది. సేలం, నామక్కల్ జిల్లాలో మెట్టూరుకు అతి సమీపంలో ఉండడంతో నీటి ఉధృతి ఇక్కడి తీరాల్లో మరీ ఎక్కువగా ఉంది. ఈ పరిస్థితుల్లో నామక్కల్ కుమార పాళయం, పళ్లి పాళయం పరిసరాల్లో లోతట్టు ప్రాంతాల్లోకి కావేరి వరద జలాలు వచ్చాయి. వరదలు రావడంతో ఆ పరిసరాల్లోని ప్రజల్లో ఆందోళన నెలకొంది. లోతట్టు ప్రాంతాల్లో మోకాలి లోతు నీరు వచ్చింది. ఈ సమాచారంతో అధికారులు అక్కడికి పరుగులు తీశారు. నీటి ఉధృతి పెరగకుండా చర్యలు తీసుకున్నారు. స్వల్ప ముంపునకు గురైన ప్రాంతాల్లో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళణి స్వామి, మాజీ మంత్రి తంగమణి శనివారం పర్యటించారు. బాధితులను పరామర్శించారు. ఇదిలా ఉండగా, కావేరీ తీర జిల్లాల్లో వరద కారణంగా ముంపునకు గురైన ప్రాంతాలలో ప్రత్యేకంగా వైద్య శిబిరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. సీఎం స్టాలిన్ ఆదేశాలతో ఆరోగ్య మంత్రి ఎం సుబ్రమణియన్ ఈ మేరకు ప్రకటన చేశారు. 50 చోట్ల వైద్య శిబిరాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. అలాగే వరదల సమయంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేయాలని నిర్ణయించారు.

ఆంధ్ర నుంచి మత్తు పదార్థాల తరలింపు

- వ్యక్తి అరెస్టు



స్వాధీనం చేసుకున్న కారు సహ నిందితుడిని అరెస్టు చూపుతున్న పోలీసులు

వేలూరు: ఆంధ్రప్రదేశ్ నుంచి తమిళనాడుకు నిషేధిత మత్తు పదార్థాలు తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. నిషేధిత మత్తు పదార్థాలను ఆంధ్రప్రదేశ్ నుంచి పేర్నంబట్టు మీదుగా తమిళనాడుకు కారులో తరలిస్తున్నట్లు గుడియాత్తం డీఎస్పీ రవిచంద్రన్‌కు రహస్య సమాచారం అందింది.

దీంతో డీఎస్పీ ఆదేశాల మేరకు పేర్నంబట్టు పోలీస్ ఇన్‌స్పెక్టర్ రుక్మాందన్, పోలీసులు ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతంలోని గుడియాత్తం-మేల్‌పట్టి ప్రాంతంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అతి వేగంగా వచ్చిన ఒక కారును ఆపి పోలీసులు తనఖీ చేశారు. కారులో రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిన హాన్స్, గుట్కాతో పాటు మత్తు పదార్థాలు గోనె సంచిల్లో ఉన్నట్లు గుర్తించారు. ఈ కేసులో ఆంధ్రప్రదేశ్ చిత్తూరు జిల్లా పుంగనూరుకు చెందిన భరత్ అరెస్టు చేశారు.

11న బీజేపీ కార్యవర్గ సమావేశం

- జిల్లాల అధ్యక్షుల మార్పు
- అన్నామలై ఆకస్మిక నిర్ణయం

సేలం: తిరుపూర్‌లో ఈ నెల 11వ తేదీన బీజేపీ జిల్లాల అధ్యక్షులు, నేతలతో కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నారు. తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై ఢిల్లీకి వెళ్లి కోవైకి తిరిగి వచ్చారు. ఢిల్లీలో జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను కలిసి ముఖ్య విషయాలపై చర్చించినట్టు సమాచారం. 2026 ఎన్నికలకు రాష్ట్ర పార్టీలు ఇప్పటి నుంచే సిద్ధమవుతున్నాయి. డీఎంకే తరఫున సమన్వయ కమిటీని ఏర్పాటు చేసి పనులను ప్రారంభించారు. అలాగే బీజేపీ చేపట్టాల్సిన పనుల గురించి జేపీ నడ్డాతో అన్నామలై చర్చించినట్లు తెలుస్తోంది. పార్టీ పరంగా 66 మంది జిల్లా అధ్యక్షులు ఉన్నారు. ఎన్నికల ముందే జిల్లా అధ్యక్షులలో మార్పులు చేర్పులు చేపట్టాల్సి ఉందని కేంద్రం అన్నామలైకు సూచించినట్లు తెలుస్తోంది. గత పార్లమెంటు ఎన్నికల్లో విజయం పొందనప్పటికీ 12 జిల్లాలలో రెండో స్థానాన్ని చేజిక్కించుకున్నారు. ఇతర కొన్ని జిల్లాలలో కనీస ఓట్లు కూడా బీజేపీ పొందలేకపోయింది. దీని ఆధారంగా నేతల పనితీరును పరిశీలించనున్నారు. కొందరు జిల్లా అధ్యక్షులు పార్టీ వర్గీయుల ఫిర్యాదులకు లోనయ్యారు. ఆ మేరకు నేతల పని తీరును సంతృప్తికరం, పర్వాలేదు, అసంతృప్తి అంటూ మూడు విధాలుగా కేటాయించి, వచ్చే ఎన్నికలకు శ్రమించగలిగే వారిని మాత్రమే అధ్యక్షులుగా ఎన్నుకోవాలని నిర్ణయించినట్టు సమాచారం. ఇలా పలు అంశాలపై చర్చించే రీతిలో 11వ తేదీ జిల్లా అధ్యక్షులు, నిర్వాహకుల సమావేశం తిరుపూర్‌లో నిర్వహించనున్నారు. ఈ సమావేశం తర్వాత రాష్ట్ర బీజేపీలో పలు మార్పులు జరుగుతాయని పార్టీ వర్గాల సమాచారం.

కోవైలో న్యాయవాది దారుణ హత్య

- నలుగురు పోలీసులకు లొంగుబాటు

సేలం: కోవైలో పట్టపగలు నడిరోడ్డుపై కారులో కమల్ పార్టీకి చెందిన న్యాయవాది దారుణ హత్యకు గురయ్యారు. ఇందుకు సంబంధించిన నలుగురు పోలీసులకు లొంగిపోయారు. వివరాల్లోకి వెళితే.. కోవై రత్నపురి విశ్వనాథపురానికి చెందిన న్యాయవాది ఉదయకుమార్ (48). ఇతనికి భార్య నిత్యవల్లి కోవై శరవణపట్టిలో ఉన్న ఒక ప్రైవేటు ఆస్పత్రిలో డాక్టర్‌గా పని చేస్తున్నారు. ఉదయకుమార్ చాలా కాలంగా జాన్‌పాండియన్ పార్టీలో ముఖ్య బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చారు. ప్రస్తుతం ఆ పార్టీ నుంచి తప్పుకుని కమల్‌హాసన్ మక్కల్ నీతి మయ్యం పార్టీలో జిల్లా స్థాయి ఇన్‌చార్జిగా బాధ్యత వహిస్తున్నారు. ఈ స్థితిలో శుక్రవారం ఉదయకుమార్ కారులో పొల్లాచ్చికి వెళుతున్నట్టు భార్యకు చెప్పి బయలుదేరాడు. ఆ సమయంలో ఆయన కారులో మరో నలుగురు ఎక్కి ఆయనతో వాగ్వాదం చేశారు. అది బాగా ముదిరింది. తర్వాత కోవై - పొల్లాచ్చి రోడ్డుపై నుంచి చెట్టిపాళయం సమీపంలో ఉన్న వారతోపు ప్రాంతంలో ఒక కోళ్ల ఫారం ముందు కారును ఆపి కత్తులతో ఉదయకుమార్‌పై దాడి చేశారు. ఆ ముఠా సభ్యులు కత్తితో ఉదయకుమార్ మర్మాంగాన్ని నరికారు. దీంతో అతను సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. తర్వాత ఆ ముఠా అక్కడి నుంచి అదే కారులో పరారైంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఇందు కోసం ఆరు ప్రత్యేక పోలీసులు బృందాలను ఏర్పాటు చేశారు. ఈ స్థితిలో శుక్రవారం రాత్రి న్యాయవాది ఉదయకుమార్ హత్య కేసుకు సంబంధించి రత్నపురికి చెందిన సెల్వం, గణపతి ప్రాంతానికి చెందిన గౌతమ్, అరుణ్‌కుమార్, అభి అనే నలుగురు కోవిల్‌పాళయం పోలీసు స్టేషన్‌లో లొంగిపోయారు. విచారణలో ఉదయకుమార్ ఒక ఫైనాన్సర్ వద్ద రూ.లక్షలు డబ్బు తీసుకున్నారని, దాన్ని రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడి చేసినట్టు తెలిసింది. ఆ డబ్బు తిరిగి ఇచ్చే వ్యవహారంగా ఈ హత్య జరిగినట్టు తెలుస్తోంది. లొంగిపోయిన వారిలో ఒక వ్యక్తి ఫైనాన్షియర్ అని, మిగిలిన ముగ్గురు కలెక్షన్ చేసే వారని తెలిసింది.

దుబాయిలో సహాయ నటీమణుల వ్యభిచారం!

తమిళసినిమా: తమిళ సినీ, బుల్లితెర సహాయ నటీమణులు, నృత్య కళాకారులు దుబాయిలో నడుపుతున్న వ్యభిచార రాకెట్‌ను చెన్నై పోలీసులు బట్టబయలు చేసే ప్రయత్నంలో ఉన్నారు. తమిళ సినీ, బుల్లితెర సహాయ నటీమణులు అత్యధిక సంఖ్యలో దుబాయిలో వ్యభిచారం చేస్తున్నట్లు చెన్నై వ్యభిచార నిరోధక శాఖ పోలీసులకు గత మే నెలలో సమాచారం అందింది. దీంతో పోలీసులు రంగంలోకి దిగారు. విచారణలో పలువురు యువ సహాయ నటీమణులు వ్యభిచారం చేస్తున్నట్లు తెలిసింది. కొందరు బ్రోకర్లు వీరిని దుబాయికి తీసుకెళ్లి స్టార్ హోటళ్లలో వ్యభిచారం చేయిస్తున్నట్లు తెలిసింది. ఈ బ్రోకర్లు రూ.లక్షల్లో డబ్బు తీసుకుని సహాయ నటీమణులకు చిన్న మొత్తంలో డబ్బు చెల్లించి వ్యభిచారం చేయిస్తున్న వ్యవహారం వెలుగు చూసింది. ఇందుకు కారణం అయిన చెన్నై, మడిపాక్కం ప్రాంతానికి చెందిన రాజ్, జయకుమార్ తోసహా నలుగురిని పోలీసులు అరెస్టు చేసి విచారిస్తున్నారు. ఇందులో ఒక ప్రముఖ బుల్లితెర నటికి ప్రధాన పాత్ర ఉన్నట్లు తెలిసింది. ఆమె దుబాయిలోని పలువురు ప్రముఖులతో పరిచయం పెంచుకుని తద్వారా యువ సహాయ నటీమణులతో చాలా కాలంగా వ్యభిచారం చేయిస్తున్నట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో వ్యభిచార నిరోధక శాఖ పోలీసులు విచారణను వేగవంతం చేసి వ్యభిచార రాకెట్‌లో ఎవరెవరు ఉన్నారన్న పూర్తి పట్టికను త్వరలోనే ఆధారాలతో సహా బట్టబయలు చేయడానికి సిద్ధం అవుతున్నట్లు సమాచారం.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

అన్నానగర్: రాష్ట్రంలో శుక్రవారం రాత్రి జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. చెన్నై సమీపం పల్లికరనై కారుమేల్ క్రాస్ వీధికి చెందిన సతీష్ (27), సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా జీవిస్తున్నాడు. బెంగళూరులోని ఓ ఐటీ కంపెనీలో పని చేస్తున్నాడు. ప్రస్తుతం ఇంట్లో నుంచి పని చేస్తున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి వేళచ్చేరిలో స్నేహితుడిని చూసి బైకులో వేళచ్చేరి మెయిన్ రోడ్డు మీదుగా ఇంటికి తిరిగి బయలుదేరాడు. పల్లికరణై బాలాజీ నగర్ సిగ్నల్ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న వ్యాన్ అతని బైకుని ఢీ కొంది. ఈ ఘటనలో సతీష్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. పల్లికరనై ట్రాఫిక్ ఇన్వెస్టిగేషన్ విభాగం పోలీసులు కేసు నమోదు చేసి వ్యాన్ డ్రైవర్ పెరుంబాక్కం ఎలిల్ నగరానికి చెందిన తిరుమలై(42)ని అరెస్టు చేశారు.

సత్యమంగళం వాసి..

విల్లుపురం జిల్లా సెంజీ తాలూకా సత్య మంగళం ప్రాంతానికి చెందిన మునియమ్మాళ్ (59) తన బంధువైన ప్లస్-1 విద్యార్థితో కలిసి శుక్రవారం రాత్రి పరంగిమలై పట్ రోడుకు వెళ్లింది. మౌంట్-పూందమల్లి రహదారిపై వెళుతుండగా వెనుక కూర్చున్న మునియమ్మాళ్ బైకుపై నుంచి జారిపడిపోయింది. దీంతో తీవ్రంగా గాయపడిన మునియమ్మాళ్ మృతి చెందింది. దీనిపై పరంగిమలై ట్రాఫిక్ ఇన్వెస్టిగేషన్ విభాగం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మన్ కోవిల్ వీధి నివాసి..

మాంగాడు కామక్షి అమ్మన్ కోవిల్ వీధికి చెందిన శివరామక్రిష్ణన్ (23)రామాపురంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. శివరామకృష్ణన్ శుక్రవారం రాత్రి బైకులో మాంగాడు-కుండ్రత్తూరు రహదారిపై మాంగాడులోని కామక్షియమ్మన్ దేవాలయం ఎదురుగా వెళుతుండగా వెనుక నుంచి వస్తున్న బస్సు అతని బైకుని ఢీ కొట్టింది. దీంతో శివరామకృష్ణన్ తీవ్రగాయాలతో అక్కడికక్కడే మరణించాడు. ఆవడి ట్రాఫిక్ ఇన్వెస్టిగేషన్ విభాగం పోలీసులు బస్సు డ్రైవర్ రమేష్‌ను అరెస్టు చేసి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా...

సిలికా, క్వార్ట్జ్ అందుబాటులోకి తీసుకురండి

మంత్రి భరత్‌ను కోరిన ఏపీ చాంబర్స్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఫౌండ్రీలు, ఇతర పరిశ్రమలకు అత్యంత కీలకమైన సిలికా, క్వార్ట్జ్ అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని, అనేక ఫౌండ్రీలు ఉద్యోగులను తొలగిస్తుండటంతో ఈ సమస్యను సత్వరం పరిష్కరించాల్సిందిగా పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌కు ఏపీ చాంబర్స్ విజ్ఞప్తి చేసింది. ముడి సరుకు అందుబాటులో లేకపోవడంతో అనేక ఫౌండ్రీ పరిశ్రమలు మూతపడుతున్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకురాగా రెండు మూడు రోజుల్లోనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరు భాస్కరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024–29కి సంబంధించి రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి చాంబర్స్ రూపొందించిన రోడ్‌మ్యాప్‌ను టీజీ భరత్‌తో పాటు ఎంఎస్‌ఎంఈ మంత్రి కె.శ్రీనివాసు, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్‌లకు అందచేసినట్లు ఆయన పేర్కొన్నారు.

సీఎంను కలసిన శ్రీసిటీ ఎండీ


సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రవీంద్ర

శ్రీసిటీ (వరదయ్యపాళెం): సీఎం చంద్రబాబును శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సీఎం కార్యాలయంలో శనివారం కలిశారు. పారిశ్రామికీకరణలో భాగంగా దినదినాభివృద్ధి చెందుతున్న శ్రీసిటీని సందర్శించాలని ఆయన సీఎంను కోరారు. శ్రీసిటీ ప్రగతి, ప్రస్తుత పరిస్థితులు, భవిష్యత్ అభివృద్ధి కార్యాచరణ గురించి వివరించారు. సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి మేడ్ ఇన్ శ్రీసిటీ జ్ఞాపికను బహూకరించారు. అనంతరం డీజీపీ ద్వారకా తిరుమలరావును కూడా రవీంద్ర సన్నారెడ్డి కలిశారు.

శ్రీసిటీ తరహా పార్కులు అభివృద్ధి చేయండి

అధికారులకు మంత్రి టీజీ భరత్ ఆదేశం



సాక్షి, అమరావతి: తిరుపతి జిల్లాలోని శ్రీసిటీ తరహాలో పారిశ్రామిక పార్కులు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అధికారులను ఆదేశించారు. నగరాల్లో కలిసిపోయిన పారిశ్రామిక పార్కుల ద్వారా ఆదాయ ఆర్జనకు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. శనివారం ఏపీఐఐసీ కార్యాలయంలో పరిశ్రమల శాఖపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని ఇండస్ట్రియల్ జోన్లు, భూముల విలువ, నీరు, విద్యుత్, ల్యాండ్ అలాట్‌మెంట్స్ గురించి ఆరా తీశారు. శ్రీసిటీ తరహాలో పారిశ్రామిక పార్కుల్లో మౌలికవసతులు కల్పించాలని, త్వరలోనే విజయవాడ, విశాఖ ఇండస్ట్రియల్ జోన్లను సందర్శించనున్నట్లు తెలిపారు.

ట్రిపుల్ ఐటీల్లోని సీట్ల భర్తీకి రెండో జాబితా విడుదల

నూజివీడు/వేంపల్లె: ఏపీలోని ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో తొలి విడత కౌన్సెలింగ్ అనంతరం మిగిలిన 753 సీట్ల భర్తీకి రెండో ఎంపిక జాబితాను విడుదల చేసినట్లు అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య అమరేంద్రకుమార్ శనివారం తెలిపారు. ఈ జాబితాను ఆర్జీయూకేటీ వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. ఈ నెల 9న రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఉద్యోగాలకు 82 మంది ఎంపిక

న్యాక్ టెక్నాలజీస్ కంపెనీకి 82 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆర్కే వ్యాలీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు. ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ప్రాంగణంలో జరిగిన క్యాంపస్ సెలక్షన్స్‌లో ఒక్కో విద్యార్థి ఏడాదికి రూ.6 లక్షల వేతనంతో ఉద్యోగం సాధించినట్లు తెలిపారు.

ఎన్నికల్లో భారీగా అవకతవకలు

▶ మొదటి పేజీ తరువాయి

వ్యక్తం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రాథమిక గణాంకాలతో పోలిస్తే తుది ఓటింగ్ శాతంలో గణనీయంగా వ్యత్యాసాలు ఉండటంపై కేంద్ర ఎన్నికల సంఘం వివరణ ఇవ్వాలన్నారు. పోలింగ్ రోజుల్లో ఈసీ ప్రకటించిన ఓట్ల లెక్కలకు, తుది ఓటింగ్ శాతానికి మధ్య భారీ వ్యత్యాసం ఉందని పలు సంస్థలు కూడా విశ్లేషించాయన్నారు. జాతీయ స్థాయిలో సగటు వ్యత్యాసం 4.7 శాతం ఉంటే ఎన్నికల ఫలితాలు సరైనవేనా అని సందీప్ దీక్షిత్ ప్రశ్నించారు. ప్రతి దశలో ఓటింగ్ ముగిశాక చాలా రోజుల తర్వాత కానీ ఆ దశకు సంబంధించిన ఓటింగ్ శాతాన్ని ఈసీ ప్రకటించలేదని గుర్తు చేశారు. ఈవీఎంలతో ఓటింగ్ ప్రారంభమైనప్పుడు, ప్రతి రెండు గంటలకు బూత్‌లో ఎంత ఓటింగ్ జరిగిందనే సమాచారాన్ని కేంద్ర ఎన్నికల సంఘానికి పంపాల్సి ఉంటుందన్నారు. ఇంటర్‌నెట్ వంటి సాంకేతిక సమస్యలతో సమాచారం ఇవ్వడంలో ఆలస్యమైందని కేంద్ర ఎన్నికల సంఘం చెబుతోందని సందీప్ దీక్షిత్ మండిపడ్డారు. ఈసీ విడుదల చేసిన డేటాలో వ్యత్యాసం పలు ప్రశ్నలను లేవనెత్తుతోందన్నారు. 2019లోనూ ఈ విధంగానే డేటా విడుదలలో ఆలస్యం జరిగిందని గుర్తు చేశారు. ఓట్ ఫర్ డెమోక్రసీ నివేదిక ప్రకారం.. దేశంలోని 79 లోక్‌సభ నియోజకవర్గాల్లో ఓటింగ్ శాతం పెరుగుదల.. బీజేపీ తక్కువ ఓట్ల తేడాతో గెలిచిన దాని కంటే ఎక్కువగా ఉందన్నారు. ఈ నివేదికపై కేంద్ర ఎన్నికల సంఘం నుంచి సంతృప్తికర సమాధానాలు, వివరణ రాకపోతే కోర్టును ఆశ్రయిస్తామన్నారు.

పేదల కడుపు నింపే రేషన్ బియ్యాన్ని నల్లబజారుకు తరలించే ముఠాకు అండగా నిలిచి కాలు కదపకుండా కోట్ల రూపాయలు కూడబెట్టుకోవాలని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పథకం రచించారు. ఈ మేరకు రేషన్ బియ్యం తరలించే ముఠా సభ్యులతో బేరం కుదిర్చే పనిని తన మామకు అప్పగించారు. ఆయన రంగంలోకి దిగి అనంతపురం టౌన్‌లో బియ్యం కొనుగోలు చేసి వాటిని గోదాములకు చేర్చి, జిల్లా సరిహద్దులు దాటించి నల్లబజారులో అమ్ముకునేదాకా అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని ముఠా సభ్యులకు భరోసా ఇస్తున్నారు. తమను కాదంటే కేసులు పెట్టించి లోపలేయిస్తామని బెదిరిస్తున్నారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించి స్వయాన ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మామ గంగారాం చౌక బియ్యాన్ని కార్డుదారులు, డీలర్ల నుంచి సేకరించి నల్లబజారుకు తరలించే ముఠాకు సహకరిస్తున్న ఓ మహిళతో ఫోన్‌లో మాట్లాడిన ఆడియో నెట్టింట వైరల్ అవుతోంది.

– అనంతపురం క్రైం

భలే మంచి 'చౌక' బేరం!

రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలించే ముఠాతో అనంతపురం ఎమ్మెల్యే రాయ'బేరాలు'!

ఈ ఆడియోలోని సంభాషణ ఇలా...

ఎమ్మెల్యే మామ: ఏమ్మా మీరు ఒకసారి ఎమ్మెల్యే ఆఫీసుకు వచ్చి రేటు మాట్లాడుకుని వెళ్లండి. మీరు మొత్తం నలుగురు ఉన్నారు కదా? రేపు ఆఫీసుకు నలుగురు కలిసి రావాల్సి ఉంటుంది.

మహిళ: అన్నా.. అప్పుడే(కౌంటింగ్ అయిన తర్వాత) పరిటాల సునీతమ్మక్క ఇంటి వద్దకు రమ్మంటే వెళ్లాము. సోమందేపల్లి వాళ్లు అక్కడే మాట్లాడుకున్నారు. సరుకు వాళ్లు కదా తీసుకెళ్లేది! మీరు వాళ్లతోనే మాట్లాడండి. మాతో ఎందుకు?

ఎమ్మెల్యే మామ: అలా కాదు... అనంతపురం అర్బన్‌లోని రేషన్ షాపులు వారందరికీ మేం అప్పుడే అలర్టు చేసినాం. మా ఆధీనంలోనే ఉన్నాయి. ఇక్కడ మీరు సరుకు నిల్వ ఉంచుకుని పంపుతున్నారు. కావున మీరు మాతో మాట్లాడాలి. అలాకాదని పరిటాల సునీత, శ్రీరాము, బాలాజీ... అంటే ఎలా? పైగా నేను కూడా బాలాజీకి బావే. బాలాజీతో నేను మాట్లాడతాను. సోమందేపల్లి, పెనుకొండ మంత్రి సవితమ్మ ఎవరైనా కానీ.. మీ సరుకు వెళ్లాలంటే అనంతపురం నగరంలో మా అనుమతి తప్పనిసరి. నువ్వు, సుబ్బు, రామకృష్ణ, జయపాల్‌రెడ్డి, జగదీష్ కలసి సాయంత్రం మూడు గంటలకు ఆఫీసుకు రండి. మీరు చాలా కరెక్టు మనిషి అని మా పిల్లలు చెప్పారు. అందుకే మీకు ఫోన్ చేస్తున్నా.

మహిళ: నేను ఒక్కదాన్నే రావాలా అన్నా?

ఎమ్మెల్యే మామ: వద్దు.. మీరు నలుగురు కలిసి రండి. అప్పుడే మాట్లాడతాం. మీరు ఎట్టి పరిస్థితుల్లో మాకు చెప్పకుండా సరుకు పంపొద్దు. సోమందేపల్లి వాళ్లు, పెనుకొండ వాళ్లు వచ్చినా వారికి సరుకు ఇవ్వొద్దు. అలా ఇచ్చారంటే మీ ఇష్టం. చాలా సీరియస్ అవుతుంది. లేదు.. మేము చేసుకుంటామంటే మాత్రం అందరినీ లోపలేపిస్తాం.

మహిళ: లేదులే అన్న మాకేముంది? లోకల్‌లో ఎవరొచ్చినా సరుకు ఎత్తిచ్చేవాళ్లము కదా?

ఎమ్మెల్యే మామ: అలా కాదు... మీరు ఇంకా ఐదు సంవత్సరాలు ఈ వ్యాపారం బాగా చేసుకోవాలంటే నేను ఫుల్ ష్యూరిటీ ఇస్తున్నా. మీకెలాంటి ఇబ్బందీ రానివ్వను. చాలారోజులుగా మీ విషయం మాట్లాడుకుంటున్నాం. నిన్న ఎమ్మెల్యే దగ్గుపాటి వచ్చి 'మామ ఇంక అదేందో నువ్వే వాళ్లని పిలిపించుకుని మాట్లాడు' అంటే నేను బాధ్యత తీసుకున్నా. మీ అందరి గురించి తెలుసుకుని నంబర్లు తీసుకునేలోపు లేటయ్యింది. సాయంత్రం 3 నుంచి 3.30 గంటల మధ్య రండి.

మహిళ: సరే సార్ వస్తాం.

ఎమ్మెల్యే మామ: ఇదే కాదు... భవిష్యత్‌లో కూడా పరిటాల, సవితమ్మ, ఇంకా పార్టీ లీడర్లు... ఇలా ఎవరి నుంచి ఏ ఇబ్బందీ రాకుండా పూర్తి బాధ్యత మేమే తీసుకుంటున్నాం. రెండు రోజుల్లో మా కమ్మాస్ అతనే సీఐ సాయినాథ్ అని వస్తున్నాడు. కావాలనే మనం తీసుకుంటున్నాం. ఇంకా ఎస్‌ఐలు కూడా మా వాళ్లే వస్తారు. మీరు ఒకటి అర్థం చేసుకోండి. డీఎస్పీ నుంచి సీఐలు, ఎస్‌ఐలు అంతా మా వాళ్లే ఉండాలని తీసుకుంటున్నాం. రెండు రోజుల్లో వస్తారు. మీకు ఎలాంటి ఇబ్బందీ రానివ్వము. అనంతపురం టోటల్ జిల్లాలో మిమ్మల్ని మాట్లాడించే వారుండరు. అలా ఎవరైనా మాట్లాడితే నాతో ఫోన్‌లో మాట్లాడించండి. నేను చూసుకుంటాను. ఎంతటి వారినైనా వదిలిపెట్టం.

- తమ ఆఫీసుకు వచ్చి రేటు మాట్లాడాలని ముఠాలోని ఓ మహిళకు ఎమ్మెల్యే దగ్గుపాటి మామ ఫోన్‌లో హెచ్చరిక
- అనంతపురం టౌన్‌లోని ముఠా సభ్యులు అందరూ తమ వద్దకే రావాలని హుకుం
- సునీత, శ్రీరామ్, సవిత అంటే ఇక్కడ కుదరదమ్మా.. అంటూ బెదిరింపులు
- మమ్మల్ని కాదంటే కేసులు పెట్టించి లోపలేయిస్తాం
- మా వద్దకు వస్తే ఐదేళ్లు అన్నీ మేమే చూసుకుంటామని హామీ
- వైరల్ అవుతున్న ఎమ్మెల్యే మామ గంగారాం ఫోన్‌కాల్ రికార్డింగ్

మహిళ: ఇంతకుముందు మా నుంచి ఎవరూ తీసుకోలేదు అన్నా!

ఎమ్మెల్యే మామ: మీరు ఇంకొకరి గురించి చెప్పొద్దు. అలా ఊరికే ఇడిసిపెట్టేది ఉండదు. వాళ్లు వదిలి పెట్టారని మేము ఎలా విడిచి పెడతాము? మీరేమో తప్పుడు పని చేస్తూ ఇంకొకరికి సరుకు ఇస్తున్నారు. మీ నుంచి మేము తీసుకోకూడదంటే ఎలా? వదిలే ప్రసక్తే లేదు. బయట ఎక్కడో మీరు మాట్లాడుకుని మమ్మల్ని ఎవరూ అడగలేదంటే ఎట్లా? ఆఫీసుకు రండి.. ఇక్కడే కూర్చుని మాట్లాడుకుందాం.

రేషన్ బండి మా ఊళ్లోకొస్తే తగులబెడతాం


టీడీపీ నాయకులు అడ్డుకున్న లారీ వద్ద నిలబడి ఉన్న పోలీసులు

- డీలర్‌ను మార్చండి... మా వారికే రేషన్ షాపు ఇవ్వండి
- అప్పటి వరకు బియ్యం బండి రానివ్వబోం
- ప్రకాశం జిల్లా ఇండ్లచెరువులో టీడీపీ నేతల బరితెగింపు

దర్శి: 'ఇప్పుడున్న రేషన్ డీలర్‌ను తొలగించండి. మేం చెప్పినవారికి డీలర్‌షిప్ ఇవ్వండి. అప్పటి వరకు మా ఊరిలో రేషన్ ఇవ్వడానికి వీల్లేదు. మేం చెప్పినట్లు చేయకుండా గ్రామంలోకి రేషన్ బియ్యం తీసుకువస్తే ఆ బండిని తగలబెడతాం..' అని ప్రకాశం జిల్లా దొనకొండ మండలం ఇండ్లచెరువు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు హెచ్చరిస్తున్నారు. రెండు సార్లు రేషన్ బియ్యం తీసుకువెళ్లిన లారీని అడ్డుకున్నారు. వారి అడ్డగోలు చర్యల వల్ల గ్రామంలోని పేదలకు ఇప్పటి వరకు రేషన్ బియ్యం అందని పరిస్థితి నెలకొంది. ఇందుకు సంబంధించిన వివరాలు... ఇండ్లచెరువు గ్రామంలో బీసీ కులానికి చెందిన అద్దంకి వెంకటేశ్వర్లు 20 ఏళ్లుగా రేషన్ షాపు పర్మినెంట్ డీలర్‌గా ఉన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ డీలర్‌ను తీసివేయాలని స్థానిక నాయకులు నిర్ణయించుకున్నారు. డీలర్ ఈ విషయం తెలుసుకుని టీడీపీ నేతలను కలసి '20 ఏళ్లుగా రేషన్ దుకాణం నిర్వహిస్తున్నాను. ఇదే నాజీవనాధారం. నా కడుపు కొట్టి నా కుటుంబాన్ని బజారున పడేయొద్దు' అని వేడుకున్నాడు. అయినా కనికరించని వారు డీలర్‌ను తొలగించాలని రెవెన్యూ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులపై ఒత్తిడి తెచ్చారు. ఆయన రాజీనామా చేస్తే తప్ప తీసివేయడానికి తమకు అధికారం లేదని అధికారులు చెప్పారు. దీంతో తమ గ్రామంలోకి రేషన్ బియ్యం ఎలా తెస్తారో చూస్తామని టీడీపీ నేతలు హెచ్చరికలు జారీచేశారు. ఈ క్రమంలో గత నెల 31వ తేదీన దొనకొండలోని పౌరసరఫరాల శాఖ గోదాము నుంచి 12 టన్నుల రేషన్ బియ్యాన్ని లారీలో ఇండ్లచెరువుకు పంపగా, టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. తమను కాదని గ్రామంలోకి రేషన్ బియ్యం లారీ వస్తే తగులబెడతామని హెచ్చరించారు. దీంతో సిబ్బంది లారీని తీసుకుని వెనక్కి వెళ్లిపోయారు.

పోలీసులనూ లెక్క చేయలేదు

పోలీస్ బందోబస్తుతో శనివారం ఉదయం 11 గంటలకు మరోసారి రేషన్ బియ్యంతో లారీ ఇండ్లచెరువుకు బయలు దేరగా... టీడీపీ నాయకులు వచ్చి ఊరి బయటే అడ్డుకున్నారు. గ్రామంలోకి వస్తే తగులబెడతామని, వెనక్కి వెళ్లాల్సిందేనని హెచ్చరించారు. పోలీసులు సాయంత్రం వరకు బతిమిలాడినా టీడీపీ నాయకులు వినకపోవడంతో లారీని వెనక్కి పంపారు. టీడీపీ నాయకులు ఇంత బరితెగించి దౌర్జన్యం చేస్తున్నా పోలీసులు బతిమిలాడుకోవడం చూసిన ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. పోలీసు వ్యవస్థ ఇంత నిర్వీర్యమైపోతే సామాన్యులకు ఏం న్యాయం చేస్తారని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

భట్టిప్రోలులో టీడీపీ బరితెగింపు

- ఎస్‌ఐ చొక్కాపట్టుకుని నెట్టివేసిన టీడీపీ కార్యకర్త
- వీడియో సోషల్ మీడియాలో వైరల్
- టీడీపీ మూకల దౌర్జన్యంపై సర్వత్రా చర్చ

భట్టిప్రోలు: టీడీపీ నేతల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండాపోతోంది. ఒకవైపు వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారు. ఆస్తులు ధ్వంసం చేస్తూ విధ్వంసం సృష్టిస్తున్నారు. మరోవైపు తమ ఆగడాలను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్న అధికారులపైనా దౌర్జన్యానికి దిగుతున్నారు. పోలీసు అధికారులపై సైతం దౌర్జన్యం చేస్తున్నారు. తాము చెప్పినట్లు వినకుంటే మీ సంగతి తేలుస్తామంటూ బెదిరిస్తున్నారు. తాజాగా బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం భట్టిప్రోలులో శనివారం టీడీపీ కార్యకర్త ఆదిన తాండవకృష్ణ అనే వ్యక్తి నగరం ఎస్‌ఐ కోటేశ్వరరావు చొక్కా పట్టుకుని నెట్టివేయడం, దుర్భాషలాడటం ఇందుకు నిదర్శనం. టీడీపీ కార్యకర్త ఏకంగా ఎస్‌ఐ చొక్కాపట్టుకుని నెట్టివేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఘటన జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

విన్నవించినా వినకుండా ఎస్‌ఐపై దౌర్జన్యం

వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, భట్టిప్రోలుకు చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబాలు నియోజకవర్గంలో పేకాట, కోడిపందాల నిర్వహణపై ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకున్నారు. ఈ విషయంపై శనివారం బహిరంగ చర్చకు సిద్ధమంటూ సవాల్ చేసుకున్నారు. దీంతో పోలీసులు భట్టిప్రోలులో సెక్షన్ 30 అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇద్దరు నేతలను హౌస్ అరెస్ట్ చేశారు. భట్టిప్రోలుకు చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా సాయంత్రం 4 గంటల సమయంలో బయటకు వచ్చేందుకు ప్రయత్నించారు. పోలీసులు ఆయనను వారించి తమకు సహకరించాలని కోరారు. అయినా సాయిబాబా పట్టించుకోకుండా బయటకు వచ్చే ప్రయత్నం చేశారు. పోలీసులు ఆయనను అడ్డుకున్నారు. దీంతో సాయిబాబా అనుచరులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో సాయిబాబా అనుచరులు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. ఈ సమయంలో టీడీపీ కార్యకర్త ఆదిన తాండవకృష్ణ అనే వ్యక్తి నగరం ఎస్‌ఐ కోటేశ్వరరావు చొక్కా పట్టుకుని నెట్టారు. అధికార పార్టీ కార్యకర్త కావడంతో ఎస్‌ఐ ఏమీ చేయలేక అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ వీడియో కొద్ది నిమిషాల్లోనే బయటకు రావడం... అది చూసిన పలువురు రాష్ట్రంలో పోలీసులకే రక్షణ లేకుండాపోయిందని, సామాన్యుల పరిస్థితి ఏమిటోనని ఆందోళన వ్యక్తం చేశారు.

బడుగులపైకి బుల్డోజర్..

- విశాఖలో జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ అరాచకం
- చిరు వ్యాపారులకు చెందిన 500 దుకాణాలు కూల్చివేత
- రోడ్డుపై బైఠాయించిన బాధితులు


దుకాణాల తొలగింపుని ఆపాలంటూ రోడ్డుపై బైఠాయించిన చిరు వ్యాపారులు

సాక్షి, విశాఖపట్నం: రోడ్డు పక్కన చిరు వ్యాపారాలు చేసుకునే బడుగులపై జనసేన కార్పొరేటర్ తన ప్రతాపాన్ని చూపించారు. అధికారమే అండగా వారి దుకాణాలపైకి బుల్డోజర్‌ను పంపి కూల్చివేయించారు. వారి పొట్టకొట్టి రోడ్డున పడేలా చేశారు. గ్రేటర్ విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) 22వ వార్డు పరిధిలో పితాపురం కాలనీలో ఉన్న సుమారు 500 చిన్నచిన్న దుకాణాల్ని శనివారం ఉదయం అధికారులు కూల్చిపారేశారు. పీతల మూర్తి యాదవ్ 2021లో కార్పొరేటర్‌గా గెలిచినప్పటి నుంచి ఈ వ్యాపారులతో నిరంతరం గొడవలకు దిగుతుండేవారు. ఎప్పటికైనా మీ షాపులన్నీ తొలగించేస్తానంటూ సవాల్ విసిరారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చిరు దుకాణాలపై ఫిర్యాదు చేసినా అక్కడ పరిస్థితుల్ని అర్థం చేసుకున్న గత ప్రభుత్వం వారికి అండగా నిలిచింది. దుకాణాలు తొలగించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది.

చిరు వ్యాపారులకు వ్యతిరేకంగా పిటిషన్

ఈ క్రమంలో ప్రభుత్వం మారిన వెంటనే జనసేన పార్టీ కార్పొరేటర్ మూర్తి యాదవ్ రెచ్చిపోయారు. చిరు వ్యాపారుల దుకాణాలను తొలగించాల్సిందేనంటూ హైకోర్టులో పిటిషన్ కూడా వేశారు. కోర్టు ఆదేశాలు వచ్చాక.. చిరు వ్యాపారులకు ఎలాంటి నోటీసులివ్వకుండానే దుకాణాలు తొలగింపు ప్రక్రియని మొదలు పెట్టేశారు. ఏయూ గేట్‌ని ఆనుకొని ఉన్న షాపుల్ని బుల్డోజర్ల సాయంతో కూల్చివేశారు. మరికొన్ని చోట్ల చిరు వ్యాపారుల షెడ్లను పెకిలించిపారేశారు. దుకాణాలను కోల్పోయినవారు టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును ఆశ్రయించగా జీవీఎంసీ అధికారులను తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశించారు. దీంతో దుకాణాల తొలగింపు ప్రక్రియని నిలిపివేశారు. ఎమ్మెల్యే పనులు నిలిపేశారని తెలుసుకున్న మూర్తి యాదవ్.. జీవీఎంసీ అధికారులకు ఫోన్ చేసి హైకోర్టు ఆదేశాలు పాటించకపోతే కోర్టు ధిక్కరణ కేసులు పెడతానని బెదిరించినట్లు తెలుస్తోంది. బాధిత వ్యాపారులు పితాపురం కాలనీ రోడ్డుపై బైఠాయించి తమకు న్యాయం చేయాలని నినదించారు.

పన్ను చెల్లించినప్పుడు అక్రమమని గుర్తులేదా?



నేను ఇక్కడ 30 ఏళ్లుగా సెలూన్ నడుపుతున్నా. ఎవరికీ ఏ ఇబ్బంది లేకుండా దీన్ని నిర్వహిస్తున్నా. ట్రాఫిక్‌కు కూడా ఏ ఇబ్బందీ లేదు. జీవీఎంసీకి పదేళ్ల నుంచి పన్నులు కూడా కడుతున్నా. ఇప్పుడు జనసేన కార్పొరేటర్ చెప్పారని దుకాణాలు తొలగిస్తున్నారు. నా దుకాణం ఏర్పాటు అక్రమమైతే పన్నులు ఎందుకు కట్టించుకున్నారో అధికారులు, కార్పొరేటర్ చెప్పాలి.

– కె.వెంకటరమణ, సెలూన్ షాప్ నిర్వాహకుడు

నోటీసులివ్వకుండా కూల్చారు



నెల్లూరు నుంచి వలస వచ్చి.. రెండేళ్లుగా ఇక్కడ టిఫిన్ దుకాణాన్ని నడుపుతున్నాం. ఇంతకు ముందు.. కొంచెం లోపలకు పెట్టుకొండి.. లేదంటే పగలగొట్టేస్తామని జనసేన కార్పొరేటర్ మూర్తి చెప్పారు. మూడు రోజుల నుంచి చిన్న చిన్న మరమ్మతులు చేస్తున్నాం. ఇప్పుడు నోటీసులు కూడా ఇవ్వకుండా కూల్చివేశారు. ఈ దుకాణంలో మా కుటుంబంతో పాటు మరో ఏడుగురు పనిచేస్తూ పొట్ట నింపుకుంటున్నాం. ఇప్పుడు అడుక్కోవాల్సిన పరిస్థితికి తీసుకొస్తారా?

– కస్తూరయ్య, టిఫిన్ దుకాణం నిర్వాహకుడు

సాగర్‌లోకి కొనసాగుతున్న వరద


నాగార్జున సాగర్ జలాశయం

సాగర్ ప్రాజెక్టులో 244.15 టీఎంసీలకు చేరిన నిల్వ.. శ్రీశైలం ప్రాజెక్టులోకి కొనసాగుతున్న వరద ఉధృతి

సాక్షి, అమరావతి/విజయపురిసౌత్/శ్రీశైలం ప్రాజెక్ట్/కోసిగి/పోలవరం రూరల్: కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతుండటంతో సాగర్ ప్రాజెక్టు వేగంగా నిండుతోంది. శనివారం సాయంత్రం 6 గంటలకు సాగర్‌లోకి 3,03,741 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటినిల్వ 565 అడుగుల్లో 244.15 టీఎంసీలకు చేరుకుంది. సాగర్ గరిష్ట నీటి మట్టం 590 అడుగులు.. పూర్తి నీటి నిల్వ 312.05 టీఎంసీలు. ఎగువ నుంచి వరద ఉధృతి కొనసాగుతుండటంతో సోమవారం సాయంత్రానికి ప్రాజెక్టులో నీటి మట్టం గరిష్టస్థాయికి చేరుతుందని అధికారవర్గాలు చెబుతున్నాయి. శ్రీశైలం ప్రాజెక్టులోకి ఎగువ నుంచి వరద ఉధృతి కొనసాగుతోంది. శనివారం సాయంత్రం సమయానికి 10 రేడియల్ క్రస్ట్‌గేట్లను 20 అడుగుల మేర తెరిచి ఉంచారు. ప్రాజెక్టులోకి 4.33 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. 5.52 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టులో 882.5 అడుగుల్లో 202.04 టీఎంసీలు నిల్వ చేస్తున్నారు. కృష్ణా నదిపై ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌లలోకి వరద స్థిరంగా కొనసాగుతోంది. ఆ రెండు డ్యామ్‌ల నుంచి దిగువకు 2.56 లక్షల క్యూసెక్కులను వదులుతున్నారు. ఇక తుంగభద్ర డ్యామ్‌లోకి 1.38 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా 1.49లక్షల క్యూసెక్కులను వదులుతున్నారు.

ఆర్డీఎస్ వద్ద తుంగభద్ర ఉధృతి

కర్నూలు జిల్లా కోసిగి మండలంలోని అగసనూరు గ్రామ సమీపంలో రాజోలి బండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) ఆనకట్ట వద్ద తుంగభద్ర నది ఉధృతి పెరిగింది. ఆనకట్ట పక్కనే ఉన్న కుడి గట్టు కాల్వకు ఏర్పాటు చేస్తున్న స్లూయిస్ వద్ద కరకట్టకు లీకేజీలు ఏర్పడ్డాయి. దీంతో వరద నీరుతో గ్రామంలోని పొలాలు మునిగిపోయే ప్రమాదం చోటు చేసుకుంది. గండిని పూడ్చి వేయించారు. గోదావరి వరద క్రమంగా తగ్గుతోంది. పోలవరం ప్రాజెక్టు వద్ద నీటిమట్టం 31 మీటర్లుగా ఉంది.

కేదార్‌నాథ్‌లో తెలుగువాళ్లు క్షేమం

సాక్షి, హైదరాబాద్: ప్రకృతి విలయతాండవంతో అతలాకుతలమైన ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్‌లో చిక్కుకున్న తెలుగువాళ్లు క్షేమంగా ఉన్నారు. కేదార్‌నాథ్ దేవాలయ సందర్శన కోసం ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రికి చెందిన అడప సత్యనారాయణ, మరో నలుగురు, హైదరాబాద్‌కు చెందిన మొలల వెంకటేశ్ కుటుంబంలోని ఐదుగురు వేర్వేరుగా జూలై 31న గుప్తకాశి నుంచి హెలికాప్టర్ ద్వారా కేదార్‌నాథ్‌కు వెళ్లారు. అక్కడికి వెళ్లిన తరువాత వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. కొండచరియలు విరిగిపడటం, వరదలు రావడంతో అక్కడే కాటేజీల్లో తలదాచుకున్నారు. వెంకటేశ్ భార్య, మరొక మహిళను రెండు రోజుల క్రితం రెస్క్యూ టీం గుప్తకాశికి తీసుకురాగా, 8 మంది అక్కడే ఉన్నారు. దీంతో తెలిసిన వారి ద్వారా కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ఫోన్ చేసి విషయం తెలియజేశారు. దీంతో సంజయ్ రుద్రప్రయాగ్ జిల్లా కలెక్టర్ సౌరభ్ గహర్వార్‌కు విషయం తెలియజేయడంతో ఆయన వెంటనే స్పందించారు. శనివారం ఉదయం వాతావరణం అనుకూలంగా ఉండటంతో కలెక్టర్ ఆదేశాల మేరకు రెస్క్యూ టీం రాజమండ్రికి చెందిన అడప సత్యనారాయణ, సత్య వరప్రసాద్, అనంతలక్ష్మి శారద, రతన్ శేఖరి, ఫణి కుమారిలను హెలికాప్టర్ ద్వారా గుప్తకాశికి తీసుకొచ్చారు.

ఇదేం 'పసుపు' పిచ్చి..!



ఈ చిత్రంలో కనిపిస్తున్న భవనం టీడీపీ కార్యాలయం అనుకుంటున్నారా..! అయితే మీరు తప్పులో కాలేసినట్లే.. అది శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం పేరూరు గ్రామ పంచాయతీ కార్యాలయ భవనం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి టీడీపీ శ్రేణులు ఏది కనిపిస్తే దానికి పసుపు రంగులేసేస్తున్నారు. ఇదంతా చూస్తున్న ప్రజలు 'ఇదేం పసుపు పిచ్చి' అంటూ నవ్వుకుంటున్నారు.

– రామగిరి (శ్రీసత్యసాయి జిల్లా)

యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా



అధికారంలోకి రాగానే టీడీపీ నాయకులు యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారు. అనుమతులతో మనకేంటి పనిలే.. అనుకుంటూ అక్రమంగా మట్టిని తరలించుకుపోతున్నారు. తాజాగా శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, బొమ్మవరం అగ్రహారం పంచాయతీలోని చెరువు నుంచి అదే గ్రామానికి చెందిన ఓ టీడీపీ నేత మూడు రోజులుగా దాదాపు 20 ట్రాక్టర్ల మట్టిని అక్రమంగా తరలించుకుపోయారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని గ్రామస్తులు వాపోతున్నారు.

– సోమశిల

ఇసుక అక్రమ రవాణా అడ్డుకోలేదని..

- వీఆర్‌వోకు షోకాజ్ నోటీసులు
- అక్రమ ఇసుక తవ్వకాలను పరిశీలించిన రేపల్లె సబ్‌కలెక్టర్

సాక్షి ఎఫెక్ట్

కొల్లూరు: బాపట్ల జిల్లా కొల్లూరు మండలంలోని పెసర్లంక వద్ద కృష్ణా నదిలో విచ్చలవిడిగా ఇసుక అక్రమ తవ్వకాలు చేపడుతున్న ప్రాంతాన్ని శని వారం రేపల్లె సబ్‌కలెక్టర్ హేలా షారోన్ పరిశీలించారు. అక్రమ రవాణాను ఎందుకు అడ్డుకోలేకపోయారంటూ ప్రభుత్వ యంత్రాంగాన్ని నిలదీశారు. స్థానిక వీఆర్‌వోకు తక్షణం షోకాజ్ నోటీస్ జారీ చేయాలని ఆదేశించారు. 'సాక్షి' మెయిన్ ఎడిషన్‌లో 'తవ్వుకో తమ్ముడూ!' బాపట్ల జిల్లా సంచికలో 'ఇసుకాసురులు పేట్రేగారు' శీర్షికలతో శనివారం వచ్చిన కథనాలతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. రేపల్లె సబ్ కలెక్టర్ ఇసుక తవ్వకాల పరిశీలనకు వచ్చారు. తొలుత ఆమె కొల్లూరు ఎస్‌ఐ రవీంద్ర రెడ్డి, వేమూరు సెబ్ ఎస్‌ఐ గంగాధర్‌లను ప్రశ్నించారు. ఇసుక అక్రమ తవ్వకాలు ఎందుకు అడ్డుకోలేదంటూ వీఆర్‌వో నరేంద్రను నిలదీశారు. వీఆర్‌వోకు తెలిసే ఈ వ్యవహారం మొత్తం జరుగుతున్నట్లుందని అన్నారు. వీఆర్‌వోకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లును ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టే విషయంలో మైనింగ్ శాఖ చర్యలు చేపట్టకపోవడంపై ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నదిలోకి ట్రాక్టర్లు, ఇతర వాహనాలు ప్రవేశించే మార్గాలను మూసివేయాలని ఆదేశించారు.

క్లోజ్ ఫ్రెండ్స్



మాది ఎయిర్‌ఫోర్స్ బ్యాచ్

'ఎయిర్‌ఫోర్స్ బ్యాచ్' నుంచి ఎయిర్ బస్ దాకా... ఆఫర్‌లో ఫుడ్ ఆర్డర్ చేసుకున్న రోజుల నుంచి, ఫైవ్‌స్టార్ ఫుడ్ ఆర్డర్ చేసుకునే రోజుల దాకా... రెండు ఐదు రూపాయల కాయిన్స్ కోసం వెతికిన రోజుల నుంచి కోట్లు లెక్క పెట్టుకునే రోజుల దాకా... ఇద్దరూ విజయప్రయాణాలు చేశారు. ఇండస్ట్రీలో నిలిచారు. విజయ్ దేవరకొండ, తరుణ్ భాస్కర్... ఇద్దరూ మంచి స్నేహితులనే విషయం తెలిసిందే. 'ఫ్రెండ్‌షిప్ డే' సందర్భంగా వీరి స్నేహంలోని ముచ్చట్లను 'సాక్షి'తో తరుణ్ భాస్కర్ ప్రత్యేకంగా పంచుకున్నారు.

● విజయ్‌తో మీ స్నేహం మొదలైన రోజులను షేర్ చేసుకుంటారా?

తరుణ్ భాస్కర్: మహేశ్వరి చాంబర్స్‌లో నాకో ఆఫీస్ ఉండేది. వెడ్డింగ్ ఫిల్మ్స్, కార్పొరేట్ ఫిల్మ్స్, షార్ట్ ఫిల్మ్స్ చేసేవాళ్లం. 2011 అనుకుంటా. ఆ టైమ్‌లో థియేటర్ ఆర్టిస్ట్స్‌ని కలిసేవాడిని. అప్పుడే విజయ్‌ని కలిశా. పరిచయం బాగా పెరిగింది. 'డబ్బులు ఉన్నా లేకపోయినా ఫర్వాలేదు... షార్ట్ ఫిల్మ్స్ చేసేద్దాంరా' అని విజయ్ కాన్ఫిడెంట్‌గా అనేవాడు. ఒక షార్ట్ ఫిల్మ్ కూడా అనుకున్నాం కానీ కుదరలేదు. ఫైనల్లీ 'పెళ్ళి చూపులు' సినిమా చేశాం. అప్పట్లో మాది ఎయిర్‌ఫోర్స్ బ్యాచ్ (ఖాళీగా తిరిగేవాళ్లను అలా అంటుంటారు). ఇక 'పెళ్ళి చూపులు'ని ఒక ప్యాషన్‌తో చేశాం. నా వల్ల విజయ్‌కి హిట్ వచ్చింది.. విజయ్ వల్ల నాకు అనే ఫీలింగ్ లేదు. సాధించాం అనే పొగరు లేదు. మనస్ఫూర్తిగా ఎంజాయ్ చేసుకుంటూ చేశాం. మా ప్యాషన్‌కి దక్కిన సక్సెస్ అనుకుంటాను.

● మీ జర్నీ ఇంతదాకా వచ్చిన విషయాన్ని అప్పుడప్పుడూ మాట్లాడుకుంటారా?

కోవిడ్ టైమ్‌లో విజయ్ ఫోన్ చేసి, 'అరేయ్... మనం ఎక్కడ స్టార్ట్ అయ్యాం... ఇంత దూరం వచ్చాం.. అస్సలు అనుకోలేదు కదరా... లైఫ్‌లో ఒక్కో పాయింట్ ఎలా టర్న్ అయిందో కదా. దీన్నే డెస్టినీ అంటారు' అని మాట్లాడుకున్నాం.

● అప్పట్లో మీ ఇద్దరూ డబ్బులు లేక ఇబ్బంది పడేవారా? డబ్బులు ఇచ్చి పుచ్చుకునేవారా?

డబ్బులంటే... ఒకరికొకరు ఇచ్చుకునే రేంజ్ ఎవరికీ ఉండేది కాదు. అయితే కలిసి బిజినెస్ చేద్దామని అనుకునేవాళ్లం. నాకు బాగా గుర్తున్న ఇన్సిడెంట్ ఏంటంటే... ఒకసారి ఏదో కొనడానికి విజయ్‌ని పది రూపాయలు అడిగాను. అప్పుడు 'పెళ్ళి చూపులు' సినిమా ట్రైల్ జరుగుతోంది. కారులో రెండు ఐదు రూపాయల బిళ్లల కోసం ఇద్దరం బాగా వెతికాం... దొరకలేదు (నవ్వుతూ). ఆ పరిస్థితి ఎప్పటికీ గుర్తుంటుంది.

మా కల ఒకటే

- విజయ్ దేవరకొండ

మేం ఇద్దరం చిన్నప్పట్నుంచి కలిసి పెరిగిన వాళ్లం కాదు... ఒకే స్కూల్‌లో చదువుకున్న వాళ్లమూ కాదు. నేను పుట్టపర్తిలో, తరుణ్ హైదరాబాద్‌లో చదువుకున్నాడు. ఎక్కడెక్కడో పెరిగినప్పటికీ మా ఇద్దరి కల (సినిమా) ఒకటే. నా 'ఎవడే సుబ్రమణ్యం' సినిమా చూసి, తరుణ్ నాతో 'పెళ్ళి చూపులు' సినిమా చేద్దాం అనుకున్నాడు. అప్పుడప్పుడే మా పరిచయం బలపడుతోంది. జేబులో రూపాయి లేకపోయినా చాలా కాన్ఫిడెంట్‌గా ఉండేవాళ్లం. ఎంతో నమ్మకంగా 'పెళ్ళి చూపులు' చేసి, సక్సెస్ అయ్యాం. ఆ సినిమా తర్వాత తరుణ్‌కి చాలా అవకాశాలు వచ్చినా, మళ్లీ కొత్తవాళ్ల తోనే చేద్దాం అనుకున్నాడు. తన మీద, తన స్క్రిప్ట్ మీద తనకు చాలా నమ్మకం. తరుణ్‌లో ఆ విషయం నాకు చాలా నచ్చుతుంది. ఏదైనా స్క్రిప్ట్‌తో నా దగ్గరకు రారా అంటుంటాను... వస్తా అంటాడు. ఎక్కడో స్టార్ట్ అయి, చాలా దూరం వచ్చిన మా ఈ జర్నీలో ఎన్నో కష్టాలు చూశాం... ధైర్యంగా ఎదుర్కొన్నాం. గొప్పగా ఏదో చేస్తాం అనే నమ్మకంతో ఉండేవాళ్లం. మాతో పాటు మా ఫ్రెండ్‌షిప్ కూడా పెరుగుతూ వచ్చింది. లైఫ్‌లో ఒక మంచి ఫ్రెండ్ ఉండటం అనేది చాలా హ్యాపీగా ఉంటుంది.

● మీ ఇద్దరి కుటుంబాల మధ్య అనుబంధం?

మేమంతా ఒక ఫ్యామిలీ అని మా ఇద్దరి ఇంట్లోనూ అనుకుంటారు. విజయ్ నాన్న ఎలాంటి ఫిల్టర్ లేకుండా నాతో మాట్లాడతారు... టైమ్ వేస్ట్ చేస్తున్నావని తిడుతుంటారు. ఆ ప్రేమ నాకు నచ్చుతుంది. అలాగే మా అమ్మ చేసే బిర్యానీ విజయ్‌కి చాలా ఇష్టం. మా ఇంటికి వచ్చినప్పుడు డైట్ అంతా గడప దగ్గరే పెట్టి లోపలికి వస్తాడు.

మీ బాయ్స్‌కి 'అడ్డా' ఉంటుంది కదా... అప్పట్లో మీ అడ్డా ఎక్కడ?

నెక్లెస్ రోడ్, మహేశ్వరి చాంబర్స్ దగ్గర చాయ్ బండి, ఆ పక్కన చైనీస్ ఫుడ్ సెంటర్. అక్కడే ఏదొకటి తింటూ సినిమాల గురించి మాట్లాడుకునేవాళ్లం. ఆ మధ్య అటువైపు వెళ్లినప్పుడు ఆ చాయ్ కేఫ్ దగ్గర థమ్సప్ లోగోలో విజయ్ థమ్సప్ తాగే ఫొటో కనిపించింది. అది ఫొటో తీసి, విజయ్‌కి పంపిస్తే ఎక్కడరా ఇది అని అడిగాడు. మనం ఒకప్పుడు కూర్చున్న కేఫ్ దగ్గర అన్నాను. మాకు అదో ఎమోషనల్ మూమెంట్. ఇక అప్పట్లో ఎక్కడ ఆఫర్‌లో ఫుడ్ ఉంటే అక్కడ తినేవాళ్లం (నవ్వుతూ). ఇప్పుడు ఆ ప్లేసెస్‌కి అంత ఫ్రీగా వెళ్లలేం. అందుకే ఇప్పుడు మాస్క్ లేకుండా సూపర్ మార్కెట్‌కి వెళ్లి ఓ పాల ప్యాకెట్ కొనుక్కురా దమ్ముంటే అని విజయ్‌తో అంటుంటాను. అది మాత్రం నా వల్ల కాదురా అంటాడు.

● మీరు, విజయ్ గొడవలు పడిన సందర్భాలు...

'పెళ్ళి చూపులు' అప్పుడు గొడవపడేవాళ్లం. నాకు ఎవరైనా సలహాలిస్తే నచ్చేది కాదు. ఇలా చేస్తే బాగుంటుందని క్రియేటివ్‌గా కొన్ని చెప్పేవాడు విజయ్. అక్కడ గొడవలు పడేవాళ్లం. ఫైనల్‌గా విజయ్ నాన్న సాల్వ్ చేశారు. రేయ్.. వాడు చెప్పిన మాట విను అని విజయ్‌తో వాళ్ల నాన్న అంటే, ఓకే డాడీ అన్నాడు. నీ డైరెక్షన్ నీది.. నా యాక్టింగ్ నాది అని ఫిక్స్ అయి, గొడవలు మానేశాం. ఇప్పుడు కూడా ఎలాంటి కథలతో సినిమాలు చేయాలి? కమర్షియల్‌గా ఎలా చేయాలి? అని చర్చించుకుంటాం. విజయ్ బాలీవుడ్ వరకూ వెళ్లాడు కాబట్టి తన ఫీడ్‌బ్యాక్ బాగుంటుంది. తనకు చాలా అవగాహన ఉంది.

● ఇద్దరూ కన్నీళ్లు పెట్టుకున్న సందర్భం...

బాధలో పెట్టుకున్నవి చాలా ఉన్నాయి. కానీ

మీ ఫస్ట్ సినిమాలో విజయ్‌ని 'పెళ్ళి చూపులు'కి పంపించారు. మరి రియల్ లైఫ్‌లో విజయ్‌ని పెళ్లి కొడుకుగా చూడాలని లేదా?

కచ్చితంగా ఉంది. మా మధ్య ఆ విషయం గురించి చర్చకు వస్తుంటుంది. కానీ అవి వ్యక్తిగతం కాబట్టి బయటకు చెప్పలేను. అయితే నాకు హండ్రెడ్ పర్సెంట్ విజయ్‌ని ఫ్యామిలీ మేన్‌గా చూడాలని ఉంది. ఎందుకంటే తనలో మంచి ఫ్యామిలీ మేన్ ఉన్నాడు. మంచి భర్త, తండ్రి కాగలుగుతాడు. విజయ్ ఆ లైఫ్‌ని కూడా ఎంజాయ్ చేయాలని కోరుకుంటున్నా. నా ఫ్రెండ్ పక్కా 'జెంటిల్‌మేన్'.

'పెళ్ళి చూపులు' సక్సెస్‌కి ఎమోషనల్ అయ్యాం. అప్పుడు విజయ్‌ది, నాది బ్యాడ్ సిట్యువేషన్... నిరాశలో ఉన్నాం. మా ఇంట్లో పరిస్థితులు బాలేదు. మా నాన్న సంవత్సరీకం కూడా. ఆ టైమ్‌లో వచ్చినన్ని అప్స్ అండ్ డౌన్స్ మాకెప్పుడూ రాలేదు. ఆ పరిస్థితుల్లో చేసిన సినిమా హిట్ కావడంతో ఎమోషన్‌తో కన్నీళ్లు వచ్చాయి.

● విజయ్‌తో మళ్లీ సినిమా ఎప్పుడు?

విజయ్ నా ట్రంప్ కార్డ్. గేమ్‌లో ఎప్పుడైనా కొంచెం అటూ ఇటూ అయితే ఆ ట్రంప్ కార్డ్ వాడుకుంటా. ఆ టైమ్ దగ్గరికొచ్చింది. నాక్కూడా ఎక్కువమంది ఆడియన్స్‌కి రీచ్ కావాలని ఉంది. మా కాంబినేషన్‌లో సినిమా ఉంటుంది.

● విజయ్ లాంటి ఫ్రెండ్ ఉండటం గురించి?

విజయ్ ప్రతి సక్సెస్‌లో నా విజయం ఒకటి కనబడుతుంటుంది. తను నా హోమ్ బాయ్... నా డార్లింగ్. విజయ్ అవుట్‌సైడర్‌గా ఇండస్ట్రీకి వచ్చి, ఆ స్టేటస్‌కి రావడమనేది చాలామందికి ఆదర్శంగా ఉంటుంది. కొన్నేళ్ల తర్వాత కూడా ఆ అచీవ్‌మెంట్ గురించి మాట్లాడుకుంటారు. విజయ్ జర్నీలో నేనో చిన్న పార్ట్ అవడం గర్వంగా ఉంటుంది.

- డి.జి. భవాని

నివాళి

నాట్యం కోసమే పుట్టాను



సుప్రసిద్ధ నాట్యకళాకారిణి, భరతనాట్యం, కూచిపూడి, ఒడిస్సీ నృత్యాలలో నిష్ణాతురాలు, చిత్తూరు జిల్లా మదనపల్లిలో జన్మించి తమిళనాడులోని చిదంబరంలో పెరిగిన యామినీ కృష్ణమూర్తి శనివారం ఢిల్లీలో కన్నుమూశారు. ఆమె మృతికి నివాళిగా ఆమె గతంలో సాక్షికి ఇచ్చిన ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలు...

యామిని అసలు పేరు పూర్ణతిలక. నాట్యంలో అనేక అవార్డులు గెలుచుకున్నారు. 2017లో 'నటరాజ డాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ' వారి జీవిత సాఫల్య పురస్కారం అందుకోడానికి విజయవాడ వచ్చిన సందర్భంగా సాక్షి ఫ్యామిలీ.. యామినితో ముచ్చటించింది.

పదేళ్లకే నాట్యంలో నైపుణ్యం

యామిని తండ్రి కృష్ణమూర్తి కూతుర్ని కూడా తనలా పండితురాలిని చేయాలనుకున్నారు. అనుకోవడమే కాదు చేశారు కూడా! అందుకోసం రెండు ఇళ్లు, కొంతపొలం కూడా అమ్మేశారు. ''మా నాన్నగారికి నన్ను విద్వాంసురాలిని చేయాలని బలమైన కోరిక ఉండేది. నేనా అస్సలు కుదురు లేని అమ్మాయిని. ఎప్పుడు చూసినా చెట్లు ఎక్కడం, గోడలు దూకడం... ఒక్క క్షణం కూడా కదలకుండా కూర్చునేదాన్ని కాదు. నాలో నాన్నగారికి ఏమి కనిపించిందో కాని, నా ఏడవ ఏటే భరతనాట్యం నేర్పించడం ప్రారంభించారు. అయితే అందుకు ఒక సంఘటన కారణం అయింది... వేదాంతం రాఘవయ్య గారి 'రైతు బిడ్డ' సినిమా చూశాక నాకు నాట్యం నేర్పించాలనే కోరిక కలిగిందట నాన్నగారికి. అప్పటికే వెంపటి పెద సత్యం, చినసత్యం, పసుమర్తి కృష్ణమూర్తి వీరంతా సినిమాలకి వెళ్లిపోయారు. వేదాంతం లక్ష్మీనారాయణ గారి దగ్గర నా కూచిపూడి నాట్యం ఆరంభం కావడమేంటి... పది సంవత్సరాల వయసు వచ్చేసరికి నాట్యంలో నైపుణ్యం సాధించాను'' అని తన నాట్యప్రస్థానం గురించి చెప్పారు యామిని. తండ్రి ఆమెను మొదట చెన్నైలోని రుక్మిణీ అరండేళ్ కళాక్షేత్రకు తీసుకువెళ్లారు. యామిని నాట్యానికి ముగ్ధులయిన రుక్మిణీ అరండేళ్, ఆమెకు తన దగ్గరే నాట్యశిక్షణ ప్రాంభించారు.

భరతనాట్యంతోపాటే కూచిపూడి కూడా...

భరతనాట్యం నేర్చుకునే సందర్భంలోనే కూచిపూడి నాట్యంవైపు యామిని మనసు మళ్లింది. ఆ తర్వాత కూచిపూడి వైభవానికి ఆమె పాటుపడ్డారు. అది చాలా చిత్రంగా జరిగింది. తర్వాత ప్రముఖ ఒడిస్సీ ఆచార్యులు కేలూచరణ్ మహాపాత్ర దగ్గర ఆమె ఒడిస్సీ నృత్యం అభ్యసించారు. ''నేను మూడు గంటల పాటు చేసే నా నాట్యప్రదర్శనలో కూచిపూడి, భరతనాట్యం, ఒడిస్సీ... ఒక్కోటి గంటసేపు ప్రదర్శించేదాన్ని.

ఇల్లు నటరాజ ఆలయానికి దగ్గర కావడం నా సుకృతం

మా ఇల్లు, చెన్నైలోని చిదంబర నటరాజ దేవాలయానికి చాలా దగ్గర కావడంతో, దేవాలయ కుడ్యాల మీద కొలువుతీరిన శిల్పాల భంగిమలు నా మీద చెరగని ముద్ర వేశాయి. ''రోజూ గుడికి వెళ్లేదాన్ని. ఆ శిల్పాలు చూసి ఇంటికి వచ్చాక, అదే భంగిమలో నిలబడేదాన్ని. నాకు నాట్యభంగిమలు, ముద్రలు అందంగా అమరడానికి ఇది ఒక కారణం అయి ఉంటుంది'' అని వివరిస్తూనే ''ఇక్కడ మరొక విషయం చెప్పాలి. నాకు పండుగలన్నీ నాట్యవేదిక మీదే జరిగేవి. ప్రతి పండుగ సందర్భంలో నిర్వహించే వేడుకలలో నా నాట్యం తప్పనిసరిగా ఉండటమే ఇందుకు కారణం'' అని చెప్పారు యామిని.

ఇందిరాగాంధీకి చాలా ఇష్టం

నాటి ప్రధాని ఇందిరాగాంధీకి నేనంటే చాలా ఇష్టం. ఢిల్లీలో ఏ ప్రభుత్వ కార్యక్రమం ఉన్నా, ఏ పండుగ సంబరాలు ఉన్నా వెంటనే ''యామిని ఉందా'' అని అడిగేవారు. నాటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ సమక్షంలో 'క్షీరసాగరమథనం' నృత్యరూపకం ప్రదర్శించడం ఒక మధురానుభూతి. కలకత్తా ప్రజలను చూస్తే 'ఆర్ట్ ఈజ్ ఇన్ దెయిర్ హార్ట్స్' అనిపిస్తుంది. నేను లోన్లీ పర్సన్ కాను, ఎలోన్‌గా ఉంటాను, డిలైటెడ్‌గా ఉన్నాను.

విమర్శించాలనుకునేవారు... సూర్యుడు ఉదయం తూర్పున ఉదయిస్తాడు, సాయంత్రానికి పడమట అస్తమిస్తాడు అని – సూర్యుడిని కూడా విమర్శిస్తారు.

వాళ్లు నన్ను 'బిజిలీ' అన్నారు



నేను నాట్యం కోసమే పుట్టాను. నా జీవితాన్ని నాట్యానికే అంకితం చేశాను. వివాహానికి దూరంగా ఉన్నాను. మధ్యప్రదేశ్‌లో బందిపోట్ల దగ్గర సైతం రెండుసార్లు ప్రదర్శన ఇచ్చాను. నాన్నగారు భయపడొద్దని చెప్పారు. వారు నా నాట్యం మెచ్చుకోవడమే కాదు, నన్ను బిజిలీ అన్నారు.

ఫ్రెండ్‌షిప్ డే

అలనాటి స్నేహమా జ్ఞాపకాలు పదిలమా

జీవన మార్గాలను వెతుక్కుంటూ బహుదూరం ప్రయాణించాము. బరువు బాధ్యతల్లో పడి పాత స్నేహాలు మరిచాము. ఇన్నాళ్లు గడిచాక, ఏదో ఒక సందర్భంలో... ఆనాటి మిత్రురాలు గుర్తుకొస్తే వెచ్చబడ్డ కళ్లతో తలుచుకున్నాము. అలనాటి స్నేహమా... నీ చిరునామా ఎక్కడ అని అడిగితే సమాధానం దొరుకుతుందా? ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా గ్రూప్ ఫోటోలను చూసి తమ స్నేహితురాళ్లను తలుచుకుంటున్న సాక్షి పాఠకులు...

గోదావరిఖనిలో ఒకే వీధిలో



ఇందులో ఎడమవైపు నుంచి రెండోవ్యక్తిని నేను. మిగిలిన ముగ్గురు సాయికృష్ణ, సులోచన, అరుణ. 1987లో తొమ్మిదో తరగతి చదువుతున్నప్పుడు ఈ ఫోటో దిగాం. నా పేరుతో మా నాన్న 'శ్రీదేవి కాన్వెంట్' నడిపేవారు. అందులో మేము నలుగురం చదువుకున్నాం. ఆ తర్వాత హైస్కూల్లో కూడా కలిసే చదువుకున్నాం. టెన్త్ తర్వాత మిగిలిన వారికి పెళ్లిళ్లయ్యాయి. వారి తర్వాత నా పెళ్లి. మా జీవితాల్లో ఇన్ని రోజులు గడిచినా నేను, అరుణ కాంటాక్ట్‌లో ఉన్నాం. సాయికృష్ణ, సులోచన ఎక్కడ ఉన్నారో తెలియదు. వారి నంబర్ల కోసం ట్రై చేస్తున్నాను. నేనిప్పుడు మహిళా సంఘాల్లో పని చేస్తున్నాను. చిన్నప్పుడు మేమంతా గడిపిన రోజులు గుర్తొస్తే మనసులో అదోలాంటి ఉద్వేగం కలుగుతుంది. దిగులు కలుగుతుంది. మేము నలుగురం మళ్లీ కలిస్తే బాగుంటుందని నా ఆశ. సాక్షిలో ఫోటో వస్తే వాళ్లు చూస్తారని పంపుతున్నాను.

- శ్రీదేవి, గోదావరి ఖని

యాభై ఏళ్ల స్నేహం



యాభై ఏళ్ల క్రితం 1972–74 నర్సాపురం వైఎన్ఎం కాలేజీలో మేము ముగ్గురం ఇంటర్ చదివాం. అప్పుడు తీయించుకున్న ఫొటో. నాతో పాటు ఉన్నది సత్యవాణి, గ్లాడిస్. అప్పటి నుంచి ఇప్పటి వరకూ మా స్నేహం కొనసాగుతూనే ఉంది. ఇటీవలే 50 ఏళ్ల మా స్నేహాన్ని సెలబ్రేట్ చేసుకుంటూ కలిశాం. స్నేహితులు ఉన్నప్పుడే లైఫ్ బాగుంటుంది. బెస్ట్‌ఫ్రెండ్స్ మనకు బలం. వాళ్లే ఎనర్జీ.

- కృష్ణవేణి

అక్కచెల్లెళ్లు అనుకునేవారు



నేను బ్లూడ్రెస్‌లో ఉన్న అమ్మాయిని. నా పక్కన ఉన్నది అపర్ణ. పశ్చిమ గోదావరి జిల్లా సిద్ధాంతంలో మేమిద్దరం చిన్నప్పటి నుంచి ఫ్రెండ్స్. కాన్వెంట్‌లో అమ్మాయిలమంతా చాలా క్లోజ్ అయితే వారిలో మేమిద్దరం ఇంకా క్లోజ్. పెనుగొండలో డిగ్రీ వరకు కలిసి చదువుకున్నాం. మా ఇద్దరినీ చూసి అక్కచెల్లెళ్లు అనుకునేవారు. మా ఆలోచనలూ ఒకటే. పెళ్లయ్యాక కూడా మేము కాంటాక్ట్‌లో ఉన్నాం. గత ఐదేళ్లుగా తన కాంటాక్ట్ మిస్ అయ్యింది. తను భర్త ఉద్యోగం రీత్యా రేణిగుంటలో ఉండేది. ఆ తర్వాత ఇప్పుడు ఎక్కడ ఉందో తెలియదు. ఫ్రెండ్‌షిప్‌డే రోజు తన పలకరింపు వింటే చాలా సంతోషిస్తాను.

- రేణుక, సిద్ధాంతం, ప.గో.జిల్లా

ఆ ముగ్గురూ ఎక్కడున్నారో!



ఈ ఫోటోలో వరుసగా ఉన్నది పద్మ, కరీమా, ఉమ (నేను), సుకన్య. గుంటూరు కొత్తపేటలో జలగం రామారావు స్కూల్‌లో 1981–82 టెన్త్ క్లాస్ చదువుతుండగా దిగిన ఫొటో. మా నలుగురికీ ఒకరంటే ఒకరికి ప్రాణం. ఎవరికి ఏ ఇబ్బంది వచ్చినా మిగిలిన వాళ్లం సాయం చేసుకునేవారం. ఒకసారి మేము నలుగురం స్కూల్ ఎగ్గొట్టి కాకాణి గుడి చూసి సాయంత్రం క్లాసులకు వచ్చాం. అప్పుడు మా మాష్టారు ఆడపిల్లలమని కూడా చూడకుండా బెత్తం దెబ్బలు వేశారు. ఎంతో కలిసి ఉన్న మేము ఆ తర్వాత కాలంలో ఎవరి జీవితాల్లో వాళ్లం పడి మిస్ అయిపోయాం. ఈ ఫోటోలో ఉన్న మిగిలిన ముగ్గురూ ఇప్పుడు ఎక్కడ ఉన్నారో. వారి కోసం నేను ఎంతో ఎదురు చూస్తున్నాను.

- పసుపులేటి ఉమాదేవి,
భట్టిప్రోలు, బాపట్ల జిల్లా.

బ్యూటిప్



పాలల్లో కొద్దిగా ఓట్స్ వేసి ఉడికించాలి. తర్వాత ఇందులో కాస్త పెరుగు, తేనె వేసి బాగా కలపాలి. ఇది కాస్త చల్లబడిన తర్వాత బ్లాక్‌హెడ్స్ ఉన్న చోట అప్లై చేసుకుని 20 నిమిషాలు ఆరనివ్వాలి. తర్వాత మైల్డ్ క్లెన్సర్ ఉపయోగించి ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఈ మాస్క్ వేసుకోవడం వల్ల చర్మంపై ఉండే బ్లాక్‌హెడ్స్ సులభంగా తొలగిపోతాయి.

ఐరన్ ఉమన్

వయనాడ్ వారియర్



వయనాడ్ అనే మాట వినిపించగానే కళ్ల ముందు కన్నీటి సముద్రం కనిపిస్తుంది. అక్కడికి వెళ్లే సహాయకులకు ప్రకృతి విలయ విధ్వంస దృశ్యాలను చూసి తట్టుకునే గుండె ధైర్యంతో పాటు మెరుపు వేగంతో కదిలే శక్తి ఉండాలి. ఆ శక్తి ఆర్మీ మేజర్ సీతా అశోక్ షెల్కేలో నిండుగా కనిపిస్తుంది. అందుకే... సామాన్య ప్రజల నుంచి రిటైర్డ్ ఆర్మీ అధికారుల వరకు సీతను ప్రశంసిస్తున్నారు...

వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన చూరల్‌మాల గ్రామంలో కొత్తగా నిర్మించిన బెయిలీ బ్రిడ్జి రెయిలింగ్‌పై సగర్వంగా నిలుచున్న మేజర్ సీతా షెల్కే ఫొటో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

లింగ వివక్షతను సవాలు చేసి సగర్వంగా వెలుగుతున్న ఫొటో అది.

'ఇండియన్ ఆర్మీ ఇంజనీర్‌లతో కలిసి మేజర్ సీత షెల్కే పదహారు గంటలోనే 24 టన్నుల సామర్థ్యం ఉన్న బెయిలీ వంతెనను నిర్మించారు' అని అభినందిస్తూ 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు లెఫ్టినెంట్ కల్నల్ జేఎస్ సోఢి(రిటైర్డ్). తన కామెంట్‌తో పాటు కొన్ని ఫొటోలను కూడా షేర్ చేశాడు.

'ఒక్క చిత్రం చాలు వంద మాటలు ఎందుకు!' అన్నట్లు ఈ ఫొటోలలో ఒక్కటి చూసినా చాలు సీత బృందం కష్టం, శక్తిసామర్థ్యాలు తెలుసుకోవడానికి.

ఒకవైపు నేల కూలిన చెట్లు, మరోవైపు అడుగు వేయనివ్వని శిథిలాలు, వేగంగా ప్రవహిస్తున్న నది, పై నుంచి వర్షం, పరిమిత స్థలం... ఒక్క అనుకూలత కూడా లేని అత్యంత ప్రతికూల పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో కూడా నిట్టూర్చకుండా బ్రిడ్జీ నిర్మాణం వేగంగా పూర్తయ్యేలా చేసింది ఆర్మీ బృందానికి నాయకత్వం వహించిన సీత.

సహాయచర్యలు చేపట్టడంలో ఈ బ్రిడ్జి కీలకం కానుంది.

'ఇది సైన్యం విజయం మాత్రమే కాదు. సహాయకార్యక్రమాల కోసం ఎక్కడెక్కడి నుంచో వచ్చిన వారు, స్థానిక అధికారులు... ఎంతో మంది విజయం' వినమ్రంగా అంటుంది సీత.

కొండచరియలు విరిగిపడిన చోట పని చేయడం పెద్ద సవాలు. అక్కడ పురుషులతో సమానంగా పనిచేసింది సీత.

మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్‌కు చెందిన సీతకు 'సాహసం' చిన్నప్పటి నుంచి సన్నిహిత మిత్రురాలు. ఆ ధైర్యమే ఆమెను సైన్యంలోకి తీసుకువచ్చింది.



మద్రాస్ ఇంజినీరింగ్ గ్రూప్(ఎంఈజీ) అనేది వంతెనలు నిర్మించడం, మందుపాతరలను నిర్వీర్యం చేయడం...ఇలాంటి పనులెన్నో చేస్తుంటుంది. ఈ ఇంజినీరింగ్ యూనిట్ గురించి ఒక్కమాటలో చెప్పాలంటే ప్రమాదాల అంచున పనిచేయడం. ఏమాత్రం అప్రమత్తంగా లేకపోయినా ప్రాణాలు మూల్యంగా చెల్లించుకోవాల్సిందే. 'మద్రాస్ ఇంజినీరింగ్ గ్రూప్'లోని డెబ్బై మంది సభ్యులలో ఏకైక మహిళ సీత. అయినప్పటికీ ఆమె ఎప్పుడూ అసౌకర్యం అనుకోలేదు. అధైర్య పడిపోలేదు.

'మహిళ కదా... ఇది రిస్క్ జాబ్ కదా' అని ఎంతోమంది సీతతో అనేవాళ్లు.

'రిస్క్ లేనిది ఎక్కడా!' అనేది ఆమె నోటి నుంచి వేగంగా వచ్చే మాట.

'రిస్క్ తీసుకోక పోవడం కూడా పెద్ద రిస్కే' అనుకునే సీతా అశోక్ షెల్కే ఎన్నో రెస్క్యూ ఆపరేషన్‌లలో ధైర్యంగా పాల్గొంది. నిద్ర, తిండి, నీళ్లు.... ఇలాంటివేమీ పట్టించుకోకుండా పని చేసింది. 'మగవాళ్లు ఎంత కష్టమైనా పనైనా చేస్తారు. మహిళలకు కష్టం' అనే మాట ఆమె ముందు నిలిచేది కాదు.

వాయనాడ్‌లో సహాయ, నిర్మాణ కార్యక్రమాలలో తన బృందంతో కలిసి నాన్‌–స్టాప్‌గా పనిచేస్తున్న సీత మోములో అలసట కనిపించదు....రాకెట్ వేగంతో పనిచేయాలనే తపన తప్ప. ఆ తపనే ఆమెను అందరూ ప్రశంసించేలా చేస్తోంది.



జొకోవిచ్ ఒలింపిక్ స్వర్ణ స్వప్నం నెరవేరేనా? నేడు అల్‌కరాజ్‌తో ఫైనల్ పోరు

తన సుదీర్ఘ కెరీర్‌లో లోటుగా ఉన్న ఒలింపిక్ స్వర్ణ పతకాన్ని అందుకునేందుకు సెర్బియా దిగ్గజం విజయం దూరంలో నిలిచాడు. వరుసగా ఐదో ఒలింపిక్స్ క్రీడల్లో పోటీపడుతున్న 37 ఏళ్ల జొకోవిచ్ తొలిసారి పసిడి పతక పోరుకు అర్హత సాధించాడు. పారిస్ ఒలింపిక్స్ పురుషుల టెన్నిస్ సింగిల్స్ సెమీఫైనల్లో జొకోవిచ్ 6-4, 6-2తో లొరెంజో ముసెట్టి (ఇటలీ)పై గెలిచాడు. తద్వారా ఒలింపిక్స్ టెన్నిస్ చరిత్రలో ఫైనల్‌కు చేరిన పెద్ద వయస్కుడిగా గుర్తింపు పొందాడు. నేడు జరిగే ఫైనల్లో ఈ ఏడాది ఫ్రెంచ్, వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీల చాంపియన్ అల్‌కరాజ్ (స్పెయిన్)తో జొకోవిచ్ తలపడతాడు. ముఖాముఖి రికార్డులో ఇద్దరూ 3-3తో సమంగా ఉన్నారు. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో జొకోవిచ్ కాంస్య పతకం గెలిచాడు. 2012 లండన్, 2020 టోక్యో ఒలింపిక్స్‌లో నాలుగో స్థానంలో నిలిచిన జొకోవిచ్ 2016 రియో ఒలింపిక్స్‌లో తొలి రౌండ్‌లోనే ఓడిపోయాడు.





ఈసారీ గెలిచేద్దాం

- బ్రిటన్‌తో నేడు భారత హాకీ జట్టు క్వార్టర్ ఫైనల్ మ్యాచ్
- 'టోక్యో'లోనూ బ్రిటన్‌ను ఓడించే సెమీస్‌కు చేరిన టీమిండియా
- మధ్యాహ్నం గం. 1:30 నుంచి స్పోర్ట్స్–18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

పారిస్: టోక్యో ఒలింపిక్స్‌లో తాము సాధించిన కాంస్య పతకాన్ని నిలబెట్టుకోవాలంటే భారత జట్టు ముందుగా క్వార్టర్ ఫైనల్ అడ్డంకిని దాటాలి. మూడేళ్ల క్రితం టోక్యో ఒలింపిక్స్‌లో క్వార్టర్ ఫైనల్లో ఎదురైన ప్రత్యర్థి బ్రిటన్ జట్టుతోనే పారిస్ ఒలింపిక్స్‌లోనూ భారత్ క్వార్టర్ ఫైనల్లో తలపడనుంది. నేడు జరిగే ఈ నాకౌట్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ బృందం విజయం సాధిస్తేనే సెమీఫైనల్‌కు చేరుకొని పతకం రేసులో నిలుస్తుంది. ఓడిపోతే మాత్రం టీమిండియా ఇంటిదారి పడుతుంది. 'టోక్యో' క్వార్టర్ ఫైనల్లో భారత్ 3-1 గోల్స్ తేడాతో బ్రిటన్ జట్టును ఓడించింది. 'పారిస్' గేమ్స్‌లో భారత హాకీ జట్టు నిలకడైన ప్రదర్శనతో ఆకట్టుకుంది. గ్రూప్ 'బి'లో ఉన్న భారత జట్టు తొలి లీగ్ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై 3-2తో గెలిచింది. రెండో లీగ్ మ్యాచ్‌లో మాజీ ఒలింపిక్ విజేత అర్జెంటీనాతో 1-1తో 'డ్రా' చేసుకుంది. మూడో లీగ్ మ్యాచ్‌లో ఐర్లాండ్‌పై 2-0తో గెలిచి క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. నాలుగో లీగ్ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఒలింపిక్ చాంపియన్ బెల్జియం జట్టు చేతిలో 1-2తో ఓడిన టీమిండియా చివరి లీగ్ మ్యాచ్‌లో పటిష్ట ఆస్ట్రేలియా జట్టును 3-2తో ఓడించి సంచలనం సృష్టించింది. ఒలింపిక్స్ క్రీడల్లో ఆస్ట్రేలియా జట్టుపై 52 ఏళ్ల తర్వాత భారత జట్టు విజయాన్ని అందుకుంది.

లీగ్ దశ మ్యాచ్‌ల ఫలితాలు, ప్రదర్శన ప్రస్తుతం గతంతో సమానం. నాకౌట్ మ్యాచ్ కావడంతో తప్పనిసరిగా గెలిస్తేనే జట్లు ముందుకు సాగుతాయి. 1988 సియోల్ ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం నెగ్గిన తర్వాత బ్రిటన్ జట్టు మళ్లీ ఒలింపిక్స్‌లో పతకం సాధించలేకపోయింది. ప్రస్తుత ప్రపంచ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో ఉన్న బ్రిటన్ జట్టును ఏమాత్రం తక్కువ అంచనా వేయకుండా భారత జట్టు ఆద్యంతం నిలకడగా ఆడాల్సి ఉంటుంది. గోల్ చేసేందుకు వచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. దక్కిన పెనాల్టీ కార్నర్‌లను లక్ష్యానికి చేర్చాలి. అందుబాటులో ఉన్న ముఖాముఖి రికార్డు ప్రకారం భారత్, బ్రిటన్ జట్లు ఇప్పటి వరకు 23 సార్లు తలపడ్డాయి. 13 సార్లు బ్రిటన్ నెగ్గగా... 9 సార్లు భారత్ గెలిచింది. ఒక మ్యాచ్ 'డ్రా' అయింది. ఒలింపిక్స్‌లో మాత్రం బ్రిటన్‌పై భారత్‌దే పైచేయిగా ఉంది. విశ్వ క్రీడల్లో ఈ రెండు జట్లు తొమ్మిదిసార్లు తలపడగా... ఆరుసార్లు భారత్, మూడుసార్లు బ్రిటన్ గెలుపొందాయి. నేడు జరిగే ఇతర మూడు క్వార్టర్ ఫైనల్స్‌లో స్పెయిన్‌తో బెల్జియం; నెదర్లాండ్స్‌తో ఆస్ట్రేలియా; జర్మనీతో అర్జెంటీనా తలపడతాయి. యాదృచ్ఛికంగా 'పారిస్' గేమ్స్‌లోనూ 2020 టోక్యో ఒలింపిక్స్‌లో నాలుగు క్వార్టర్ ఫైనల్స్‌లో ఎదురెదురుగా తలపడిన జట్లే ఈసారి పోటీపడుతున్నాయి.



'మూడో' కన్ను చెదిరింది!

మనూ భాకర్‌కు త్రుటిలో చేజారిన కాంస్యం

25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో నాలుగో స్థానం

2 కాంస్యాలతో ముగించిన భారత యువ షూటర్

ఏడు రోజుల వ్యవధి. రెండు ఒలింపిక్ కాంస్య పతకాలు గెలిచిన ఘనత. మూడో పతకం సాధించి కొత్త చరిత్ర సృష్టించేందుకు సై. కానీ చివరకు 'షూట్ ఆఫ్'తో ఆశలకు తెర పడింది. త్రుటిలో కాంస్యం చేజారింది. ఒలింపిక్స్ చరిత్రలో భారత్ తరఫున వ్యక్తిగత క్రీడాంశంలో మూడు పతకాలు గెలుచుకున్న తొలి ప్లేయర్‌గా నిలవాలని ఆశించిన యువ షూటర్ మనూ భాకర్‌కు చివర్లో చుక్కెదురైంది. తీవ్ర ఒత్తిడికి తలవంచిన ఆమె ఆశించిన లక్ష్యాన్ని చేరుకోలేక నాలుగో స్థానంతో ముగించింది. అయితే 22 ఏళ్ల మనూ భాకర్ సాధించిన ఘనత చిన్నదేమీ కాదు. మూడు ఈవెంట్లలో రెండు పతకాలు, మరో దాంట్లో నాలుగో స్థానం అంటే అసాధారణ ప్రదర్శన. గత టోక్యో ఒలింపిక్స్‌లో కనీస ప్రభావం చూపించలేక తీవ్ర విమర్శలపాలైన ఈ యంగ్‌స్టర్ ఇప్పుడు పారిస్ నుంచి సగర్వంగా స్వదేశం వెళుతోంది.

పారిస్: భారత స్టార్ షూటర్ మనూ భాకర్ పారిస్ ఒలింపిక్స్‌లో మూడో పతకాన్ని సాధించడంలో విఫలమైంది. మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్ ఫైనల్లో మనూ నాలుగో స్థానానికి పరిమితమైంది. శనివారం జరిగిన ఫైనల్లో మనూ 'షూట్–ఆఫ్'లో ఓటమి పాలైంది. ఒక్కో సిరీస్‌లో ఐదు షాట్‌ల చొప్పున ఉండే ఎనిమిది సిరీస్‌లు ముగిసేసరికి మనూ 28 పాయింట్లు స్కోరు చేసింది. హంగేరీకి చెందిన వెరోనికా మాయో కూడా సరిగ్గా 28 పాయింట్లే సాధించింది. దాంతో ఇద్దరి మధ్య ఐదు షాట్‌ల 'షూట్–ఆఫ్' నిర్వహించారు. ఇందులో మూడు షాట్‌లను మనూ లక్ష్యంపైకి సరిగ్గా కొట్టగా... నాలుగు షాట్‌లు సరిగ్గా కొట్టిన వెరోనికాయే పైచేయి సాధించి కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. దాంతో మనూకు నిరాశ తప్పలేదు. ఫైనల్లో తొలి సిరీస్‌లో రెండు షాట్‌లు మాత్రం లక్ష్యం చేర్చిన మనూ పేలవంగా మొదలు పెట్టింది. అయితే ఆ తర్వాత వరుసగా 4, 4 పాయింట్లు సాధించి 10 పాయింట్లతో ఎలిమినేషన్ రౌండ్‌కు సిద్ధమైంది. ఇక్కడ మళ్లీ తడబడి 3తో మొదలు పెట్టిన మనూ ఆ తర్వాత వరుసగా 5, 4, 4 పాయింట్లతో ఏడు సిరీస్‌ల తర్వాత మొత్తం 26 పాయింట్లతో రెండో స్థానంతో మెరుగైన స్థితిలో నిలిచింది. అయితే ఈ తర్వాత ఈ జోరు కొనసాగలేదు. ఎనిమిదో సిరీస్ మనూను బాగా దెబ్బ తీసింది. కేవలం 2 షాట్‌లు మాత్రమే లక్ష్యం చేరడంతో వెనకబడిపోయి కాంస్యం కోసం పోటీ పడాల్సి వచ్చింది. అయితే 'షూట్–ఆఫ్'లో అదే వైఫల్యం కొనసాగింది. ఈ ఈవెంట్‌లో 'షూట్–ఆఫ్'లో జిన్ యాంగ్ (దక్షిణ కొరియా) స్వర్ణం, క్యామిలె జెడ్రెస్కీ (ఫ్రాన్స్) రజతం గెలుచుకున్నారు. నిర్ణీత 10 సిరీస్‌ల తర్వాత ఇద్దరూ 37 పాయింట్లతో సమంగా నిలిచారు. 'షూట్–ఆఫ్'లో జిన్ యాంగ్ 3 పాయింట్లు సాధించగా... క్యామిలె ఒక పాయింట్‌తో సరిపెట్టుకుంది.

స్కీట్‌లో నిరాశ...

షూటింగ్‌లోనే స్కీట్ ఈవెంట్ పురుషుల విభాగంలో భారత షూటర్ అనంత్ జీత్‌సింగ్ నరూకా విఫలమయ్యాడు. 30 మంది పాల్గొన్న ఈ పోటీలో ఐదు క్వాలిఫయింగ్ రౌండ్ల తర్వాత అతను 24వ స్థానంలో మాత్రమే నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించడంలో విఫలమయ్యాడు. తొలి ఆరుగురు ఫైనల్‌కు చేరే ఈ ఈవెంట్‌లో అనంత్ జీత్ మొత్తం 125కుగాను 116 (23, 22, 23, 24, 24) పాయింట్లు సాధించాడు. మహిళల స్కీట్‌లో తొలిరోజు శనివారం మూడు క్వాలిఫయింగ్ రౌండ్లు ముగిసేసరికి మహేశ్వరి చౌహాన్ ఎనిమిదో స్థానంలో, రిజా ధిల్లాన్ 25వ స్థానంలో కొనసాగుతున్నారు. ఆదివారం మరో రెండు క్వాలిఫయింగ్ రౌండ్ల తర్వాత టాప్–6 ఫైనల్‌కు చేరతారు.

ఒత్తిడిని అధిగమించలేకపోయాను

పారిస్ ఒలింపిక్స్‌లో మూడో పతకంపై గురి పెట్టాను. అయితే కీలక సమయంలో ఒత్తిడిలో చిత్తయ్యాను. ఎంత ప్రశాంతంగా ఉండాలని ప్రయత్నించినా నా వల్ల కాలేదు. అయితే రెండు కాంస్యాల తన ప్రదర్శన పట్ల సంతృప్తిగా ఉన్నాను. 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో ఇంతకంటే మెరుగైన ప్రదర్శన ఇస్తాను. 'షూట్–ఆఫ్'లో చాలా ఒత్తిడిని ఎదుర్కొన్నా. దానిని అధిగమించి గెలిచేందుకు నా శాయశక్తులా ప్రయత్నించినా అది సరిపోలేదు. రెండు పతకాలు గెలవడం సంతోషకరమే. కానీ ఈ క్షణాన మాత్రం నాలుగో స్థానం నాకు తీవ్ర నిరాశ కలిగించింది. ఒలింపిక్స్‌లో చాలా వరకు బాగానే ఆడినా ఈసారి విఫలమయ్యాను. ఎప్పుడైనా రేపు మరో అవకాశం అనేది ఉంటుంది. 2028 కోసం ఎదురు చూస్తున్నా. ఈ పోరుకు ముందు ఎలాగైనా మూడో పతకం సాధించాలని నాపై ఎవరూ ఒత్తిడి పెట్టలేదు, సోషల్ మీడియాకు దూరంగా ఉన్నాను కాబట్టి బయటి వ్యక్తుల అంచనాల గురించి కూడా నాకేమీ తెలియదు. నాలుగో స్థానం దక్కింది కాబట్టి నా లోపాలేమిటో తెలుసుకునే అవకాశం కూడా కలుగుతుంది. పతకం రాకపోతే ఎవరూ నిరాశ చెందవద్దని నేను ముందే చెప్పడం ఏదో మాట వరసకు అన్నదే. ఇక్కడా గెలిస్తే బాగుండేది. కానీ చివరి వరకు పోరాడగలిగాను. నేను ఈ ఒలింపిక్స్ కోసం చాలా కష్టపడ్డాను. ఇక ముందు ఇలాగే కష్టపడతానని అందరికీ చెబుతున్నాను.

–మనూ భాకర్



దీపిక

లక్ష్యానికి చేరని భారత బాణం

ఒలింపిక్స్ నుంచి మళ్లీ రిక్తహస్తాలతో వెనుదిరిగిన భారత ఆర్చర్లు

- పతకావకాశాన్ని చేజేతులా వృథా చేసుకున్న దీపిక కుమారి
- కీలకదశలో అక్కరకురాని అపార అనుభవం
- క్వార్టర్ ఫైనల్లో కొరియా టీనేజర్ చేతిలో ఓటమి

పారిస్: ఒలింపిక్స్‌లో మన ఆర్చర్లకు మరోసారి నిరాశ తప్పలేదు! భారీ అంచనాలు, మంచి ఫామ్‌తో పారిస్‌లో అడుగుపెట్టిన ఆర్చర్లు పోటీపడ్డ అన్నీ విభాగాల్లో విఫలమై.. రిక్తహస్తాలతో ఇంటిబాట పట్టారు. ఇప్పటికే పురుషుల టీమ్, మహిళల టీమ్, మిక్స్‌డ్ టీమ్, పురుషుల వ్యక్తిగత విభాగాల్లో మనవాళ్లకు చేదు ఫలితాలు ఎదురుకాగా... శనివారం మహిళల వ్యక్తిగత విభాగంలోనూ అదే పునరావృతం అయింది. ప్రపంచ మాజీ నంబర్ వన్, భారత స్టార్ దీపికా కుమారి క్వార్టర్ ఫైనల్లో కొరియాకు చెందిన 19 ఏళ్ల టీనేజ్ ఆర్చర్ నామ్ సిహైన్ చేతిలో ఓడగా.. తొలిసారి విశ్వ క్రీడల్లో ఆడుతున్న భజన్ కౌర్ ప్రిక్వార్టర్స్‌లోనే వెనుదిరిగింది. 'పారిస్' క్రీడల రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్–అంకిత భకత్ నాలుగో స్థానంలో నిలవడమే ఒలింపిక్స్ చరిత్రలో మన ఆర్చర్ల అత్యుత్తమ ప్రదర్శన.

వరుసగా నాలుగోసారి ఒలింపిక్స్ బరిలోకి దిగిన దీపిక శనివారం జరిగిన రికర్వ్ మహిళల వ్యక్తిగత క్వార్టర్ ఫైనల్లో 4-6 (28-26, 25-28, 29-28, 27-29, 27-29)తో నామ్ సిహైన్ చేతిలో పరాజయం పాలైంది. తొలి మూడు సెట్‌లలో రెండింట గెలిచి 4-2తో ఆధిక్యంలోకి వెళ్లి ఆశలు రేపిన దీపిక.. నాలుగో సెట్‌లో గురితప్పి 7 పాయింట్లు సాధించడంతో వెనుకబడింది. 14 ఏళ్లుగా అంతర్జాతీయస్థాయిలో నిలకడగా పతకాలు సాధిస్తూ మేటి ఆర్చర్‌గా పేరు తెచ్చుకున్న దీపిక వరుసగా నాలుగో ఒలింపిక్స్‌లోనూ పతకం లేకుండానే వెనుదిరిగింది. 'నిరాశ చెందా. ఒలింపిక్స్‌లో ప్రతిసారీ ఇలాంటి ఫలితాలే ఎందుకు వస్తున్నాయో అర్థం కావడం లేదు. ఈ వాతావరణం, అంచనాలే కారణమనుకుంటా. రెండు బాణాలు గురి తప్పడంతో.. మ్యాచ్‌ను నేనే ప్రత్యర్థికి అప్పగించినట్లు అనిపించింది' అని 2012 'లండన్'లో 33వ స్థానంలో, 2016 'రియో'లో 16వ స్థానంలో, 2020 టోక్యోలో 8వ స్థానంలో నిలిచిన దీపిక వ్యాఖ్యానించింది. క్వార్టర్ ఫైనల్లో దీపిక గెలిచి ఉంటే సెమీఫైనల్‌కు అర్హత సాధించి కనీసం కాంస్య పతక రేసులో నిలిచేది. అంతకుముందు ప్రిక్వార్టర్స్‌లో దీపిక 6-4 (27-24, 27-27, 26-25, 27-29, 27-27)తో మిచెల్లి క్రాపెన్ (జర్మనీ)పై గెలిచింది. మరో ఆర్చర్ భజన్ కౌర్ 'షూట్ ఆఫ్'లో దినంద చోరునిసా (ఇండోనేసియా) చేతిలో ఓడింది. మొదట స్కోర్లు 28-29, 27-25, 26-28, 28-28, 27-26తో సమం కాగా.. విజేతను నిర్ణయించేందుకు నిర్వహించిన 'షూట్ ఆఫ్'లో తడబడ్డ భజన్ 8 పాయింట్లు సాధించగా.. 9 పాయింట్లతో ఇండోనేసియా ఆర్చర్ ముందంజ వేసింది.

మథియాస్ బో గుడ్‌బై

భారత డబుల్స్ కోచ్ పదవి నుంచి వైదొలిగిన డెన్మార్క్ మాజీ షట్లర్



పారిస్: భారత బ్యాడ్మింటన్ డబుల్స్ కోచ్ పదవి నుంచి మథియాస్ బో తప్పుకున్నాడు. సాత్విక్ సాయిరాజ్ –చిరాగ్ శెట్టి జోడీని గొప్పగా తీర్చిదిద్ది వారి విజయాల్లో కీలకపాత్ర పోషించిన అతను పారిస్ ఒలింపిక్స్‌లో భారత ద్వయం వైఫల్యం తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నాడు. గత కొంత కాలంగా అద్భుత ప్రదర్శనతో వరుసగా ట్రోఫీలు నెగ్గి పారిస్ ఒలింపిక్స్‌లో పతకంపై ఆశలు రేపిన సాత్విక్–చిరాగ్ జంట క్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించింది. 2012 లండన్ ఒలింపిక్స్ డబుల్స్ విభాగంలో రజతం గెలిచిన మథియాస్ భారత జట్టుకు నాలుగేళ్ల క్రితం డబుల్స్ స్పెషలిస్ట్ కోచ్‌గా వచ్చాడు. 'నా కోచింగ్ రోజులు ముగిశాయి. ఇకపై నేను భారత్‌లో గానీ, మరెక్కడా గానీ కోచింగ్ ఇవ్వబోవడం లేదు. చాలా సమయం బ్యాడ్మింటన్ కోర్టుల్లో తీవ్ర ఒత్తిడి మధ్య గడిపిన నేను బాగా అలసిపోయాను. నాకు అండగా నిలిచిన, ఎన్నో జ్ఞాపకాలు అందించిన అందరికీ కృతజ్ఞతలు' అని మథియాస్ బో స్పష్టం చేశాడు. ప్రతికూల పరిస్థితుల్లోనూ కష్టపడి భారీ అంచనాలతో ఒలింపిక్స్ బరిలోకి దిగి పతకం సాధించలేకపోయిన సాత్విక్–చిరాగ్‌ల ప్రదర్శన పట్ల గర్వపడుతున్నానని, భవిష్యత్తులో వారిద్దరు ఎన్నో విజయాలు సాధిస్తారని మథియాస్ ఆకాంక్షించాడు. డెన్మార్క్‌కు చెందిన 44 ఏళ్ల మథియాస్ ఈ ఏడాది మార్చిలోనే సినీ నటి తాప్సీని పెళ్లి చేసుకున్నాడు.

భళా బైల్స్...

ఒలింపిక్స్‌లో ఏడో స్వర్ణం గెలిచిన అమెరికా స్టార్ జిమ్నాస్ట్





పారిస్: టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం నెగ్గలేకపోయిన అమెరికా మహిళా స్టార్ జిమ్నాస్ట్ 'పారిస్'లో మాత్రం పసిడి మెరుపులు మెరిపిస్తోంది. ఇప్పటి వరకు పోటీ పడ్డ మూడు ఈవెంట్లలోనూ ఆమె స్వర్ణ పతకాలను సొంతం చేసుకుంది. 27 ఏళ్ల బైల్స్ మహిళల టీమ్ విభాగంలో, ఆల్ అరౌండ్ విభాగంలో పసిడి పతకాలు నెగ్గగా... తాజాగా శనివారం జరిగిన వాల్ట్ ఈవెంట్‌లోనూ విజేతగా నిలిచింది. ఎనిమిది మంది మధ్య జరిగిన ఫైనల్లో బైల్స్ 15.300 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో నిలిచి స్వర్ణ పతకాన్ని సాధించింది. రెబెకా అంద్రాడె (బ్రెజిల్; 14.966 పాయింట్లు) రజతం, జేడ్ కేరీ (అమెరికా; 14.466 పాయింట్లు) కాంస్యం గెల్చుకున్నారు. ఓవరాల్‌గా ఒలింపిక్స్ క్రీడల్లో బైల్స్‌కిది పదో పతకంకాగా, ఇందులో ఏడు స్వర్ణాలు ఉన్నాయి. 2016 రియో ఒలింపిక్స్‌లో బైల్స్ నాలుగు స్వర్ణాలు, ఒక కాంస్యం నెగ్గింది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో బైల్స్‌కు ఒక రజతం, ఒక కాంస్యం దక్కింది. ఒలింపిక్స్ జిమ్నాస్టిక్స్‌లో మహిళల వాల్ట్ ఈవెంట్‌లో రెండుసార్లు విజేతగా నిలిచిన రెండో జిమ్నాస్ట్‌గా బైల్స్ గుర్తింపు పొందింది. గతంలో వెరా కసాలావ్‌స్కా (చెకోస్లొవేకియా; 1964, 1968 ఒలింపిక్స్) రెండుసార్లు వాల్ట్ ఈవెంట్‌లో పసిడి పతకాలు గెలిచింది. 'పారిస్'లో బైల్స్ ఖాతాలో నాలుగో స్వర్ణం కూడా చేరే అవకాశం ఉంది. నేడు జరిగే అన్‌ఈవెన్ బార్స్ ఫైనల్లో బైల్స్ పోటీపడనుంది.

పారిస్‌లో భారతీయం

నేడు భారత క్రీడాకారుల షెడ్యూల్

షూటింగ్

పురుషుల 25 మీటర్ల క్వాలిఫికేషన్ మొదటి స్టేజ్: విజయ్‌వీర్, అనీశ్ (మధ్యాహ్నం గం. 12:30 నుంచి). పురుషుల 25 మీటర్ల క్వాలిఫికేషన్ రెండో స్టేజ్: విజయ్‌వీర్, అనీశ్ (సాయంత్రం గం. 4:30 నుంచి). మహిళల స్కీట్ క్వాలిఫికేషన్: రైజా ధిల్లాన్, మహేశ్వరి చౌహాన్ (మధ్యాహ్నం గం. 1:00 నుంచి)

హాకీ

పురుషుల క్వార్టర్ ఫైనల్: భారత్ X బ్రిటన్ (మధ్యాహ్నం గం. 1:30 నుంచి)

గోల్ఫ్

పురుషుల వ్యక్తిగత స్ట్రోక్‌ప్లే నాలుగో రౌండ్: శుభాంకర్ శర్మ, గగన్‌జీత భుల్లర్ (మధ్యాహ్నం గం. 12:30 నుంచి)

బ్యాడ్మింటన్

పురుషుల సింగిల్స్ సెమీ ఫైనల్: లక్ష్యసేన్ X అక్సెల్‌సన్ (డెన్మార్క్) (మధ్యాహ్నం గం. 3:30 నుంచి)

బాక్సింగ్

మహిళల 75 కేజీల క్వార్టర్ ఫైనల్: లవ్లీనా బొర్గొహైన్ X లి కియాన్ (చైనా) (మధ్యాహ్నం గం. 3:02 నుంచి)

అథ్లెటిక్స్

మహిళల 3000 మీటర్ల స్టీపుల్ చేజ్ తొలి రౌండ్: పారుల్ చౌధరీ (మధ్యాహ్నం గం. 1:35 నుంచి). పురుషుల లాంగ్ జంప్ క్వాలిఫికేషన్: జస్విన్ అల్‌డ్రిన్ (మధ్యాహ్నం గం. 2:30 నుంచి)

సెయిలింగ్

పురుషుల డింగీ రేసులు: విష్ణు శరవణన్ (మధ్యాహ్నం గం. 3:35 నుంచి). మహిళల డింగీ రేసులు: నేత్ర కుమానన్ (సాయంత్రం గం. 6:05 నుంచి)

పతకాల పట్టిక



ర్యాంక్	దేశం	స్వ	ర	కాం	మొ
1	చైనా	16	11	9	36
2	ఫ్రాన్స్	12	14	15	41
3	ఆస్ట్రేలియా	12	7	5	24
4	అమెరికా	11	20	20	51
5	బ్రిటన్	10	10	12	32
6	దక్షిణ కొరియా	9	6	5	20
7	జపాన్	8	5	9	22
49	భారత్	0	0	3	3

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం. స్వర్ణాల సంఖ్య ఆధారంగా ర్యాంక్ వరుస క్రమాన్ని నిర్ణయిస్తారు.

10 వేల మీటర్ల రేసులో చెప్తెగాయ్‌కు స్వర్ణం



పారిస్: అథ్లెటిక్స్ పురుషుల 10,000 మీటర్ల రేసులో ఉగాండా రన్నర్ జోషువా చెప్తెగాయ్ స్వర్ణ పతకాన్ని సాధించాడు. శనివారం జరిగిన ఫైనల్లో జోషువా 26 నిమిషాల 43.14 సెకన్లలో అందరికంటే వేగంగా 10,000 మీటర్లను పూర్తి చేసి అగ్రస్థానంలో నిలిచాడు. ఈ క్రమంలో కొత్త ఒలింపిక్ రికార్డును నమోదు చేయడంతోపాటు 'పారిస్' గేమ్స్‌లో ఉగాండాకు తొలి పసిడి పతకాన్ని అందించాడు. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో కెనెనిసా బెకెలె (ఇథియోపియా; 27ని:01.17 సెకన్లు) నెలకొల్పిన రికార్డును జోషువా 'పారిస్'లో సవరించాడు. టోక్యో ఒలింపిక్స్‌లో రజతం నెగ్గిన జోషువా గత మూడు ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో 10,000 మీటర్ల విభాగంలో స్వర్ణ పతకాలు గెలిచాడు. 2020 వాలెన్సియా మీట్‌లో చెప్తెగాయ్ 10,000 మీటర్లను 26 నిమిషాల 11 సెకన్లలో పూర్తి చేసి తన పేరిట ప్రపంచ రికార్డును నమోదు చేసుకున్నాడు. నాలుగేళ్లుగా ఈ ప్రపంచ రికార్డు చెప్తెగాయ్ పేరిటే ఉంది.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



రజక/M.Tech / C.Govt. మేనేజర్ / కెనరా బ్యాంక్/18 Lakhs.P.A/5'10" ఎత్తు/30 సంగల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-15781]

క్రిస్టియన్ మాల/కట్నం ప్రసక్తి లేదు/28/ 5'9"/B.Tech/Govt. సెక్షన్ ఇంజనీర్/ రైల్వే/90,000/-PM/ అందమైన వరునికి వధువు కావలెను. Ph: 6309258463 [HA-15781]

క్రిస్టియన్ మాల/B.Tech, NIT/C.Govt. Asst. మేనేజర్ /SBI / 70,000/-PM/6' ఎత్తు/29 సంగల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9908222406 [HA-15780]

బెస్త, గంగపుత్ర/కట్నం ప్రసక్తి లేదు/M.Tech (Civil) Govt. Asst. ఇంజనీర్ / ట్రాన్స్‌కో/16 Lakhs. P.A/6'ఎత్తు/29 సంగల అందమైన వరుడికి వధువు కావలెను. 9966760501 [HA-15780]

రజక/కట్నం ప్రసక్తి లేదు/B.Tech/Govt. బ్యాంక్ మేనేజర్/SBI/80,000/-PM/ 5'10" ఎత్తు /29 సంగల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-15780]

SC హిందూ మాదిగ/ M.Tech/ Govt. Sr. Asst./ రెవెన్యూ Dept/ 60,000/-PM/ 5'11"ఎత్తు/29 సంగల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 6305007091 [HA-15780]

SC మాదిగ/B.Tech/C.Govt. మేనేజర్ / కెనరా బ్యాంక్/80,000/-PM / 5'8" ఎత్తు/ 28 సంగల వరునికి తగిన వధువు కావలెను. Ph: 6304407230, 9515755529 [HA-15782]

యాదవ/కట్నం ప్రసక్తి లేదు/B.టెక్/ C.Govt. Sr. ఇంజనీర్/రైల్వే/14 Lakhs. P.A / 5'8"ఎత్తు /28 సంగల వరుడికి వధువు కావలెను. Ph: 9515755529 [HA-15782]

SC-Mala (Hindu)/2nd Marriage/ 40y / 5'10"/PG Own Visa Consultancy/ 1,60,000/-PM Wants Good Bride (Direct). Ph: 8187861989 [H-782757]

★

ముస్లిం/55Y ఆస్తులు, బాదరబందీ, చెడు అలవాట్లు లేని డ్రైవర్ వరునకు. 45Y విడో వధువు. ఏ మతమైనా అంగవైకల్యం ఉన్నా OK. డైరెక్ట్ 8886309582 (Only Hyd) [HA-15783]

డైరెక్ట్ : విశ్వబ్రాహ్మణ/48y/ 2వ పెళ్ళి/ 50K PM / డిగ్రీ / ప్రై.జాబ్/Hydలో స్వంత ఇల్లు & ప్రాపర్టీ ఉన్న వరునికి తగిన వధువు కావలెను. 9618346855 [HA-98101]

★★

59 సంగ / తెలుగు జర్నలిస్ట్ /విడోయర్/ తిరుపతి/ ద్వితీయ వివాహమునకు తగిన వధువు కావలెను. భాదరబందీలేని వితంతువుకు ప్రాధాన్యత. ✆ 9032532295. [T-764215]

వరుడు కావలెను



రెడ్డి/విడో/AGE: 35, QLY: B.Com/Own Properties/Lands గల అందమైన వధువుకి వరుడు కావలెను/కుల, మత, ఆస్తి ప్రసక్తి లేదు (ఇల్లరికం అయినా OK) Ph: 8121347478 [H-782757]

38yrs Govt ఎంప్లాయ్ 4,00,000/- (pm) వెరీ వెల్ సెటిల్డ్ కోట్ల ప్రాపర్టీ కలిగి కుల పట్టింపు లేని అందమైన వధువుకి వరుడు కావలెను. (డైవర్సి) సంప్ర: 9032445378 [H-796662]

కమ్మ: 38yr/ ఫెయిర్ / కులపట్టింపులేదు / Govt ఎంప్లాయ్ 90k (PM), వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ 2 సొంత ఇల్లులు & బిజినెస్ కలిగిన వధువుకి వరుడు కావలెను (1st, 2nd మ్యాచ్ & ఇల్లరికం ok) సంప్ర: 9640133485 [H-796662]

రెడ్డి: కమ్మ/విడో/56y/ 54y/ Khammamలో సొంత ప్లాట్లు / Hyd లో సొంత బిజినెస్ రెంట్స్/ మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను (అర్జెంట్) (ఇల్లరికం ok) (నో బ్రోకర్స్) 7799083500, 7386660643. [H-796662]

కుల ప్రసక్తి లేదు /విడో/59y / విజయవాడ / Hydలో Own House/ Rents/ Lands/ Well Settle/ పిల్లలు లేని ఏ బాదరబందీ లేని అందమైన ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను. Ph: 8519803423 [H-782757]

2వ పెళ్ళి, కుల ప్రసక్తి లేదు, 3,00,000 PM, కోట్ల ప్రాపర్టీ, బాగా స్థిరపడిన అమ్మాయికి, అందమైన వరుడు కావలెను (ఇల్లరికం పిల్లలు ఉన్న OK) 9381696641 [H-796662]

రెడ్డి/కుల పట్టింపు లేదు/26Y/5'4"/B.Tech/ పెద్ద స్థిరాస్తి కలిగి తండ్రి లేని ఏకైక వధువుకు మిడిల్ క్లాస్ వరుడు కావలెను. మీ ఫోటోలు వాట్సాప్‌లో సెండ్ చెయ్యండి. Ph: 9885463158 [HA-15781]

క్రిస్టియన్ మాల/25/ 5'4" / B.Tech / C. Govt. Asst. మేనేజర్/కెనరా బ్యాంక్ / 60,000/-PM / అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 6309258463 [HA-15781]

పద్మశాలి/ఏకైక కుమార్తె / B.Tech/C. Govt. బ్యాంక్ P.O/SBI/50,000/-PM /5'5" ఎత్తు/25 సంగల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8297439565 [HA-15781]

హిందూ మాల/M.Tech/C.Govt. Asst. ఇంజనీర్ / రైల్వేస్ / 60,000/-PM / 5'4" ఎత్తు /26 సంగల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9908222406 [HA-15781]

యాదవ/ఏకైక కుమార్తె/M.Sc/Govt. గ్రూప్ -II ఆఫీసర్/కస్టమ్స్ & GST Dept/ 62000/-PM/5'5"ఎత్తు/25సంగల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9966760501 [HA-15781]

క్రిస్టియన్ మాదిగ/B.Tech / C.Govt. సైంటిస్ట్ / DRDO/1 Lakh. PM/5'4" ఎత్తు/26 సంగల అందమైన వధువుకు వరుడు కావలెను. 6305007091 [HA-15781]

SC మాల/B.Tech/C.Govt.ట్యాక్స్ ఆఫీసర్ /ఇన్‌కమ్ ట్యాక్స్ Dept/60,000/-PM/5'4" ఎత్తు /25 సంగల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-15781]

గౌడ/1 Cr. ఆస్తి/M.SC/Govt.Jr.Asst పంచాయతీరాజ్ Dept/42000/-PM/ 5'5" ఎత్తు/25 సంగల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9550572571 [HA-15781]

వడ్డెర/M.Sc/C.Govt.Jr.Asst./ పోస్టల్ Dept/ 45000/-PM / 5'5"ఎత్తు /25 సంగల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618007652 [HA-15780]

కుల పట్టింపు లేదు/55Yrs/2వ పెళ్ళి/ఫ్యామిలీ పెన్షన్/55000/-PM/Own House/15 ఎకరాల వ్యవసాయ భూమి గల వధువుకు కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను. ఇల్లరికం అయినా OK. Ph: 7702580013 [HA-15782]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి Citizen, BS, 28, 6', Microsoft, USA, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5' 11", SWE, 160 K, 15 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MS, 30, 5' 6", SWE, 200 K, 7 Crores, Green Card, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Bengaluru, BE (IIIT), 30, 5' 8", SWE, 40 L P/A, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి MBBS, 24, 5' 4", Doctor, Hyderabad, Rich Family, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5' 7", Business Analyst, 90 K, 4 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, Residency Doctor, 27, 5' 4", USA, Rich Family, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 25, 5' 6", SWE, 2 Crores, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి BE, MS, 34, 5' 11", SWE, 350 K, 10 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 31, 5' 8", Analyst, 175 K, 15 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, DM, 27, 5' 11", PG Doctor, 100 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, 40, 5' 8", Microsoft, 60 L P/A, Hyd, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 27, 5' 3", Analyst, 12 L P/A, 20 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5' 6", Developer, 110 K, 5 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, 24, 5' 9", Doctor, 20 Crores, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 28, 5' 5", SWE, 130 K, H1, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

SC మాల & క్రిస్టియన్/B.Tech, NIT/ M.Tech,IIT/C.Govt.ఆఫీసర్/HPCL/10 Lakhs. P.A / 5'4"ఎత్తు /25 సంగల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9676995093 [HA-15782]

SC మాదిగ & క్రిస్టియన్/B.Tech(EEE)/ C. Govt. డిప్యూటీ మేనేజర్/SBI/75000/- PM / 5'4"ఎత్తు/25 సంగల అందమైన వధువుకు వరుడు కావలెను. 9676995093 [HA-15782]

రెడ్డి/2nd మ్యారేజ్ : కుల, మత, ఆస్తి పట్టింపు లేదు. డిగ్రీ Height: 5'4", బిజినెస్సులు గల అందమైన వధువుకి వరుడు కావలెను. 1st, 2nd(ఇల్లరికం OK) అన్ని కులాల వారికి సంబంధాలు చూడబడును. Ph: 9032598676 [HA-15782]

రెడ్డి/2nd మ్యారేజ్: (కుల/మత/ఆస్తి) ప్రసక్తి లేదు. Age:30, Degree/Own House/2 Sites/ Business / వెల్ సెటిల్డ్ గల అందమైన వధువుకి 1వ, 2వ వరుడు కావలెను. (ఇల్లరికం OK) Ph: 9392332143 [HA-15782]

కాపు/43y/విడో / డిగ్రీ, C.Govt. పెన్షనర్, Hydలో సొంత బంగ్లా, 25Cr ప్రాపర్టీ, బాగా స్థిరపడిన వధువుకు స్థిరపడిన వరుడు కావలెను. CNB, 9573943211, 8125132949 [HA-15782]

వయసు : 35yrs / ఎత్తు 5'5"గవర్నమెంటు జాబ్, 1.5 Laks జీతం కలిగిన అందమైన అమ్మాయికి వరుడు కావలెను. కుల పట్టింపు లేదు. పిల్లలున్నా OK. Ph: 7893409985 [HA-15782]

రెడ్డి: విడో/ 55y/ 5'3"/ Govt టీచర్/ ట్యూషన్స్/సొంత ఇల్లు. ఆస్తి కుల పట్టింపు లేని వధువుకి వరుడు కావలెను. 8367233524 [H-796331]

ఆస్తి, కుల పట్టింపులేని వధువుకు వరుడు కావలెను / 60y/విడో/ 5'4"/ Govt Rtd/ 80,000/pm/ సొంత ఇల్లు ఆంధ్రాలో పొలాలు/పిల్లలు లేరు 9618513615 [H-796331]

రెడ్డి:విడో / 59y / 5'5"/ Fair / Govt(HM)/28 ఎకరాల కొబ్బరి తోట/సొంత ఇల్లు. రెంట్స్/ 3L/pm/ పిల్లలు లేని వెల్‌సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తి లేదు. 9492718486 [H-796331]

FC: విడో/60y/ Fair/Govt రిటైర్డ్/సొంత ఇల్లు/ కొద్దిగా పంటభూమి గల ఒంటరి వధువుకు కులప్రసక్తిలేని స్నేహపూర్వకమైన వరుడు కావలెను. 9391272485 [H-796331]

కాపు: 53y/విడో/ఇంటర్/సొంత ఇల్లు & బిజినెస్/ 9 ఎకరాల పొలం గల వధువుకి కుల, ఆస్తి పట్టింపులేని వధువుకు వరుడు కావలెను. 9705499686 [H-796331]

బ్రాహ్మణ /24/5'3"/B.Sc '27/5'4"/ MBA '30/ 5'3"/B.Sc '27/5'2"/ ఇంటర్/32/5'2"/ఇంటర్ వధువులకు వరులు కావలెను. జాబ్/ బిజినెస్/ పురోహితులకు త్వరగా కుదుర్చబడును. Ph : 7842635086 [HA-16313]

వేదికలు



కావ్య మ్యారేజ్ లింక్స్! 1వ, 2వ లేట్ మ్యారేజెస్, డైవర్సీ, విడోస్, విడోయర్స్, పెన్షనర్లకు అన్ని కులాల వారికి ఫాస్ట్ సెటిల్‌మెంట్ స్త్రీలకు ఫ్రీ. Ph: 7702526428 [H-782757]

సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే. అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. సంప్ర : 8555980066, 9885144375 [H-782757]

మాల మాదిగ స్పెషల్ IAS, IPS, IFS, IRS, గ్రూప్-I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt. ఆఫీసర్స్, USA, UK. Ph : 7396915712 [HA-15782]

ధ్రువ మ్యారేజెస్. అన్ని కులాల వారికి 1వ, 2వ, లేటు, విడో, డైవర్స్ వారికి తగిన సంబంధాలు చూపబడును. Age: 18-70 సం.లు. Ph: 7702955854 [HA-15785]

Brahmin, Padmashali పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-15784]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Sai Teja, Ph: 9032378894/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-15784]

Kamma, Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-15784]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Sai Teja, Ph: 9032378894/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-15784]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-15784]

కుల పట్టింపు లేని అన్ని కులాల వారికి 1వ/2వ/లేట్ విడో/ విడోయర్/ పెన్షనర్స్/ ఒంటరి స్త్రీలకు మరియు పురుషులకు వ॥ 21-80 సం॥ పెళ్ళి సంబంధాలు త్వరగా చూడబడును. సంప్ర: 8374802603 [H-796662]

మాల, మాదిగ, హిందూ, క్రిస్టియన్/ Govt. సాఫ్ట్‌వేర్ /గెజిటెడ్/MBBS/PG/ NRI/PVT/ బిజినెస్/1వ/2వ/లేట్/ AP/ TS/ 15 సం॥ Exp. Ph: 8790555273 [HA-32610]

Doctors, Software, NRI, Rich Persons కు Late Matches కు, అన్ని ప్రాంతాల వారికి వ్యక్తిగత శ్రద్ధతో Fast గా సెటిల్‌మెంట్ చేయబడును. పూర్ణమ్యాట్రిమోని, తిరుపతి, 7093722724. [T-2957]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt. Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి. 9704656103, 9494809254 (Whatsapp) [HA-986]

★★

గవర్నమెంట్ ఎంప్లాయిస్, ప్రైవేట్ ఎంప్లాయిస్, డాక్టర్స్ & సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వధూవరులకు మాల హిందూ సంబంధాలు చూడబడును. ✆ 77949 11019 [R-1229035]

సినిమా



● వెంకటేష్

పొల్లాచ్చికి పోదాం

పొల్లాచ్చికి పోదాం అంటున్నారట హీరో వెంకటేశ్. 'ఎఫ్ 2', 'ఎఫ్ 3' సినిమాల తర్వాత హీరో వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా సినిమా 'సంక్రాంతికి వస్తున్నాం' (ప్రచారంలో ఉన్న టైటిల్). ఈ చిత్రంలో ఐశ్వర్యా రాజేశ్, మీనాక్షీ చౌదరి హీరోయిన్లుగా నటిస్తున్నారు. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఓ మాజీ పోలీసాఫీసర్, అతని భార్య, అతని మాజీ ప్రేయసి... ఇలా మూడు పాత్రల నేపథ్యంలో సాగే క్రైమ్ థ్రిల్లర్‌గా ఈ సినిమా రూపొందుతోంది. ఇటీవల ఈ సినిమా తొలి షెడ్యూల్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. అయితే హీరో వెంకటేశ్ పాల్గొనని సన్నివేశాల చిత్రీకరణ జరిపారు. కాగా నెక్ట్స్ షెడ్యూల్ చిత్రీకరణ ఈ నెల రెండో వారంలో పొల్లాచ్చిలో ప్రారంభం కానుందని తెలిసింది. ఈ షెడ్యూల్‌లో వెంకటేశ్‌తో పాటు మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ కూడా పాల్గొంటారట. ఈ చిత్రాన్ని సంక్రాంతికి రిలీజ్ చేయాలని మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారని తెలిసింది.

అంతర్జాతీయ గూఢచారి



● అడివి శేష్

అడివి శేష్ హీరోగా వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకత్వంలో రూపొందుతున్న స్పై యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'గూఢచారి 2'. టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్, అనిల్ సుంకర ఈ సినిమాను నిర్మిస్తున్నారు. అర్జున్ కుమార్ అలియాస్ ఏజెంట్ గోపీ 116 పాత్రలో అడివి శేష్ హీరోగా శశికిరణ్ తిక్క దర్శకత్వంలో రూపొంది, సూపర్ హిట్‌గా నిలిచిన 'గూఢచారి' (2018) సినిమాకు సీక్వెల్‌గా 'గూఢచారి 2' రూపొందుతోంది. 'గూఢచారి' సినిమా విడుదలై ఆరేళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా 'గూఢచారి 2' సినిమా నుంచి ఆరు స్టన్నింగ్ మూమెంట్స్‌ను రిలీజ్ చేశారు. అడివి శేష్ మాట్లాడుతూ– ''గూఢచారి' మూవీ చాలా ప్రత్యేకమైనది. ఆరేళ్లుగా ఈ సినిమా గురించిన ప్రశంసలు వింటూనే ఉన్నాను. 'గూఢచారి 2' చిత్రం అంతర్జాతీయ స్థాయిలో ఉంటుంది. ఓ మ్యాసీవ్ విజువల్ ట్రీట్‌గా ఉంటుంది'' అన్నారు. ''40 శాతం చిత్రీకరణ పూర్తయింది. ఈ యాక్షన్ డ్రామా సినిమా ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని ఇస్తుంది'' అన్నారు వినయ్ కుమార్. ''గూఢచారి 2' సినిమా, యాక్షన్ సీక్వెన్స్‌లు ప్రేక్షకుల అంచనాలను మించి ఉంటాయి'' అన్నారు టీజీ విశ్వప్రసాద్. ''గూఢచారి'కి ఎంత బడ్జెట్ అయ్యిందో 'గూఢచారి 2' సినిమాలోని ఒక్క యాక్షన్ సీక్వెన్స్‌కు అంతే బడ్జెట్ అయింది'' అన్నారు అభిషేక్. భారతీయ ప్రధాన భాషల్లో 'గూఢచారి 2' 2025లో రిలీజ్ కానుంది.



● 'బ్రదర్' పోస్టర్

దీపావళికి బ్రదర్

దీపావళికి థియేటర్స్‌కు వస్తున్నాడు బ్రదర్. 'జయం' రవి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'బ్రదర్'. ఈ చిత్రంలో ప్రియాంకా మోహన్ హీరోయిన్‌గా నటించగా, భూమికా చావ్లా, రావు రమేశ్, యోగిబాబు, సతీష్ కృష్ణన్ ఇతర కీలక పాత్రల్లో నటించారు. ఎమ్. రాజేశ్ దర్శకత్వంలో సిద్ధార్థ్ రావిపాటి, సెంథిల్ కుమార్ ఈ సినిమాను నిర్మించారు. కాగా 'బ్రదర్' సినిమాను ఈ ఏడాది దీపావళి సందర్భంగా రిలీజ్ చేయనున్నట్లుగా అధికారికంగా ప్రకటించారు. ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీకి హారిస్ జయరాజ్ సంగీతం అందించారు.



● దేవిశ్రీ ప్రసాద్, నాగచైతన్య

మ్యూజికల్ తండేల్

'లవ్‌స్టోరీ' సినిమా తర్వాత నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటిస్తున్న చిత్రం 'తండేల్'. చందు మొండేటి దర్శకత్వంలో అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో జాలరి రాజు పాత్రలో నాగచైతన్య కనిపిస్తారు. నాగచైతన్య, సాయిపల్లవిలు డీ–గ్లామరస్ రోల్స్‌లో కనిపిస్తారు. వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. కాగా ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఈ నెల 2న దేవిశ్రీ ప్రసాద్ బర్త్ డే. ఈ సందర్భంగా 'తండేల్' యూనిట్ ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపింది. ''తండేల్' సినిమా కోసం చార్ట్ బస్టర్ అల్బమ్ కంపోజర్ చేశారు మ్యూజిక్ డైరెక్టర్ దేవిశ్రీ ప్రసాద్. నేపథ్య సంగీతం కూడా నెక్ట్స్ లెవల్‌లో ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.



● మీనాక్షి, విజయ్

చూపే ఒక స్పార్క్...

'జిగి జింతాకు చూపే ఒక స్పార్క్... ఆ నాజూకు నడకే ఓ క్యాట్వాక్కు...' అంటూ మొదలవుతుంది 'ది గోట్' (ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్) సినిమాలోని 'స్పార్క్' సాంగ్. తమిళ హీరో విజయ్ ద్విపాత్రాభినయం చేస్తున్న తాజా చిత్రం ఇది. మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా సెప్టెంబరులో విడుదల కానుంది. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ తెలుగు వెర్షన్‌ను రిలీజ్ చేయనుంది. తాజాగా ఈ సినిమా నుంచి 'స్పార్క్' సాంగ్ లిరికల్ వీడియోను విడుదల చేశారు. ''అయ్యయ్యో... మనసులోకి నన్ను లాగే మందు పెట్టావే... కలల్లో రోజూ వచ్చి రెచ్చగొట్టావే...' అంటూ 'స్పార్క్' పాట తెలుగు వెర్షన్‌కు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా, వృషబాలుతో కలిసి ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ యువన్ శంకర్‌రాజా ఆలపించారు.

తెరపైకి బ్రిట్నీ జీవితం



ప్రముఖ అమెరికన్ పాప్ స్టార్ బ్రిట్నీ స్పియర్స్ జీవితం వెండితెర పైకి రానుంది. తన జీవితం ఆధారంగా బ్రిట్నీ స్పియర్స్ 'ది ఉమెన్ ఇన్ మీ' (మెమొర్) అనే పుస్తకం రాశారు. ఇందులో బ్రిట్నీ ప్రేమ విశేషాలు, చేదు అనుభవాలు, కుటుంబ విశేషాలు.. ఇలా చాలా అంశాలు ఉన్నాయట. ఇరవైఆరు భాషల్లో రిలీజ్ అయిన ఈ పుస్తకానికి ప్రపంచవ్యాప్తంగా ఆదరణ దక్కింది. అంతేకాదు.. ఈ పుస్తకం ఆడియో వెర్షన్‌కు ప్రముఖ హాలీవుడ్ నటి మిచెల్ విలియమ్స్ వాయిస్ ఇచ్చారు. ఈ బుక్ హక్కులను యూనివర్సల్ పిక్చర్స్ దక్కించుకుంది. దీంతో బ్రిట్నీ బయోపిక్ ప్రస్తుతం హాలీవుడ్‌లో హాట్‌టాపిక్‌గా మారింది. దర్శకుడు జోన్ ఎమ్ చు ఈ బయోపిక్‌ను తెరకెక్కించనున్నారని, మార్క్ ప్లాట్ నిర్మించనున్నారని టాక్. ఇక 'నా ఫేవరెట్ మూవీస్ తీసిన మార్క్ ప్లాట్‌తో ఓ సీక్రెట్ ప్రాజెక్ట్ చేస్తున్నానని నా ఫ్యాన్స్‌కు చెప్పడానికి హ్యాపీగా ఉంది' అని 'ఎక్స్'లో పేర్కొన్నారు బ్రిట్నీ.

ఓటీటీ ఇది చూడొచ్చు

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే చిత్రాలు చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతున్న వాటిలో హిందీ చిత్రం 'సావి' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

ఫ్రెంచ్ సావిత్రి కథ



ఓ సినిమా కథ బావుంటే ఆ కథకి ఏ భాషా హద్దు కాదు. అలాగే ఏ దేశమూ సరిహద్దు కాదు. దానికి సరైన ఉదాహరణ 'సావి' సినిమా. 'సావి' గురించి చెప్పుకోవాలంటే ఈ సినిమాకి మూలం తెలుసుకోవడం చాలా అవసరం. 2008లో ఫ్రెంచ్ దర్శకుడు ఫ్రెడ్ కవాయే 'ఎనీథింగ్ ఫర్ హర్' అనే సినిమా నిర్మించారు. ఆ సినిమాను 8 మిలియన్ డాలర్లు పెట్టి తీస్తే, ఆరు మిలియన్ డాలర్ల రాబడితో సరిపెట్టుకుంది. అదే మూల కథతో సరిగ్గా రెండేళ్ళ తరువాత... అంటే 2010లో రస్సెల్ క్రోవ్ వంటి సీనియర్ నటుడుతో హాలీవుడ్ దర్శకుడు పాల్ హాగిస్ 'ది నెక్స్ట్ త్రీ డేస్' అనే సినిమా నిర్మించారు. ఈ సినిమాను 30 మిలియన్ డాలర్లు పెట్టి తీస్తే దాదాపు 67 మిలియన్ డాలర్లు సాధించి, బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఈ కథ ఫ్రెంచ్‌లో ప్రారంభమై హాలీవుడ్ చుట్టి 14 ఏళ్ళ తరువాత బాలీవుడ్‌కి 'సావి'గా అడుగుపెట్టింది. అంతలా ఈ కథలో ఏముందో చూద్దాం. అందమైన ఓ చిన్న కుటుంబం. భార్య, భర్త, ఓ చిన్న పిల్లాడు. వీరే కథకు పాత్రధారులు. అనుకోని ఓ ఘటన వల్ల ఒక హత్య కేసులో ఇరుక్కుని జీవిత ఖైదీగా శిక్ష పడుతుంది భార్యకు. దేశం కాని దేశంలో తన బిడ్డకు తల్లిని దూరం చేయలేక ఆ భర్త శిక్ష అనుభవిస్తున్న తన భార్యను జైలు నుండి తప్పించి కుటుంబమంతా ఎలా వేరే దేశం చేరుకుంటారు అనేదే కథ. 'సావి'లో పెద్ద మార్పేంటంటే భార్య బదులు భర్తను ఖైదీగా మార్చారు. పైగా ఇండియా సెంటిమెంట్ ప్రకారం సావి అంటే సావిత్రి అని దర్శకుడు అభినయ్ డియో సినిమా ఆఖర్లో చెప్పిస్తాడు. సినిమా థ్రిల్లింగ్‌గా ఉంటుంది. అనిల్ కపూర్ ప్రత్యేక పాత్రలో నటించిన ఈ సినిమాలో దివ్య ఖోస్లా టైటిల్ రోల్ చేశారు. థ్రిల్లింగ్ జోనర్ ఇష్టపడే వాళ్ళకు 'సావి' మంచి ఛాయిస్. ఈ చిత్రం నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమ్ అవుతోంది.

– ఇంటూరు హరికృష్ణ



డోపింగ్‌లో పట్టుబడ్డ అఫ్గానిస్తాన్ జూడో ప్లేయర్

పారిస్ ఒలింపిక్స్‌లో మూడో డోపింగ్ కేసు నమోదైంది. అఫ్గానిస్తాన్‌కు చెందిన జూడో ఆటగాడు మొహమ్మద్ సమీమ్ ఫైజాద్ డోపింగ్ పరీక్షలో దొరికిపోయాడు. అతను నిషిద్ధ ఉత్ప్రేరకాలు తీసుకున్నట్లు పరీక్షల్లో తేలింది. దీంతో అతన్ని అఫ్గాన్ జట్టు నుంచి తప్పించారు. 81 కేజీల కేటగిరీలో తొలి బౌట్‌లో పాల్గొన్న సమయంలోనే 22 ఏళ్ల ఫైజాద్ నుంచి రక్త, మూత్ర నమూనాలను సేకరించారు. అనంతరం ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) ఆధ్వర్యంలోని ల్యాబ్‌లో పరీక్షించగా పాజిటివ్ రిపోర్ట్ వచ్చింది. పారిస్ క్రీడల్లో పట్టుబడిన మూడో డోపీ సమీమ్ ఫైజాద్. ముగ్గురు మహిళలు, ముగ్గురు పురుషుల బృందంతో అఫ్గాన్ ఈ విశ్వక్రీడల్లో పాల్గొంటుంది.

ఎబ్డెన్-పీర్స్ జోడీకి స్వర్ణం

పారిస్ ఒలింపిక్స్ పురుషుల టెన్నిస్ డబుల్స్‌లో మాథ్యూ ఎబ్డెన్-జాన్ పీర్స్ (ఆస్ట్రేలియా) జోడీ స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. శనివారం జరిగిన ఫైనల్లో ఎబ్డెన్-పీర్స్ ద్వయం 6-7 (6/8), 7-6 (7/1), 10-8తో ఆస్టిన్ క్రాయిసెక్-రాజీవ్ రామ్ (అమెరికా) జంటపై విజయం సాధించింది. 1996 అట్లాంటా ఒలింపిక్స్‌లో టాడ్ వుడ్‌బ్రిడ్జ్-మార్క్ వుడ్‌ఫర్డ్ తర్వాత ఆస్ట్రేలియాకు పురుషుల డబుల్స్‌లో మళ్లీ పసిడి పతకం లభించింది.



కొలనులో కొత్త కెరటం


ఒలింపిక్స్‌లో ఈత పోటీలు అనగానే.. ఠక్కున గుర్తొచ్చే పేరు మైకేల్ ఫెల్ప్స్! మకుటం లేని మహారాజులా స్విమ్మింగ్‌పూల్‌ను ఏలిన ఈ అమెరికా స్విమ్మర్.. విశ్వక్రీడల్లో ఏకంగా 28 పతకాలు సాధించి అదుర్స్ అనిపించుకున్నాడు. అందులో 23 స్వర్ణాలు ఉన్నాయంటే.. విశ్వ క్రీడల్లో అతడి హవా ఏ స్థాయిలో సాగిందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడు ఫ్రాన్స్ నయా స్విమ్మర్ లియాన్ మర్చండ్.. అమెరికా దిగ్గజం బాటలో దూసుకెళ్తున్నాడు. పాల్గొన్న తొలి ఒలింపిక్ క్రీడల్లోనే నాలుగు స్వర్ణాలు కైవసం చేసుకొని ఫెల్ప్స్‌కు తానే సరైన వారసుడినని అనిపించుకుంటున్నాడు. రెండు గంటల వ్యవధిలో రెండు స్వర్ణాలు సాధించి అభిమానుల దృష్టిని ఆకర్షించిన మర్చండ్.. 'పారిస్' క్రీడల్లో నాలుగో పసిడి చేజిక్కించుకున్నాడు. నాలుగు భిన్న రేసుల్లో అగ్రస్థానంలో నిలిచిన మర్చండ్.. ఈ నాలుగింట ఒలింపిక్ రికార్డులు బద్దలు కొట్టడం విశేషం.

- ఫెల్ప్స్‌ను తలపిస్తున్న ఫ్రాన్స్ స్విమ్మర్ మర్చండ్
- నాలుగో ఒలింపిక్ రికార్డుతో 'పారిస్'లో నాలుగో స్వర్ణం కైవసం

ఫ్రాన్స్ యువ స్విమ్మర్ లియాన్ మర్చండ్ బరిలోకి దిగిన తొలి ఒలింపిక్స్‌లోనే నాలుగో పసిడి పతకంతో సత్తా చాటాడు. ఇప్పటికే మూడు స్వర్ణాలు నెగ్గిన మర్చండ్.. ఆదివారం పురుషుల 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లే రేసులో 1 నిమిషం 54.06 సెకన్లలో లక్ష్యాన్ని చేరి అగ్రస్థానంలో నిలిచాడు. 200 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్, 200 మీటర్ల బటర్‌ఫ్లయ్, 400 మీటర్ల వ్యక్తిగత మెడ్లేలో పసిడి పతకాలు గెలుచుకున్న 22 ఏళ్ల మర్చండ్.. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించడమే లక్ష్యమని అంటున్నాడు. మర్చండ్ పోటీపడ్డ తొలి రేసును కుటుంబ సభ్యులతో కలిసి వీక్షించిన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మక్రాన్.. అతడి ప్రతిభకు ముగ్ధుడయ్యారు. వారం రోజుల వ్యవధిలో కొలనులో సంచలన ఫలితాలు సాధించి రికార్డులు తిరగరాసిన మర్చండ్‌కు తాను అభిమాని అయిపోయానని వెల్లడించారు.'అభిమాన సందోహం మధ్య పతకం గెలవడం చాలా ఆనందంగా ఉంది. ఇలాంటి అవకాశం చాలా అరుదుగా వస్తుంది. ప్రేక్షకులంతా లేచి నిల్చొని అభివాదం చేస్తుంటే.. ఇన్నేళ్లు పడ్డ కష్టం అంతా మరిచిపోయినట్లు అనిపిస్తుంది' అని నాలుగో పసిడి పతకం గెలిచిన అనంతరం మర్చండ్ అన్నాడు. తనను తాను సిగ్గరిగా చెప్పుకునే మర్చండ్.. తాజా క్రీడల్లో చివరగా బరిలోకి దిగిన 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లే సమయంలో చాలా ప్రశాంతంగా కనిపించాడు. మూడు పతకాలు గెలిచిన గర్వం కానీ, మరో పతకం సాధించాలనే ఒత్తిడి కానీ ఏమాత్రం లేకుండా బరిలోకి దిగి బంగారు పతకం చేజిక్కించుకున్నాడు. 'నాలుగు స్వర్ణాలు గెలవడం నమ్మశక్యంగా లేదు. మొదట ఒక పతకం గెలవాలని లక్ష్యంగా పెట్టుకున్నా.. ఆ తర్వాత వరుసగా మంచి ప్రదర్శనలు కనబర్చా. ఫలితం నాకు అనుకూలంగా వచ్చింది' అని మర్చండ్ పేర్కొన్నాడు.







ఫ్రెంచ్ ఫెల్ప్స్...

ఈత కొలనులో సంచలనాలు నమోదు చేస్తున్న మర్చండ్‌ను అభిమానులు ముద్దుగా 'ఫ్రెంచ్ ఫెల్ప్స్' అని పిలుచుకుంటున్నారు. అయితే అది తనపై ఎలాంటి ఒత్తిడి తేవడం లేదని.. ఒకింత ఆనందంగా కూడా ఉందని మర్చండ్ పేర్కొన్నాడు. దశాబ్దకాలం పాటు ఒలింపిక్స్‌లో ఏకఛత్రాధిపత్యం కనబర్చిన ఫెల్ప్స్ నమోదు చేసిన రెండు ఒలింపిక్ రికార్డుల (400 మీటర్ల మెడ్లే, 200 మీటర్ల మెడ్లే)ను మర్చండ్ తాజాగా బద్దలు కొట్టాడు. మరోవైపు ఫెల్ప్స్ కూడా మర్చండ్ ఫీట్‌కు ఫిదా అయిపోయాడు. 200 మీటర్ల బటర్‌ఫ్లయ్, బ్రెస్ట్‌స్ట్రోక్‌లో మర్చండ్ స్వర్ణాలు గెలిచిన సందర్భంలో ఫెల్ప్స్ సంబరాలు జరుపుకున్న వీడియో వైరల్‌గా మారింది. 'ఫెల్ప్స్‌తో పోల్చినప్పుడు గర్వంగా ఉంటుంది. స్విమ్మింగ్ రూపురేఖలను మార్చిన ఘనత అతడిది' అని మర్చండ్ అన్నాడు. ఒలింపిక్స్‌లో నాలుగు స్వర్ణాలు సాధించేందుకు ఫెల్ప్స్ ఇచ్చిన సూచనలు కూడా పనిచేశాయని వెల్లడించాడు. అయితే 'పారిస్' క్రీడల్లో మర్చండ్‌తో పోటీపడిన సహచరులు మాత్రం.. ఫెల్ప్స్ కన్నా మర్చండ్ కఠిన ప్రత్యర్థి అని ప్రశంసించారు. మర్చండ్‌తో కలిసి 400 మీటర్లు, 200 మీటర్లు వ్యక్తిగత మెడ్లే విభాగంలో బరిలోకి దిగిన అమెరికా స్విమ్మర్ కార్సాన్ ఫాస్టర్ మాట్లాడుతూ.. 'పోటీలో పాల్గొన్న వారం దరికీ.. అత్యుత్తమ స్విమ్మర్‌తో బరిలోకి దిగిన అనుభవం ఎదురైంది. పోటీ పడిన నాలుగు ఈవెంట్లలోనూ స్వర్ణాలు గెలవడం మామూలు విషయం కాదు' అని పేర్కొన్నాడు.

-సాక్షి క్రీడా విభాగం

'టై'ని బ్రేక్ చేసేదెవరో?

నేడు భారత్, శ్రీలంక మధ్య రెండో వన్డే

- ఆధిక్యంపై టీమిండియా దృష్టి
- స్పిన్ దళంతో అసలంక బృందం
- మధ్యాహ్నం గం. 2:30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



కొలంబో: వన్డే సిరీస్‌లోనూ శుభారంభం చేస్తుందనుకున్న భారత్‌కు తొలి మ్యాచ్ 'టై' ఫలితం ఏమాత్రం ఊహించనిది. స్పిన్‌కు అనుకూలించిన పిచ్‌పై ఆతిథ్య బౌలర్లు ఓడే మ్యాచ్‌ను సమం చేసుకున్నారు. బంతులు మిగిలున్నా... స్పిన్ ఉచ్చులో పడి ఆశించిన ఫలితాన్ని రాబట్టలేకపోయిన భారత్ ఇప్పుడు ఆ 'టై'ని బ్రేక్ చేసే పనిలో పడింది. ఆదివారం జరిగే రెండో వన్డేలో గెలుపే లక్ష్యంగా రోహిత్‌శర్మ బృందం బరిలోకి దిగుతోంది. పైగా ఈ వేదికపై టీమిండియాకు మంచి రికార్డే ఉంది. ఇక్కడ 6 వన్డేల్లో గెలిచిన ఘనత భారత్‌ది! సరిగ్గా మూడేళ్ల క్రితం 2021లో చివరిసారిగా లంక చేతిలో ఓడింది. తర్వాత గత 'టై' మినహా ఆడిన ప్రతి మ్యాచ్ గెలిచింది.

మిడిలార్డర్ బాధ్యతగా ఆడితే...

తొలి వన్డేలో భారత బౌలర్లు, ఓపెనర్లు బాగానే ఆడారు. 231 లక్ష్యఛేదనలో 130/3 స్కోరు వద్ద పటిష్టంగానే ఉంది. 101 పరుగులు చేస్తే గెలిచే చోటా ఏడు వికెట్లు చేతిలో ఉన్న టీమిండియా సరిగ్గా 100 చేసింది. మిడిలార్డర్‌లో నిలకడలేమి వల్లే జట్టు చివరకు 'టై' చేసుకోవాల్సి వచ్చింది. అయితే ఒక్క మ్యాచ్‌తో వేలెత్తిచూపేలా బ్యాటింగ్ ఆర్డర్ అయితే లేదు. కాస్త ఓపిక, అదేపనిగా స్పిన్‌ను ఎదుర్కొనే సహనం కనబరిస్తే చాలు జట్టు గాడిన పడుతుంది. కోహ్లి, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్‌లు బ్యాట్ ఝుళిపిస్తే సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లవచ్చు. స్పిన్ ట్రాక్ కావడంతో మూడో పేసర్‌కు అవకాశం ఉండకపోవచ్చు. కాబట్టి అర్ష్‌దీప్, సిరాజ్‌లకు తోడుగా ముగ్గురు స్పిన్నర్లు అక్షర్, సుందర్, కుల్దీప్‌లతో బౌలింగ్ దళం బరిలోకి దిగుతుంది.

పైచేయి సాధించే పనిలో...

పొట్టి ఫార్మాట్‌లో క్లీన్‌స్వీప్ అయిన ఆతిథ్య శ్రీలంక తొలి వన్డేలో ప్రత్యర్థికి దీటుగా పోరాడింది. ఈ మ్యాచ్‌లో విజయం లభించకపోయినా... వచ్చిన కొండంత ఆత్మవిశ్వాసమే బలంగా ఇప్పుడు లంక బరిలోకి దిగుతోంది. ఓపెనర్లలో నిసాంక సూపర్‌ఫామ్‌లో ఉండటం... స్పిన్నర్లు పట్టు బిగించడం జట్టు స్థయిర్యాన్ని పెంచింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌లో రెండో మ్యాచ్‌లో గెలిచి పైచేయి సాధించాలని అసలంక సేన భావిస్తోంది. కలిసొచ్చే పిచ్‌పై నమ్ముకున్న స్పిన్ బౌలింగ్ దళం జట్టును ఒడ్డున పడేస్తుందని జట్టు మేనేజ్‌మెంట్ అంచనాలతో ఉంది. టాపార్డర్‌లో అవిష్క, కుశాల్ మెండిస్, సమరవిక్రమ కూడా తమవంతు పాత్ర పోషిస్తే పరుగుల రాక సులువవుతుంది. లోయర్ ఆర్డర్‌లో దునిత్ వెలలగే రూపంలో జట్టును ఆదుకునే బ్యాటర్ ఉండటం జట్టుకు అదనపు బలం. బౌలింగ్‌లో స్పిన్నర్లు హసరంగ, అసలంక, ధనంజయ రాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో టి20 సిరీస్‌ల కాకుండా వన్డే సిరీస్ పోటాపోటీగా జరగడం ఖాయం.

పిచ్, వాతావరణం

ప్రేమదాస స్టేడియం స్పిన్‌కే అనుకూలం. గత మ్యాచ్‌లో పడిన 18 వికెట్లలో స్పిన్నర్ల (13) వాటానే అధికం. దీంతో బ్యాటర్లకు ఇబ్బందులు తప్పవు. ఆదివారం చిరుజల్లు కురిసే అవకాశముంది.

జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్, కోహ్లి, అయ్యర్, కేఎల్ రాహుల్, శివమ్ దూబే, అక్షర్, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్, సిరాజ్, అర్ష్‌దీప్. **శ్రీలంక:** అసలంక (కెప్టెన్), నిసాంక, అవిష్క ఫెర్నాండో, కుశాల్ మెండీస్, సమరవిక్రమ, లియనగే, వెలలగే, హసరంగ, ధనంజయ, షిరాజ్, అసిత ఫెర్నాండో.

నేత్ర, విష్ణు ఎదురీత

పారిస్ ఒలింపిక్స్‌లో భారత సెయిలర్లు పెద్దగా ఆకట్టుకోలేకపోయారు. మహిళల డింగీ విభాగంలో 6 రేసులు ముగిసేసరికి భారత సెయిలర్ నేత్ర కుమానన్ 24వ స్థానంలో నిలిచింది. మూడు రేసులు ముగిసేసరికి 11వ ప్లేస్‌లో ఉన్న నేత్ర శనివారం ఐదు, ఆరు రేసుల్లో మెరుగైన ప్రదర్శన కనబర్చలేకపోయింది. పురుషుల ఈవెంట్‌లో విష్ణు శరవణన్ 23వ స్థానంలో ఉన్నాడు. 10 రేసులు ముగిసేసరికి టాప్-10లో ఉన్న సెయిలర్లు ఫైనల్‌కు అర్హత సాధించనున్నారు.

వెనుకంజలో భారత గోల్ఫర్లు

పారిస్ ఒలింపిక్స్‌లో భారత గోల్ఫర్లు ప్రభావం చూపలేకపోతున్నారు. శనివారం మూడో రౌండ్ పోటీలు ముగిసేసరికి శుభాంకర్ శర్మ 34వ స్థానంలో.. గగన్‌జీత్‌సింగ్ భుల్లర్ 48 స్థానంలో నిలిచారు. రెండు రౌండ్‌లు ముగిసేసరికి మెరుగైన స్థితిలో కనిపించిన శుభాంకర్... శనివారం పోటీల్లో తొమ్మిది స్థానాలు కోల్పోయి.. 211 పాయింట్లతో నిలిచాడు. సెర్బియా గోల్ఫర్ రహమ్ జాన్ (199) టాప్‌లో ఉన్నాడు. మొత్తం 18 హోల్స్ ఉన్న ఈ పోటీల్లో నాలుగు రౌండ్‌లు నిర్వహించనున్నారు. ఇందులో మెరుగైన షాట్లు ఆడిన తొలి ముగ్గురు గోల్ఫర్లకు పతకాలు దక్కుతాయి. ఆదివారం చివరి రౌండ్ పోటీలు జరగనున్నాయి. ఇక మహిళల వ్యక్తిగత విభాగంలో భారత్ నుంచి అదితి అశోక్, దీక్ష డాగర్ బరిలోకి దిగనున్నారు.



శుభాంకర్

వృక్షాబంధన్..



మానవ మనుగడ, సర్వజీవుల సుఖజీవనానికి వృక్ష సంపదను రక్షించడం మన బాధ్యత అని పలువురు నినదించారు.విశాఖ నగరం రైల్వేస్టేషన్ రోడ్డులోని పురాతన భారీ వృక్షానికి శనివారం రాఖీ కట్టి వృక్షాబంధన్ జరుపుకున్నారు. 1887లో బొంబాయి-నాగ్‌పూర్ రైల్వేలైన్ నిర్మాణ సమయంలో కార్మికుల నీడ కోసం నాటిన మొక్కల్లో ఇదొక్కటి.

- తాటిచెట్లపాలెం (విశాఖ జిల్లా)

మనోహరం...జోగ్ జలపాతం



కర్ణాటకలో తీర జిల్లాల్లో విపరీతమైన వర్షాల కారణంగా కావేరి, ఉప నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. శివమొగ్గ జిల్లాలోని ప్రసిద్ధ జోగ్ జలపాతం హోరుమని గర్జిస్తూ కనువిందు చేస్తోంది. శరావతి నది ఇక్కడ వందల మీటర్ల ఎత్తు నుంచి పాయలుగా విడిపోయి దుమికే దృశ్యాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ దృశ్యాలను పర్యాటకులు తమ కెమెరాలలో బంధిస్తున్నారు.

- శివమొగ్గ

రైతు కష్టం.. ఎలుకల పాలు



అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలంలోని బొయితిలి పంచాయతీ ఎగరాపల్లి గ్రామానికి చెందిన గిరిజన రైతు బూటారి రామారావు బీరువాలో దాచుకున్న రూ.10 వేలు ఎలుకల పాలయ్యాయి. పసుపు పంట అమ్మగా వచ్చిన రూ.35 వేలను నెల కిందట బీరువాలో పెట్టాడు. శనివారం తెరిచి చూడగా కొన్ని రూ.500 నోట్లు ముక్కలై కనిపించాయి.

- జి.మాడుగుల (అల్లూరి సీతారామరాజు జిల్లా)

వంట పాత్రే పడవైంది..




ఏజెన్సీలో వైద్య సేవలు అందాలంటే ప్రాణాలను పణంగా పెట్టాల్సిందే. అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలంలోని జామిగుడ పంచాయతీ గుంజివాడకు చెందిన పాంగి రాజేశ్వరికి శనివారం పురిటినొప్పులు వచ్చాయి. అయితే గుంజువాడ గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో రాజేశ్వరిని గెడ్డ దాటించేందుకు భర్త రమేష్, కుటుంబ సభ్యులు సిల్వర్ వంట పాత్రలో కూర్చోబెట్టి అతికష్టం మీద గెడ్డ దాటించారు.

- పెదబయలు (అల్లూరి సీతారామరాజు జిల్లా)


ఒక్క రోజులోనే 842 మంది

న్యాయవాదులుగా ఎన్‌రోల్‌మెంట్ చేయించి బార్ కౌన్సిల్ రికార్డు



సాక్షి, అమరావతి: రాష్ట్ర బార్ కౌన్సిల్ సరికొత్త రికార్డ్ నెలకొల్పింది. శనివారం ఒక్క రోజే 842 మందితో న్యాయవాదులుగా ఎన్‌రోల్‌మెంట్ చేయించి వారితో ప్రమాణం చేయించింది. గతంలో ఎన్నడూ కూడా ఒక్క రోజులో ఇంత పెద్ద సంఖ్యలో న్యాయవాదులు ఎన్‌రోల్ కాలేదు. శనివారం హైకోర్టు ప్రాంగణంలో జరిగిన ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి భారీగా వచ్చారు. నూతనంగా ఎన్‌రోల్ అయినవారితో బార్ కౌన్సిల్ సభ్యులు గంటా రామారావు, చలసాని అజయ్ కుమార్, కార్యదర్శి పద్మలత ప్రమాణం చేయించగా..బార్ కౌన్సిల్ వీరందరికీ సర్టిఫికెట్లు ప్రదానం చేసింది. న్యాయవాదులనుద్దేశించి బార్ కౌన్సిల్ ఛైర్మన్ ఎస్.ద్వారకనాథరెడ్డి మాట్లాడుతూ..నమ్మి వచ్చే కక్షిదారులను ఎన్నడూ మోసం చేయవద్దని చెప్పారు.

ఏపీకి జీవన్‌దాన్ పురస్కారం ప్రదానం




సాక్షి, అమరావతి/ఆరిలోవ(విశాఖ తూర్పు): ఆంధ్రప్రదేశ్‌కు తొలిసారి జీవన్‌దాన్ అవార్డు లభించింది. న్యూఢిల్లీలో శనివారం జరిగిన జాతీయ అవయవదాన దినోత్సవంలో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి అనుప్రియా పటేల్, నీతి ఆయోగ్ సభ్యులు డాక్టర్ వినోద్ కె.పాల్, ఆరోగ్య శాఖ సెక్రటరీ ఎస్.హెచ్ అపూర్వ చంద్ర, డాక్టర్ అతుల్ గోయల్ చేతుల మీదుగా ఈ అవార్డును జీవన్‌దాన్ రాష్ట్ర కోఆర్డినేటర్, విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) డైరెక్టర్ డాక్టర్ కె. రాంబాబు అందుకున్నారు. జీవన్‌దాన్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించడం, అవయవదానాన్ని ప్రోత్సహించడంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విశేషంగా కృషి చేసింది. ఆ కృషి ఫలితమే ఈ అవార్డు.

టీటీడీ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా శ్రీధర్

సాక్షి, అమరావతి: ఐపీఎస్ అధికారి ఎస్. శ్రీధర్‌ను టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

భారీగా సైబర్ నేరాలు

- దేశవ్యాప్తంగా ఐదేళ్లలో 44,599 మోసాలు.. రూ.2,137 కోట్లు దోచేసిన సైబర్ నేరస్తులు
- కేవలం రూ.184 కోట్లే రికవరీ
- 2023-24లోనే రూ.1,457 కోట్ల దోపిడీ
- గత ఐదేళ్లలో ఏపీలోనే అత్యల్పం
- కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి వెల్లడి



సాక్షి, అమరావతి: దేశంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోయాయి. గత ఐదేళ్లలో సైబర్ నేరస్తులు ఏకంగా 44,599 మోసాలు చేసి.. రూ.2,137 కోట్లు కొట్టేశారు. అత్యధికంగా 2023-24వ ఆర్థిక సంవత్సరంలోనే 29,082 మోసాలతో రూ.1,457 కోట్లను కొల్లగొట్టారని ఇటీవల లోక్‌సభలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి వెల్లడించారు. 2019-20వ ఆర్థిక సంవత్సరం నుంచి 2023-24వ ఆర్థిక సంవత్సరం వరకు రూ.2,137 కోట్లు దోచేస్తే.. రూ.184 కోట్లే రికవరీ చేసినట్లు మంత్రి తెలిపారు. క్రెడిట్ కార్డులు, డెబిట్ కార్డులు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ తదితరాల ద్వారా ఈ మోసాలకు పాల్పడినట్లు చెప్పారు. దేశంలో అత్యధికంగా హరియాణా, కర్ణాటక, మహారాష్ట్ర, ఢిల్లీ, తమిళనాడు, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ మోసాలు జరుగుతున్నాయని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో అత్యల్పంగా గత ఐదేళ్లలో 575 సైబర్ మోసాలతో రూ.23.46 కోట్లను దోచేశారని తెలిపారు. ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం ద్వారా డిజిటల్ టెక్నాలజీల సురక్షిత వినియోగానికి వివిధ చర్యలు చేపట్టామన్నారు. ఆర్థిక నేరాలతో పాటు సైబర్ చీటింగ్‌లపై ఫిర్యాదుల కోసం కేంద్ర హోం శాఖ నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్, నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930ను ప్రారంభించిందన్నారు. బాధితులు అధికారిక కస్టమర్ కేర్ వెబ్‌సైట్ లేదా బ్యాంకు శాఖల్లో కూడా ఫిర్యాదు చేయొచ్చని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు నిర్వహిస్తోందని.. సోషల్ మీడియా ద్వారా కూడా అవగాహన కల్పిస్తోందని తెలిపారు. ఆర్‌బీఐతో పాటు బ్యాంకులు సైబర్ నేరాలపై ఎస్ఎంఎస్‌ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాయని చెప్పారు. తద్వారా నష్టాన్ని తగ్గించేందుకు కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

ప్రభుత్వ ఉత్తర్వుల కోసం వెయిటింగ్

- ఆ తర్వాతే ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌కు నోటిఫికేషన్!
- సిద్ధార్థకు రాష్ట్ర హోదా తొలగింపు సహా పలు నిబంధనలు సవరింపు
- వైద్య శాఖ ప్రతిపాదనలను ఇంకా ఆమోదించని ముఖ్యమంత్రి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ నోటిఫికేషన్ జారీపై సందిగ్ధత నెలకొంది. సిద్ధార్థ వైద్య కళాశాలకు రాష్ట్ర హోదా తొలగింపుతో పాటు యూజీ అడ్మిషన్ నిబంధనల సవరణ ఉత్తర్వుల కోసం హెల్త్ యూనివర్సిటీ అధికారులు ఎదురుచూస్తున్నట్టు తెలిసింది. ఇప్పటికే ఎంబీబీఎస్ అర్హుల జాబితాను యూనివర్సిటీ ప్రకటించింది. కౌన్సెలింగ్ నిర్వహణకు దరఖాస్తులను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంది. ఇదిలా ఉండగా, రాష్ట్ర విభజనకు ముందు ఏర్పాటైన వైద్య కళాశాలల్లో తెలంగాణ కోటా, విజయవాడలోని సిద్ధార్థ వైద్య కళాశాలకు రాష్ట్ర హోదా తొలగింపు వంటి అడ్మిషన్ల నిబంధనల సవరణతో పాటు 2024-25 విద్యా సంవత్సరానికి ఫీజుల విధానంపై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంది. ఇప్పటికే వైద్య శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. కానీ సీఎం చంద్రబాబు వాటిని ఇంకా ఆమోదించలేదని సమాచారం.

స్థానికేతర విధానానికి ఇక స్వస్తి..

ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం.. 2014కు ముందు ఏర్పాటైన కాలేజీల్లో కన్వీనర్ కోటా ఎంబీబీఎస్, పీజీ సీట్లలో 85 శాతం స్థానిక, 15 శాతం స్థానికేతర విద్యార్థులకు కేటాయించేవారు. 15 శాతం స్థానికేతర కోటా సీట్లలో తెలంగాణ విద్యార్థులు కూడా సీట్లు పొందుతూ వచ్చారు. అయితే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయి పదేళ్లు పూర్తవ్వడంతో స్థానికేతర విధానానికి స్వస్తి పలుకుతున్నారు. కాగా, 2014 తర్వాత ఏర్పాటైన కళాశాలల్లో స్థానికేతర కోటాను గత ప్రభుత్వ హయాంలో రద్దు చేశారు. మరోవైపు హెల్త్ యూనివర్సిటీ ఏర్పాటు చేసిన సమయంలో దానికి అనుబంధంగా వైద్య కళాశాల ఉండాలనే నిబంధనతో.. విజయవాడలో సిద్ధార్థ వైద్య, దంత కళాశాలలను రాష్ట్ర కళాశాలలుగా మార్చారు. అప్పటి నుంచి కోస్తా, తెలంగాణ, రాయలసీమ విద్యార్థులకు 42:36:22 నిష్పత్తిలో ఎంబీబీఎస్, బీడీఎస్, పీజీ సీట్లను కేటాయిస్తూ వస్తున్నారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తవ్వడంతో పాటు రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం.. ఏ భూభాగంలో ఉన్న కాలేజీల్లో ఆ స్థానిక విద్యార్థులకే సీట్లు కేటాయించాలి. ఈ నిబంధనల ప్రకారం సిద్ధార్థ వైద్య, దంత కళాశాలలకు రాష్ట్ర స్థాయి హోదా తొలగించాల్సి ఉంది. ఇప్పటికే దంత కళాశాలకు రాష్ట్ర హోదాను తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. సిద్ధార్థ వైద్య కళాశాలపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం సిద్ధార్థలో 175 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. 15 శాతం ఆలిండియాకు పోతే.. 149 సీట్లు ఉంటాయి. వీటిలో గత విద్యా సంవత్సరం వరకు 54 సీట్లు ఆంధ్రా యూనివర్సిటీకి, 47 సీట్లు ఉస్మానియాకు, 28 శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీకి, 20 సీట్లు అన్‌రిజర్వ్‌డ్ కింద భర్తీ చేస్తున్నారు. రాష్ట్ర స్థాయి హోదా తీసివేస్తే.. ఓయూ, ఎస్వీయూ కోటా కూడా రద్దు కానుంది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943